
‘రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹5.00

సంపుటి: 10 సంచిక: 337

మంగళవారం 27-2-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కరుగుతున్న అమెరికా కలలు

విశ్వవిద్యాలయాల్లో 21 శాతం తగ్గిన భారత విద్యార్థుల సంఖ్య - 11లో

అడుగడుగునా ప్రతికూలత ఎదురైనప్పటికీ... ఆత్మవిశ్వాసమే పెట్టుబడిగా ముందుకు కదిలారు. అన్ని రంగాల్లో ప్రవేశించడమే కాకుండా ప్రత్యేక స్థానం సంపాదించుకుని మహిళాలోకానికే ఆదర్శంగా నిలుస్తున్న అతివలపై ప్రత్యేక కథనం

ఆత్మవిశ్వాసమే... వారి గెలుపు గీతం

www.sakshi.comలో చదవండి.



‘శ్రీ’ విషాదం ఓ మిస్టరీ?

స్పృహ కోల్పోయి ప్రమాదవశాత్తూ బాత్‌టబ్‌లో పడటంతో మృతి

తేల్చిన ఫోరెన్సిక్ రిపోర్టు.. శ్రీదేవి మృతి కేసులో అనూహ్య మలుపు

- కేసు పోలీసుల నుంచి పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ
- భౌతికకాయం తరలింపులో మరింత జాప్యం
- నేటి మధ్యాహ్నం ఎంబామింగ్.. కేసు దర్యాప్తు ముమ్మరం
- శ్రీదేవి భర్త బోనీకపూర్‌ని సుదీర్ఘంగా విచారించిన పోలీసులు
- ఆయన పాస్‌పోర్టు సీజ్ చేసినట్లు వార్తలు.. బోనీ, శ్రీదేవి కాల్‌డేటాలపై ఆరా

దుబాయ్/ముంబై: ఎన్నో అనుమానాలు.. మరెన్నో ప్రశ్నలు.. గంటగంటకో సంచలన విషయం.. మొత్తంగా సినీనటి శ్రీదేవి మరణం ఓ మిస్టరీగా మారింది! గుండెపోటుతో మృతి చెందినట్లు ఆమె కుటుంబీకులు చెప్పిన విషయం అవాస్తవమని తేలిపోయింది. శ్రీదేవి గుండెపోటుతో మరణించలేదని, ప్రమాదవశాత్తూ మృతి చెందిందని దుబాయ్ ఫోరెన్సిక్ నిపుణులు తేల్చారు. బాత్‌రూంలోని టబ్‌లో స్పృహతప్పి పడిపోవడం వల్లే

మిగతా 5వ పేజీలో ▶

మరణం వెనుక..


- శ్రీదేవి మృతి కేసులో అనేక అనుమానాలు.. గుండెపోటు కాదని తేల్చిన ఫోరెన్సిక్ రిపోర్టు
- మరి అందువల్లే చనిపోయిందని కుటుంబీకులు ఎందుకు చెప్పారు?

- వివరాలు 5లో



734 ఒప్పందాలు.. 4.39 లక్షల కోట్ల పెట్టుబడులు

విశాఖ భాగస్వామ్య సదస్సు ముగింపు సమావేశంలో సీఎం చంద్రబాబు



- పాల్గొన్న 4,253 మంది ప్రతినిధులు
- వచ్చే ఏడాది రష్యా, శ్రీలంక సెషన్స్ ఏర్పాటు
- గత ఒప్పందాల్లో 58% అమల్లోకి..
- మొత్తం ఒప్పందాలతో 31 లక్షల మందికి ఉపాధి

18 లో

సోమవారం ప్రకాశం జిల్లా పొదిలిలో జరిగిన బహిరంగ సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం. ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



చంద్రబాబూ.. మళ్లీ మోసమా?

పొదిలి సభలో నిప్పులు చెరిగిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

- విశాఖ సదస్సుల్లో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయా?
- గతంలో చెప్పిన రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి?
- లేని గ్రోత్ రేట్‌ను, రాని పరిశ్రమలను, లేని ఉద్యోగాలను చూపిస్తున్నారు
- నిజం చెప్పండి.. ఇలాగైతే ప్రత్యేక హోదా ఎలా వస్తుంది?
- హోదా కోసం అవిశ్వాసానికి మద్దతివ్వవు.. రాజీనామాలకు ముందుకు రావు
- నిజంగా మీకు పాలించే అర్హత ఉందా? అని మండిపాటు

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రతినిధి

‘విశాఖపట్నంలో మూడు రోజులుగా జరుగుతున్న పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు చివరి రోజున సోమవారం ఈ పెద్దమనిషి (చంద్రబాబు) గవర్నర్‌తో రూ.4 లక్షల 39 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పించారు. గతంలో ఇదే పెద్దమనిషి రెండు సార్లు సమ్మిట్ నిర్వహించి.. ఒకసారి రూ.5 లక్షల కోట్లు, రెండోసారి రూ.10 లక్షల కోట్లు.. మొత్తం రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు

మిగతా 6వ పేజీలో ▶

యూజీసీ నెట్-2018

వివరాలు, ప్రిపరేషన్ టిప్స్

2 లో

ఎంసెట్ నోటిఫికేషన్ విడుదల

రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ



- మార్చి 29తో గడువు ముగింపు
- అపరాధ రుసుముతో ఏప్రిల్ 21 వరకు అవకాశం
- ఏప్రిల్ 18 నుంచి హాల్‌టికెట్ల జారీ
- ఏప్రిల్ 22 నుంచి ఆన్‌లైన్‌లో పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి లేదు

2 లో

హైకోర్టు భవనానికి 11 డిజైన్లు

ఈసారి దీర్ఘ చతురస్రాకారంలో పలు ఆకృతులు సిద్ధం చేసిన ఫోస్టర్

- రేపు పరిశీలించనున్న సీఎం చంద్రబాబు
- సోషల్ మీడియా, సీఆర్‌డీఏ వెబ్‌సైట్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ
- ఐటీ టవర్లకు పరిశీలనలో 19 డిజైన్లు
- డిజైన్లు రూపొందించిన షాపూర్‌జీ పల్లోంజీ

2 లో

'చలో ఢిల్లీ' నినాదంతో నేడు పాదయాత్ర

విద్యార్థి విభాగానికి వైఎస్సార్‌సీపీ సూచన

సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదా సాధన కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన 'చలో ఢిల్లీ' నినాదంతో అన్ని యూనివర్సిటీలు, నగరాల్లో మంగళవారం పాదయాత్ర నిర్వహించాలని పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం విద్యార్థి విభాగం నాయకులకు సూచించింది. ఈ పాదయాత్రను విజయవంతం చేసేందుకు విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా, నగర విభాగం అధ్యక్షులు, యూనివర్సిటీ అధ్యక్షులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరింది.

ఢిల్లీలో ధర్నాకు అనుమతి లభించింది



వైఎస్సార్‌సీపీ ఎంపీ వరప్రసాదరావు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన కోసం మార్చి 5న ఢిల్లీలో నిర్వహించ తలపెట్టిన ధర్నాకు అనుమతి లభించిందని వైఎస్సార్‌సీపీ ఎంపీ వరప్రసాదరావు తెలిపారు. సోమవారం ఆయన ఢిల్లీలో డీసీపీ మధుర్‌వర్మను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వచ్చే నెల 5న ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్‌లో ధర్నా నిర్వహించబోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొంటారని వివరించారు.

సమ్మెలోకి జూనియర్ డాక్టర్లు!

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం తమకు హామీ ఇచ్చి మోసం చేసిందని, ఇక సమ్మె దిగడమే నిర్ణయించామని రాష్ట్ర జూనియర్ వైద్యుల సంఘం ప్రకటించింది. ఒకటి రెండ్రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించింది. స్టైఫండ్ పెంపుదలను, పాత బకాయిలన్నీ చెల్లిస్తామని జీవో జారీచేసి నిధులు విడుదల చేయలేదని పేర్కొంది. జూనియర్ వైద్యుల సంఘం సభ్యులు సోమవారం వైద్యవిద్యా సంచాలకుడు ఎన్.సుబ్బారావును కలిశారు. అయితే సంచాలకుడు చెప్పిన సమాధానం తమను సంతృప్తి పరచలేదని, విధిలేని పరిస్థితుల్లో సమ్మెకు వెళ్లాలని నిర్ణయించినట్టు సంఘం సభ్యులు వెల్లడించారు.

కేంద్ర మంత్రులు, ఎంపీలు రాజీనామా చేయాలి

విద్యార్థి జేఏసీ, నాన్‌పొలిటికల్ జేఏసీ డిమాండ్

ఏఎన్‌యూ: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ఏపీకి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలని ప్రత్యేక హోదా సాధన విద్యార్థి జేఏసీ, నాన్ పొలిటికల్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఎన్‌యూ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. విద్యార్థులు, జేఏసీ నాయకులు కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు ఎ.అయ్యస్వామి మాట్లాడుతూ విభజన చట్టంలో పేర్కొన్న మేరకు ఏపీలో జాతీయ విద్యా సంస్థలు నెలకొల్పాలని, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో నాన్ పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు శ్రీహరినాయుడు, విద్యార్థి జేఏసీ ప్రెసిడెంట్ ఎ.రాజు, నాయకులు కుర్రం శ్రీనివాస్, కోటేశ్వరరావు, బాలు, మహేష్, సునీల్ పాల్గొన్నారు.

ఏఎన్‌యూ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల్లో 2018–19 విద్యా సంవత్సరంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు వర్సిటీ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఏఎన్‌యూ పీజీ సెట్–2018 నోటిఫికేషన్‌ను సోమవారం వీసీ ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ రాజేంద్రప్రసాద్, పీజీ అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ ఎం.రామిరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది 15 ఫ్యాకల్టీలో 43 పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. వీటితోపాటు పీజీ డిప్లొమాలో ఆరు కోర్సులు, ఒక సర్టిఫికెట్ కోర్సుకు కూడా అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ఏఎన్‌యూ పీజీ సెట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫీజుగా ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు రూ.500, బీసీ, ఓసీ కేటగిరీల వారు రూ.600 చెల్లించాలన్నారు. దరఖాస్తు ప్రక్రియ ఏప్రిల్ 20తో ముగుస్తుందని, రూ.500 అపరాధ రుసుంతో ఏప్రిల్ 25 వరకు, రూ.1000 అపరాధ రుసుంతో మే 1 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశ పరీక్షలు మే 5, 6, 7 తేదీల్లో జరుగుతాయన్నారు.

యూజీసీ నెట్-2018

యూనివర్సిటీలు, కాలేజీలు, ఇన్‌స్టిట్యూట్‌లలో పరిశోధన ఔత్సాహిక అభ్యర్థులను ఎంపికచేసే పరీక్ష.. యూజీసీ నెట్. ఈ పరీక్షలో మెరిట్‌లిస్ట్‌లో నిలిచిన అభ్యర్థులు జూనియర్ రీసెర్చ్ ఫెలోగా నెలకు రూ.33వేల ఫెలోషిప్ అందుకుంటూ పరిశోధనలు చేసే సువర్ణావకాశం పొందొచ్చు. అలాగే అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు పోటీపడొచ్చు. 2018, జూలైకి సంబంధించి నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్)కు నోటిఫికేషన్ వెలువడింది. కొత్త పరీక్ష విధానంతో, కొన్ని కీలక మార్పుల అనంతరం వచ్చిన ప్రకటన ఇది. ఈ నేపథ్యంలో నెట్ నోటిఫికేషన్ వివరాలు, ప్రిపరేషన్ టిప్స్..

ముఖ్య తేదీలు

- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: 2018, మార్చి 5.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 2018, ఏప్రిల్ 5.
- ఈ-చలాన్/డెబిట్‌కార్డ్/క్రెడిట్ కార్డ్ ద్వారా ఫీజు చెల్లింపు చివరి తేదీ: 2018, ఏప్రిల్ 6.
- దరఖాస్తు రుసుం: జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఓబీసీలకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులకు రూ.250.
- పరీక్ష తేదీ: 2018, జూలై 8. ■ వెబ్‌సైట్: cbsenet.nic.in

అర్హతలు

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) మొత్తం 100 సబ్జెక్టుల్లో యూజీసీ నెట్ నిర్వహిస్తుంది. హ్యూమానిటీస్ (భాషలు సహా), సోషల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎలక్ట్రానిక్ సైన్స్ తదితర వివిధ విభాగాల్లోని సబ్జెక్టులకు ఈ అర్హత పరీక్ష ఉంటుంది. ఆయా సబ్జెక్టుల్లో పీజీ లేదా తత్సమాన స్థాయిలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు 5 శాతం సడలింపు ఉంటుంది. ఫైనలియర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

కనీస మార్కులు తప్పనిసరి

పేపర్ -1, 2లో కలిపి కనీసం 40 శాతం, రిజర్వేషన్ అభ్యర్థులు కనీసం 35 శాతం మార్కులు పొందాలి. ఈ రెండు పేపర్లలో పొందిన మార్కుల ఆధారంగా.. పరీక్షకు హాజరైన వారిలో టాప్ ఆరు శాతం మందికి (కేటగిరీల వారీగా) అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత లభిస్తుంది. అత్యంత ప్రతిభావంతులను జేఆర్ఎఫ్‌కు ఎంపిక చేస్తారు.

మూడు కాదు.. రెండు పేపర్లు

యూజీసీ నెట్‌ను గతంలో మూడు పేపర్లలో నిర్వహించేవారు. తాజా నోటిఫికేషన్ నుంచి రెండు పేపర్లలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ రెండూ పేపర్లు ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు.


■ పేపర్ 1 అన్ని సబ్జెక్టుల అభ్యర్థులకు ఒకటే. గతంలో ఈ పేపర్‌కు సంబంధించి 10 ప్రశ్నలను వదులుకునే వెసులుబాటు ఉండేది. కానీ, ఇప్పుడు ఎలాంటి ఐచ్ఛికాలు లేవు. 50 ప్రశ్నలకూ తప్పనిసరిగా సమాధానాలివ్వాలి. ఈ పేపర్‌లో అభ్యర్థి రీసెర్చ్/టీచింగ్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్ ఎబిలిటీ, కాంప్రెహెన్షన్‌లను పరీక్షించేలా ప్రశ్నలు ఉంటాయి. పేపర్-2 అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టుపైనే ఉంటుంది. గతంలో పేపర్- 2, 3 ఉండేవి. పేపర్-2 లో 50 ప్రశ్నలు, పేపర్-3లో 75 ప్రశ్నలు అడిగేవారు. వీటిని ఇప్పుడు 100 ప్రశ్నలకు కుదించారు.

పేపర్	ప్రశ్నలు	మార్కులు	సమయం
పేపర్-1	50	100	గంట
పేపర్-2	100	200	రెండు గంటలు

ప్రయోజనాలు

యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత ద్వారా అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత లభిస్తుంది. ప్రతిష్టాత్మక రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశానికి వీలుంటుంది. జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే నెలకు రూ.33 వేలు ఫెలోషిప్ లభిస్తుంది. ఎలిజిబిలిటీ ఫర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణులకు రాష్ట్రస్థాయి వర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లలో అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల్లో ప్రాధాన్యముంటుంది. వివిధ పీఎస్‌యూలు ఆర్ అండ్ డీ, మేనేజ్‌మెంట్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్, హెచ్ఆర్, ఫైనాన్స్ తదితర విభాగాల్లో నియామకాలకు యూజీసీ నెట్ ఉత్తీర్ణులను పరిగణనలోకి తీసుకునే అవకాశముంది.

వయోపరిమితి



2018, జూలై 1 నాటికి 30 ఏళ్లలోపు వయసున్న వారు జేఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓబీసీ (నాన్–క్రీమీలేయర్), ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ తదితర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు అయిదేళ్ల సడలింపు ఉంది. ఇతర రిజర్వేషన్ అభ్యర్థులకు నిబంధనల మేరకు వయో సడలింపు లభిస్తుంది. ఎల్ఎల్ఎం విద్యార్థులకు మూడేళ్ల సడలింపు ఉంది. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి అర్హత కోసం గరిష్ట వయోపరిమితి లేదు.

ఎంసెట్ నోటిఫికేషన్ విడుదల

రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, అమరావతి/బాలాజీచెరువు (కాకినాడసిటీ): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 2018–19 విద్యా సంవత్సరపు ప్రవేశాల నోటిఫికేషన్‌ను ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు సోమవారం విడుదల చేశారు. బీటెక్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, డెయిరీ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఫుడ్ సైన్సు అండ్ టెక్నాలజీ, బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్ బీఫార్మసీ, ఫార్మా డీ తదితర కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానించారు. ఏపీ ఆన్‌లైన్, టీఎస్ ఆన్‌లైన్, క్రెడిట్, డెబిట్, నెట్‌బ్యాంకింగ్ ద్వారా రూ. 500(ప్రాసెసింగ్ ఫీజుతో కలిపి) రుసుము చెల్లించి ఎంసెట్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ విధానంలో ఈ నెల 28 నుంచి దరఖాస్తులు చేసుకోవచ్చు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్ విభాగాలు రెండింటికీ హాజరుకాదల్చుకున్న వారు రూ. 1,000 చెల్లించాలి. అపరాధ రుసుము లేకుండా మార్చి 29వ తేదీతో గడువు ముగియనుంది. అపరాధ రుసుము రూ. 500తో ఏప్రిల్ 6 వరకు, రూ. 1,000తో ఏప్రిల్ 11 వరకు, రూ. 5 వేలతో ఏప్రిల్ 16 వరకు, రూ. 10వేలతో ఏప్రిల్ 21వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు విధానం ఇలా..

విద్యార్థులు ముందుగా www.sche.ap.gov.in/-eamcet వెబ్‌సైట్లో ఫీజును చెల్లించిన అనంతరం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం హాల్‌టికెట్ నంబర్, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ ప్రకారం పుట్టిన తేదీ, విద్యార్థి ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీని తప్పనిసరిగా దరఖాస్తులో నమోదు చేయాలని కన్వీనర్ సాయిబాబు తెలిపారు. వీటితోపాటు కులధ్రువీకరణ పత్రం(ఎస్సీ, ఎస్టీ, బీసీ), రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం, స్టడీ సర్టిఫికెట్‌లు/నివాస ధ్రువీకరణ పత్రాలను తమ వద్ద



ఉంచుకొని జాగ్రత్తగా ఆయా కాలమ్‌లను పూరించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు ఒకసారి మాత్రమే ఆన్‌లైన్లో ఆమోదం అవుతుంది. ఫీజు చెల్లింపు అనంతరం ఆయా వివరాలతో పాటు పేమెంటు రిఫరెన్సు ఐడీ నంబర్ విద్యార్థి ఫోన్‌కు సంక్షిప్త సమాచారం ద్వారా అందుతుంది. ఈ సమాచారాన్ని విద్యార్థి భవిష్యత్తులో కూడా వినియోగించుకోవలసి ఉంటుంది కనుక జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని సాయిబాబు సూచించారు.

ఏప్రిల్ 22 నుంచి 26 వరకు పరీక్షలు

ఇంజనీరింగ్ విభాగం ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 22 నుంచి 25వరకు జరుగుతుంది. అగ్రికల్చర్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25, 26 తేదీల్లో జరగనుంది. రోజూ రెండు సెషన్లలో ఉదయం 10 గంటల నుంచి 1 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహిస్తారు. విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తులో మూడు రీజనల్ సెంటర్లకు ఆప్షన్ ఇవ్వాలి. అందులో ఒక సెంటర్‌లోని పరీక్ష కేంద్రాన్ని కేటాయిస్తారు. ఏప్రిల్ 18 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఉర్దూ అనువాద పరీక్షకు హాజరయ్యే వారికి కర్నూలులో మాత్రమే పరీక్ష కేంద్రాన్ని కేటాయిస్తామని కన్వీనర్ వివరించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాలులోకి అనుమతించరు.

ఎంసెట్ కేంద్రాలు ఇవే..

శ్రీకాకుళం, రాజాం, టెక్కలి, విజయనగరం, బొబ్బిలి, విశాఖపట్నం, ఆనందపురం, గాజువాక, అనకాపల్లి, కాకినాడ, రాజమండ్రి, అమలాపురం, ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, విజయవాడ, మైలవరం, కంచికచర్ల, గుడ్లవల్లేరు, గుంటూరు, నరసారావుపేట, బాపట్ల, ఒంగోలు, మార్కాపురం, చీరాల, నెల్లూరు, కావలి, గూడూరు, చిత్తూరు, పుత్తూరు, తిరుపతి, మదనపల్లి, కడప, ప్రొద్దుటూరు, రాజంపేట, అనంతపురం, గుత్తి, హిందూపురం, కర్నూలు, నంద్యాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. సందేహాల నివృత్తికి 0884–2340535, 0884–2356255 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

40 మార్కులు వస్తేనే కోర్సుల్లో ప్రవేశార్హత

ఎంసెట్ పరీక్షను ఆన్‌లైన్లో అయిదు రోజుల పాటు నిర్వహిస్తున్నందున.. ఒకరికి కష్టంగా వేరొకరికి సులభంగా వచ్చేలా కాకుండా 5 రోజుల్లో అందరికీ ప్రశ్నలు సమానంగా వచ్చేలా సాధారణీకరణ పద్ధతిని అనుసరించనున్నామని, అభ్యర్థులు ఒకరితో ఒకరు పోల్చుకొని ఆందోళన చెందనవసరం లేదని ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సాయిబాబు తెలిపారు. నిర్దేశించిన నిబంధనల ప్రకారం సాధారణీకరణ పద్ధతిలోనే మూల్యాంకనం ఉంటుందన్నారు. ఎంసెట్ పరీక్షను ఇంజనీరింగ్, అగ్రికల్చర్ విభాగాలు రెండిటిలోనూ 160 మార్కుల చొప్పున ప్రశ్నలు ఇవ్వనున్నారు. ఎంపీసీ విద్యార్థులకు గణితం నుంచి 80, ఫిజిక్సు నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40 మార్కులకు ప్రశ్నలుంటాయి. బైపీసీ విద్యార్థులకు ఫిజిక్సు నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40, బోటనీ నుంచి 40, జువాలజీ నుంచి 40 మార్కులకు మొత్తం 160 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. ఆన్‌లైన్లో బహుళైచ్ఛిక సమాధానాల విధానంలో తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాల్లో ప్రశ్నలుంటాయి. ఎంసెట్‌లో 75 శాతం, ఇంటర్మీడియెట్ 25 శాతం మార్కులను వెయిటేజీగా తీసుకొని ర్యాంకును నిర్ణయిస్తారు. ఆయా కోర్సుల్లో ప్రవేశానికి ఎంసెట్‌లో అభ్యర్థులు 40 శాతం అర్హత మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అర్హత మార్కుల నుంచి మినహాయింపునిచ్చారు.

'ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ'లనూ పరిగణనలోకి తీసుకోండి

వక్ఫ్‌బోర్డు పాలక మండలి ఏర్పాటుపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఏపీ వక్ఫ్‌బోర్డుకు సంబంధించి హైకోర్టు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. వక్ఫ్‌బోర్డు పాలక మండలి ఏర్పాటు సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కేటగిరీని కూడా పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కేటగిరీల కింద ఎంతమంది సభ్యులుండాలనే దానిపై తర్వాత విచారణ జరుపుతామని పేర్కొంది. ప్రస్తుతానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కేటగిరీని కూడా పరిగణనలోకి తీసుకుని వక్ఫ్‌బోర్డును ఏర్పాటు చేయాలంది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ కొంగర విజయలక్ష్మీలతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ వక్ఫ్ బోర్డుకు ముస్లిం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ముత్తవల్లీ, బార్ కౌన్సిల్ సభ్యుడు ఇలా 4 కేటగిరీల కింద ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ 4 కేటగిరీల కింద ఎన్నికైన వారితో వక్ఫ్ పాలక మండలి ఏర్పాటవుతుంది. అయితే ప్రభుత్వం.. ఎమ్మెల్యే, ముత్తవల్లీ కేటగిరీల కింద మాత్రమే ఎన్నికలు నిర్వహించేందుకు గతేడాది నోటిఫికేషన్ జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఎమ్మెల్యే ముస్తఫా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. పాలకమండలి ఏర్పాటుపై స్టే విధిస్తూ ఎన్నిక నిర్వహణకు మాత్రం అనుమతినిచ్చారు. తరువాత ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన మరో సింగిల్ జడి.. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కేటగిరీని పక్కన పెట్టి మిగిలిన వారితో పాలకమండలిని ఏర్పాటు చేసుకునేందుకు అనుమతించింది. దీంతో వక్ఫ్‌బోర్డు ధర్మాసనాన్ని ఆశ్రయించింది.

రాజధాని రైతుపై అర్ధరాత్రి దౌర్జన్యం

కోర్టు ఉత్తర్వులు బేఖాతరు

- పొలంలో రోడ్డు నిర్మాణానికి పోలీసులను రంగంలోకి దించిన ప్రభుత్వం
- చొక్కా పట్టుకుని ఈడ్చుకెళ్లిన పోలీసులు

తుళ్లూరు: హైకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ రాజధాని ప్రాంతంలోని ఓ రైతు పొలంలో రహదారి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అర్ధరాత్రి పోలీసులను రంగంలోకి దించటంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. రైతు చొక్కా పట్టుకుని ఈడ్చుకెళ్లటంపై స్థానికులు మండిపడుతున్నారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయం వెనుక వైపు ఎక్స్‌ప్రెస్ రోడ్డు (ఎన్-9) రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే భూసమీకరణకు ఇవ్వని రైతు గద్దె మీరాప్రసాద్ తన పొలంలో సర్వే నంబరు 214–ఎ గుండా సీఆర్‌డీఏ అధికారులు రహదారి నిర్మిస్తుండడంతో హైకోర్టును ఆశ్రయించి తాత్కాలిక నిలుపుదల ఆర్డర్ తెచ్చుకున్నాడు. దీంతో సీఆర్‌డీఏ అధికారులు నిత్యం రైతును వేధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి తన పొలంలో రోడ్డు పనులు ఆపాలని వేడుకుంటున్న రైతుపై ప్రభుత్వం దౌర్జన్యానికి దిగింది. పోలీసులు, ప్రభుత్వాధికారులు



రైతు మీరాప్రసాద్‌ను పొలంలో నుంచి లాక్కెళుతున్న పోలీసులు

కోర్టు ఉత్తర్వులను అతిక్రమించి అక్రమంగా తన పొలంలోకి ప్రవేశించి రోడ్డు పనులు చేపట్టారని, తనను చొక్కా చింపి రోడ్డు మీదకు ఈడ్చుకెళ్లారని సీఆర్‌డీఏ ల్యాండ్ డైరెక్టర్ చెన్నకేశవులకు బాధిత రైతు ఫిర్యాదు చేశారు. కాగా, కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తూ అర్ధరాత్రి వేళ రైతును పోలీసులు, అధికారులు కలిసి చొక్కా చించి రోడ్డు మీదకు ఈడ్చేయడం దారుణమని తాడికొండ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి హెనీ క్రిస్టీనా పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తూ ఎలాంటి సంకేతాలిస్తున్నారని మండిపడ్డారు. కాగా, రోడ్డు నిర్మాణ పనులు నిర్వహిస్తున్న తమకు రక్షణ కల్పించాలని సీఆర్‌డీఏ అధికారులు కోరటంతో పోలీసులను పంపినట్లు తుళ్లూరు సీఐ సుధాకర్ చెబుతున్నారు.

రాక్షస పాలనకు రుజువు

- రాజధానిలో అర్ధరాత్రి రైతుపై దౌర్జన్యం సరికాదు: కె.పార్థసారథి
- కోర్టుల ఉత్తర్వుల ప్రకారం నడుచుకోవాల్సిన బాధ్యత అందరిదీ

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ భూములు ఇవ్వకుండా కోర్టునుంచి ఉత్తర్వులు తెచ్చుకున్న రైతుపై దాడి చేయడం రాష్ట్రంలో రాక్షస పాలనకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. రాజధాని ప్రాంతానికి చెందిన రైతు గద్దె మీరా రాంప్రసాద్ భూమిలోకి వెళ్లరాదని న్యాయస్థానం ఆదేశించినా అక్కడ రహదారి నిర్మించాలని ప్రభుత్వ పెద్దలు ఎలా పురమాయిస్తారని ప్రశ్నించారు. అడ్డుకున్న రైతును బట్టలు విప్పదీసి హింసించటం దుర్మార్గమన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోర్టుల ఉత్తర్వుల ప్రకారం నడుచుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అధికారం చేతిలో ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరించే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు.



రాజధాని నిర్మాణం కోసం అంటూ 50 వేల ఎకరాలు బలవంతంగా లాక్కుని ఇప్పటివరకూ ఎలాంటి అభివృద్ధి చేయలేదని పేర్కొన్నారు. రాజధాని భూముల్లో టీడీపీ ఎమ్మెల్యే ఒకరు గేదెలను తెప్పించి మేపారని చెప్పారు. ఓ రైతు భూమి ఇవ్వనని ఆక్రోశిస్తుంటే దోపిడీదారుల్లా లాక్కోవాలని చూడటం సర్కారుకు సమంజసమా అని నిలదీశారు. ఉన్నతాధికారులు, మంత్రుల ఆదేశాలతో పోలీసులు హింసకు దిగుతున్నారన్నారు. కోర్టు ఉత్తర్వులు ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, 'ప్రత్యేక హోదా మా హక్కు.. ప్యాకేజీతో మోసం చేయెద్దు' అనే నినాదంతో మార్చి 1న అన్ని కలెక్టరేట్ల వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు పార్థసారథి తెలిపారు. హోదాతోనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పదేపదే చెప్పారని గుర్తు చేశారు. ధర్నాకు కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాలు సంఘీభావం ప్రకటించాయన్నారు.


హైకోర్టు భవనానికి 11 డిజైన్లు

- ఈసారి దీర్ఘ చతురస్రాకారంలో పలు ఆకృతులు సిద్ధం చేసిన ఫోస్టర్
- రేపటి సమావేశంలో పరిశీలించనున్న సీఎం

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి పరిపాలనా నగరంలో ప్రతిపాదించిన హైకోర్టు భవన నిర్మాణానికి నార్మన్ ఫోస్టర్ సంస్థ తాజాగా 11 డిజైన్లు రూపొందించింది. గతంలో ఇచ్చిన పలు డిజైన్లపై ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేయకపోవడంతో మళ్లీ కొత్తవి రూపొందించి సీఆర్‌డీఏకు సమర్పించింది. దీర్ఘ చతురస్రాకారంలో పలు డిజైన్లు రూపొందించగా, భారత సంస్కృతిని ప్రతిబింబించేలా కొన్నింటిని ఫోస్టర్ సంస్థ రూపొందించింది. ఏడాదిన్నర క్రితం బౌద్ధ స్థూపాకారంలో హైకోర్టు డిజైన్‌ను రూపొందించగా ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. అయితే వీటిపై అభ్యంతరాలు వ్యక్తమవడంతో ప్రభుత్వ సూచనల మేరకు ఫోస్టర్ సంస్థ కొత్త తరహా డిజైన్లు ఇచ్చినా ఆమోదం లభించలేదు. అసెంబ్లీ భవనానికి టవర్ ఆకృతి ఖరారు చేసిన సమయంలోనే స్థూపాకారంలో ఉన్న హైకోర్టు డిజైన్‌కు ప్రభుత్వం ప్రాథమికంగా అంగీకారం తెలిపింది. అయితే బాహ్య రూపం మార్చాలని చెప్పడంతో ఫోస్టర్ ప్రతినిధులు అంగీకరించారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకూ ఇచ్చిన డిజైన్లలో కొన్నింటికి పలు మార్పులు చేసి కొత్తవి తయారు చేయడంతోపాటు పూర్తిగా కొత్త తరహావి కూడా రూపొందించి సీఆర్‌డీఏకు సమర్పించారు. ప్రజల అభిప్రాయం కోసం వీటిని సోషల్ మీడియా, సీఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. బుధవారం జరిగే సీఆర్‌డీఏ సమావేశంలో సీఎం పరిశీలించాక ఒకటి ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

రెండు ఐటీ టవర్లకు డిజైన్ల పరిశీలన

రాజధాని అమరావతిలో నిర్మించాలని భావిస్తున్న ఐటీ టవర్లకు కూడా 19 డిజైన్లను పరిశీలిస్తున్నారు. ఐటీ పార్కులో రెండు ఐటీ టవర్ల నిర్మాణానికి సంబంధించి షాపూర్ జీ పల్లోంజి సంస్థ రూపొందించిన పలు డిజైన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇతర సంస్థల ప్రతిపాదనలు కూడా ఇవ్వాలని సూచించారు. ఈ నేపథ్యంలో వివిధ సంస్థలతో 19 డిజైన్లను సిద్ధం చేసిన సీఆర్‌డీఏ ప్రజాభిప్రాయం కోసం వాటిని ఆన్‌లైన్‌లో పెట్టింది. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీతోపాటు ఇతర దేశాల్లోని ఐటీ టవర్లను అధ్యయనం చేసి వీటిని రూపొందించారు. ముఖ్యమంత్రి పరిశీలించాక ఇందులో ఒకటి ఖరారయ్యే అవకాశం ఉంది.



హైకోర్టు డిజైన్లలో కొన్ని...


ఇదం జగత్



కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది అమెరికానే.. అయినా ఓపికతో ఉంటున్నాను!

‘ఈ-ఆఫీస్’లో చెదలు!

- ‘సాధారణ’ ఫైళ్లకు కలగని మోక్షం
- సీఎంఓలో ఫైల్ క్లియరెన్స్‌కు సగటున 55 రోజులు
- జాప్యం చేయడంలో పోటీపడుతున్న మంత్రులు
- ఒక్కో ఫైలుకు 73 రోజులు తీసుకుంటున్న గంటా
- కొన్ని ఎంపికచేసిన ఫైళ్లకు జెట్ స్పీడులో క్లియరెన్స్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ‘ఈ-ఆఫీస్’ విధానం అమల్లో ఉంది. అంటే ఎవరు ఎక్కడున్నా ఫైళ్లను ఆన్‌లైన్‌లోనే క్లియర్ చేయవచ్చు. ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు.. అందరికీ ‘ఈ’ సదుపాయం అందుబాటులో ఉంది. అయితే ఎంపిక చేసిన కొన్ని ఫైళ్లు మాత్రం రాకెట్ స్పీడుతో శరవేగంగా పరుగులు పెడుతున్నాయి. మెరుపువేగంతో క్లియర్ అయిపోతున్నాయి. కాంట్రాక్టు పనులతో పాటు కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనాలు కల్పించే ఫైళ్లను, ప్రైవేట్ సంస్థలకు భూముల కేటాయింపునకు సంబంధించిన ఫైళ్లను ఇటు ముఖ్యమంత్రి కార్యాలయంతో పాటు మంత్రులు కూడా ఆగమేఘాల మీద క్లియర్ చేస్తున్నారు. కొన్ని ఫైళ్లు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా పడి ఉంటున్నాయి. వాటిని క్లియర్ చేయడానికి మంత్రులు, ముఖ్యమంత్రి రోజుల తరబడి సమయం తీసుకుంటున్నారు. అవి ఏమిటో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. సాధారణ ప్రజలకు, ఉద్యోగులకు సంబంధించినవి. వాటిని ఎవరూ పట్టించుకుంటున్న పాపాన పోవడం లేదు.

‘సాధారణ’ ఫైళ్లు పెండింగులోనే..

సాధారణ ప్రజానీకానికి సంబంధించిన ఫైళ్లు సీఎం, మంత్రుల వద్ద నెలలు తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. ఆర్థిక అంశాలకు సంబంధించినవే కాదు.. డబ్బుతో ఎలాంటి పనిలేని ఫైళ్లయినా వాటికి మోక్షం కలగడం లేదు. ‘సాధారణ’ ఫైళ్లలో ఉదాహరణకు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచేందుకు ఉద్దేశించిన ఫైలు ఏడాది నుంచి సంబంధిత శాఖల మంత్రుల దగ్గరే పెండింగ్‌లో మగ్గుతోంది. అలాగే హోం గార్డుల వేతనాల పెంపునకు సంబంధించిన ఫైలు అయితే సచివాలయం హైదరాబాద్ నుంచి తరలిరాక ముందు నుంచి పెండింగ్‌లోనే మగ్గిపోతోంది. సీఎం కార్యాలయంతో సహా మంత్రుల కార్యాలయాల్లోనూ సాధారణ ఫైళ్ల క్లియరెన్స్‌కు నెలల తరబడి సమయం పడుతోంది. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫైళ్లను పరిశీలించి ముఖ్యమంత్రి చేత సంతకం చేయించేందుకు సబ్జెక్టుల వారీగా నలుగురు ఐఏఎస్ అధికారులు ఉన్నారు. ఆ అధికారులు ఆయా సబ్జెక్టుల ఫైళ్లను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన తరువాత సీఎం ముందు సంతకాలకు పెడతారు. సీఎం అనుకుంటే ఆయా ఫైళ్లపై సంతకం చేయవచ్చు లేదా నిరాకరించవచ్చు. ముఖ్యమంత్రి కార్యాలయానికి గత ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు 2,395 ఫైళ్లు రాగా వాటిని క్లియర్ చేయడానికి సగటున ఒక్కోఫైలుకు 55 రోజులు సమయం తీసుకున్నారు.

నచ్చిన సంస్థల ఫైళ్లయితే..

ప్రైవేట్ సంస్థలకు రాయితీలు, ప్రయోజనాలు కల్పించే ఫైళ్లయితే (అవి డబ్బుతో ముడిపడినవైనా సరే) తక్కువ సమయంలో క్లియర్ చేసేస్తున్నారు. ఉదాహరణకు రూ.1192 కోట్లకు సంబంధించిన ఓ వర్క్. దానిని నచ్చిన సంస్థకు నామినేషన్‌పై ఇచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం తీసుకున్న సమయం కేవలం నాలుగంటే 4 రోజులు. ఫిబ్రవరి 17న మెమో ఇచ్చి 21 కల్లా కేబినెట్‌లో అప్రూవల్ కూడా ఇచ్చేశారు. అంచనాలో చెప్పిన మొత్తం సరిపోదన్నట్లు దానిని రూ.1244.36 కోట్లకు పెంచి మరీ ఆ సంస్థకు కట్టబెట్టడం కొసమెరుపు..

జాప్యం చేసే మంత్రుల్లో గంటా టాప్..

ఫైళ్ల క్లియరెన్స్ జాప్యంలో మంత్రులందరిదీ ఒకే మాట ఒకే బాట. జాప్యం చేయడంలో మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అందరి కంటే ముందున్నారు. గత ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు గంటా శ్రీనివాసరావుకు 778 ఫైళ్లు రాగా ఒక్కో ఫైలు క్లియర్ చేయడానికి 73 రోజుల ఐదు గంటల సమయం తీసుకున్నారు. మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణ రెడ్డికి గత ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు 2,609 ఫైళ్లు రాగా ఒక్కో ఫైలు క్లియరెన్స్‌కు 33 రోజుల మూడు గంటల సమయం తీసుకున్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్‌కు గత ఏడాది 88 ఫైళ్లు రాగా ఒక్కో ఫైలు క్లియరెన్స్‌కు 34 రోజుల 11 గంటల సమయం తీసుకున్నారు. ఐటీ కంపెనీలకు భూముల కేటాయింపులు, రాయితీలకు సంబంధించిన ఫైళ్లను ఆ శాఖ మంత్రి లోకేశ్ జెట్ వేగంతో క్లియర్ చేస్తున్నారు.

సీఎంవోలో ఫైళ్లు.. క్లియర్ చేయడానికి పట్టిన సమయం..

పేరు	హోదా	మొత్తం ఫైళ్లు	ఒక్కో ఫైలు క్లియరెన్స్‌కు సగటు సమయం
సతీష్ చంద్ర	సీఎం ప్రత్యేక సీఎస్	1619	70 రోజులు
జి.సాయిప్రసాద్	సీఎం ముఖ్యకార్యదర్శి	251	12 రోజులు
గిరిజా శంకర్	సీఎం కార్యదర్శి	267	24 రోజులు
ఎ.రాజమౌళి	సీఎం అదనపు కార్యదర్శి	258	36 రోజులు
	మొత్తం	2395	55 రోజులు

మంత్రుల కార్యాలయాలలో ఫైళ్లు.. క్లియరెన్స్‌కు పడుతున్న సమయం..

పేరు	ఫైళ్ల సంఖ్య	ఒక్కోఫైలు క్లియరెన్స్‌కు సగటు సమయం
గంటా శ్రీనివాసరావు	778	73 రోజుల 5 గంటలు
జవహర్	88	34 రోజుల 11గంటలు
సీహెచ్. ఆదినారాయణరెడ్డి	269	33 రోజుల 3 గంటలు
పరిటాల సునీత	73	16 రోజుల 6 గంటలు
భూమా అఖిల ప్రియ	51	13 రోజుల 5 గంటలు
సిద్దా రాఘవరావు	118	12 రోజుల 10 గంటలు
ఎస్. చంద్రమోహన్‌రెడ్డి	113	10 రోజుల 12 గంటలు
పి.నారాయణ	642	8 రోజుల 8 గంటలు
యనమల రామకృష్ణుడు	351	8 రోజుల 7 గంటలు
కొల్లు రవీంద్ర	122	8 రోజుల 4 గంటలు
పి. పుల్లారావు	41	8 రోజుల ఒక గంట
డి. ఉమామహేశ్వరరావు	258	6 రోజుల 11 గంటలు
నక్కా ఆనందబాబు	240	6 రోజుల 11 గంటలు
సీహెచ్. అయ్యన్నపాత్రుడు	183	6 రోజుల 5 గంటలు
సుజయ కృష్ణ రంగారావు	62	6 రోజుల 4 గంటలు
కామినేని శ్రీనివాస్	157	4 రోజుల 9 గంటలు
కె.ఇ. కృష్ణమూర్తి	307	3 రోజుల 8 గంటలు
పితాని సత్యనారయణ	71	3 రోజుల 6 గంటలు
అచ్చెన్నాయుడు	149	3 రోజుల 5 గంటలు
కాలవ శ్రీనివాసులు	77	3 రోజుల 4 గంటలు
కళా వెంకట్రావు	87	2 రోజుల 2 గంటలు
ఎన్. అమరనాథ్‌రెడ్డి	110	ఒక రోజు 12 గంటలు
ఎన్. చినరాజప్ప	160	11 గంటలు
పి. మాణిక్యాలరావు	92	11 గంటలు
ఎన్.లోకేశ్	354	9 గంటలు

ఎంపీ, ఎమ్మెల్యేలపై కేసులకు ప్రత్యేక కోర్టు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసుల సత్వర విచారణ కోసం ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో విజయవాడలో దీనిని ఏర్పాటు చేయనున్నట్లు న్యాయ, శాసనసభ వ్యవహారాల కార్యదర్శి దుప్పల వెంకటరమణ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇందుకోసం డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి స్థాయి న్యాయమూర్తితోపాటు 29 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. కోర్టు నిర్వహణ కోసం రూ.1.95కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. గతంలో ఆయా జిల్లాల్లోనే ఇటువంటి కేసుల విచారణ జరిగేది. దీనివల్ల ఏళ్ల తరబడి కేసులు తేలకపోవడంతో ప్రత్యేక కోర్టు ఏర్పాటుచేయాలని గత ఏడాది డిసెంబర్ 14న సుప్రీంకోర్టు ఆదేశించింది.

‘యురేనియం’ బాధితులను రక్షించండి

- ప్రధానికి లేఖ రాసిన ఎంపీ అవినాష్‌రెడ్డి
- పరిస్థితుల అధ్యయనం కోసం శాస్త్రవేత్తల బృందాన్ని పంపించండి
- పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లాలోని ‘యురేనియం’ ప్రాజెక్టు వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇబ్బందులుపడుతున్న ప్రజలను రక్షించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రధానికి ఓ లేఖ రాశారు. ‘వైఎస్సార్ జిల్లాలో వేముల, పులివెందుల మండలాల పరిధిలో యురేనియం ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. ఆ ప్రాజెక్టుకు చెందిన టెయిలింగ్ పాండ్ నిర్వహణ అధ్వానంగా ఉంది. దీంతో ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఏడు గ్రామాల్లో గాలి, నీరు, భూమి కలుషితమయ్యాయి. ఇక్కడి ప్రజలు, పశువులు, పంటలకు తీవ్ర నష్టం జరుగుతోంది. బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) నుంచి శాస్త్రవేత్తల బృందాన్ని ఇక్కడి వాస్తవ పరిస్థితులను ఆధ్యయనం చేయడానికి డిప్యూటేషన్‌పై ఆదేశించండి. మానవీయకోణంలో నా అభ్యర్థనను మన్నించి యుద్ధ ప్రాదిపదికన చర్యలు చేపట్టండి’ అంటూ ఎంపీ అవినాష్ ప్రధాని మోదీని కోరారు. యూసీఐఎల్ పరిధిలో ఉన్న గ్రామాల ప్రజల సమ్మతితో ఇళ్లు, భూములను కొనుగోలు చేసి వారికి పునరావాసం అందించాలని, కాలుష్య నివారణకు తక్షణమే అవసరమైన చర్యలు ప్రారంభించాలని యూసీఐఎల్ సీఎండీకి లేఖ రాశారు. భూమిలో ఇంకిపోతున్న యురేనియం వ్యర్థాల వల్ల ఇక్కడ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ నష్టానికి యూసీఐఎల్ బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించాలని ఎంపీ డిమాండ్ చేశారు. ఇదేవిధంగా పర్యావరణ మంత్రికి లేఖ రాశారు.

కేంద్రంపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు: మంత్రి మాణిక్యాలరావు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు నిధుల కేటాయింపు, విడుదలకు సంబంధించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై దురభిప్రాయం కలిగేలా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి మాణిక్యాలరావు మండిపడ్డారు. సోమవారం ఢిల్లీలో ఆయన కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. విద్యాసంస్థలకు నిధుల కేటాయింపుల గురించి జవదేకర్‌తో మాట్లాడినట్లు చెప్పారు. విభజన చట్టంలో పేర్కొన్న మేరకు ఏపీలో విద్యాసంస్థల ఏర్పాటుకు అవసరమైన నిధులిచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని జవదేకర్ చెప్పినట్లు తెలిపారు.

సాక్షి
మంగళవారం, ఫిబ్రవరి 27

కనుమరుగైన అపురూపం

బాలనటిగా ప్రవేశించి దాదాపు అయిదు దశాబ్దాలపాటు తన నటనాపాటవంతో వెండితెరపై కాంతులు విరజిమ్మి రసహృదయాలను మైమరపించిన అపురూప సౌందర్యరాశి శ్రీదేవి సినీ రంగ జీవితం ఒక అద్భుతమైతే... ఆమె హఠాన్మరణం ఒక దిగ్భ్రమ. ఏ మరణమైనా విషాదకరమైనదే... కానీ హఠాన్మరణం ఆ విషాదాన్ని మరిన్ని రెట్లు పెంచుతుంది. ఇది చాలదన్నట్టు ఇప్పుడామె మరణం చుట్టూ అల్లుకుంటున్న సవాలక్ష సందేహాలు అందరినీ విస్మయపరుస్తున్నాయి. అందులోని నిజానిజాలేమిటో ఎటూ ఒకటి రెండు రోజుల్లో వెల్లడవుతాయి. ఆమె మరణవార్త తొలిసారి విన్న ప్రతి ఒక్కరూ అది నిజం కాదేమోనన్న సందేహం వెలిబుచ్చారంటే ఆమెపై ఉన్న వల్లమాలిన అభిమానమే అందుకు కారణం. కేవలం 54 ఏళ్ల వయసులోనే ఊహకందని విధంగా ఆమె మృత్యువు బారిన పడటం అందరినీ కలిచివేసే అంశం. ఆమెకు గుండెపోటు రావడం వల్ల ఈ దురదృష్టకర ఘటన జరిగిందని తొలిరోజు చెప్పారు. ఇప్పుడది కారణమే కాదంటున్నారు. స్నానాలగదిలోని నీళ్లున్న తొట్టెలో ప్రమాదవశాత్తూ పడిపోయి కన్నుమూశారంటున్నారు.

బాలనటిగా నాలుగేళ్ల వయసులోనే కెమెరా ముందుకొచ్చి ఇంతింతై ఎదుగుతూ దక్షిణాది మాత్రమే కాదు... దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానుల్ని ఆమె సంపాదించుకున్నారు. ఆ ముఖంలో కనబడే అమాయకత్వం, అందులో ఇంకా కనుమరుగుకాని పసితనం, పాత్రోచితంగా ఒదిగిపోయే స్వభావం శ్రీదేవిని ఈ స్థాయికి చేర్చాయి. లోకజ్ఞానం అంతగా లేని వయసులో పాత్ర స్వభావం గురించి డైరెక్టర్ చెప్పింది ఆకళింపు చేసుకోవడం, తాను చెప్పవలసిన సంభాషణలను కంఠతా పట్టడం, కెమెరా ముందు సహజత్వం ఉట్టిపడేలా వాటిని చెబుతూ చుట్టూ ఉన్నవారి అభినందనలు అందుకోవడం ఓ వరం. ఇలాంటి సామర్థ్యం ఉన్నవారు క్రమేపీ ఒక రకమైన ఆధిక్యతాభావనకు లోనవుతారు. తమను తాము అతీతులుగా సంభావించుకుంటారు. కానీ శ్రీదేవి ఇందుకు విరుద్ధం. నిరుడు 'మామ్' చిత్రం విడుదలైన సందర్భంలో సైతం నటనలో తానింకా విద్యార్థినేనని చెప్పారు. ఇది ఎదిగేకొద్దీ ఒదిగి ఉండటంగా కనబడవచ్చుగానీ, ఇంకా ఏదో నేర్చుకోవాలన్న పట్టుదల, తనకప్పగించిన పాత్రను మరింత మెరుగుపరచాలన్న తపన, చేసే పని పట్ల ఉండే అంకితభావం శ్రీదేవిని అలా తీర్చిదిద్దాయి.

ఆమె తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సినీరంగాల్లో దిగ్గజాలనదగ్గ నటుల వద్ద బాలనటిగా నటించారు. అనంతరకాలంలో వారి సరసనే హీరోయిన్‌గా వెలిగారు. అదే వింతనుకుంటే ఆ దిగ్గజాల వారసుల పక్కన సైతం కథానాయికగా చేసి అందరినీ మెప్పించారు. మరే హీరోయిన్‌కూ ఇది సాధ్యపడలేదు. దక్షిణాది భాషల కంటే విస్తృతమైన మార్కెట్ గల హిందీ సినీ రంగానికెళ్లి దాన్ని సైతం జయించగలిగారు. అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చుకున్నారు. 'అవతార్'లో ఆమెతో నటింపజేయాలని జేమ్స్ కామెరాన్ తహతహలాడడానికి అందుకు శ్రీదేవిలోని నటనావైదుష్యమే కారణం. అసమాన ప్రతిభాపాటవాలున్నప్పుడు భౌగోళిక సరిహద్దులు మటుమాయమవుతాయని ఆమె నిరూపించారు. హిందీ చిత్రసీమలో శ్రీదేవికి ముందు వైజయంతిమాల, హేమమాలిని వంటివారు పేరుప్రఖ్యాతులు గడించి ఉండొచ్చుగానీ 'సూపర్‌స్టార్' కీర్తిశిఖరాలను అధిరోహించిన ఖ్యాతి మాత్రం ఒక్క శ్రీదేవికే దక్కింది. ఆ తర్వాత వచ్చిన నటీమణులెవరూ ఆమె స్థాయికి చేరుకోలేకపోయారు. పురుషాధిక్యత రాజ్యమేలే సినీరంగంలో ఒక మహిళ 'సూపర్‌స్టార్'గా వెలుగులీనడం సాధారణ విషయం కాదు.

భారీ పెట్టుబడులతో మరింత భారీగా లాభాలను ఆర్జించాలని తహతహలాడే చలనచిత్ర రంగంలో హీరోయిన్ అనగానే గ్లామర్, శరీరాకృతి వంటివే ఎక్కువగా ప్రాధాన్యతలోకొస్తాయి. కథానాయకుడి పక్కన కుందనపు బొమ్మలా కనిపించడం, పాటల్లో గంతులేస్తూ నటించడమే కథానాయిక పని అనుకునేచోట హీరోయిన్ ప్రాధాన్యతను ఆమె తెలియజెప్పారు. కథానాయికగా మొదట్లో వచ్చిన 'పదహారేళ్ల వయసు' మొదలుకొని అనేక చిత్రాల్లో ఆమె వైవిధ్యభరితమైన నటనను ప్రదర్శించి అందరితో భేష్ అనిపించుకున్నారు. 1983లో వచ్చిన హిందీ చిత్రం 'హిమ్మత్‌వాలా'లో హీరోయిన్‌గా సమ్మోహనపరిచిన నటే అంతకు ముందు సంవత్సరం తమిళ చిత్రం 'మూండ్రాంపిరై'(తెలుగులో వసంత కోకిల)లో ప్రమాదంబారినపడి గతాన్ని మరచిన యువతిగా కనిపించి ప్రేక్షక లోకాన్ని కంట తడిపెట్టించిందంటే ఎవరూ నమ్మలేరు. 'జగదేక వీరుడు అతిలోక సుందరి', 'క్షణం క్షణం' వంటి చిత్రాలు సైతం శ్రీదేవిని ప్రేక్షకుల మనస్సుల్లో చిరస్థాయిగా నిలబెట్టాయి. ఇరవై ఆరేళ్లపాటు తెల్లారుజామునే లేచి తయారుకావడం, రోజుకు రెండు మూడు షూటింగ్‌లు, భిన్నమైన పాత్రలు, నిరంతర అవుట్‌డోర్లు, ఆర్క్‌లైట్ వెలుగులు... ఇవే జీవితంగా గడిపిన శ్రీదేవి ఆ తర్వాత దాదాపు 20 ఏళ్లపాటు నిజ జీవితంలో గృహిణి పాత్రలో ఒదిగిపోయారు. కుటుంబమే ప్రపంచంగా బతికారు. అయినా సరే 2012లో మళ్లీ ముఖానికి రంగేసుకుని 'ఇంగ్లిష్ వింగ్లిష్' చిత్రంలో నటించేనాటికి కూడా ఆమె అభిమాన ప్రపంచం చెక్కుచెదరలేదు.

గ్లామర్ ప్రపంచం ఆడవాళ్లను కాసించినంతగా మగవాళ్ల జోలికి రాదు. నాజూగ్గా కనబడాలని ఎవరూ చెప్పినట్టు, ఆదేశించినట్టు కనబడదు. కానీ ఏమూలో దానికి లొంగిపోయే స్వభావం ప్రబలంగానో ఎంతో కొంతో ఉంటుంది. కోట్లాదిమందిని ఆకట్టుకునే మాధ్యమంలో దిగ్గజాలుగా వెలుగుతున్నవారికి అది అప్పుడప్పుడు శాపమవుతోంది. శ్రీదేవి మరణానికి అలాంటిదేమైనా కారణమా అన్నది తెలియదు. కానీ సహజంగానే సామాజిక మాధ్యమాల్లో ఆ కోణంలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. చిత్రపరిశ్రమలో ఏనాడూ వివాదాల జోలికి పోకుండా, చివరికంటా ఎంతో హుందాగా జీవించి అందరి ఆదరాభిమానాలూ చూరగొన్న శ్రీదేవి రానున్న తరాలకు సైతం అపురూపంగా, స్ఫూర్తిదాయకంగా నిలుస్తారు.



"మరణం మనిషి చివరి నిద్ర ఎంతమాత్రమూ కాదు. అది జీవితం చివరి మేల్కొలుపు."
– వాల్టర్ స్కాట్
స్కాటిష్ నవలా రచయిత

గ్రహం అనుగ్రహం


శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి శు.ద్వాదశి ఉ.12.52 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం పుష్యమి రా.2.40 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం ఉ.11.43 నుంచి 1.13 వరకు దుర్ముహూర్తం ఉ.8.41 నుంచి 9.28 వరకు, తదుపరి రా.10.56 నుంచి 11.46 వరకు, అమృతఘడియలు రా.8.41 నుంచి 10.11 వరకు.

సూర్యోదయం : 6.24
సూర్యాస్తమయం : 6.00
రాహుకాలం : ప.3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

నమాజ్ వేళలు

ఫజర్ : 5.24
జొహర్ : 12.29
అసర్ : 4.44
మగ్రీబ్ : 6.22
ఇషా : 7.34

అగ్రదేశాన్ని అంటకాగొద్దు!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

అమెరికా తన ఆర్థిక సంక్షోభాలను నివారించుకోవడానికి కనిపెట్టే సాంకేతిక చిట్కాల వెంటపడితే– రోజుకొక తీరు చొప్పున వస్తువులను మార్చుతూ, నెల తిరగకుండానే నూతన ఆవిష్కరణల పేరిట పాత వస్తువుకు ఉద్వాసన చెప్పి దాని స్థానంలో కొత్త వస్తువును 'అవ్యవధి'లో సృష్టించాల్సి వస్తుందని.. ఇది అధిక సంఖ్యలో నిరుద్యోగులు, నిరక్షరాస్యులు ఉన్న భారత్‌కు సరికాదని అమెరికాలో భారత మాజీ రాయబారి, మాజీ విదేశాంగ మంత్రి ఎం.సి. చాగ్లా తన 'రోజెస్ ఇన్ డిసెంబర్' గ్రంథంలో పేర్కొన్నారు.

రెండో మాట

'ఏ దేశంలో అయినా, ప్రజలందరినీ సుఖసంతోషాలతో ఉంచగల అపార సహజ వనరులు ఉంటాయి. కానీ కొద్దిమంది ధనవంతుల 'ఆబ'వల్ల ప్రజల మధ్య అసమానతలు, దారిద్ర్యం తాండవిస్తున్నాయి.'
– *మహాత్మాగాంధీ*

'ఈ భూమి ఏ ఒక్కడి సొత్తూ కాదు, చివరికి ఈ భూఖండంలోని యావన్మంది ప్రజలకు కూడా ఆ సొత్తును సొంతం చేసుకునే హక్కులేదు. ప్రజలు ఈ భూమినీ భూసంపదనూ భావి తరాల కోసం కాపాడే విశ్వసనీయమైన ధర్మకర్తలు మాత్రమే. ఒక కుటుంబానికి నమ్మదగిన ఇంటి పెద్దలాగా ఈ సమష్టి భూసంపదను ఆ పెద్ద వృద్ధిలోకి తీసుకురావడమే వారి బాధ్యత.'
– *కారల్‌మార్క్స్*

'ఒక రోజాపువ్వు దాని ప్రకాశవంతమైన శోభ, పరిమళం చెడకుండా సృష్టించడం ఎలా సాధ్యమంటే ఆ రోజా చుట్టూ ఉన్న మొగ్గలని కాస్తా తుంచి పారేయడం ద్వారానే.'
– *జూనియర్ రాక్‌ఫెల్లర్ (బ్రౌన్ విశ్వవిద్యాలయంలో ఈ అమెరికా కోటీశ్వరుడు చేసిన ప్రసంగంలో భాగం)*

అమెరికా సామ్రాజ్య విస్తరణ శక్తి మీద, ప్రపంచంలో ఆ దేశ గుత్త పెట్టుబడి సంస్థలు చూపించే శక్తి సామర్థ్యాల మీద అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు విశ్వాసం సన్నగిల్లినట్టుంది. నిజానికి ఆయన ఆ భావాన్ని అధ్యక్ష ఎన్నికల సందర్భంగానే వ్యక్తం చేశారు. 'ప్రపంచ శక్తిగా అమెరికా ప్రతిష్టను తిరిగి పునరుద్ధరించడమే' తన కర్తవ్యంగా ఆయన ఎన్నికల సభలలో చెప్పారు. ఆ ప్రతిష్ట ఎలాంటిదో చెప్పకుండానే, అది ప్రపంచదేశాలలో పలచబారిపోతోందని లోపాయికారీగా అంగీకరించవలసి వచ్చింది. ఇందుకు కారకులు తన కంటే ముందు పాలించిన ట్రూమన్, రూజ్వెల్ట్, ఐసెన్‌హోవర్, నిక్సన్, బుష్ (సీని యర్, జూనియర్), క్లింటన్, ఒబామా– ఎవరు కారకులు?

అనేక పోరాటాలూ త్యాగాలూ ఫలితంగా ఇండియా సహా పెక్కు ఆఫ్రో–ఏసియన్ దేశాల మీద బ్రిటిష్ పెత్తనం తొలగిపోయింది. మళ్లీ అదే పంథాను అనుసరించింది అమెరికా. ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా పెత్తనం కొనసాగుతూ వస్తోంది. సోవియెట్ రష్యా కూడా అనేక త్యాగాలు చేసి, అమెరికా కుట్రలకు తలొగ్గకుండా ఉన్నందుకే ఏడు దశాబ్దాలకు పైగా వ్యక్తిత్వాన్నీ, ఆర్థిక స్వాతంత్ర్యాన్నీ కాపాడుకోగలిగింది. విశ్వకవి టాగోర్, గాంధీ, నెహ్రూ, డీన్ ఆఫ్ కాంటర్‌బరీ, బెర్నార్డ్‌షా వంటివారు ఈ సత్యాన్ని కీర్తించినవారే. సోవియెట్ రష్యా పేదలకు, పేద దేశాలకు చెక్కుచెదరని అండదండలు అందించింది. రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీ నియంత హిట్లర్ విజయ పరంపరలో ఉన్నప్పటికీ సోవియెట్ యూనియన్‌కు జయం కలగాలని టాగోర్, నెహ్రూ పదేపదే ప్రార్థించడానికి కారణం కూడా అదే. నిజానికి హిట్లర్‌ను తుత్తునియలు చేయడంలో సోవియెట్ రష్యాకు అండదండలు అందిస్తున్నట్టే పైకి కనిపించినా మిత్రమండలిలోని అమెరికా, బ్రిటన్ ఆలోచన వేరు. నాజీలను ఓడించిన ఘనత సోవియెట్ సేనలకు రాకూడదనే వారి ఆశ. అందుకే సోవియెట్ రష్యా కోరిన విధంగా తమ సేనలను పంపించడంలో తీవ్ర జాప్యం చేసిన సంగతి తెలిసిందే. అక్కడ నుంచి క్రమంగా సోవియెట్ రష్యా పలుకుబడి ప్రపంచ వ్యాప్తం కాకుండా ఉండేందుకు ఆంగ్లో–అమెరికన్ సామ్రాజ్యవాదులు అన్ని రకాల వ్యూహాలకు సిద్ధపడ్డారు.

ఒక శాతం ధనికుల వద్దనే అమెరికా సంపద

ఏడు దశాబ్దాల సోవియెట్ రష్యా ప్రస్థానంలో ఆ దేశ నాయకత్వాన్ని, అందులోని మెతక వర్గాన్ని అమెరికన్ సామ్రాజ్యవాద శక్తులు ప్రలోభాలతో సాకుతూనే ఉన్నాయి. చివరికి రెక్‌జావిక్ (ఐస్‌ల్యాండ్) రహస్య సమావేశం ద్వారా సోవియెట్ నాయకవర్గాన్ని లోబరుచుకున్నారు. ఆపై అమెరికా విజృంభణకు అదుపు లేకుండా పోయింది. అలాగే రెండో ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా దాదాపు 90 దేశాలలో సైనిక స్థావరాలను నెలకొల్పింది. ప్రపంచం మీద పెత్తనానికి ప్రయత్నించింది. ఇతర దేశాల సంపదలపై ఆధిపత్యం చేయడానికి ఇలాంటి స్థావరాల అవసరం అమెరికాకు ఉంది. సరిగ్గా ఆ కుట్రలు పన్నుతున్న సమయంలోనే ప్రపంచ చరిత్రలోనే అత్యంత కీలకమైన ఆర్థిక సంక్షోభానికి (గ్రేట్ డిప్రెషన్) అమెరికా కారణమైంది. అలా 70 ఏళ్లుగా అనేక ఆర్థిక సంక్షోభాలకు 'పురుడు' పోసి స్వతంత్ర దేశాల ఆర్థిక వ్యవస్థలను కూడా ఆ కుట్రలోకి లాగి తేరుకోలేకుండా చేస్తోంది. అటు రాజకీయ పెత్తనం, ఇటు ఆర్థిక సంక్షోభాల సృష్టికి తామే కారకులమన్న సత్యాన్ని అమెరికా కాదనలేని దశకు చేరింది.

ఈ సంక్షోభంలో ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా వర్ధమాన, బడుగు దేశాలను అమెరికా తనకు తోడుగా సంపాదించుకుంది. సరిగ్గా ఈ నేపథ్యంలోనే అమెరికా వర్తక, గుత్త వ్యాపార కేంద్రమైన పెట్టుబడిదారీ 'వాల్‌స్ట్రీట్' మీద ప్రజలు తిరుగుబాటు చేశారు. ఆ ప్రకంపనలు ఇప్పటికీ చల్లారలేదు. ఈ సమయంలోనే అసలు రహస్యాన్ని బయట పెడుతూ ప్రపంచ బ్యాంకు అనుబంధ అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐ.ఎం.ఎఫ్.) అమెరికాలోని 1 శాతం అతి సంపన్నులు మాత్రమే 99 శాతం ప్రజల్ని దోచుకు తింటున్నారని నిరూపించింది. ఈ 99 శాతం ప్రజల తరపున వాల్‌స్ట్రీట్ ఉద్యమం సాగవలసి వచ్చిందని ఆందోళనకారులు చెప్పవలసి వచ్చింది కూడా. ఈ పరిణామాలను తాజాగా చర్చిస్తూ ఈ ప్రపంచ అనుభవాల తర్వాత 'మానవజాతి లేదా మానవులు బతికి బట్టకట్టాలంటే సోషలిజం అనివార్యమ'ని ప్రసిద్ధ అమెరికన్ మాసపత్రిక 'మంత్లీ రివ్యూ'సంపాదకుడు జాన్ బెలామీ పోస్టర్ ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఇంటర్వ్యూ జరిపినవారు జిప్సన్ జాన్, జితేష్ పి.ఎం. (జనవరి 19, ఫిబ్రవరి 02, 2018).



అమెరికాను అనుసరిస్తే ఎలా?

శతాబ్దాలుగా ప్రయాణించిన పెట్టుబడిదారీ వ్యవస్థ నేడు ఈ దశకు చేరుకుంది. తానెదుర్కొంటున్న పలు ఆర్థిక సంక్షోభాలను, శ్రేయోదాయకమైన ప్రజాతంత్ర ప్రజా ప్రయోజనాలను కాపాడే దిశగా పరిష్కరించే మార్గాలు విడిచి కేవలం సాంకేతిక పరిజ్ఞానం చాటున దాగుతూ సమస్యను తాత్కాలికంగా దాటవేస్తూ వస్తోంది. అందుకే అమెరికాలో భారత మాజీ రాయబారి, మాజీ విదేశాంగ మంత్రి ఎం.సి. చాగ్లా రాసిన 'రోజెస్ ఇన్ డిసెంబర్' గ్రంథంలో భారతీయ అనుకరణ విద్యను విమర్శించాల్సి వచ్చింది. అమెరికా తన ఆర్థిక సంక్షోభాలను నివారించుకోవడానికి కనిపెట్టే సాంకేతిక చిట్కాల వెంటపడితే– రోజుకొక తీరు చొప్పున వస్తువులను మార్చుతూ, నెల తిరగకుండానే నూతన ఆవిష్కరణల పేరిట పాత వస్తువుకు ఉద్వాసన చెప్పి దాని స్థానంలో కొత్త వస్తువును 'అవ్యవధి'లో సృష్టించడం అనేది అధిక సంఖ్యలో నిరుద్యోగులు, నిరక్షరాస్యులు ఉన్న భారత్‌కు సరికాదని చెప్పారు చాగ్లా. ఈ భావాన్నే ఇప్పుడు విస్తృత స్థాయిలో చర్చించిన బెలామీ పాస్టర్, 'అనేక ప్రపంచదేశాలలో, ఆర్థిక సంక్షోభాలలో కూరుకుపోతున్న ప్రాంతాలలో నేడు తిరుగుబాటు బీజాలు పడ్డాయి' అన్నాడు. ఎందుకంటే, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొంటున్న ఈ నిరంతర సంక్షోభం పెట్టుబడిదారీ వ్యవస్థ చంచలమైన దాని చలన సూత్రాలలోనే దాగి ఉందని మరవరాదన్నాడు. అంతేగాదు, నేడు మనకి ముంచుకొచ్చిన పర్యావరణ కాలుష్య సమస్యలు కూడా పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థలో అంతర్భాగమేనని గుర్తించాలంటాడు బెలామీ. పెట్టుబడి వ్యవస్థలో అంతర్భాగంగా కొత్తగా వెలసిన 'నూతన ఉదారవాదం' (నియోలిబరిజం) కూడా ఆర్థిక సంక్షోభాలకు మౌలిక కారణాలను ప్రజలు గుర్తించకుండా చేసే 'మాయజలతారే'నని గ్రహించవలసిన రోజు వచ్చిందంటాడు పాస్టర్. అంటే అంతంతమాత్రపు ఆ 'నవీన ఉదారవాదా'నికి కూడా కాలం చెల్లిపోయే సుదినాలు వచ్చాయని బెలామీ పాస్టర్ ఒక ఆశావాదిగా భావిస్తున్నాడు. ఇందుకు అనుగుణంగానే ప్రపంచ వ్యాపితంగా ఇప్పటిదాకా ఎదురులేకుండా 'నటిస్తున్న' అమెరికన్ సామ్రాజ్యవాద పాలనా వ్యవస్థ, అతి చిన్న దేశమైన వియత్నాం తిరగబడినంతనే కుప్పకూలిపోయి ధన, సైనిక, నైతిక రంగాలలో వరసగా రాజకీయ, సైనికపరమైన ఓటమి పరంపరను ఎదుర్కొన్నది. నికరాగ్వా, హోండురాస్, క్యూబా, బ్రెజిల్ వగైరా స్వతంత్ర దేశాలు తమ మనుగడను చాటుకునే దేశాలలో అమెరికాకు పట్టిన గతీ ఇదే. ఈ పరిణామాలన్నీ గడచిన 25–30 సంవత్సరాలలోనే జరిగాయి.

సాంకేతిక విద్య సమరానికి కాదు

సాంకేతిక పరిజ్ఞానం మానవుడి అవసరాలను తీర్చగల ఒక సాధనమేగానీ అతని ప్రగతిని యుద్ధాల బాటలోకి నెట్టే సాధనం కాదు. ట్రంప్, మోదీ లాంటి ఆయన అనుచరులూ గుర్తించవలసిన మొదటి షరతు అది. దీనికి తోడు 'కృత్రిమ మేధ' (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను రంగంలోకి దించే పెద్దలు ఆ కృత్రిమ రోబోటిక్ పరికరం మానవుడు సృష్టించిందేనని, అతని శ్రమశక్తి వినియోగించకుండా ఆ పరికరం వెలుగులోకి రాలేదని గ్రహించాలి. ట్రంప్ ఎన్నికలో ప్రధాన పాత్ర వహించిన అతని క్యాబినెట్ అనుయాయులుగా కన్జర్వేటివ్స్‌గా ఉన్న స్టీవ్ బన్నన్, జాన్ కెల్లీ, జాత్యహంకారి రాయ్ మూర్ సహితం ట్రంప్ టీమ్ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. అంతేగాదు, మధ్యాసియా రిపబ్లిక్స్‌లోనూ, అదను చూసుకుని అఫ్ఘానిస్తాన్‌లో తన యుద్ధ స్థావరాలు ఆధారంగా క్రమంగా కశ్మీర్‌లోకి పాకాలని చూస్తూ, భారత్–పాకిస్తాన్‌ల మధ్య, భారత్–చైనాల మధ్య సంబంధాలు మెరుగుపడకుండా వ్యూహ రచన చేస్తున్న సమయంలో ట్రంప్ ఆశలు ఆవిరైపోక తప్పదు. యూరప్‌లో కూడా తన ఆధిపత్యం చేజారకుండా ఉండేందుకు అమెరికా ఆధ్వర్యాన నడుస్తున్న 'నాటో' సైనిక కూటమి సరికొత్త ప్రచ్ఛన్న యుద్ధానికి సన్నాహాలు చేస్తోంది. అందుకే మార్క్స్ 'ప్రపంచంలో అత్యంత కీలకమైన ఉత్పాదక శక్తులు మానవమాత్రులేగానీ మరొకరు కాజాలరు. మానవశక్తి, ఉత్పత్తి శక్తులయిన ఆ మానవుల అభివృద్ధే–శ్రమ విభజనే అసలు సిసలు అభివృద్ధికి చిహ్నం' అన్నాడు.

షెల్లీ మహాకవి మాటల్ని వినండి: ***"నీవు విత్తనం చల్లుతావు, ఆ పంటను మరొకడు కోసుకుంటాడు/ నీవు సంపద సృష్టిస్తావు, మరొకడు అనుభవిస్తాడు/ బట్ట నేసేది నీవు ధరించేది మరొకడు/ ఆయుధాల తయారీ నీవు– వాటిని ఉపయోగించేది మరొకడు/ అయితే– నీవు విత్తనం చల్లు, కానీ ఏ నియంతనూ పంటను కోసుకోనివ్వకు/ సంపద సృష్టించు, కానీ మరొకణ్ని కూడబెట్టనివ్వకు/ నీవు బట్టనెయ్యి కానీ సోమరిపోతుకు దాన్ని దక్కనివ్వకు/ ఆయుధాలు తయారుచేసుకో, కానీ నీ రక్షణ కోసమే తయారు చేసుకో".***

abkprasad2006@yahoo.co.in

నిజాయితీకి నిదర్శనాలు

దమ్ముంటే తనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి బదిలీ చేయాలంటూ థానే మునిసిపల్ కమిషనర్ చేసిన సవాలు నేతలకు షాక్ కలిగించింది. నిబంధనలకు కట్టుబడే అధికారుల ధోరణి పెరుగుతుండటం అభినందనీయం.

విశ్లేషణ



మహేశ్ విజాపుర్కర్

మహారాష్ట్రలో ఐఏఎస్ అధికారుల్లో బలపడుతున్న ఒక ధోరణి గురించి మనం మాట్లాడుకోవాల్సిన అవసరముంది. వారు నియమ నిబంధనలకు కట్టుబడటానికి ప్రయత్నిస్తూ, తమకు అప్పగించిన విధుల్లో రాజకీయ జోక్యాన్ని పూర్తిగా అడ్డుకుంటున్నారు. జనం దృష్టికి వచ్చిన తాజా ఉదంతం ఏమిటంటే, థానె మునిసిపల్ కమిషనర్ ఇటీవలే కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో.. తనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి, దమ్ముంటే తనను బదిలీ చేయాలంటూ సవాలు చేశారు.

ఇది తొలిసారి జరిగిన విషయం ఏమీ కాదు. కొన్ని నెలల క్రితం కూడా ఆ అధికారి తాను ముఖ్యమంత్రిని కలిసి బదిలీ చేయించుకుంటానని సర్వ సభ్య సంఘానికి తెలియజేశారు. కాని అతడి ప్రతిపాదనను అప్పట్లో అంగీకరించలేదు. ఇప్పుడు తనపై అవిశ్వాస ప్రకటన చేయాలన్న అతడి డిమాండ్ పట్ల కూడా రాజకీయ నేతలు కలవరపడలేదు. సంజయ్ జైస్వాల్ అనే ఆ అధికారి మరికొద్ది నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. ఇలాంటి అధికారి విషయంలోనూ వారు నిలకడతనాన్ని పాటించలేదు. పైగా వారు అతడిని అప్రతిష్టపాలు చేయడానికి కూడా ప్రయత్నించారు.

ఎదుగుతున్న లేక ముంబైలాగా కిక్కిరిసిపోయి, జనసమ్మర్ధంగా ఉంటున్న థానే నగరం రాజకీయ నేతలకు, మధ్య దళారీలకు అద్భుతమైన అవకాశాలను ఇస్తోంది. నిర్మాణ రంగం ఇక్కడ అతి పెద్ద పరిశ్రమగా మారడంతో రాజకీయ నేతలే దళారీలుగా మారుతున్నారు. నగరం ఎదుగుతున్నట్లయితే, నూతన గృహాల నిర్మాణం వేగం పుంజుకుంటుంది. నగరం ఇప్పటికే ఇరుగ్గా మారి ఉన్నట్లయితే చట్టాలను అతిక్రమించాల్సి ఉంటుంది. అనేక పెద్ద నగరాల్లో నిర్మాణరంగ వాణిజ్యంలో రాజకీయ నాయకులు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కాని వాటా కలిగి ఉంటున్నారని చెబుతున్నారు.

థానేలో దాదాపు 20 లక్షల మంది జనాభాతో మహారాష్ట్రలో గుర్తించదగిన నగరంగా విస్తరిస్తోంది. కానీ ఇరుగ్గా మారుతుండటంతో నగర పాలనను సమర్థంగా నిర్వహించాల్సిన అవసరమెంతైనా ఉంది. ఇప్పుడు సుపరిపాలన కావాలి. కానీ తమ వ్యక్తిగత అభివృద్ధి పైనే దృష్టి పెట్టిన రాజకీయనేతలు పురపాలక సంస సమర్థ నిర్వహణపై ఆసక్తి చూపడం లేదు.

తనకంటే ముందు పనిచేసిన ఐఏఎస్ అధికారి టి. చంద్రశేఖర్ లాగే జైస్వాల్ కూడా ప్రజానుకూల అధికారి. 2000ల మొదట్లో ఐఏఎస్ అధికారి టి. చంద్రశేఖర్ రాజకీయ నేతల అడ్డంకులను ఎదుర్కొని థానే నగరంలో మెరుగైన మౌలిక వసతులను కల్పించారు. ప్రజాపక్షపాతిగా, నగరాభివృద్ధే లక్ష్యంగా కార్యాచరణకు పూనుకున్నారు. అందుకే జైస్వాల్ నేతల దారిలో ముల్లు అయి కూర్చున్నారు. నగర ఆదాయ మార్గాలను పెంచారు. వీటన్నింటితో ప్రజలు అతడి వెన్నంటే నిలిచారు. పైగా



నగరంలోని స్వార్థ ప్రయోజన శక్తులను అడ్డుకుంటూ బహిరంగ ప్రకటనలు పంపిణీ చేశారు కూడా. రక్షణ కోసం పురపాలక సంస్థ ఖర్చుతో ప్రైవేట్ బౌన్సర్లను నియమించుకున్న ఏకైక పురపాలక సంస్థ అధినేత బహుశా ఆయనే కావచ్చు. అక్రమ నివాసాలను తొలగిస్తున్నప్పుడు లేక కూల్చివేస్తున్నప్పుడు అతడిని దూషించడమే కాకుండా తన డిప్యూటీపై దాడి చేశారు కూడా.

జైస్వాల్ ఒంటరి కాదు. నవీ ముంబై కార్పొరేషన్ అధిపతి తుకారాం ముండే కూడా రాజకీయ నేతలకు తలవంచని పాపానికి కొద్దికాలంలోనే బదిలీకి గురయ్యారు. పింప్రి నుంచి చించ్‌వాడ్‌కు అక్కడి నుంచి నాసిక్‌కి తరచుగా తన విషయంలో జరిగిన బదిలీలను ఆయన కిమ్మనకుండా, సాహసోపేతంగా స్వీకరించారు కానీ ప్రజాస్వామ్యంలో కొన్ని నియమ నిబంధనలు ఉంటాయని, వాటిని రాజకీయ నేతలు తోసిపుచ్చరాదని ఈ ఉదంతాలు తెలుపుతున్నాయి. వ్యక్తుల కంటే సంస్థలు చాలా ముఖ్యమైనవి.

ఇకపోతే మహేష్ జగాడే ఉదంతాన్ని తీసుకోండి. రాజకీయ నేతలకు వంగి నమస్కారాలు పెట్టకపోవడంతో ఈ అధికారిని కూడా చాలాసార్లు బదిలీలపై పంపారు. ఆహారం, మందుల సంస్థ కమిషనర్ స్థాయిలో ఉన్న తనను జిల్లా స్థాయికి కుదించివేశారు. కానీ ఏ పదవిని అలంకరించినా, స్వార్థ ప్రయోజన శక్తులకు లొంగకుండా తన పని విషయంలో ఆయన రాజీలేకుండా వ్యవహరించారు.

మహారాష్ట్రలో పలువురు నిజాయితీ పరులైన అధికారులున్నారు. అవినీతిమయమైన వ్యవస్థ లొసుగులను చక్కదిద్దారు. ఉదాహరణకు దేశంలోనే అతిపెద్దదైన నగరాల్లో ఒకటైన ముంబై పురపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేసిన డిఎమ్ శుక్తాంకర్, చాలాకాలం తర్వాత ఆయన వారసుడిగా వచ్చిన ఎస్ఎస్. టినైకర్ ఇద్దరూ పురపాలన అనేది పౌరుడి కేంద్రకంగానే ఉండాలని రాజకీయనేతలు, కాంట్రాక్టర్లు తెలుసుకునేలా చేశారు.

చంద్రశేఖర్, జైస్వాల్, ముండే వంటివారు ఉత్తమ అధికారులుగా మహారాష్ట్ర నగర పాలనపై తమ ముద్ర వేశారు. మహారాష్ట్రకే కాదు దేశంలోని ప్రతి స్థాయిలోనూ ఇలాంటి మంచి అధికారులు తప్పక పనిచేయాలి. అధికారులు నిబంధనలకు పూర్తిగా కట్టుబడి పనిచేసే ఈ ధోరణి ఇప్పుడు చాలా ఎక్కువగా ఉన్నట్లుంది. మొదటిగా నగర పాలనకు ప్రాధాన్యం ఇవ్వడం చాలా ముఖ్యం. ఎందుకంటే నగరాలు పౌర జీవితాల సమ్మేళనం.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
ఈ–మెయిల్ : mvijapurkar@gmail.com

అర్ధ శతాబ్దపు చందమామ

వెండితెరపై అర్ధశతాబ్దపు చందమామవు. నిన్ను చూస్తూ గడిపిన బాల్యం, నిన్ను ఆరాధిస్తూ నడిచిన యవ్వనం, నీ ఊహల్లో గడిచిన రాత్రులు, చెదిరిన నిద్రలు ఒక్కసారిగా నువ్వు లేవంటే దిగాలు పడిపోవూ..!

దేవీ... మౌనమా!

అదేంటో...

నువ్వేమో మౌనంలోకి వెళ్లిపోయావు!

ఈ ప్రపంచమంతా నీ గురించే మాట్లాడుకుంటోంది.

తెరమీద నువ్వు కనిపిస్తే బ్రహ్మదేవుడికి దండం పెట్టారు.

కొంపముంచావంటూ తియ్యగా తిట్టుకున్నారు.

అసలు భూలోకం ఇలాంటి సిరి చూడలేదని పాడుకున్నారు.

ఇప్పుడు నువ్వు అకస్మాత్తుగా మాయమైపోతే ఆ వాస్తవాన్ని ఒప్పుకోడానికి ఎవరికి వాళ్లు కారణాలు వెతుక్కుంటున్నారు.

నువ్విలాగే భూమ్మీద ఇంకొన్నాళ్లు ఉండిపోతే... అందరిలాగే నీకూ వృద్ధాప్యం వచ్చేస్తే... నిన్నలా చూడలేక, నువ్వూ మామూలు మనిషివేనని అనుకోలేక ఆ బ్రహ్మను నిజంగానే తిట్టుకుంటారని ఇలా వెళ్లిపోయావట.



ఇన్నాళ్లూ నీ అందాన్ని చూసి ఆయన్ను మెచ్చుకున్నవాళ్లు...

ఇదంతా తమ భ్రమేనని నిరాశపడిపోతే నిట్టూరిస్తే చూడలేక నువ్వెళ్లిపోయావట.

నిన్ను దేవకన్యగా భూమ్మీదకు పంపిన బ్రహ్మకు చెడ్డపేరు తేవడం ఇష్టంలేక కృతజ్ఞతతో వెళ్లిపోయావట.

నీ చర్మం ముడతలు పడితే... నీ చూపు మందగిస్తే.. నీ అడుగులు సాయం కోరితే... నీ మాట తడబడితే...

పూలరెక్కలు కొన్ని తేనెచుక్కలు రంగరించిన అందమని పొగిడినవాళ్లు తట్టుకోలేరని ఇలా అర్ధాంతరంగా చేదువార్తగా సెలవిచ్చావట.

ఎందుకంటే...

నువ్వు సినిమాకోసం కాస్త డైటింగ్ చేసి కొంచెం సొట్ట బుగ్గలతో కనిపిస్తేనే నీ అభిమానలోకం తట్టుకోలేకపోయింది. నీకేమైంది? అని గంటలకొద్దీ గూగులమ్మను ఆరాతీసి అలసిపోయింది.

అలాంటిది, నువ్వు అందరిలా సహజంగానే అన్ని దశల్లోనూ కనిపిస్తానంటే ఆ గుండె తట్టుకుంటుందా? ఆ మనసు ఒప్పుకుంటుందా?..

ఎన్ని కథలు, ఎన్ని పాత్రలు, ఎన్ని భావోద్వేగాలు, ఎన్ని కళలు, ఎన్ని సొగసులు, ఎన్ని కవ్వింపులు.

ఊరికే వచ్చి పోయిన తారవి కాదు కదా!

తెరమీద నీకంటూ ఒక వాటా పంచేసుకున్న నటివి.

వెండితెరపై అర్ధశతాబ్దపు చందమామవు.

నిన్ను చూస్తూ గడిపిన బాల్యం, నిన్ను ఆరాధిస్తూ నడిచిన యవ్వనం, నీ ఊహల్లో గడిచిన రాత్రులు, చెదిరిన నిద్రలు ఒక్కసారిగా నువ్వు లేవంటే దిగాలు పడిపోవూ..!

నీలా చూడాలని, మాట్లాడాలని, నడవాలని, సిగ్గులొలకాలని...

నీలా జడవేసుకోవాలని, నువ్వు కట్టిన డిజైన్ చీర కట్టుకోవాలని, అదే బొట్టు పెట్టుకోవాలని...

నీలా ఉయ్యాలలూగాలని, నవ్వాలని, మంచం మీద బోర్లా పడుకుని రెండు కాళ్లూ ఆడించాలని, ముక్కుపుడక పెట్టుకోవాలని...

నీలా నీటిలోని చేపపిల్లలా కనురెప్పలు ఆడించాలని, హావభావాలు ప్రదర్శించాలని చాటుగా ప్రాక్టీస్ చేసిన వెన్నెల్లో ఆడపిల్లలు ఈ వార్త వింటే బెంగటిల్లిపోరూ..!

ఎన్ని హృదయాలను కొల్లగొట్టావు..?

అయినా సరే... నువ్వు అందవని తెలిసినా సరే నవ్వుతూ ఆ ప్రేమను అనుభవించేశారు. జీవితాంతం నిన్నే ప్రేమిస్తూ ఉంటామని ప్రకటించేశారు.

ఇప్పుడు నీ గుండె చప్పుడే లేదంటే అంతకంటే గాయం ఉంటుందా చెప్పు..!

తనను ఏడిపించావని వర్మ నీకు కటీఫ్ చెప్పేశాడు.

బోనీ ఎప్పటికీ చెప్పలేడు...

పోనీలే..! అభిమానుల సంగతి అడగొద్దు ప్లీజ్.

నువు లేవన్న విషయంలోనే వాళ్లకింకా క్లారిటీ రాలేదు.

చాలామంది నీ సన్నిహితులు చెబుతుంటే విన్నాను.

నటన తప్ప నీకేమీ చేతకాదట.

ఎంత గొప్ప కాంప్లిమెంట్!...

ఇది కూడా నటన అయితే బాగుండేది.

విచిత్రం...

ఈ భూమ్మీద ఉన్నప్పుడే నిన్ను అతిలోక సుందరి అన్నారు.

ఇప్పుడు అక్కడికే వెళితే మాకు దూరమైపోయింది అంటున్నారు.

నిన్ను ఆరాధించేవారికి అర్థంకానిదేంటంటే...

అక్కడ ఉండాల్సిన నువ్వు ఇన్నాళ్లూ ఇక్కడ కళా విడిది చేశావా?

అదిగో... ఏదో వాట్సాప్ మెసేజ్ వచ్చింది.

ఎవరో రాశారు...

నువ్వు అంగుళీయకము మర్చిపోయి వెళ్లి ఉంటావు...

ఇంద్రలోకం నుంచి నిన్ను మళ్లీ భూలోకానికి పంపిచేస్తారు అని!

కల్పన అయినా ఎంత బాగుంది...

వసంతకోకిలలో పాటలాగ.

మిస్ యు...

– పూడి శ్రీనివాసరావు, సాక్షి టీవీ

మరణం వెనుక..

శ్రీదేవి మృతి కేసులో అనేక అనుమానాలు.. గుండెపోటు కాదని తేల్చిన ఫోరెన్సిక్ రిపోర్టు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి

శ్రీదేవి గుండెపోటుతో మరణించలేదని, ప్రమాదవశాత్తూ మృతి చెందినట్టు దుబాయి ఫోరెన్సిక్ నిపుణులు తేల్చడంతో అనేక అనుమానాలు తెరపైకి వస్తున్నాయి. శ్రీదేవి బాత్‌రూమ్‌లో గుండెపోటుకు గురవడంతో హాస్పిటల్‌కు తరలించామని, కానీ చికిత్స అందించే లోపే చనిపోయినట్టు కుటుంబీకులు ఇప్పటిదాకా చెప్పుకొచ్చారు. కానీ జరిగింది అది కాదన్న సంగతి ఫోరెన్సిక్ నివేదికను బట్టి తెలుస్తోంది. బాత్‌టబ్‌లో ప్రమాదవశాత్తూ ఆమెనే పడిపోయారా లేదా ఎవరైనా తోసేశారా అన్న అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి.

ఎన్నో సందేహాలు..

- పెళ్లి జరిగింది ఈ నెల 20న అయితే శ్రీదేవి 24 వరకు ఎందుకు దుబాయిలోనే ఉన్నారు?
- 22వ తేదీ మధ్యాహ్నం నుంచి 24 వరకు శ్రీదేవి అసలు హోటల్ రూమ్ నుంచి బయటకు రాలేదు. అందుకు కారణం ఏంటి? ఆల్కహాల్ తీసుకొని స్పృహ లేకుండా ఉందా?
- గది నుంచి శ్రీదేవి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి హోటల్ సిబ్బంది వెళ్లి చూశారన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి. దీనిపై కుటుంబీకులు ఎందుకు స్పందించడం లేదు?
- శ్రీదేవిని సర్‌ప్రైజ్ చేసేందుకు బోనీకపూర్ నిజంగానే 24న సాయంత్రం ముంబై నుంచి దుబాయి వెళ్లారా? లేదా శ్రీదేవి మృతి వార్త తెలిశాక వెళ్లారా?
- గతంలో శ్రీదేవికి ఎప్పుడూ గుండెపోటు రాలేదని సంజయ్ కపూర్ మీడియాకు వెల్లడించారు. అలాంటప్పుడు ఆమె గుండెపోటుతోనే మరణించారన్న ప్రచారం ఎందుకు జరిగింది?
- బోనీ కపూర్ తన స్నేహితుడికి కాల్ చేసి ఆ తర్వాత హాస్పిటల్‌కు తీసుకెళ్లారని ప్రచారం జరుగుతోంది. ఇందులో వాస్తవ మెంత? అసలు శ్రీదేవిని హాస్పిటల్‌కు ఎవరు తీసుకెళ్లారు?

- మరి అందువల్లే చనిపోయిందని కుటుంబీకులు ఎందుకు చెప్పారు?
- 20న పెళ్లి అయిపోతే 24 వరకు శ్రీదేవి అక్కడే ఎందుకుంది?
- హాస్పిటల్‌కు తీసుకెళ్లింది బోనీకపూరా? హోటల్ సిబ్బందా?
- 'ప్రమాదవశాత్తూ' అని ఫోరెన్సిక్ నిపుణులు ఎలా తేలుస్తారు?

ఫోరెన్సిక్ రిపోర్టులో ఇదెలా సాధ్యం?

శ్రీదేవి మృతికేసులో ఫోరెన్సిక్ విభాగం ఇచ్చిన రిపోర్టుపైనా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా మన దేశంలో అయితే నీటిలో మునిగి చనిపోతే.. ఫోరెన్సిక్ రిపోర్టులో అంతవరకే ప్రస్తావిస్తారు. ప్రమాదవ శాత్తూ మునిగిపోయారా? లేదా ఎవ రైనా బలవంతంగా నీటిలో ముంచి చంపేశారా అన్నది తేల్చాల్సింది పోలీసులే! కానీ దుబాయి ఫోరెన్సిక్ నిపుణులు వారే 'ప్రమాదవశాత్తూ మునిగిపోవడం' (యాక్సిడెంటల్ డ్రౌనింగ్) వల్ల చనిపోయినట్టు తేల్చారు. ఇది సందేహాత్మకంగా కనిపిస్తోందని రాష్ట్ర ఫోరెన్సిక్ నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రమాదమా కాదా అన్నది ఫోరెన్సిక్ నిపుణులు తేల్చాల్సిన అంశం కాదని, అది పూర్తిగా పోలీసు దర్యాప్తులో తేలాల్సిన వ్యవహారమని వారు చెబుతున్నారు. అలాగే రిపోర్టులో 'డ్రౌనింగ్' అన్న పదం స్పెల్లింగ్‌ను 'డ్రావింగ్' అని తప్పుగా ప్రచురించారు. ఒక సెలబ్రెటీ కేసులో ఇలా అచ్చు తప్పుతో నివేదిక రూపొందించడం కూడా ఫోరెన్సిక్, పోలీసులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అలాగే శ్రీదేవి తూలి బాత్‌టబ్‌లో పడిపోతే తలకు లేదా మరేదైనా ప్రాంతంలో గాయాలై ఉండాలి. కానీ ఇలాంటి ఆనవాళ్లు ఉన్నాయా? లేదా అన్న అంశాలను కూడా రిపోర్టులో వెల్లడించలేదు.

దుబాయిలో ఇవి నిబంధనలు...

- డెత్ రిపోర్టు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే మృతిచెందిన వ్యక్తికి తప్పనిసరిగా పాస్‌పోర్టు, వీసా ఉండాలి. వీటితో పాటు పోలీసులిచ్చే నివేదిక తప్పనిసరి.
- సాధారణంగా డెత్ సర్టిఫికెట్ కోసం ఫీజుగా 60 దిరమ్స్ కట్టాలి. అరబ్ భాషలో కాకుండా ఇంగ్లిష్‌లో సర్టిఫికెట్ కావాలంటే 100 దిరమ్స్ చెల్లించాలి. ఎంబసీ నుంచి సర్టిఫికెట్ కోసం 700 దిరమ్స్ కట్టాలి.
- డెడ్‌బాడీని మాతృదేశానికి తరలించే ప్రక్రియలో భాగంగా దుబాయి పోలీసుల నుంచి ఎన్‌ఓసీ(నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) తీసుకోవాలి. ఆ ఎన్‌ఓసీని ఎయిర్‌పోర్టు అథారిటీకి అందించాలి. ఇదే సమయంలో ఎంబసీకి దరఖాస్తు చేస్తే మృతిచెందిన వ్యక్తి పాస్‌పోర్టు రద్దు చేస్తారు. తర్వాత డెడ్‌బాడీని మాతృదేశానికి పంపించేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు.
- మాతృదేశంలోని హోంశాఖ కూడా మృతదేహాన్ని తీసుకునేందుకు ఎన్‌ఓసీ ఇవ్వాలి. సాధారణంగా ఈ ప్రక్రియను భారత ఎంబసీ చూసుకుంటుంది.

కుటుంబీకులు ఎందుకు మాట్లాడడం లేదు?

శ్రీదేవి మృతి విషయంలో బోనీ కపూర్ కుటుంబం గానీ, కపూర్ ఫ్యామిలీ గానీ ఎక్కడా క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేయడంలేదు. మృతి విషయంలో వస్తున్న అనేకానేక పుకార్లను ఖండించే ప్రయత్నం కూడా చేయడంలేదు. తీవ్ర విభేదాలు, తగాదాలు వస్తే తప్పా ఇంతటి పరిస్థితి రాదన్నది కపూర్ కుటుంబ సన్నిహితుల నుంచి వినిపిస్తున్న మాట.



'శ్రీ' విషాదం..

స్పృహ కోల్పోయి ప్రమాదవశాత్తూ బాత్‌టబ్‌లో పడి చనిపోయింది

తేల్చిన ఫోరెన్సిక్ రిపోర్టు.. శ్రీదేవి మృతి కేసులో అనూహ్య మలుపు

ఓ మిస్టరీ?



▶ మొదటి పేజీ తరువాయి

మరణించినట్లు స్పష్టంచేశారు. ఈ మేరకు సోమవారం దుబాయ్ ప్రివెంటివ్ మెడిసిన్ డైరెక్టర్ డాక్టర్ సమీ వాదీ పేరుతో ఒక ప్రకటన వెలువడింది. ఇందులో శ్రీదేవి పూర్తిపేరును 'శ్రీదేవి బోనీ కపూర్ అయ్యప్పన్'గా పేర్కొన్నారు. ఆమె పాస్‌పోర్టు నంబర్, ఘటన జరిగిన తేదీ, మృతికి కారణాలను వివరించారు. దుబాయ్ ప్రభుత్వ అధికారిక మీడియా కార్యాలయం కూడా తన ట్విటర్ ఖాతాలో.. శ్రీదేవి ప్రమాదవశాత్తూ స్నానాల తొట్టిలో పడిపోయి చనిపోయిందని తెలిపింది. తదుపరి దర్యాప్తు కోసం పోలీసులు ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ చేసినట్టు పేర్కొంది. మరోవైపు గల్ఫ్ న్యూస్ మరో కథనాన్ని ప్రచురించింది. శ్రీదేవి ఆల్కాహాల్ సేవించిందని, ఆ మత్తులో బాత్ టబ్‌లో పడిపోయి మరణించిందని పేర్కొంది. అయితే దీన్ని అధికారులెవరూ ధ్రువీకరించలేదు. ఆమె అపస్మారకస్థితిలోకి వెళ్లేందుకు కారణమేంటన్న దానిపై స్పష్టత రావడం లేదు. అలాగే బాత్‌టబ్‌లో మునిగి చనిపోవడం ఎంతవరకు సాధ్యమంటూ బాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ సరోజ్‌ఖాన్ సహా పలువురు ప్రశ్నిస్తున్నారు.

భౌతికకాయం తరలింపు మరింత జాప్యం

శ్రీదేవి భౌతికకాయాన్ని ముంబైకి తరలించడం మరింత జాప్యం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కేసు పోలీసుల చేతి నుంచి పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదలాయించడంతోపాటు ఇతర చట్టపరమైన అంశాలు ఇంకా ఓ కొలిక్కి రాకపోవడం ఇందుకు కారణం. భౌతికకాయం అప్పగింతకు మరో అనుమతి(క్లియరెన్స్) రావాల్సి ఉందని దుబాయ్ పోలీసులు చెప్పినట్లు యూఏఈలో భారత రాయబారి నవదీప్ సూరి తెలిపారు. ఎలాంటి అనుమతి రావాల్సి ఉందని విలేకరులు ప్రశ్నించగా.. ''ఆ విషయం తెలియదు. అది వారి అంతర్గత వ్యవహారం..''అని బదులిచ్చారు. భౌతికకాయాన్ని భారత్‌కు ఎప్పట్లోగా తరలిస్తారని అడగ్గా.. 'టైం చెప్పడం కష్టం. ఇక్కడ చట్టపరమైన ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది'అని పేర్కొన్నారు.

నేటి మధ్యాహ్నం ఎంబామింగ్

శ్రీదేవి భౌతికకాయానికి ఎంబామింగ్ (మృతదేహం పాడవకుండా ఉండేందుకు చేపట్టే ప్రక్రియ) ఇంకా పూర్తి కాలేదు. మంగళవారం మధ్యాహ్నం ఎంబామింగ్ చేసే అవకాశం ఉన్నట్టు గల్ఫ్ న్యూస్ పేర్కొంది. ఆ తర్వాత ఎయిర్‌పోర్టుకు శ్రీదేవి భౌతికకాయాన్ని తరలించే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం అయినా ముంబైకి తరలిస్తారా? లేదా మరింత జాప్యం జరుగుతుందా? అన్న అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి.

అనిల్ కపూర్ నివాసానికి ప్రముఖులు

శ్రీదేవి మృతి నేపథ్యంలో అనేకమంది బాలీవుడ్ ప్రముఖులు ముంబైలోని ఆమె మరిది అనిల్ కపూర్ ఇంటికి తరలి వస్తున్నారు. శ్రీదేవి ఇద్దరు కూతుళ్లు జాహ్నవి, ఖుషీ ఆదివారం నుంచి ఆ ఇంట్లోనే ఉన్నారు. నటీనటులు మాధురీ దీక్షిత్, జయప్రద, టబు, అమీషా పటేల్, సౌత్ సూపర్ స్టార్ రజనీకాంత్, కమల్ హాసన్, ఆయన భార్య సారిక, కూతుళ్లు శృతి, అక్షర, దివ్యా దత్తా, సారా అలీఖాన్, జెనీలియా, రితేశ్ దేశ్ ముఖ్, భారతీ రాజా, ఫరాఖాన్, కరణ్ జోహార్, ఫర్హాన్ అక్తర్, శేఖర్ కపూర్, తెలుగు సినీ హీరో వెంకటేశ్ తదితరులు సోమవారం ఉదయం అనిల్ ఇంటికి వెళ్లారు. అటు లోఖండ్వాలా ప్రాంతంలోని శ్రీదేవి ఇంటికి కూడా అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.


అనిల్‌కపూర్ నివాసం వద్ద మాధురి దంపతులు

బోనీ వాంగ్మూలం నమోదు...

శ్రీదేవి మృతి కేసులో ముమ్మరంగా విచారణ సాగుతోంది. దుబాయ్ పోలీసులు సోమవారం మధ్యాహ్నం బోనీని సుదీర్ఘంగా విచారించి వాంగ్మూలం నమోదు చేసినట్లు సమాచారం. ఆయన పాస్‌పోర్టు కూడా సీజ్ చేసినట్లు వార్తలు వచ్చినా అధికారికంగా ఎవరూ ధ్రువీకరించలేదు. శ్రీదేవితో హోటల్‌లో ఎప్పటివరకు ఉన్నారు? ముంబై నుంచి హోటల్‌కు ఎప్పుడు తిరిగొచ్చారు? సర్‌ప్రైజ్ చేద్దామని వచ్చారా? లేదా శ్రీదేవి మృతి విషయాన్ని హోటల్ సిబ్బంది చెబితే వచ్చారా? అన్న అంశాలపై పోలీసులు బోనీని ప్రశ్నించినట్టు తెలిసింది. అలాగే శ్రీదేవి దుబాయ్ వెళ్లినప్పట్నుంచి ఎక్కడెక్కడికి వెళ్లారు? ఎవరిని కలిశారు? ఎవరితో ఫోన్‌లో మాట్లాడారు? అన్న అంశాలపై దర్యాప్తు జరుపుతున్నారు. బోనీకపూర్ ఫోన్ కాల్‌డేటాను సైతం విచారిస్తున్నట్టు సమాచారం. హోటల్ సిబ్బందిని సైతం విచారిస్తున్నారు. హోటల్‌లో శ్రీదేవిని చివరిసారిగా చూసిందెవరు? ఆ సమయంలో ఆమె ఏ పరిస్థితిలో ఉంది? ఆమె గదిలో ఎవరైనా ఉన్నారా? అన్నదానిపై ఆరా తీస్తున్నారు. విచారణ పూర్తయ్యే వరకు బోనీకపూర్ దుబాయ్‌లోనే ఉండాలని అక్కడి పబ్లిక్ ప్రాసిక్యూషన్ విభాగం చెప్పినట్టు తెలిసింది.

కడసారి చూపు కోసం..

ముంబై: శ్రీదేవి కడసారి చూపు కోసం వందల సంఖ్యలో అభిమానులు ఆమె ఇంటి వద్ద వేచి చూస్తున్నారు. సోమవారం వర్సోవాలోని శ్రీదేవి నివాసం, జుహూలోని అనిల్ కపూర్ నివాసం, విలేపార్లేలోని శ్మశాన వాటిక పెద్ద సంఖ్యలో అభిమానులు కనిపించారు. శ్రీదేవి ఇంటికి సమీపంలోని లోఖండ్‌వాలా కాంప్లెక్స్‌లో ఉన్న తెలుగు ప్రజలు సాక్షితో మాట్లాడారు. శ్రీదేవిని చివరిసారి చూసేందుకు వచ్చినట్లు డోంబివలికి చెందిన రమణమ్మ, (కర్నూలు జిల్లా వాసి) ఆమె కుటుంబ సభ్యులు చెప్పారు. తన అభిమాన నటి శ్రీదేవిని కడసారి చూసేందుకు వచ్చానని వర్లీకి చెందిన సహదేవ్ అన్నారు.

తెలుగులో మాట్లాడేందుకే వచ్చేవారు...



'కేక్‌లు, బ్రెడ్ కొనుగోలు చేసేందుకు శ్రీదేవి బేకరీకి వచ్చేవారు. చివరిసారి 2 నెలల క్రితం షాప్‌కు వచ్చారు. వచ్చినప్పుడల్లా తెలుగులోనే మాట్లాడేవారు. చాక్లెట్ ఫ్లేవర్ కేక్‌లు ఎక్కువగా తీసుకునేవారు. హోమ్ డెలివరీ సౌకర్యం ఉన్నా తెలుగులో మాట్లాడేందుకు షాప్‌కు వచ్చేవారు. ఆప్యాయంగా మాట్లాడేవారు'

– పిట్టల తేజ, హ్యాంగ్ ఔట్ బేకరీ(కరీంనగర్ వాసి)

అద్దం ముందు నిలబడి...



శ్రీదేవి అంటే నాకు చిన్నప్పటి నుంచీ ఇష్టం. ఆమె నటించిన మిస్టర్ ఇండియా, చాల్‌బాజ్, లమ్హే సినిమాలు అంటే పిచ్చి. ఒక గ్రేస్‌తో కామెడీని పండించిన.. పండించగల నటి ఆమె ఒక్కరే. మిస్టర్ ఇండియాలోని చార్లీ చాప్లిన్ రోల్, కాటే నహీ పాట, లమ్హేలోని ద్యుయల్ రోల్, చాల్‌బాజ్ పాటలను ఇంట్లో నేను అద్దం ముందు నిలబడి ప్రాక్టీస్ చేసేదాన్ని. ఎక్స్‌ప్రెషన్స్‌లో శ్రీదేవీని ఇమ్మిటేట్ చేసేదాన్ని. ఎంత ట్రై చేసినా వచ్చేవి కావు. అలా చిన్నప్పటి నుంచీ నేను ఆరాధించిన నటితో నటించే అవకాశం నా మూడో సినిమాకే వచ్చింది. ఆ సినిమా లాడ్లా. అప్పటికే ఆమె సూపర్‌స్టార్. చాలా భయపడ్డా. కాని ఆమె చాలా ఈజీ చేసేశారు. శ్రీదేవి ఎవరితో ఎక్కువగా మాట్లాడరు. సెట్‌లో కూడా చాలా కామ్‌గా ఉంటారు అని అంటుంటారు. కాని లాడ్లా షూటింగ్ అప్పుడు నాతో చాలా క్లోజ్‌గా ఉన్నారు. తను వచ్చి.. 'రెడీ అయిపోయావా? రా.. నా వ్యాన్‌లో కూర్చుని మాట్లాడుకుందాం'' అని నన్ను తన వానిటీవ్యాన్‌లోకి తీసుకెళ్లేవారు. చిట్‌చాట్, జోక్స్, డిస్కషన్స్ చేసేవారు. నా జీవితంలో మరిచిపోలేని రోజులవి. – రవీనా టాండన్.

కహానీ కోరిక...

విశ్రాంతి సమయంలో పుస్తకాలు చదవడం, నిద్రపోవడం, పెయింటింగ్ అంటే శ్రీదేవికి ఇష్టం. అవే చేసేవారు కూడా. పెళ్లి, పిల్లల తర్వాత సినిమాల నుంచి తీసు కున్న పదిహేనేళ్ల బ్రేక్‌ను ఇంటిని, పిల్లలను చూసుకోవడానికే ఆసక్తి చూపారు. కాని బోనీకపూర్, జాన్వి, ఖుషీల బలవంతం, ప్రోత్సాహంతో గౌరీ షిండే ఇంగ్లిష్ వింగ్లిష్ సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చారు. గౌరీ అంటే శ్రీదేవికి చాలా అభిమానం. ఆమె తన చిన్నకూతురు ఖుషీలాగే చురుకుగా, అల్లరిగా,చలాకీగా ఉంటుందని గౌరీని 'ఖుషీ' అని పిలిచేవారట. సెట్స్‌లోకి రాగానే ''వేర్ ఈజ్ మై ఖుషీ'' అంటూ గౌరీని వెదుక్కునేవారట. ప్రతి సినిమాను కొత్తగా.. మొదటి సిని మా అనుకొనే చేస్తారు. తన నటన పట్ల పూర్తి సంతృప్తిని ఎప్పుడూ కనబర్చ లేదు. ఇంట్లోవాళ్లు, స్నేహితులు చాలా బాగా చేశావ్ అని మెచ్చుకున్నా.. శ్రీదేవి మాత్రం ఇంకా చేసుండాల్సింది అని అనుకునేవారట. అదే ఆరాటం, అంతే జిజ్ఞాస చివరి సినిమా వరకు కనబర్చారు. బహుశా ఆ తపనే ఆమెను దేశంలోనే ఫస్ట్ ఫీమేల్ సూపర్‌స్టార్‌గా నిలబెట్టిం దేమో! ఎవరితో ఎక్కువగా మాట్లా డకుండా తన పని తాను చేసుకుపోయే ఈ స్టార్‌కు కామెడీ సినిమాలు చేయడం అంటే ఇష్టం. అయితే బయట గంభీరంగా కనిపించే శ్రీదేవి ఇంట్లో, దగ్గరి వాళ్లతో జోక్స్ వేస్తూ, వాళ్లను సరదాగా ఆటపట్టిస్తూ చాలా జోవియల్‌గా ఉంటారు. చక్ దే ఇం డియా, తారే జమీన్ పర్, విక్కీ డోనర్ , కహానీ సినిమాలంటే ఇష్టం. కహానీ లాంటి సినిమా చేయాలని ఆమె కోరిక. బాలీవుడ్‌లో హీరోయిన్ క్యారెక్టరైజేషన్ పట్ల ఇప్పుడు వచ్చిన మార్పు పట్ల చాలా సంతోషపడేవారు. స్క్రిప్ట్ ముఖ్య భూమిక పోషించడం, నటనకు స్కోప్ ఉండడాన్ని ఆమె ప్రశంసించారు.

కూల్ మామ్...



''మా అమ్మ చాలా స్ట్రిక్ట్. అయితే మా అమ్మ నాతో ఉన్నట్టుగా నేను నా పిల్లల దగ్గర ఉండలేను. కాలంతో మారాలి కదా! అందుకే పట్టువిడుపులూ చూపిస్తా. లైఫ్‌లో బేసిక్ ఎథిక్స్ ఉండాలని చెప్పేదాన్ని. వాళ్ల టీన్స్‌లో ఉన్నప్పుడు లేట్ నైట్స్ రావాల్సి వస్తే వాళ్లతో పాటు నేనూ వెళ్లేదాన్ని. పిల్లలు వచ్చే వరకు కార్లో వెయిట్ చేసేదాన్ని. ఇప్పుడు పెరిగారు. వాళ్ల మంచి చెడ్డలు చూసుకోగలరు. పిల్లల విషయంలో నేను, బోనీ ఇద్దరం బ్యాలెన్స్‌డ్‌గా ఉంటాం. నేను స్ట్రిక్ట్‌గా ఉన్నప్పుడు ఆయన.. ''పిల్లలు కదా.. కొన్ని విషయాల్లో మనం చూసీచూడనట్టు ఉండాలి. అంత కఠినంగా ఉండకు వదిలెయ్'' అని చెప్తుంటారు. కొన్ని సందర్భాల్లో నేను అలా చెప్తుంటాను బోనీకి (నవ్వుతూ). మామూలుగా నేను షూటింగ్‌లో ఉన్నా గ్యాప్ దొరికినప్పుడల్లా పిల్లలకు ఫోన్ చేస్తుంటా. అయితే మామ్ సినిమా అప్పుడు మాత్రం చేయలేదు. ఖుషీ.. అందిట జాన్వితో. 'ఇదేంటి అమ్మ ఒక్కసారి కూడా ఫోన్ చేయట్లేదు' అని. మామ్ సినిమాలోని దేవకీ పాత్ర అలాంటిది. కంప్లీట్‌గా.. నా పిల్లలను కూడా మరిచిపోయేంతగా లీనమయ్యా అందులో.

– మామ్ ప్రమోషనల్ సమయంలో శ్రీదేవి ఎన్‌డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూ

ఆరోజు అసలేం జరిగింది..?



శ్రీదేవి మృతి చెందిన రోజు ఏం జరిగిందన్న విషయంపై స్థానిక ఖలీజ్ టైమ్స్ ఓ కథనం ప్రచురించింది. దాని ప్రకారం.. మేనల్లుడి వివాహ కార్యక్రమం తర్వాత బోనీ కపూర్, చిన్న కూతురు ఖుషీ సహా కుటుంబీకులంతా ముంబై వచ్చేశారు. శ్రీదేవి మాత్రం కొద్దిరోజులు దుబాయ్‌లో ఉండి వస్తానని చెప్పింది. అయితే భార్యకు సర్‌ప్రైజ్ ఇచ్చేందుకు బోనీ శనివారం సాయంత్రం మళ్లీ దుబాయ్‌కు వచ్చారు. సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో (దుబాయ్ కాలమానం ప్రకారం).. శ్రీదేవి ఉన్న జుమేరా ఎమిరేట్స్ టవర్స్ హోటల్ చేరుకున్నారు. నిద్రలో ఉన్న ఆమెను లేపి 15 నిమిషాలసేపు ఇద్దరూ మాట్లాడుకున్నారు. తర్వాత భర్తతో డిన్నర్‌కు వెళ్లేందుకు శ్రీదేవి సిద్ధమయ్యారు. బాత్రూమ్‌లోకి వెళ్లి 15 నిమిషాలైనా ఆమె బయటకు రాకపోవటంతో బోనీ తలుపుతట్టారు. ఎంతకూ స్పందన లేకపోవడంతో బలవంతంగా తలుపులు తెరిచి లోపలకు వెళ్లారు. అప్పటికే శ్రీదేవి బాత్‌టబ్‌లో అపస్మారకస్థితిలో పడి ఉన్నారు. వెంటనే బోనీ తన మిత్రుడిని పిలిచారు. ఆసుపత్రికి తీసుకువెళ్లినా అప్పటికే శ్రీదేవి మృతిచెందారని ఖలీజ్ టైమ్స్ వివరించింది.

ప్రాసిక్యూషన్ ఎందుకు?



పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం.. శ్రీదేవి భౌతికకాయాన్ని ముంబైకి తరలించేందుకు క్లియరెన్స్ వచ్చిందని యూఏఈలో భారత రాయబారి నవ్‌దీప్ సింగ్ సూరీ తెలిపారు. ఇందుకు దుబాయ్ అధికారులు అంగీకరించారని దుబాయ్‌లోని భారతమీడియాకు ఆయన ప్రకటించారు. అయితే కాసేపటికే పరిస్థితి మారిపోయింది. భారత మీడియాలో వార్తపై గల్ఫ్ న్యూస్ సూరీని సంప్రదించింది. అయితే.. పోస్టుమార్టం నివేదిక వచ్చినపుడున్న పరిస్థితుల ప్రకారం మృతదేహం తరలింపులో ఇక ఆలస్యం లేదన్నానని.. అయితే పోస్టుమార్టం నివేదిక వెల్లడవటం, అందులో శ్రీదేవి నీట మునిగి చనిపోయారని తెలియటంతో కేసును పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ చేశారని సూరీ తెలిపారు. దీని కారణంగా భౌతికకాయం తరలింపు మరింత ఆలస్యం కావొచ్చని ఆయన స్పష్టం చేశారు. దుబాయ్ అధికారులతో భారత దౌత్యకార్యాలయం నిరంతరం చర్చలు జరుపుతోందని.. వీలైనంత త్వరగా క్లియరెన్స్ సంపాదిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతో ముంబైలో ఆమెను కడసారి చూసేందుకు ఎదురు చూస్తున్న వారు మరో రోజు వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

పబ్లిక్ ప్రాసిక్యూషన్ అంటే?


దుబాయ్ చట్టాల ప్రకారం ఆసుపత్రి బయట ఎవరు చనిపోయినా.. తప్పనిసరిగా పోస్టుమార్టం చేయటంతో పాటు ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించటం తప్పనిసరి. ఇందులో భాగంగానే శ్రీదేవి హోటల్ గదిలో మృతిచెందిన తర్వాత ఈ తంతు యథావిధిగానే కొనసాగింది. అయితే నివేదికలో అనుమానాస్పదంగా నీటమునిగి చనిపోయినట్లు వెల్లడవ టంతో విచారణ ముమ్మరం చేయటంతోపాటు కేసును పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు అప్పగించారు. 'ఇలాంటి అనుకోకుండా మృతిచెందే కేసుల్లో పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ రిపోర్టులను పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ చేయటం సహజమే. ఇదంతా సాధారణ న్యాయ విధివిధానాల్లో భాగమే. ఈ రెండు రిపోర్టులను ప్రాసిక్యూటర్లు సమీక్షిస్తారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు భౌతిక కాయాన్ని అప్పజెబుతారు. అయితే.. కేసుల్లో ఏదైనా అనుమానాస్పదంగా ఉందని అనిపిస్తే ప్రాసిక్యూటర్లు విస్తృతమైన విచారణ జరుపుతారు. తదనుగుణంగా తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకుంటారు' అని చీఫ్ ప్రాసిక్యూటర్‌ను ఉటంకిస్తూ గల్ఫ్ న్యూస్ పేర్కొంది.

వివరాలు సేకరిస్తున్నాం: దుబాయ్ పోలీసులు

ప్రాథమిక విచారణ ప్రకారం శ్రీదేవి స్పృహకోల్పోయిన అనంతరం స్నానపుతొట్టిలో పడి చనిపోయారని దుబాయ్ పోలీసులు తెలిపారు. దీంతోపాటు ఫోరెన్సిక్ రిపోర్టులో.. శ్రీదేవి రక్తంలో మద్యం ఆనవాళ్లు ఉన్నాయన్నారు. 'ఘటన జరిగిన క్రమంపై విచారణ కొనసాగుతోంది. ప్రమాదవశాత్తూ బాత్‌టబ్‌లో నీటమునిగి చనిపోయారంటూ ఫోరెన్సిక్ నివేదికలో తేలింది. అలాగే.. ఘటనకు ముందు గదిలో ఏం జరిగిందనే దానిపై వివరాలు సేకరిస్తున్నాం' అని దుబాయ్ పోలీసులు చెప్పినట్లు గల్ఫ్ న్యూస్ పేర్కొంది. ప్రమాదం ఎలా జరిగింది? అంతకు ముందు శ్రీదేవితో ఎవరెవరున్నారు? తదితర అంశాలపై కూపీలాగుతున్నారు.

శ్రీదేవి వైన్ మాత్రమే తీసుకుంటారు

శ్రీదేవి మద్యం మత్తులోనే అప స్మారక స్థితిలోకి వెళ్లి తర్వాత నీటమునిగి చనిపోయారంటూ వస్తున్న వార్తలపై సమాజ్‌వాదీ పార్టీ నేత అమర్ సింగ్ స్పందించారు. నటి కుటుంబంతో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకుంటూ.. 'శ్రీదేవి హార్డ్ లిక్కర్ (బీర్, విస్కీ మొదలైనవి) తీసుకోరు. ఆమె వైన్ మాత్రమే తీసుకుంటారు. అది కూడా అప్పుడప్పుడే. నేను అబుదాబి షేక్ అల్ నహ్యాన్‌తో మాట్లాడాను. అధికారిక తతంగమంతా త్వరగా పూర్తిచేసుకుని శ్రీదేవి భౌతిక కాయాన్ని వీలైనంత త్వరగా ముంబై పంపిస్తామని ఆయన భరోసా ఇచ్చారు' అని అమర్ సింగ్ పేర్కొ న్నారు. అయితే శ్రీదేవితో సాన్నిహిత్యం ఉన్న మరికొందరు కూడా శ్రీదేవి ఈ స్థాయిలో మద్యం సేవించరని తెలిపారు.



స్తంభించిన బాలీవుడ్

శ్రీదేవి హఠాన్మరణంతో షాక్‌కు గురైన బాలీవుడ్ ఇంకా తేరుకోలేదు. నిత్యం ఏదో ఒక షూటింగ్‌తో బిజీగా ఉండే ముంబైలోని స్టూడియోలు రెండ్రోజులుగా తోటి నటీనటుల మౌనరోదనకు సాక్ష్యాలుగా నిలిచాయి. తోటి నటి ఇక లేరనే వార్తను జీర్ణించుకోలేక.. చిత్రీకరణలో ఉన్న బాలీవుడ్ సినిమాల షూటింగ్‌లకు బ్రేక్ ఇచ్చారు. దీంతోపాటుగా హోలీ సందర్భంగా జరిగే పలు ప్రత్యేక కార్యక్రమాలను కూడా రద్దుచేసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏడాది ఘనంగా హోలీ పార్టీని ఏర్పాటుచేసే షబానా అజ్మీ, జావెద్ అక్తర్ దంపతులు.. శ్రీదేవి మృతి నేపథ్యంలో ఈసారి వేడుకలను రద్దుచేసుకుంటున్నట్లు ప్రకటించారు. మరోవైపు, దర్శక నిర్మాత రాంగోపాల్ వర్మ కూడా తన తదుపరి చిత్రం పేరు, పోస్టర్ విడుదలను వాయిదా వేసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. అటు ముంబైలో షూటింగ్ జరుపుకుంటున్న 102 నాటౌట్ సినిమా పాట చిత్రీకరణ కూడా రద్దయింది. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, రుషి కపూర్ నటిస్తున్నారు. శ్రీదేవి మృతికి గౌరవసూచకంగా షూటింగ్ వాయిదా వేసుకున్నట్లు చిత్ర దర్శకుడు వెల్లడించారు.

అంత్యక్రియలకు తరలిరానున్న సినీలోకం

ముంబైలోని శాంతాక్రజ్ శ్మశానవాటికలో జరగనున్న శ్రీదేవి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు పెద్ద సంఖ్యలో సినీ ప్రముఖులు తరలివెళ్లనున్నారు. ఇప్పటికే బాలీవుడ్ నటీనటులంతా అనిల్ కపూర్ ఇంటికెళ్లి కపూర్‌ల కుటుంబానికి సంతాపం తెలిపారు. అక్కడే ఉన్న శ్రీదేవి కూతుళ్లు జాహ్నవి, ఖుషిలను పరామర్శిస్తున్నారు. దక్షిణ భారత సినీ ప్రముఖులు, పలువురు టాలీవుడ్ ప్రముఖులు కూడా ముంబై వెళ్లనున్నారు.

డాక్టర్.. సినిమాల్లో!



జాన్వి సినిమాల్లోకి వస్తాను అన్నప్పుడు శ్రీదేవేమీ షాక్ అవలేదట. జాన్వి చిన్నప్పుడు బంధువులు ఆమెను పెద్దయ్యాక ఏమవుతావ్ అని అడిగారట. 'డాక్టర్' అని జవాబిచ్చిందట జాన్వి. అక్కడే ఉన్న శ్రీదేవి ఆ ఆన్సర్‌కి ఆనందపడి ఉబ్బితబ్బిబ్బయ్యే లోపే ఆ పిల్ల 'కాని సినిమాల్లో' అని చెప్పిందట. తాను పెద్దయ్యాక ఏం కావాలనుకుంటుందో కూతురు మెసేజ్ ఇచ్చేసిందని గ్రహించారట శ్రీదేవి. అందుకే ''నేను యాక్టింగ్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలనుకుంటున్నాను'' అని చెప్పినప్పుడు పెద్దగా ఆశ్చర్యపోలేదట.

నా పనైపోయిందనుకున్నా..



అందరిలాగే ఫర్హాన్ అక్తర్‌కూ శ్రీదేవి అంటే పిచ్చి. ఆమె నటించిన లమ్హే సినిమా ప్రొడక్షన్ వర్క్‌లో ఫర్హాన్ కూడా పాలు పంచుకున్నాడు. నిజానికి ఆ సినిమాతోనే ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చాడు ఫర్హాన్. ఓ పాట షూటింగ్ కోసం శ్రీదేవి రిహార్సల్స్ చేస్తోందట. వాళ్లు ప్రాక్టీస్ చేస్తున్న చోట ఫ్లోర్ పాలీష్ పోయి నల్లగా ఓ మచ్చలా కనపడుతోంది. డైరెక్టర్ వచ్చి అక్కడ పెయింట్ వేయమని ఫర్హాన్‌కు పురమాయించాడు. దాంతో పెయింట్ వేశాడు ఫర్హాన్. శ్రీదేవి ఆరిపోని ఆ పెయింట్ మీద కాలు వేసి జారి పడ్డారట. దెబ్బకే సెట్‌లో అంతా సైలెంట్. అందరిలో భయం. ఫర్హాన్‌లో ఇంకా భయం. తన పనైపోయింది.. ఇక సినిమాలకు తనకూ గుడ్ బై అనుకున్నాడట. అంతలోకే శ్రీదేవి పెద్దగా నవ్వడం మొదలెట్టారట. దాంతో సెట్‌లో అంతా ఊపిరిపీల్చుకొని వాళ్లూ ఆమె నవ్వుతో జతకలిపారు. అయోమయంగా చూస్తున్న ఫర్హాన్ దగ్గరకు వచ్చి.. 'కూల్' అంటూ అతని భుజం తట్టారట శ్రీదేవి. అలా ఆమె తన కెరీర్‌ను కాపాడారు అని ట్వీట్ చేశాడు ఫర్హాన్ అక్తర్.



తాగునీటి సమస్యపై అక్కచెల్లెమ్మలతో కలసి నిరసన తెలుపుతున్న జననేత



పొదిలిలో అశేషజనవాహిని మధ్య పాదయాత్ర సాగిస్తున్న జగన్

చిన్నారికట్ల జంక్షన్ వద్ద జగన్, జనం పరస్పర అభివాదం



చంద్రబాబూ..మళ్లీ మోసమా?

▶ మొదటి పేజీ తరువాయి

వచ్చినట్లు ఊదరగొట్టారు. లక్షలాది మందికి ఉద్యోగాలిచ్చినట్లు చెప్పుకున్నారు. రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రంలో ఎక్కడ పెట్టారయ్యా చంద్రబాబూ.. లక్షలాది మందికి ఎక్కడ ఉద్యోగాలిచ్చారయ్యా.. ఇలా అబద్ధాలు చెప్పడం ప్రజలను మోసం చేయడం కాదా? మీ తప్పుడు లెక్కలతో రాష్ట్రానికి చేటు జరగడం లేదా?' అని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా సోమవారం 98వ రోజు ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలిలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సభలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

సంతోషం ఆవిరైపోయింది..

''ఎన్నికలకు ముందు ప్రత్యేక హోదా సంజీవని అన్న పెద్దమనిషి ఆ తర్వాత అదేమన్నా సంజీవనా? అని మాట మార్చాడు. ఆయనకు జ్ఞానోదయం కలగాలని నాలుగేళ్లుగా మనం ధర్నాలు, బంద్‌లు, రాస్తారోకోలు, ఆందోళనలు నిర్వహిస్తూ వచ్చాం. ప్యాకేజీ పేరుతో మోసం చేయొద్దని, ప్రత్యేక హోదా మన హక్కు అని చెబుతూ వచ్చాం. ఇప్పటికి జ్ఞానోదయమై.. వారం రోజుల కిందట ప్లేట్ ఫిరాయించి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే అంటున్నాడు. ఇంతకాలం అన్యాయం చేసినా ఇప్పుడు ఆ మాట అన్నందుకు సంతోషమనుకున్నా. ఆ మనిషిలో మార్పు వచ్చిందిలే అనుకున్నా. అయితే చిత్తశుద్ధి లోపించిన ఆయన మాటలు వింటుంటే ఆ సంతోషం ఆవిరైపోయింది. నాలుగేళ్లలో రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, లక్షలాది మందికి ఉద్యోగాలు ఇచ్చామని చంద్రబాబు చెబుతున్నాడు. ఆ పెట్టుబడులు ఎక్కడైనా కనిపించాయా? ఆయన ఊదరగొడుతున్నట్లు ఉద్యోగాలు వచ్చాయా? ఎవరైనా పరిశ్రమ పెట్టడానికి ముందుకు రావాలంటే మొట్టమొదట ఢిల్లీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ ప్రమోషన్ అనే ఏజెన్సీకి దరఖాస్తు చేస్తారు. అక్కడ దరఖాస్తు చేయకపోతే పొల్యూషన్ కంట్రోల్, ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్‌లు రావు కాబట్టి. దీనినిబట్టి చూస్తే 2015లో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు రూ.4500 కోట్లు. 2016లో రూ.10 వేల కోట్లు. 2017లో కేవలం రూ.4400 కోట్లు. ఈ లెక్కన సంవత్సరానికి కనీసం ఐదువేల కోట్ల రూపాయల పెట్టుబడులు కూడా రాలేదు. ఈ పెద్దమనిషి మాత్రం నాలుగు సంవత్సరాల్లో రూ.15 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని చెబుతున్నాడు. ఇలా చెప్పడం రాష్ట్రానికి అన్యాయం చేయడం కాదా? రాష్ట్రానికి అన్యాయం జరిగిందయ్యా.. ఆదుకోండయ్యా.. వాస్తవిక పరిస్థితులు ఇవయ్యా.. అని చెప్పి ఎవరైనా నిజాయితీగా చెబుతారా? లేక లేనిది ఉన్నట్లుగా చంద్రబాబులా గొప్పలు చెబుతారా? నాలుగేళ్లలో రాష్ట్ర జీఎస్‌డీపీ పురోగతి 12 శాతంతో పరుగెడుతోందని చెబుతున్నాడు. రాష్ట్రం.. దేశంలోనే కాదట ప్రపంచంతోనే పోటీ పడుతోందట. భారతదేశం మొత్తం జీడీపీ గ్రోత్ రేటు ఆరున్నర నుంచి ఏడు శాతం వరకు ఉంది. ప్రపంచంలోని యూరఫ్, అమెరికా లాంటి దేశాల్లో రెండున్నర మూడు శాతంతో పెరుగుతోంది. రాష్ట్రం విడిపోయిన తర్వాత అన్ని రకాలుగా నష్టాల్లో ఉంటే 12 శాతంతో జీడీపీ పెరుగుతోందని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడం కాదా? మోసం కాదా? ఇదే పిక్చర్‌ను కేంద్రానికి, ప్రపంచానికి ఇస్తాడు.

అన్నీ దొంగ లెక్కలే..

నాలుగేళ్లుగా రాష్ట్రంలో ప్రజలు కరువుతో అల్లాడుతున్నారు. ఏ రైతుకూ గిట్టుబాటు ధర లేదు. ఏ రైతూ పండించిన పంట అమ్ముకునే పరిస్థితి లేదు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి. చదువుకున్న పిల్లలు ఉద్యోగాలు దొరక్క చెన్నైకో, హైదరాబాద్‌కో వెళుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ పెద్దమనిషి మాత్రం వాస్తవ పరిస్థితులు పక్కన బెట్టి చేసిందేమిటో తెలుసా? మన రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1.22 లక్షలు (ప్రతి మనిషి సంపాదించే ఆదాయం) అన్నాడు. మొన్ననే ఈనాడు పేపర్‌లో చూశా. ఈ మొత్తం భారతదేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ అని గొప్పగా రాయించారు. ఇది వాస్తవమేనా? ఇలా ఎందుకు పెంచి చూపుతున్నారని అడుగుతున్నా. లేని పరిశ్రమలు, లేని ఉద్యోగాలు, లేని గొప్పలు చూపిస్తుంటే ఎవరయ్యా ప్రత్యేక హోదా ఇచ్చేది? రాజకీయాల్లో చిత్తశుద్ధి, విశ్వసనీయత ఎందుకు అవసరం అని చెబుతున్నానంటే.. నాలుగేళ్లుగా ఈ పెద్దమనిషి అన్ని రకాలుగా మోసం చేసుకుంటూ వచ్చి, మొన్న ప్రత్యేక హోదా కావాలన్నారు. ఇప్పటికి ఆయనకు అర్థమైందనుకున్నా. మార్పు వచ్చిందని సంతోషపడే సరికే విశాఖపట్నంలో మూడోసారి జరుగుతున్న సమ్మిట్‌లో 4 లక్షల 39 వేల కోట్ల రూపాయలకు సంబంధించిన అగ్రిమెంట్ చేసుకున్నామని గవర్నర్ చేత చదివిస్తాడు. నిజంగా ఇంత దారుణంగా చిత్తశుద్ధి లేకుండా చేస్తున్నాడంటే ఈ మనిషికి పాలించే అర్హత ఉందా? ఈ మనిషి ప్రత్యేక హోదా కోసం మొసలి కన్నీరు కారుస్తాడు. సమ్మిట్లలో దొంగ నంబర్లు చెబుతాడు. మరోవైపు 25 మంది ఎంపీలు ఒక్కతాటిపై నిలబడి అవిశ్వాస తీర్మానం పెడదామంటే ముందుకు రారు. ప్రత్యేక హోదా ఇవ్వకపోతే 25 మంది ఎంపీలతో రాజీనామా చేయించేందుకు ముందుకు రావయ్యా అంటే రాడు. చిత్తశుద్ధి ఏ అడుగులోనూ కనిపించదు. ఇంతటి అన్యాయమైన, దుర్మార్గపు ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేద్దాం.

క్యాబినెట్‌లో రైతుల గురించి మాట్లాడరు...

ఈ సంవత్సరం రబీలోనూ, ఖరీఫ్‌లోనూ వరుసగా మైనస్ 31 శాతం వర్షపాతం నమోదైంది. అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లో మైనస్ 71 శాతం వర్షపాతం నమోదైంది. ఇంత జరుగుతున్నా రైతన్నలకు ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలన్న ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి రాలేదు. ఇన్సూరెన్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వం వాటా డబ్బులు ఇంతవరకు కట్టని పరిస్థితి. క్యాబినెట్‌లో మంత్రులు కలుస్తారు కానీ రైతుల గురించి మాట్లాడరు. దొంగలు దొంగలు డబ్బులు పంచుకున్న విషయాలు మాట్లాడతారట. ఎక్కడి నుంచి భూములు లాక్కోవాలి.. ఎవరికి తక్కువ రేటుకు ఎక్కడి నుంచి దోచిపెట్టాలనే విషయాలు మాట్లాడతారు. లంచాలు పుచ్చుకుని ఎక్కువ ధరకు కాంట్రాక్టులు ఇవ్వాలని ఆలోచనలు చేస్తున్నారే కాని, రైతుల గురించి మాత్రం ఆలోచించరు.

వెలిగొండ ప్రాజెక్టు పరిస్థితి దారుణం

రాజశేఖరరెడ్డి గారు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఆయన పుణ్యాన మొదటి సొరంగంలో 13 కిలోమీటర్లు, రెండో సొరంగంలో 9 కిలోమీటర్ల తవ్వకం జరిగింది. దాదాపు 70 శాతం వైఎస్ హయాంలో పూర్తయింది. ఈ నాలుగేళ్లలో చంద్రబాబు మిగతా పనులను పూర్తి చేయలేదంటే పరిస్థితి మీకు అర్థమై ఉంటుంది. నిజంగా ఈ ప్రాజెక్టు పూర్తయితే దాదాపు 48 టీఎంసీలతో 4 లక్షల 34 వేల ఎకరాలకు నీరందుతుంది. ఎర్రగొండపాలెం, దర్శి, మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో దాదాపు మూడు లక్షల 24 వేల ఎకరాలు సాగులోకి వస్తాయి. ఫ్లోరైడ్ సమస్య పూర్తిగా పోవాలంటే ఈ ప్రాజెక్టు పూర్తయి నీరు రావడమే మార్గం. 15 లక్షల మందికి ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీరు అందుతుంది. ఒక్క మార్కాపురం నియోజకవర్గంలోనే 83 వేల ఎకరాలకు సాగునీరు అందించే గొప్ప ప్రాజెక్టు. అలాంటి ప్రాజెక్టు పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నందుకు బాధనిపిస్తోంది. పొదిలి, మార్కాపురంలోనే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు కావాలనే డిమాండ్ ఉంది. పెద్ద చెరువుతో పాటు మూడు చెరువులను సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులుగా మార్చి సాగర్‌నీటితో నింపాలనే డిమాండ్ ఉంది. పాలకులు ఏ మాత్రం పట్టించుకోలేదు. ఈ నాలుగేళ్లలో మనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు.

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారు...

చంద్రబాబు పాలన అంతా మోసం, అబద్ధాలు, అవినీతి, విచ్చల విడిగా అధికార దుర్వినియోగం. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు రూ. 20 కోట్ల నుంచి రూ.30 కోట్లు ఇచ్చి సంతలో పశువులను కొన్నట్లు కొంటారు. అయినా అనర్హులుగా ప్రకటించరు. ఆడియో, వీడియో టేపులతో అవినీతి సొమ్ముతో దొరికిపోతారు. అయినా కూడా ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతారు. ఏ చట్టాలూ వాళ్లకు వర్తించవు. ఇంతటి దుర్మార్గపు పాలన ఇవాళ చూస్తున్నాం. ఇవాళ పెట్రోల్, డీజిల్ ధరలు మండుతున్నాయి. కర్ణాటక, తమిళనాడులతో పోలిస్తే మన రాష్ట్రంలో లీటరుకు రూ.7 అదనంగా బాదుడే బాదుడు. ఇదే పెద్దమనిషి ఎన్నికలప్పుడు పిల్లలు తాగి చెడిపోతున్నారని చెప్పాడు. వస్తూనే మద్యం తగ్గిస్తానన్నాడు. బెల్ట్‌షాపులు లేకుండా చేస్తానని చెప్పాడు. ఈరోజు గ్రామాల్లో మంచినీరు ఉందో లేదో తెలీదు కానీ ఫోన్ కొడితే మద్యం డోర్ డెలివరీ చేస్తున్నారు.

నిరుద్యోగ భృతిపై నిలదీయండి

ఎన్నికలకు ముందు కరెంటు చార్జీలు తగ్గిస్తానని చెప్పిన పెద్దమనిషి తీరా అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచారు. ఇవాళ కరెంటు బిల్లులను ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయి. ఈరోజే నాదగ్గరికి ఓ అక్క వచ్చింది. 'అన్నా మా ఇంట్లో మూడు ఫ్యాన్లు, మూడు ట్యూబ్‌లైట్లు, ఒక టీవీ ఉందన్నా.. మాకు కరెంటోళ్లు ఎనిమిది వేలు బిల్లు ఇచ్చారన్నా' అని బిల్లు చూపించింది. ఇదీ చంద్రబాబు హయాంలో జరుగుతున్న దారుణం. రేషన్ షాపులో ఇవాళ బియ్యం తప్ప మరేమీ ఇవ్వని పరిస్థితి. అన్నదాతల రూ.87,612 కోట్ల రుణాలు బేషరతుగా మాఫీ చేస్తానన్నాడు. ఇవాళ ఆయన ఇస్తున్న రుణ మాఫీ సొమ్ము వడ్డీలకు కూడా సరిపోవడం లేదు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రూపాయి కూడా అప్పు మాఫీ కాలేదు. బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటికి రాకపోగా వేలం వేస్తామని నోటీసులు వస్తున్నాయి. బ్యాంకులకు ప్రభుత్వం డబ్బు చెల్లించక పోవడంతో రైతులకు, డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు సున్నా వడ్డీకి రుణాలు ఇవ్వడం లేదు. ఇంటికో ఉద్యోగం లేదా ఉపాధి చూపుతానన్నాడు. లేకపోతే రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానన్నాడు. ఈ లెక్కన ఇప్పటిదాకా ఒక్కో ఇంటికి రూ.90 వేలు బకాయి పడ్డారు. చంద్రబాబు కనిపిస్తే ఈ డబ్బులు ఎప్పుడిస్తారని నిలదీయండి.

ఇలాంటి నాయకుడు అవసరమా ఆలోచించండి..

రాజకీయ నాయకుడికి ఉండాల్సింది చిత్తశుద్ధి, వ్యక్తిత్వం, విశ్వసనీయత, అంకిత భావం. ఇవి లేకపోతే అచ్చం చంద్రబాబులా తయారవుతారు. ఒక్క హామీ నెరవేర్చకుండా అన్ని వర్గాల వారిని మోసం చేసింది కాక మళ్లీ మోసం చేయడానికి మీ ముందుకు వస్తాడు. ఈసారి చిన్న చిన్న హామీలు ఇస్తే నమ్మరని తెలిసి పెద్ద పెద్ద హామీలు ఇస్తారు. ఇంటికో కేజీ బంగారం ఇస్తానంటాడు. బెంజ్ కారు కూడా బోనస్‌గా ఇస్తానంటాడు. మీరు నమ్మరని తెలిసి తన మనుషులను పంపించి రూ.3 వేలు మీ చేతిలో పెడతాడు. ఇస్తే మాత్రం వద్దూ అనమాకండి. మూడు వేలు కాదు. ఐదువేలు గుంజండి. ఆ డబ్బు మనది. మన జేబుల్లో నుంచి దోచేసిన డబ్బు అదంతా. కానీ ఓటేసేటప్పుడు మాత్రం మీ మనస్సాక్షి ప్రకారం ఓటెయ్యండి'' అని జగన్ అన్నారు. ఇలాంటి నాయకుడు మనకు అవసరమా అని ఆలోచించాలని, ఈ రాజకీయ వ్యవస్థను మార్చాడానికి మీ ముందుకు వచ్చిన మీ బిడ్డను ఆశీర్వదించాలని కోరారు. సభలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు జంకె వెంకటరెడ్డి, సురేష్‌లు ఉన్నారు.





పాదయాత్రలో తాతలను ఆప్యాయంగా పలకరిస్తున్న జగన్




పాదయాత్రలో అవ్వలను ఆప్యాయంగా పలకరిస్తూ ధైర్యం చెబుతున్న జగన్

98వ రోజు

26-02-2018, సోమవారం
కాటూరువారిపాలెం, ప్రకాశం జిల్లా



హోదా కోసం ప్రజలు ఉద్యమిస్తున్న తరుణంలో.. ఇది మీరు చేస్తున్న ద్రోహం కాదా?

కంబాలపాడు గ్రామం వద్ద ఓ పెద్దాయన నడవలేక నడవలేక నడుస్తూ నా వద్దకొచ్చి ఓ చిన్న పుస్తకాన్ని నా చేతిలో పెట్టాడు. నాన్నగారి మీద తాను రాసిన పద్యాలు, పాటల పుస్తకమని చెప్పాడు. అందులోని కొన్ని పద్యాలు పాడి వినిపించాడు. గుండెలోని అభిమానాన్నంతా ఒలికించి.. పద్యాలుగా పలికించినట్టనిపించింది. ఆ తాత పేరు రాగిపిండి చెంచురెడ్డి. వయసు 84 ఏళ్లట. ఆ తాత నాతో మాట్లాడుతూ 'ఊహ తెలిసినప్పటి నుంచి నేను కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిని. కానీ నా జీవితంలో రాజశేఖరరెడ్డి వంటి ప్రజా నాయకుడిని చూడలేదు. పేదల కోసం ఆయనకన్నా గొప్పగా చేసిన వాళ్లు ఎవరూ లేరు. సమసమాజం కోసం పరితపించేదే కమ్యూనిజమైతే.. ఆయనకన్నా గొప్ప కమ్యూనిస్టు లేడు. అందుకనే ఆయన అభిమానిగా మారాను. పద్యాలు, పాటలు రాసి జనానికి వినిపిస్తున్నా' అని చెప్పాడు. ఆ తాతకు నాన్నపట్ల ఉన్న ప్రేమాభిమానాలకు హృదయం ఉప్పొంగింది. ప్రజల కోసం తపించే నాయకులు పదికాలాల పాటు ప్రజల మనసుల్లో నిలిచిపోతారనడానికి ఈ రోజు ఎదురైన అనుభవమే సాక్ష్యం.

ప్రతిభావంతురాలైన తన కూతుర్ని చదివించుకోలేకపోతున్నానంటూ కన్నీటిపర్యంతమయ్యాడు లింగంగుంటకు చెందిన ఆవులయ్య. 'అయ్యా.. మేము నిరుపేద ఎస్సీ కులస్తులం. మా అమ్మాయి ఇంటర్ దాకా కరీంనగర్‌లోని ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలో చదివింది. ఇప్పుడు ఒంగోలులో బీటెక్ చేస్తోంది. మొదటి సంవత్సరం 89శాతం మార్కులొచ్చాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ కావడం లేదు. అమరావతికెళితే.. తెలంగాణ వెబ్‌సైట్ ద్వారా అప్లై చేయాలని చెబుతున్నారు. హైదరాబాద్‌లో అడిగితే.. మీ రాష్ట్రం వాళ్లు లింక్ ద్వారా వివరాలు పంపలేదని చెబుతున్నారు. ఎన్నిసార్లు అమరావతికి తిరిగినా ప్రయోజనం శూన్యం. రెండేళ్లయిపోయింది. ఏడాదికి రూ.70 వేలు ఫీజు కట్టి చదివించుకోలేను. పోనీ, ఇంజినీరింగ్ మాన్పిద్దామంటే.. డబ్బులు కట్టందే సర్టిఫికెట్లు ఇచ్చేదిలేదంటున్నారు. అటు చదివించలేక, ఇటు మాన్పించలేక సతమతమవుతున్నా..' అంటూ ఆవేదన చెందాడు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలన్న చిత్తశుద్ధి, తపన ఏమాత్రం లేని ఈ పాలకుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా వృథా ప్రయాసేనేమో! ఏదో ఒక సాకు చూపి ఇచ్చే అరకొర ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కూడా ఎగ్గొట్టడంపై ఉన్న శ్రద్ధ.. పేదల చదువులపై చూపిస్తే బాగుండేదేమో..

చిన్నారికట్లకు చెందిన ఉడుముల గోవిందయ్య కథ విన్నాక పెద్దలు చెప్పే మాటలు నిజమేననిపించింది. ఆయన 2004కు ముందు చంద్రబాబు పాలనలో 150 నిమ్మ మొక్కలు నాటాడట. బోరు కూడా వేయించాడట. కొంతకాలనికే బోరు ఇంకిపోయి, చెట్లన్నీ ఎండిపోయాయట. రూ.లక్షన్నర నష్టం వచ్చిందట. 'బాబుగారి పాలన ముగిశాక నాకు మంచికాలం నడిచింది. వ్యవసాయం లాభసాటిగా ఉండేది. కానీ, 2014లో మళ్లీ బాబుగారు వచ్చారు. అప్పటికి 200 నిమ్మ మొక్కలు ఉండేవి. బోర్లు కూడా వేశాను. అదేం ఖర్మో.. మళ్లీ బోర్లు ఇంకిపోయి, తోట పూర్తిగా ఎండిపోయింది. ఈసారి నెత్తిన రూ.నాలుగు లక్షల నష్టం. చంద్రబాబు, కరువు కవల పిల్లలంటారే.. ఇదేనేమో సార్! బాబు, ఆ కరువు రెండూ కలిసి నన్ను అప్పుల పాల్జేశాయి..' అంటూ బాధపడ్డాడు. ఓవైపు ప్రకృతి కన్నెర్రజేసి, మరోవైపు పాలకులు కర్కశంగా వ్యవహరిస్తే.. ప్రజల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో నాకు ప్రత్యక్షంగా తెలుస్తోంది. 'పాలించే రాజు ప్రజాకంటకుడైతే.. ప్రకృతి కూడా కన్నెర్రజేస్తుంది' అని మన పెద్దలు చెప్పే మాట నిజమనిపించింది.

రాష్ట్రంలో లేనివి ఉన్నట్లుగా.. ఉన్నవి లేనట్లుగా చూపించడానికి ముఖ్యమంత్రిగారు పడుతున్న తంటాలు చూసి నవ్వాలో ఏడవాలో అర్థంకావడంలేదు. జీఎస్‌డీపీని, తద్వారా రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచి చూపించడం.. భాగస్వామ్య సదస్సులలో రూ. లక్షల కోట్ల పెట్టుబడులంటూ గొప్పలు చెప్పుకోవడం చూస్తుంటే.. ఎవర్ని మభ్యపెట్టడానికి ఈ ప్రయత్నం.. ఎవరిని వంచించడానికి ఈ తాపత్రయం.. అనిపించింది.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. మూడు భాగస్వామ్య సదస్సుల్లో దాదాపు రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులంటున్నారు.. కనీసం ఈ సదస్సుల నిర్వహణకైన వ్యయం, ఈ నాలుగేళ్ల ప్రైవేటు విమానాల్లో మీరు చేసిన విదేశీ పర్యటనలకైన ఖర్చులమేరకైనా వాస్తవంలో పెట్టుబడులు వచ్చాయా? లక్షలాది ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలంటున్నారు.. మీ గుండెల మీద చేయి వేసుకుని నిజాయితీగా చెప్పండి.. కనీసం పదివేల ఉద్యోగాలనైనా సృష్టించగలిగారా? ఉన్న ఉద్యోగాలు ఊడిపోకపోతే చాలని ఉద్యోగస్తులు భయపడుతుండటం వాస్తవం కాదా? మీరు చెబుతున్న ఈ అబద్ధపు లెక్కలు చూశాక.. ఇక ఈ రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరం ఏముందని బయట ప్రపంచం, కేంద్రం భావించవా? రాష్ట్ర ప్రజలు హోదా కోసం ఉద్యమిస్తున్న ఈ తరుణంలో.. ఇది మీరు చేస్తున్న ద్రోహం కాదా?

వైయస్. జగన్.

ప్రజాసంకల్ప యాత్ర
98 వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం
1,323.8 కి.మీ

98వ రోజు నడిచిన దూరం
13.5 కిలో మీటర్లు

ప్రారంభం:
ఉ.8 గంటలకు చిన్నారికట్ల

ముగింపు: సా.6.00 గంటలకు
కాటూరువారిపాలెం శివారు

ముఖ్యాంశాలు
- చిన్నారికట్ల, చిన్నారికట్ల జంక్షన్, కంబాలపాడులో జనంతో మమేకం
- పోతవరంలో పార్టీ జెండా ఆవిష్కరణ
- పొదిలిలో బహిరంగ సభ

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ.8 గంటలకు
కాటూరువారిపాలెం శివారు

ముఖ్యాంశాలు
- కాటూరువారిపాలెం, అగ్రహారంక్రాస్, తలమళ్ల, ఫిరదోసి నగర్, గోగినేనిపాలెం క్రాస్, ఉప్పలపాడులో జనంతో మమేకం
- అగ్రహారంలో పార్టీ జెండా ఆవిష్కరణ

మండుటెండలో రోడ్డు నిండా జనం

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ఎర్రటి ఎండలోనూ సోమవారం జగన్ పాదయాత్రకు జనం పోటెత్తారు. ఊరూరా, ఊరి బయట సైతం రోడ్డు నిండా జనమే. జగన్ ఊరి మధ్యకి వచ్చినప్పుడు రోడ్డు పట్టక ఇళ్లపైకెక్కారు. ఊరు బయట రోడ్డు పక్కన ఉన్న చెట్లు, బస్సులు, లారీలు ఎక్కారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ కంబాలపాడులో పెద్ద సంఖ్యలో మహిళలు గంటల తరబడి రోడ్డుపైనే ఎదురు చూశారు. ఈ గ్రామంలో మౌనిక అనే బాలిక తను దాచుకున్న డబ్బులను పార్టీకి విరాళంగా జగన్‌కు అందజేసింది. నక్షత్ర అనే చిన్నారి ఐదవ పుట్టిన రోజును తల్లిదండ్రులు.. జగన్ సమక్షంలో జరుపుకొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో కరెంటు బిల్లులు పేదలు కట్టుకోలేనంత భారంగా మారాయని కొనకనమిట్ల మండలం మొట్టువారిపల్లె గ్రామానికి చెందిన కాసు అల్లూరమ్మ కంబాలపాడు వద్ద జగన్‌తో వాపోయింది. ఇళ్లలో కరెంటు మీటర్లు ఫ్యాను కంటే స్పీడుగా తిరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. తన ఇంట్లో ఏసీ లేదని, ఫ్యాన్లు, బల్బులు మాత్రమే ఉన్నప్పటికీ బకాయిలతో కలిపి రూ.8 వేలు కట్టాలని నోటీసులిచ్చారని జగన్ దృష్టికి తీసుకొచ్చారు. మీటరు మార్చమంటే విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వమంటున్నారన్నా..: తెలంగాణలో ఇంటర్ చదివానన్న కారణంగా తనకు ఇంజనీరింగ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించడానికి ప్రభుత్వం నిరాకరిస్తోందని హనుమంతునిపాడు మండలం లింగంగుట్ల గ్రామానికి చెందిన రూత్ అనే విద్యార్థిని జగన్‌కు ఫిర్యాదు చేసింది. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు జగన్‌ను కలిసి వారి సమస్య వివరించారు. జిల్లాలో 440 మందిని రాజకీయ కక్షతో ఉద్యోగాల నుంచి తొలగించించారని వాపోయారు. 170 మంది కోర్టును ఆశ్రయించి అనుమతి తెచ్చుకున్నా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారికట్ల గ్రామంలో మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపైకి వచ్చి నీటి సమస్య గురించి జగన్‌కు వివరించారు. మహిళలతో కలిసి ఖాళీ బిందెను పట్టుకొని ప్రభుత్వ తీరు పట్ల జగన్ సైతం నిరసన తెలియజేశారు. కంబాలపాడులోనూ మహిళలు మంచినీటి సమస్య గురించి జగన్‌కు వివరించారు. అక్కచెరువు ప్రాంతానికి చెందిన వెలుగొండ ప్రాజెక్టు భూ నిర్వాసితులు చిన్నారికట్ల క్రాస్ రోడ్డు వద్ద జగన్‌ను కలిసి తమ సమస్యలు వివరించారు. సాయంత్రపుటెండ చుర్రుమంటున్నా పొదిలి సభకు జనం పోటెత్తారు.



అన్నొస్తున్నాడంటూ చిన్నారికట్ల వద్ద ముగ్గులు వేసిన అక్కచెల్లెమ్మలు



విద్యుత్ బిల్లు ఎక్కువొచ్చిందంటూ మొట్టువారిపాలేనికి చెందిన అల్లూరమ్మ ఇచ్చిన బిల్లును పరిశీలిస్తున్న జననేత



చిన్నారికి పుట్టినరోజు కేక్ తినిపిస్తున్న జగన్

హాయ్ చిట్టితల్లీ.. అంటున్న జగన్

ప్రజా సంకల్ప యాత్ర — మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో



సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
మంగళవారం, 27-2-2018

చాందినీ

సినిమా థియేటర్ చీకటి అమావాస్యలాగే ఉంటుంది.
కాని అంతా వెన్నెలే.
తెర మీద చందమామలాంటి శ్రీదేవి ఉంటే చాలు అంతా వెన్నెలే...
చాందినీలాంటి వెన్నెలే.

దక్షిణాది నుంచి వైజయింతిమాల హిందీకి వెళ్లింది.
బ్యూటిఫుల్ హీరోయిన్ అన్నారు.
దక్షిణాది నుంచి రేఖ హిందీకి వెళ్లింది.
గ్లామరస్ హీరోయిన్ అన్నారు.
దక్షిణాది నుంచి హేమమాలిని హిందీకి వెళ్లింది.
డ్రీమ్‌గర్ల్ అన్నారు.
దక్షిణాది నుంచి శ్రీదేవి హిందీకి వెళ్లింది.
ఆల్ ఇండియా సూపర్‌స్టార్ అన్నారు.

• ❖ •

జితేంద్ర, ధర్మేంద్ర, అమితాబ్ బచ్చన్, రిషీ కపూర్, మిథున్ చక్రవర్తి, సన్నిడియోల్, అనిల్ కపూర్, సంజయ్ దత్, సల్మాన్‌ఖాన్.... ఈ హీరోలందరూ శ్రీదేవి కాల్‌షీట్స్ కోసం ఎదురు చూశారు.

యశ్ చోప్రా, శేఖర్ కపూర్, సుభాష్ ఘాయ్ వంటి పెద్ద దర్శకులు ఆమె కోసం పాత్రలు సృష్టించడానికి తపన పడ్డారు.

పర్వీన్ బాబీ, జీనత్ అమాన్, మీనాక్షి శేషాద్రి, మాధురి దీక్షిత్, అనితా రాజ్, పద్మినీ కొల్హాపురి... వీళ్లంతా శ్రీదేవితో పోటీ పడాలని చూసి విఫలమయ్యారు.

శ్రీదేవి పోస్టర్ పడితే యూపీ, బీహార్ థియేటర్లు క్రిక్కిరుస్తాయి.

శ్రీదేవి కటౌట్ నిలబడితే ముంబై, ఢిల్లీలు హౌస్‌ఫుల్ అవుతాయి.

శ్రీదేవి రూప్ కీ రాణి. ఆమె మాది అని దక్షిణాది అనుకుంది. మాదే అని ఉత్తరాది అనుకుంది. దేశం నడుం వొంపు మీద పుట్టుమచ్చ శ్రీదేవి.

• ❖ •

1975లో 'షోలే' రిలీజ్ అయ్యింది. కాని అదే సంవత్సరం శ్రీదేవి తొలిసారి హిందీలో నటించిన 'జూలీ' కూడా రిలీజ్ అయ్యింది. ఆంగ్లో ఇండియన్స్ జీవితాన్ని ఆధారం చేసుకుని తీసిన ఈ సినిమాలో మన లక్ష్మి హీరోయిన్. ఆమె చెల్లెలుగా 12 ఏళ్ల వయసులో శ్రీదేవి అందులో నటించింది. హిందీ డైలాగులు చెప్పింది. 'జూలీ' పెద్ద హిట్ అయ్యింది. అందులో హీరోయిన్ అయిన లక్ష్మి హిందీలో హీరోయిన్‌గా సెటిల్ కావాల్సింది. కాని కాలేదు. శ్రీదేవి అయ్యింది. దానికి బీజం 'పదహారేళ్ల వయసు'తో పడింది.

భారతీరాజా దర్శకత్వంలో తమిళంలో, కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో తెలుగులో సూపర్ హిట్ అయిన సినిమా హీరోయిన్‌గా హిందీలో కూడా శ్రీదేవిని ఇంట్రడ్యూస్ చేసింది. అయితే దీనికి దర్శకునిగా భారతీరాజాను పెట్టుకున్నారు. ఉత్తరాది టేకింగ్ వేరు. భారతీరాజా దక్షిణాది పద్ధతిలో చెప్పడం వల్ల ఆ సినిమా ఫ్లాప్ అయ్యింది. శ్రీదేవికి ఇది గట్టి దెబ్బగా అనిపించింది. కాని ఇటువైపు తమిళంలో తెలుగులో తను బిజీ అయిపోయింది. అప్పటికే జయప్రద కూడా హిందీలో ఇంట్రడ్యూస్ అయ్యింది. ఆమెకు సినిమాలు వస్తున్నాయి. పెర్ఫార్మెన్స్ ఉన్న పాత్రలకు అడుగుతున్నారు. కాని శ్రీదేవికి తెలుసు. మాస్‌ను ఆకట్టుకోవాలంటే గ్లామర్ ఉండాలి. తను గ్లామర్‌స్టార్‌గా హిట్ కావాలని ఎదురు చూసింది. తెలుగులో మంచి హిట్ అయిన 'ఊరికి మొనగాడు' హిందీలో 'హిమ్మత్‌వాలా'గా తీస్తూ 1983లో రాఘవేంద్రరావు శ్రీదేవిని హీరోయిన్‌గా అడిగాడు. ఆ సమయంలో జితేంద్ర టాప్ పొజిషన్‌లో ఉన్నాడు. హిందీలో క్లిక్ అవ్వాలంటే అతని ఆశీర్వాదం తప్పనిసరి. ఈసారి శ్రీదేవి 'హిమ్మత్‌వాలా'ను ఛాలెంజింగ్‌గా తీసుకుంది. ముక్కుకు ప్లాస్టిక్ సర్జరీ చేసుకుని పూర్తిగా సన్నబడి కాస్ట్యూమ్స్ మీద శ్రద్ధ పెట్టి హిమ్మత్‌వాలాతో రీ ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమాకు బప్పీలహరి మ్యూజిక్ డైరెక్టర్. అతడిచ్చిన 'నైనో మే సప్‌నా' పాట వందలాది బిందెల మధ్యలో శ్రీదేవి అంద చందాలతో దేశాన్ని ఒక ఊపు ఊపింది. శ్రీదేవి రాత్రికి రాత్రి స్టార్ హీరోయిన్‌గా మారింది. ఆ తర్వాత తెలుగులో హిట్ అయిన చాలా సినిమాలు రాఘవేంద్రరావు–జితేంద్ర–శ్రీదేవి కాంబినేషన్‌లో మిస్సైల్స్‌లా ఉత్తరాది మీద దాడి చేశాయి. 'జానీ దోస్త్' (అడవి సింహాలు), 'జస్టిస్ చౌదరి' (జస్టిస్ చౌదరి), 'ధరమ్ అధికారి' (బొబ్బిలి బ్రహ్మన్న), 'తోఫా' (దేవత) ఇవన్నీ శ్రీదేవిని వరుసగా హిందీలో స్టార్‌డమ్ కొనసాగేలా చేశాయి. వీటి మధ్యనే 'వసంత కోకిల'కు రీమేక్‌గా శ్రీదేవి నటించిన 'సద్మా' విమర్శకులు ఆమెను గమనించేలా చేసింది. అయితే ఈ మద్రాసు ధోరణి సినిమాల కంటే హిందీ వాళ్ల ధోరణిలో ఆమెకు ఒక పెద్ద హిట్ కావాల్సి వచ్చింది. అలా దొరికిన సినిమాయే 'నగీనా' (1986).

• ❖ •

'మై తేరి దుష్మన్... దుష్మన్ తు మేరా'... పాటతో పాము కళ్లతో శ్రీదేవి డాన్స్ చేసిన ఈ పాట 'నగీనా' సినిమాను సూపర్ హిట్ చేసింది. శ్రీదేవి నాగకన్యగా, అమ్రిష్‌పురి మంత్రగాడుగా నటించిన ఈ సినిమా దక్షిణాదిలో కూడా చిన్న చిన్న సెంటర్లలో వారాల తరబడి ఆడింది. ఈ సినిమా ఎంత పెద్ద హిట్ అంటే దీని కొనసాగింపుగా శ్రీదేవితో 'నిగాహే' అనే సీక్వెల్ వచ్చింది. భారతదేశంలో సీక్వెల్‌గా వచ్చిన మొదటి సినిమా ఇది. శ్రీదేవి ఇమేజ్ ఘనత. హైఫై సినిమాలు తీసే ఫిరోజ్ ఖాన్ శ్రీదేవి గ్లామర్ చూసి 'జాన్‌బాజ్' సినిమాలో తీసుకున్నాడు. అందులో శ్రీదేవి డ్రగ్ ఎడిక్ట్‌గా కనిపించడం కొంత షాకింగ్‌గా అనిపిస్తుంది. ఈ సమయంలోనే అమితాబ్‌తో 'ఆఖరీ రాస్తా'లో మొదటిసారి నటించింది. ఇద్దరి మధ్య పెద్దగా మేజిక్ జరగలేదు. కాని శ్రీదేవిలోని ఎక్స్ ఫాక్టర్, ఆమె బహుముఖ ప్రతిభ ఇంకా బయటకు రావాల్సి ఉంది. శేఖర్ కపూర్ తీసిన 'మిస్టర్ ఇండియా' ఆమెకు అలాంటి అవకాశం ఇచ్చింది. అల్లరి అమ్మాయి, సరదా అమ్మాయి, ఆడుతూ పాడుతూ ఉండే జర్నలిస్ట్‌గా ఈ సినిమాలో శ్రీదేవి అనిల్ కపూర్ పక్కన నటించింది. ఇందులో 'కాటే నహి కట్‌తెహై'... పాటలో నీలి రంగు చీర కట్టుకుని ఆమె చేసిన నృత్యం భారతీయ వెండితెర చూసిన అందమైన శృంగార నృత్యంగా స్థిరపడింది.

మిస్టర్ ఇండియా సూపర్ డూపర్ హిట్ అయ్యింది.

దేశానికి నంబర్ వన్ హీరోయిన్ శ్రీదేవి అని ఈ సినిమా స్థిరపరిచింది.

• ❖ •

1989.

శ్రీదేవి కెరీర్‌లో ముఖ్యమైన సంవత్సరం.

ఆ సంవత్సరమే ఆమె నటించిన 'చాందినీ' విడుదలైంది. అందమైన ప్రేమ కథలు తీస్తాడని పేరుబడ్డ యశ్ చోప్రా రిషీ కపూర్, వినోద్ ఖన్నా, శ్రీదేవిలతో తీసిన ఈ సినిమా రాత్రికి రాత్రి శ్రీదేవిని దేవకన్య స్థాయికి తీసుకెళ్లింది. ఆ అందం, సౌందర్యం మరొకరికి లేవు అన్నట్టుగా... ఆమె సినిమాలో ఉంటే చాలు అన్నంత పెద్ద ఇమేజ్‌ను సృష్టించింది. ఈ సినిమాలో శ్రీదేవి ప్రేమను పొందడానికి హెలికాప్టర్ మీద వచ్చిన రిషీ కపూర్ ఆమె మీద ఆకాశం నుంచి పూలు కురిపిస్తాడు. శ్రీదేవి సినిమాలో ఉంటే ఈ స్థాయి ఖర్చు హంగు ఉండాలని స్థిరపడింది. దేశమంతా శ్రీదేవిని చాందినీగా స్వీకరించింది. 'చాందినీ... ఓ మేరి చాందినీ' పెద్ద హిట్ అయ్యింది. ఆ వెంటనే విడుదలైన 'చాల్‌బాజ్' అందులో నటించిన రజనీకాంత్, సన్నీ డియోల్‌ను ప్రేక్షక పాత్రలను చేసి శ్రీదేవిని డ్యూయెల్ రోల్‌లో ఇంకా పెంచి పెద్ద చేసింది. హిందీలో ఈ సినిమాతో ఏర్పడిన ఇమేజ్ తెలుగులో 'ఆఖరి పోరాటం', 'జగదేకవీరుడు–అతిలోక సుందరి' సినిమాల మెగా హిట్‌కు కారణం అయ్యింది.

• ❖ •

శ్రీదేవి కెరీర్‌లో 'ఖుదాగవా', 'రూప్‌కీ రాణీ చోరోంకా రాజా' వంటి అతి భారీ సినిమాలు ఉన్నాయి. అయితే ఇవి బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేదు. 1993 తర్వాత శ్రీదేవికి పెద్ద హిట్ రాలేదు. కొత్తతరం హీరోలు సంజయ్ దత్‌తో 'గుమ్‌రాహ్', సల్మాన్ ఖాన్‌తో 'చంద్రముఖి', 'చాంద్ కా టుక్‌డా' వంటి సినిమాలు చేసినా లాభం లేకపోయింది. పెళ్లి తర్వాత సినిమాల నుంచి విరామం తీసుకున్న శ్రీదేవి 'ఇంగ్లిష్ వింగ్లిష్' వంటి ప్రతిభావంతమైన సినిమాలో నటించడం ఆమె కెరీర్ అంతం చెడు సినిమాలతో కాక మంచి సినిమాలతో ముగిసినట్టు అయ్యింది. ఆఖరుగా నటించిన 'మామ్' కూడా ప్రేక్షకులను ఆకట్టుకోగలిగింది.

• ❖ •

కొందరు ముసలి రూపంలోకి మారి వృద్ధులుగా కనిపిస్తూ కనుమరుగవడం ప్రకృతికి నచ్చదేమో.

అందుకే అది శ్రీదేవిని రాణిలా ఉంచింది. రాణిలా ఉండగానే పంపించేసింది.

శ్రీదేవి– ఇండియాస్ నంబర్ వన్ సూపర్‌స్టార్ అప్పుడూ ఇప్పుడూ ఇక మరెప్పుడూ.


చాందిని సినిమాలో శ్రీదేవి ప్రేమను పొందడానికి హెలికాప్టర్ మీద వచ్చిన రిషీ కపూర్ ఆమె మీద ఆకాశం నుంచి పూలు కురిపిస్తాడు. శ్రీదేవి సినిమాలో ఉంటే ఈ స్థాయి ఖర్చు హంగు ఉండాలని స్థిరపడింది.



● చాల్‌బాజ్



● చాందినీ



● హిమ్మత్‌వాలా



● ఖుదాగవా



● మిస్టర్ ఇండియా



● సద్మా

● చైల్డ్‌హుడ్

ఒంటరి శ్రీదేవి





సినిమాల్లో అల్లరి అమ్మాయిలా కనిపించిన శ్రీదేవి నిజానికి మహా బిడియస్తురాలు. అమ్మానాన్న, చెల్లి.. చిన్నప్పుడు తన ప్రపంచం ఇదే. తల్లిదండ్రులు బాగానే చూసుకున్నా ఎందుకో 'ఒంటరి'గా అనిపించేదట. ఈ విషయాన్ని శ్రీదేవి స్వయంగా తెలిపారు. గుంపులు గుంపులుగా జనాలను చూస్తే చిన్ని శ్రీదేవికి నచ్చేది కాదు. అంతెందుకు ఎవరైనా కొత్తవాళ్లు నలుగురు ఇంటికి వస్తే గదిలోకి వెళ్లిపోయి దాక్కునేది. అమ్మ కొంగు చాటున నిలబడేది. అలాంటి శ్రీదేవి సినిమా నటిగా వందల మందిలో షూటింగ్‌లు చేసింది. కెమెరా ఆన్ చేశాక మొహమాటం, బిడియం లేకుండా నటించేసినా, కెమెరా వెనక మళ్లీ మామూలే.

సున్నిత మనస్కురాలు

చిన్నప్పటినుంచి శ్రీదేవి ఎమోషనల్ పర్సన్. సున్నిత మనస్కురాలు. చిన్న చిన్న విషయాలకు కూడా బాధపడటం శ్రీదేవి అలవాటు. అలా హర్ట్ అయినప్పుడు సైలెంట్‌గా ఉండేదాన్నని, అది శారీరకంగా తనపై ప్రభావం చూపించేదని శ్రీదేవి ఓ సందర్భంలో అన్నారు. బాధపడిన రోజు రాత్రి నిద్రపోయేవారు కాదు. ఆ నిద్రలేమి వల్ల ముఖం ఉబ్బి, ఎర్రబడేది. 'నిన్ను నవ్వు మార్చుకో. చిన్న విషయాలకు బాధపడొద్దు' అని తల్లిదండ్రులు చెప్పినా శ్రీదేవి మారలేదు. చివరి వరకూ అలా సున్నిత మనస్కురాలిగానే ఉండిపోయారు.

కుమారస్వామిగా...

స్కూల్‌కి వెళ్లాల్సిన వయసులో శ్రీదేవి షూటింగ్స్‌కి వెళ్లారు. నాలుగేళ్ల వయసులో తమిళ చిత్రం 'కందన్ కరుణై' ద్వారా సిల్వర్ స్క్రీన్‌పై మెరిసింది చిన్నారి శ్రీదేవి. ఆ సినిమాలో 'మురుగన్' (కుమారస్వామి) పాత్ర చేసింది. ఆ క్యారెక్టర్ కోసం కదలకుండా కూర్చోమని ఒంటి నిండా రంగు పూశారు. ఆ తర్వాత చేతికి శూలం ఇచ్చి కదలకుండా కూర్చోమన్నారు. అదంతా బుల్లి శ్రీదేవికి విచిత్రంగా అనిపించింది. అయితే డైరెక్టర్ చెప్పినట్లు బుద్ధిగా కూర్చున్న శ్రీదేవిని చూసి లొకేషన్‌లో చాలామంది ముచ్చటపడ్డారట.



● జయలలితతో శ్రీదేవి

హీరోయిన్‌గా ఫస్ట్ సినిమా (తమిళ చిత్రం 'మూండ్రు ముడుచ్చు') చేసినప్పుడు శ్రీదేవి వయసు 11. అయితే తన వయసుకన్నా కొంచెం పెద్దగా కనిపించడంతో కథానాయికగా చేయగలిగారామె.

బాలనటిగా శ్రీదేవి ఫుల్ బిజీగా ఉండేది. ఆ వయసులోనే రోజుకి రెండు మూడు షిఫ్టులు చేసేది. ఇక స్కూల్‌కి వెళ్లడానికి తీరిక ఎక్కడుంటుంది? శ్రీదేవికేమో స్కూల్‌కి వెళ్లాలని ఉండేది. కానీ అది కష్టం. అందుకే శ్రీదేవి కోసం హోమ్ ట్యూటర్‌ని పెట్టారు. షూటింగ్‌కి పేకప్ చెప్పి, ఇంటికి రాగానే చదువుకునేది. అయితే చదువు కొనసాగించలేకపోయింది. ''కొన్ని కావాలంటే కొన్ని వదులుకోవాలి. చదువుకోలేకపోయినందుకు నేను పెద్దగా బాధపడలేదు'' అని శ్రీదేవి అన్నారు.

కొన్ని క్షణాలు.. సందర్భాలు



మనసు నిండా ట్రాజెడీ... కెమెరా ముందు కామెడీ

జీవితంలోని కొన్ని క్షణాలు జీవితాంతపు క్షణాలుగా మిగిలిపోతాయి. స్టార్ నటి శ్రీదేవి జీవితంలోనూ అలాంటి క్షణాలు ఉన్నాయి! గుండె నిండా దుఃఖాన్ని ఉంచుకుని, ముఖమంతా నవ్వును అభినయించిన క్షణాలు అవి! యశ్‌చోప్రా చిత్రం 'లమ్హే' (1991) షూటింగ్ లండన్‌లో జరుగుతున్నప్పుడు ఆమెకు తండ్రి చనిపోయిన కబురు అందింది. వెంటనే ఇండియా వచ్చి, తండ్రి అంత్యక్రియల్లో ఉండి, తిరిగి లండన్ వెళ్లారు. ఆ దుఃఖంలోనే.. అనుపమ్ ఖేర్‌తో కామెడీ సన్నివేశాల్లో నటించారు! 'లమ్హే' అంటే క్షణాలు అని అర్థం.




ఎక్కడి నుంచి వచ్చిందో... ఎక్కడికి వెళ్లి పోయిందో

'న జానె కహా సె ఆయీ హై'.. 'చాల్‌బాజ్' (1989) చిత్రంలోని పాపులర్ సాంగ్. ఆమె ఎక్కడి నుంచి వచ్చిందో ఎవరికి తెలుసు? ఆమె ఎక్కడికి వెళ్తుందో ఎవరికి తెలుసు?.. అని భావగర్భితంగా సాగే ఈ పాట.. ఈ సందర్భంలో శ్రీదేవి అభిమానుల హృదయాల మీద కదలాడే ఉంటుంది. ఆ పాటను చిత్రీకరిస్తున్నప్పుడు శ్రీదేవికి 103 డిగ్రీల జ్వరం. పైగా బోరున కురిసే వర్షంతో మొదలయ్యే పాట అది!

ఆడినా తియ్యగా.. పాడినా తియ్యగా..


శ్రీదేవి నవ్వినా, మాట్లాడినా, పాటలు పాడినా చిన్న పిల్ల గొంతులా స్వీట్‌గా ఉంటుంది. సద్మా (1983), చాందినీ (1989), గర్జన (1991), క్షణక్షణం (1991) చిత్రాలలో ఆమె స్వయంగా పాడిన పాటలు ఉన్నాయి.





'బర్క్' అడిగినా...'పార్క్'కి వెళ్లలేదు!

'జురాసిక్ పార్క్' (1994)లో శ్రీదేవి చిన్న పాత్ర వేస్తే బాగుంటుందని స్టీవెన్ స్పీల్‌బర్గ్ ముచ్చట పడ్డారు. శ్రీదేవి మంచి పీక్‌లో ఉన్న సమయం అది. అందుకని కాదు కానీ, అది పెద్దగా గుర్తుండిపోయే పాత్రేమీ కాకపోవడంతో శ్రీదేవి ఆ ఆఫర్‌ని మృదువుగా తిరస్కరించారు.



భాష రాకుండానే.. భావం ఒలికింది!

'చాందినీ'కి ముందంతా శ్రీదేవి హిందీలో తన డైలాగులు తను చెప్పలేకపోయేవారు. అప్పట్లో ఆమె నటించిన చాలా సినిమాలకు నాజ్, రేఖ డబ్బింగ్ చెప్పేవారు.

శ్రీదేవి ఇబ్బందుల్లో ఉందని విన్నాం

- శ్రీదేవి బాబాయ్ ఎం. వేణుగోపాల్

శ్రీదేవి చిన్నప్పుడు ఇష్టపడి ఏం తినేది?
శ్రీదేవి తల్లి రాజేశ్వరి కూతురు సన్నగా ఉండటం కోసం కడుపు మాడ్చిందా?
చెల్లెలు శ్రీలత, శ్రీదేవికి మధ్య విభేదాలు ఏంటి?
ఎన్నిసార్లు ముక్కుకి సర్జరీ చేయించుకుంది?
స్టార్ అయ్యాక బంధువులను చూసిందా?
పెళ్లయ్యాక శ్రీదేవి బంధువులను దూరం పెట్టిందా?
సవతి కొడుకు అర్జున్ కపూర్.. శ్రీదేవిని ఒత్తిడికి గురి చేసేవాడా?
... అతిలోక సుందరి శ్రీదేవి మరణం తర్వాత రేకెత్తిన ప్రశ్నలివి. గుండెపోటుతో ఆకస్మిక మరణం అనే వార్త నుంచి 'డెత్ మిస్టరీ' అనే టాక్ మొదలైంది. ఆమె మరణం పట్ల బంధువులకు ఏమైనా అనుమానాలున్నాయా? శ్రీదేవి బాబాయ్ ఎం. వేణుగోపాల్‌తో 'సాక్షి' ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ.



ఎం. వేణుగోపాల్



బంధువులతో శ్రీదేవి

● శ్రీదేవిగారికి మీరు బాబాయ్ అవుతారు కదా.. ఆ బంధుత్వం గురించి వివరంగా చెబుతారా?

శ్రీదేవి అమ్మ రాజేశ్వరమ్మ మా అమ్మకు అన్న కూతురు. నాకు వదిన అవుతుంది. శ్రీదేవి వాళ్ల పిన్నమ్మ అనసూయమ్మను మా అన్న (పెదనాన్న కొడుకు)కు చేసుకున్నాం. రాజేశ్వరమ్మ తమ్ముడికి మా చెల్లెల్ని ఇచ్చి పెళ్లి చేశాం. రాజేశ్వరమ్మ సినిమాల్లో సైడ్ క్యారెక్టర్స్ చేసేవారు. అప్పుడే శివకాశీలో అయ్యప్పన్‌ని పెళ్లి చేసుకున్నారు. రాజేశ్వరమ్మ పెళ్లికి మేం బంధువలమంతా వెళ్లాం.

● తిరుపతిలో మీ ఇంటి పక్కనే రాజేశ్వరమ్మ ఉండేవారా?

అందరి ఇళ్లు దగ్గర దగ్గరే ఉండేవి. శ్రీదేవి వాళ్ల ఇంటికి ఒక నాలుగు ఇళ్లు అవతల శ్రీదేవి వాళ్ల పిన్ని (అనసూయమ్మ) ఇల్లు ఉండేది. చిన్నప్పుడు అందరి ఇళ్లల్లో శ్రీదేవి ఆడుకునేది.

● శ్రీదేవి అసలు పేరు 'శ్రీ అమ్మయ్యంగార్ అయ్యప్పన్' కదా. మరి శ్రీదేవిగా ఎవరు మార్చారు?

వాళ్ల నాన్నగారు తమిళియన్. కాబట్టి అమ్మయ్యంగార్ అని ఏదో పేరు పెట్టారు. మేం మాత్రం ఆ పేరుతో ఎప్పుడూ పిలిచింది లేదు. బంధువులమంతా తనని 'పప్పీ' అని పిలిచేవాళ్లం. పప్పీ సినిమాల్లోకి వెళ్లాక తన అమ్మానాన్న ఇద్దరూ కలసి 'శ్రీదేవి' అని పెట్టారు.

● శ్రీదేవిగారు యాక్ట్ చేసిన సినిమా షూటింగ్స్‌కు మీరు వెళ్లేవారా?

'గోవిందా గోవిందా' షూటింగ్ తిరుపతిలో జరిగినప్పుడు మేం వెళ్లాం. అప్పుడు శ్రీదేవి గెస్ట్ హౌస్‌లో ఉండేది. మేమంతా గెస్ట్‌హౌస్‌కు వెళ్లి రాత్రి వరకు మాట్లాడి వచ్చేవాళ్లం. ఆ సినిమా తప్ప వేరే ఏ సినిమా షూటింగ్‌కూ వెళ్లలేదు.

● స్టార్ అయ్యాక శ్రీదేవి బంధువుల ఇంటికి వచ్చేవారా?

ప్రతి సంవత్సరం ఆగస్ట్ 13 తన పుట్టినరోజుకు తిరుపతి వస్తుంది. అప్పుడు బంధువులందర్నీ పిలుస్తుంది. అందరం కలిసి దర్శనానికి వెళ్తాం. ఆ రోజు తిరుపతిలోనే స్టే చేస్తుంది. వీలుంటే ఇంటికి వస్తుంది. ఏదైనా సెక్యూరిటీ ప్రాబ్లమ్ అయితే హోటల్‌లో ఉంటుంది. అయితే అంతకు ముందు ఇంటికి వస్తుండేది. క్రమంగా పెద్ద యాక్టర్ అయ్యే కొద్దీ ఇంటికి వస్తే.. జనం బాగా వస్తున్నారని హోటల్‌లో ఉండేది. మేమే తనని కలవటానికి వెళ్లేవాళ్లం. ఆ రోజంతా అక్కడే ఉండేవాళ్లం.

● శ్రీదేవి పెద్ద స్టార్ కాబట్టి బంధువులను పట్టించుకునే వారు కాదేమో అనే సందేహం చాలామందికి ఉంది..

ఒక వ్యక్తి గురించి బయటవాళ్ల కంటే వాళ్ల బంధువులకే ఎక్కువ తెలుస్తుంది. నా కొడుకు (ఉమేశ్)ని బాగా చూసేది. బాగా ముద్దు చేసేది. మద్రాస్ వెళ్లే వరకు వాణ్ణి బాగా చూసుకునేది. వెళ్లిన తర్వాత కూడా ఉమేశ్ మద్రాసు వెళుతుండేవాడు. ఇప్పుడు మా ఉమేశ్ అమెరికాలో ఉన్నాడు. తనకు కూడా శ్రీదేవి అంటే చాలా ఇష్టం. మేం ఇల్లు కట్టుకుంటుంటే సాయం చేసింది. మార్బుల్స్ అవీ పంపించింది. మావాళ్లు ఎవరు ఎప్పుడు వెళ్లినా అంతో ఇంతో సాయం కచ్చితంగా చేస్తుండేది.

● శ్రీదేవిగారి తల్లిదండ్రుల మధ్య మనస్పర్థలు ఉండేవని, శ్రీదేవిగారు స్టార్‌గా ఎదగడానికి ఆమె తల్లి మాత్రమే కారణమని ఇప్పుడు వార్తలు వినిపిస్తున్నాయి. నిజమా?

ఆ మాటలు నిజం కాదు. రాజేశ్వరమ్మ, అయ్యప్పన్ బాగుండేవాళ్లు. శ్రీదేవిని షూటింగ్స్‌కి తీసుకెళ్లేవారాయన. భార్య, కూతురిని బాగా చూసుకునేవారు.

● తండ్రి చనిపోయినప్పుడు శ్రీదేవిగారు షూటింగ్‌లో ఉండి రాలేదని ఇప్పుడు అనుకుంటున్నారు. మాకు ఆవిడ హాజరైనట్లుగానే తెలుసు..

అప్పుడు శ్రీదేవి హిందీ సినిమా 'లమ్హే' షూటింగ్‌లో ఉంది. తండ్రిని చివరిసారిగా చూడ్డానికి మద్రాసు వచ్చింది. దాదాపు పదీ పదిహేను రోజులు షూటింగ్స్‌కి వెళ్లలేదు.

> **బంధువులను చూడ్డానికి వచ్చినప్పుడు శ్రీదేవిగారు గిఫ్ట్స్ అవీ తెచ్చేవారా?**
>
> తెచ్చేది. అలాంటి విషయాల్లో వెనకాడేది కాదు. దేవుడి దయ వల్ల మేం బాగానే ఉన్నాం. ఆర్థిక ఇబ్బందులు ఏవీ లేవు. మా కుటుంబానికి చెందిన అమ్మాయి ఇలా దేశం కాని దేశంలో హఠాత్తుగా చనిపోవడం మా అందరికీ ఎప్పటికీ తీరని బాధ మిగిల్చింది.

● శ్రీదేవిగారి పెళ్లికి వెళ్లారా ?

చెన్నైలో పెళ్లి రిసెప్షన్ ఏర్పాటు చేశారు. అప్పుడు అందరం వెళ్లాం.

● బోనీ కపూర్‌గారితో శ్రీదేవిగారి పెళ్లయ్యాక మీకు రాకపోకలు ఉండేవా?

పెళ్లి అవ్వకముందు వరకు బాగానే కలిసేది. పెళ్లయి బాంబేకు వెళ్లిపోయాక కొంచెం రాకపోకలు తగ్గిపోయాయి. మేము వెళ్లడం తగ్గిపోయింది. మేం బాంబే వెళ్లినప్పుడు తను ఉండకపోవచ్చు. బిజీగా ఉండేది. ఏమైనా గానీ ఆగస్ట్ 13న తిరుమల వస్తుంది. అప్పుడు తప్పనిసరిగా అందరి బంధువులను కలిసేది. లాస్ట్ ఇయర్ కూడా మా వాళ్లందరూ వెళ్లారు.

● శ్రీదేవిగారి కుమార్తెలు బంధువులందరికీ పరిచయమేనా?

కూతుళ్లకు మా బాబాయ్, పిన్ని అంటూ మమ్మల్నందర్నీ పరిచయం చేసింది. ముఖ పరిచయం అంతే. వాళ్లకు మన భాష రాదు కదా. అంతా హిందీ, ఇంగ్లీష్. అందుకే పిల్లలు, మేం మాట్లాడుకునేవాళ్లం కాదు.

● బోనీ కపూర్‌గారు ఎలా ఉంటారు మీతో?

ఆయన బాగానే మాట్లాడతారు. కొంచెం భాష ప్రాబ్లమ్ అంతే. కానీ చాలా బాగా మర్యాద ఇచ్చేవాడు. మమ్మల్ని చూడగానే నమస్కారం పెడతాడు.

● మీ ముందు పెరిగిన అమ్మాయి 'ఆల్ ఇండియా స్టార్ అవుతుంది' అని ఊహించారా?

అనుకోలేదు. మా రంగంపేటలో ఉన్నప్పుడు చిన్న పాపగా ఉండేది. నాలుగేళ్ల వయసులోనే సినిమాలు చేయడం మొదలుపెట్టింది కదా. అప్పుడు మద్రాసు వెళ్లిపోయారు. శ్రీదేవి నటిగా ఎంత పెద్ద రేంజ్‌కి వెళుతుందని ఊహించడానికి మేం తన షూటింగ్స్‌కి వెళ్లలేదు కదా. అయితే మన బిడ్డ అంత పెద్ద పొజిషన్‌కి వెళ్లిందంటే మాకు సంతోషం. శ్రీదేవి బంధువులం అని చెప్పుకోవటం మాకు గొప్ప.

● చిన్నారి శ్రీదేవి ఇష్టపడి ఏం తినేది?

చికెన్, మటన్ బాగా తినేది. నాన్ వెజ్ అంటే బాగా ఇష్టపడేది.

● కానీ శ్రీదేవి తల్లి ఆమెను సరిగ్గా తిననిచ్చేవారు కాదట.. నిజమేనా?

సిటీల్లో దాదాపు అందరూ తక్కువే తింటారు కదా. మాకు తెలిసి కూతుర్ని మరీ అంత కట్టడి చేయలేదు. అయితే ఆపరేషన్‌లు అవీ చేయించుకున్నాక శ్రీదేవి తిండి బాగా తగ్గించింది.

● ఆపరేషన్లు అంటున్నారు. ఏం ఆపరేషన్లు. ఎన్ని?

ముక్కు ఆపరేషన్ చేయించుకుంది కదా. మాకు తెలిసి మూడుసార్లు చేయించుకుంది. అవి చేయించుకున్నాక తిండి తగ్గించింది.

● సర్జరీలు వద్దు అని చెప్పే అవకాశం మీకు ఉండేది కాదేమో?

రాజేశ్వరమ్మ ఉన్నప్పుడు కష్ట సుఖాలు మాట్లాడుకునేవాళ్లం. ఆవిడ పోయాక రాకపోకలు కూడా తగ్గాయి కాబట్టి, సలహాలు ఇచ్చే అవకాశం మాకు లేకుండాపోయింది.

● శ్రీదేవిగారి మరణ వార్త విన్న తర్వాత మీ బంధువులెవరైనా బాంబే వెళ్లారా?

మా ఆవిడ, ఇంకొంతమంది బంధువులు వెళ్లారు. ముందు శ్రీదేవి వాళ్ల ఇంటికి వెళ్లారు. కొంతసేపు ఉండి హోటల్‌లో రూమ్ తీసుకుని ఉంటున్నారు.

● శ్రీదేవిగారి మరణం పట్ల చాలామందికి అనుమానాలున్నాయి. మీకేమైనా అనుమానం?

అక్కడ ఏం జరిగిందో మాక్కూడా తెలియదు. అందరిలాగా టీవీల్లో చూడటమే.

● ఎప్పుడైనా శ్రీదేవిగారు బాధపడుతున్నట్లు అనిపించిందా? మీతో ఏమైనా చెప్పకున్నారా?

మా దగ్గరేం చెప్పలేదు కానీ, బోనీ కపూర్‌గారి పెద్ద భార్య కొడుకు (అర్జున్ కపూర్) కొంచెం ఇబ్బంది పెడతాడని బంధువులతో ఓసారి చెప్పి, బాధపడిందని విన్నాం.

● అంటే.. పైకి నవ్వుతూ కనిపించిన శ్రీదేవిగారి మనసులో బాధ ఉందంటారా?

ఉండేదేమో అనిపిస్తోంది. ముఖ్యంగా భర్త ఆరోగ్యం విషయంలో చాలా ఆందోళన పడేదట. ఒకసారి ఆయనకు బాగా షుగర్ పెరిగిపోతే ఏమైపోతాడో.. పిల్లలు, తనూ ఏమైపోతామేమోనని చాలా బాధపడిందట. అలా అని మా బంధువులు చెబితే తెలిసింది.

● శ్రీదేవిగారు సున్నిత మనస్కురాలని చాలామంది అన్నారు.. మీరేమంటారు?

మంచి అమ్మాయి. ఎవరితోనూ గొడవలున్నట్లు మాకు తెలియదు.

● మరి.. చెల్లెలు శ్రీలతకూ, శ్రీదేవిగారికీ మధ్య ఆస్తి గొడవలు వచ్చాయి కదా. అసలప్పుడు ఏం జరిగింది?

అవి ఆస్తి గొడవలు కాదు. రాజేశ్వరమ్మ ఆరోగ్యం పాడైపోయినప్పుడు ఆపరేషన్ జరిగింది కదా. అప్పుడు ఒకచోట చేయాల్సిన ఆపరేషన్‌ని మరోచోట చేశారు. దాంతో ఆవిడ చనిపోయింది. ఆ తర్వాత ఆ హాస్పటల్‌పై కేస్ పెట్టారు. హాస్పటల్ డబ్బు విషయంలో అక్కచెల్లెళ్లిద్దరికీ ఏవో మనస్పర్థలు వచ్చాయి. అంతకు మించి ఏమీ లేదు.

● ఆ తర్వాత ఇద్దరూ మామూలుగానే ఉండేవారా?

బాగానే ఉండేవారు. మొన్న బోనీ కపూర్‌గారి బంధువు పెళ్లికి శ్రీలత కూడా దుబాయ్ వెళ్లింది. ఆ ఫంక్షన్ అయ్యాక శ్రీలత వచ్చేసింది. అక్క చనిపోయిందని తెలిసి బాంబే వెళ్లింది.

● శ్రీదేవిగారు చాలా త్వరగా చనిపోయారు. మీ కళ్ల ముందు పెరిగిన పిల్ల ఇలా ఆకస్మిక మరణం పొందడం బాధగా ఉండి ఉంటుంది..

మేమంతా చాలా బాధపడ్డాం. చనిపోదగ్గ వయసు కాదు. ఎంతో పేరు సంపాదించుకుంది. ఇప్పుడు పిల్లలు ఎదుగుతున్నారు. కూతురి సినిమాని కళ్లారా చూసుకోలేకపోయింది. అందరూ ఆరాధించే శ్రీదేవి మా కుటుంబానికి చెందిన అమ్మాయి కావడం మాకు గర్వకారణం. తన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాం.

- డి.జి. భవాని



జాన్వీ తన కాళ్ల మీద తను నిలబడాలి

ఇటీవల 'సాక్షి'కి శ్రీదేవి ఇచ్చిన ఇంటర్వ్యూలోని కొన్ని విశేషాలు

● నాలుగేళ్ల క్రితం 'ఇంగ్లీష్ వింగ్లీష్' సినిమా ప్రమోషన్ కోసం హైదరాబాద్ వచ్చినప్పుడు ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. వయసు పెరుగుతున్నట్టే అనిపించడం లేదు!

(నవ్వుతూ...) ఏం చెప్పమంటారు? ఎవరైనా నా గురించి ఇలా చెబుతున్నప్పుడు సంతోషంగా ఉంటుంది. హెల్దీ లైఫ్, హెల్దీ థింకింగ్, బీయింగ్ హ్యాపీ... ఈ మూడూ చాలు! మనం ఎప్పుడూ సంతోషంగా ఉంటే అది ముఖంలో కనిపిస్తుంటుంది.

● 'మామ్' తల్లీకూతుళ్ల రిలేషన్ మీద సినిమా కాబట్టి, ఈ సినిమా చేస్తున్నప్పుడు మీ అమ్మగారు గుర్తొచ్చారా?

లేదండీ! 'మామ్' చేసినప్పుడు మా అమ్మగారు గానీ, నా పిల్లలు గానీ గుర్తు రాలేదు. దేవకి (సినిమాలో శ్రీదేవి పాత్ర పేరు) మనసులో ఎంత బాధ ఉంది? పిల్లల కోసం ఏం చేస్తుంది? ఎంత దూరం వెళ్తుంది? అనేవి నా మనసులో ఉన్నాయి. దేవకి పాత్రలో ఉన్నంతసేపూ నా ఫ్యామిలీ మెంబర్స్ గుర్తు రాలేదు.

● మీ చిన్నప్పటి నుంచి స్టార్ హీరోయిన్‌గా ఎదిగే వరకూ.. మీ అమ్మగారు మిమ్మల్ని గైడ్ చేశారు.. ఆమె గురించి కొన్ని మాటలు...

తప్పకుండా! ఈ రోజు నేను ఏమాత్రం కొంచెం ఎఛీవ్ చేశానన్నా... ఆ క్రెడిట్ మా అమ్మకే ఇవ్వాలి. అమ్మ నన్ను కూర్చోబెట్టి ఏం నేర్పలేదు. కానీ, ఆమె నుంచి జీవితం అంటే ఏంటనేది నేర్చుకున్నాను. లైఫ్‌లో ఏం చేసినా వంద శాతం కష్టపడాలి. ఊరికే చేయాలని చేయకూడదు. హార్డ్ వర్కింగ్. బీయింగ్ పంక్చువల్ – ఈ లక్షణాలన్నీ అమ్మ దగ్గర్నుంచి నేర్చుకున్నా. 'కష్టే ఫలి. నో పెయిన్–నో గెయిన్' – ఇలాంటివి నాకు నేర్పించింది. అమ్మ దగ్గర నేను నేర్చుకున్న దాంట్లో ఒక యాభై శాతం నేను నా పిల్లలకు ఇవ్వగలిగితే చాలు. అదే పెద్ద ఎఛీవ్‌మెంట్ అనుకుంటా.

● నేను కొంచెమే ఎఛీవ్ చేశాననడం మీ గొప్పతనం. 50 ఏళ్ల కెరీర్... 300 సినిమాలంటే జోక్ కాదు. మీరు చాలా ఎఛీవ్ చేశారు. ఎప్పుడూ అలసిపోలేదా?

ఇప్పుడీ 'మామ్' నా ఫస్ట్ ఫిల్మ్‌లా ఉంది (నవ్వులు). ఇప్పటికీ కొత్తగా చిత్రసీమలో అడుగు పెట్టినట్టు ఫీలవుతున్నా! మీరు చెబుతుంటే '300 సినిమాలు చేశానా?' అనిపిస్తోంది. అదర్ వైజ్... ఐ ఫీల్ లైక్ థిస్ ఈజ్ మై ఫస్ట్ ఫిల్మ్.

● మీరెలాంటి మదర్? స్ట్రిక్టా, ఫ్రెండ్లీయా?

ఫుల్ ఫ్రెండ్లీ. యాక్చువల్‌గా ఎప్పుడూ స్ట్రిక్ట్‌గా ఉండాల్సిన పరిస్థితి నా పిల్లలు తీసుకు రాలేదు. చాలా తక్కువ సార్లు స్ట్రిక్ట్‌గా ఉంటాను.

● 'మామ్' ట్రైలర్‌లో 'వచ్చాను రా దానమ్మను' అనే డైలాగ్ చెప్పే టైమ్‌లో మీ కళ్లలో ఆగ్రహం కనిపించింది. మీ పిల్లల గురించి రాకూడని వార్తలు వచ్చినప్పుడు ఓ మదర్‌గా మీరెలా ఫీలవుతారు?

అమ్మ ఎక్కడైనా అమ్మే కదా. ఐయామ్ వెరీ ప్రొటెక్టివ్ అబౌట్ మై చిల్డ్రన్. మా అమ్మాయి ఓ పార్టీకి వెళ్లొచ్చి, నాకు ఫొటోలు చూపించింది. 'ఇంగ్లీష్ వింగ్లీష్' చిత్రదర్శకురాలు గౌరీ షిండేతో ఆ ఫొటోలు దిగింది. గౌరీ కూడా నాకు ఫోన్ చేసి 'పాపతో పార్టీలో మాట్లాడాను. తనతో చాలా టైమ్ స్పెండ్ చేశా' అని చెప్పింది. తర్వాత రోజు పేపర్‌లో మా పాప ఎవరో హీరో వెనకాల, అతను ఎక్కడికి వెళితే అక్కడే తిరుగుతుందని రాశారు. పాప చాలా అప్‌సెట్ అయ్యింది. కానీ, నా పాప గురించి నాకు తెలుసు. నేను అలాంటి వార్తలు చూసి నవ్వుకుంటా. కానీ, కొన్ని వార్తలు మాత్రం నిజంగా బాధకు గురిచేస్తాయి. అలాంటి వార్తలు రాసేవాళ్లు 'వాళ్ల ఫ్యామిలీ ఎఫెక్ట్ అవుతుంది. తల్లి మనసు ఎంత బాధపడుతుంది' అనేది అర్థం చేసుకోవాలి.

● 'మామ్' ట్రైలర్ చూసి, మీ పిల్లలేమన్నారు?

వాళ్లు సినిమా కూడా చూశారు. జాన్వీ అయితే నన్ను గట్టిగా కౌగలించుకుంది. తను అలా చేయడం అదే మొదటిసారి. మా పిల్లలకు సినిమా బాగా నచ్చింది.

● జాన్వీ ఎవరితోనో లవ్‌లో ఉందని, మీరు పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారని ఇంకో న్యూస్ వచ్చింది...

ఇక వాటన్నిటి గురించి మాట్లాడడం వేస్ట్. ముంబయ్‌లో ఇటీవల ఓ పత్రికలో 'మా పాపకు పెళ్లి చేయాలి' అని నేను చెప్పినట్టు రాశారు. ప్రతి అమ్మ తన కూతురికి పెళ్లి చేయాలనుకుంటుంది కదా! నేనూ అదే చెప్పా. కానీ, అంతకు ముందు 'జాన్వీ ఇండిపెండెంట్‌గా ఎదగాలి. తన కాళ్లపై తను నిలబడాలి. ఊరికే పెళ్లి చేసి కుక్కేయడం కాదు. తనకూ ఓ కెరీర్ ఉండాలి' అని చెప్పా. అదంతా వదిలేసి 'శ్రీదేవి తన కూతురికి పెళ్లి చేయాలనుకుంటుంది' అని రాశారు. దాన్నే హెడ్‌లైన్ చేశారు.

● ఇంట్లో ఆల్రెడీ ఓ సక్సెస్‌ఫుల్ స్టార్ ఉన్నారు కాబట్టి, జాన్వీని మీతో కంపేర్ చేస్తారు. మీరేమంటారు?

జాన్వీ ఎంత పెద్ద స్టార్ అవుతుందనేది మన చేతుల్లో లేదు. తన టాలెంట్, హార్డ్‌వర్క్ బట్టి పైకొస్తుంది. తనింకా ఒక్క అడుగు కూడా వేయలేదు. నాతో తనను కంపేర్ చేయడమనేది చాలా రాంగ్. ఎందుకంటే... నేను చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఇండస్ట్రీకి వచ్చాను. హీరోయిన్‌గా పరిచయమయ్యే టైమ్‌కి చైల్డ్ స్టార్‌గా సుమారు 50 సినిమాలు చేశా. హీరోయిన్‌గా ఫస్ట్ సినిమా చేసే టైమ్‌కి షూటింగ్ ఎలా ఉంటుంది? కెమెరా... వంటివన్నీ తెలుసు. మా పాపకు మాత్రం 'ఇట్స్ జస్ట్ ఎ ఫస్ట్ ఫిల్మ్' అన్నమాట. సో, తననూ, నన్నూ కంపేర్ చేయడమనేది న్యాయం కాదు. తనని ఇండివిడ్యువల్‌గా చూస్తే బాగుంటుంది.

● మీ పిల్లలిద్దరూ చాలా అందంగా ఉన్నారు. చిన్నమ్మాయి మీకంటే హైట్ అనుకుంటా!

అవునండీ. జాన్వీ కంటే... నాకంటే చిన్న పాప ఖుషీ ఇంకా హైట్!

● ఈ వయసులోనూ మీరింత స్లిమ్‌గా ఉన్నారు. మీ పిల్లలకు మీరేమైనా టిప్స్ ఇస్తారా?

నేనా? అయ్యో... లేదండీ! వాళ్లే నాకు టిప్స్ ఇస్తున్నారు. నేనెప్పుడైనా కొంచెం ఎక్కువ తింటే... 'మమ్మా! ప్లీజ్ ఆపు' అంటారు. ఇప్పుడు నాకంటే వాళ్లే ఎక్కువ కేర్ తీసుకుంటున్నారు.

● తెలుగు నుంచి మీ పెద్దమ్మాయికి చాలా ఆఫర్స్ వస్తున్నాయి కదా?

ఏయే ఆఫర్స్ వచ్చాయి. ఎవరెవరు మా అమ్మాయిని నటించమని అడిగారు? అనేవి చెప్పడం నాకిష్టం లేదు. ఏదైనా దర్శక–నిర్మాతలు అఫిషియల్‌గా ఎనౌన్స్ చేస్తారు.

● మీరు ఓ స్ట్రయిట్ తెలుగు ఫిల్మ్ చేస్తే చూడాలనుంది?

నేను తెలుగమ్మాయినే. తెలుగు ఇండస్ట్రీ నాకెంతో ఆప్యాయత, అనురాగం, అభిమానం ఇచ్చింది. నేను ఏనాడూ దాన్ని మర్చిపోను. తెలుగులో చేయాలని నాకూ ఉంది.

● ఫిట్‌నెస్



ఫిట్‌గా ఉండటం కోసమే డైట్

శ్రీదేవి విపరీతంగా డైట్ చేయడంవల్ల ఆమె ఆరోగ్యం పాడైందన్నది ఇప్పుడు కొందరి అభిప్రాయం. నిజానికి తాను విపరీతంగా డైటింగ్ చేయడంతో పాటు సన్నగా ఉండాలని పిల్లలను కూడా సరిగ్గా తిననిచ్చేవారు కాదనే అభిప్రాయం కూడా చాలామందికి ఉంది. ఇదే విషయం గురించి గతంలో ఓసారి అడిగినప్పుడు.. జగదేక సుందరి నవ్వేశారు. ''పిల్లల కడుపు మాడ్చే తల్లిని కాదు. ఆ మాటకొస్తే నేను అన్‌హెల్దీ వేలో ఫుడ్ తీసుకోను. ఆరోగ్యం గురించి చాలా శ్రద్ధ తీసుకుంటాను. నేను హెల్త్ క్లబ్‌కి వెళ్లేదాన్ని. ఒకసారి నా పిల్లలు కూడా వస్తానంటే రమ్మన్నాను. అక్కడ నాతో పాటు జాన్వీ, ఖుషీ యోగా చేశారు. దాంతో పిల్లలను కూడా హెల్త్ సెంటర్స్‌కి తీసుకొచ్చి వాళ్లతో విపరీతంగా వర్కవుట్స్ చేయిస్తున్నానని, డైట్ విషయంలో స్ట్రిక్ట్‌గా ఉంటానని చెప్పుకోవడం మొదలుపెట్టారు. అది నిజం కాదు. నా కూతుళ్లకు కూడా ఫిట్‌నెస్ మీద మంచి అవగాహన ఉంది. వాళ్లు స్పోర్ట్స్ ఆడతారు. ఫిట్‌గా ఉండాలనుకుంటారు. అందులో తప్పేముంది'' అన్నారు శ్రీదేవి. భార్య కఠినమైన డైట్ పాటిస్తే భర్త బోనీ కపూర్ మాత్రం డైటింగ్‌కి దూరం. ఆయన భోజనప్రియుడు. ఆయనతో ఎక్సర్‌సైజ్‌లు చేయించడానికి శ్రీదేవి చాలా ప్రయత్నాలు చేశారట. కానీ పొద్దున్నే నిద్ర లేవగానే ఏదో వంక చెప్పి బోనీ తప్పించుకునేవారట. ''డైట్ విషయంలో శ్రీదేవి చాలా పర్టిక్యులర్‌గా ఉంటుంది. తను కంట్రోల్ చేసుకుంటూ నన్ను కంట్రోల్ చేస్తుంటుంది. వాస్తవానికి నేను భోజనప్రియుణ్ణి. హైదరాబాద్, చెన్నై వంటకాలు అంటే చాలా ఇష్టం నాకు. వీలు దొరికినప్పుడు ఫుడ్ లాగించడానికి ట్రై చేస్తాను. అలా చేస్తానని తనకీ తెలుసు. చిన్నగా మందలిస్తుంది. నాకు రెండే రెండు బలహీనతలు. ఫస్ట్ నా కుటుంబం అయితే సెకండ్ నాకు ఇష్టమైన ఫుడ్'' అని ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో బోనీ కపూర్ తెలిపారు. భర్త ఫుడ్ లవర్ కాబట్టి ఆయన ఎప్పుడంటే అప్పుడు తినడానికి వీలుగా ఫుడ్ రెడీ చేయించేవారట శ్రీదేవి.

సాక్షి ఫ్యామిలీ
నేను శక్తి సాక్షి
విజయవాడ
మంగళవారం, 27-2-2018



నీడ పీడ

అద్దం ముందు నిలబడాలనిపించదు నాకు. కమిలిన శరీరం కలతపెడుతుంటుంది. భయంకర జ్ఞాపకాలు మనసును మెలి పెడుతుంటాయి. నా మనఃశరీరాల కల్లోల కథ చెప్పాలంటే హైస్కూలు రోజుల్లోకి వెళ్లాలి. అభద్ర వీధుల్లో అనుభవించిన నరకాన్ని మీ ముందుంచాలి.

• ❖ •

అవి నేను తొమ్మిదో తరగతి చదువుతున్న రోజులు. బడి నుంచి తిరిగొస్తుంటే వెంటబడ్డాడు ఒక అగంతకుడు. కొద్ది రోజుల తర్వాత తెలిసింది వాడు మా ఊరు వాడేనని.

మొదట అంతగా పట్టించుకోలేదు. కానీ వాడు తరచూ వెంటబడేవాడు. కాలేజీలో చేరాక వేధింపులు ఎక్కువయ్యాయి. వెకిలి చూపులు చూసేవాడు. బెదరగొట్టేవాడు. తట్టుకోలేకపోయేదాన్ని. బయటకు వెళ్లాలంటేనే భయం. ఒక్కోసారి కాలేజీకీ వెళ్లాలనిపించేది కాదు. చదువుపై మనసు పెట్టలేకపోయేదాన్ని. ఇంట్లో చెప్పలేకపోయేదాన్ని. చెబితే చదువు మాన్పించడం ఖాయం.

నా నంబర్ ఎలా సంపాదించాడో తెలియదు.. ఓ రోజు మొబైల్‌కి మెసేజ్ పంపాడు. వాడి భాష ఎంత టెర్రరైజ్ చేసిందంటే.. అది చదివినప్పుడు నిలువెల్లా వణికిపోయా. మెసేజ్‌లతోనూ స్టాక్ చేయడం మొదలెట్టాక.. నా పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టయ్యింది. తిండి తినాలనిపించేది కాదు. ఓ గిల్టీ ఫీలింగ్ వెంటాడేది.

అసలేమి జరుగుతోంది? రేపు నాకేమవుతుంది? ఊపిరాడకుండా చేసేవి ఇట్లాంటి అనేక ప్రశ్నలు. మనసు నిండా నిరంతరమూ ఆలోచనలే. ఆందోళనలే. వాటి ఒత్తిడి భరించడం చాలా చాలా కష్టమయ్యేది. ఆ దుర్మార్గుడు కన్నేసిన నా శరీరంపై నాకే అసహ్యమేసేది. వాణ్ణి ఏమీ చేయలేను. అలాగని నన్ను నేను కాపాడుకోలేను.

మరేం చేయాలి? చచ్చిపోవాలి. నన్ను నేను తగలేసుకోవాలి.

• ❖ •

మెడ.. ఛాతి.. పొట్ట కాలిపోయాయి. ఒళ్లంతా మంటలు. ఓవైపు గాయాల సలపరం. ఇంకోవైపు మా అమ్మ దుఃఖం. కమిలిపోయిన నా ఒంటిని చూసినప్పుడు మరింత హెచ్చుతోంది ఆమె దుఃఖం. ఆ క్షణాల్లోనే నాలో గూడు కట్టిన భయమంతా వెళ్లగక్కేశాను. గుండె బరువు దించుకున్నాను.

నా కారణంగా మా అమ్మానాన్నా చాలా డిస్టర్బ్ అయ్యారు. చాలా యాతన పడ్డారు. నా గాయాలు నాన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ని మింగేశాయి. ఇల్లు కూడా మిగల్లేదు. నా కుటుంబాన్ని లేమిలోకి నెట్టేసినందుకు చాలా పెయిన్‌ఫుల్‌గా ఉంది. ట్రీట్‌మెంట్ ఖర్చు ఇరవై లక్షల రూపాయలు దాటింది.

• ❖ •

పదకొండు మాసాల తర్వాత ఇంటికి చేరాం. మళ్లీ వెంటబడ్డాడు వాడు. మా నాన్న హెచ్చరించినా వెనక్కి తగ్గలేదు. ఇక భయపడదలచుకోలేదు. 'షీ టీమ్స్'కి ఫిర్యాదు చేశా. నాతో వాడికి ఫోన్ చేయించారు ఎస్ఐ. అలా వలపన్ని వాణ్ణి పట్టుకున్నారు. ఇప్పుడు వాడు జైల్లో ఉన్నాడు. నన్ను దక్కించుకునేందుకు ఆస్తులు కోల్పోయిన అమ్మానాన్నలకు మరింత భారం కాదలచుకోలేదు. డిగ్రీ పూర్తి చేసి, ఉద్యోగం చూసుకున్నాను. కమిలిన శరీరం పీడకల లాంటి గతాన్ని గుర్తు చేస్తుంటుంది. కాలిపోయిన ఛాతి నన్ను వెక్కిరిస్తుంది. పెళ్లి గురించిన ఆలోచనలు భయపెడుతుంటాయి.

(విజయ కేస్ స్టడీ) – హృదయ

మౌనాన్ని వీడండి



స్త్రీలు మౌనాన్ని వీడాలి. సపోర్ట్ సిస్టమ్స్‌ను వాడుకోవాలి. తమకు దగ్గరగా ఉండే ఎవరో ఒకరితో బాధను పంచుకోవాలి. హింసను భరిస్తూ పోతే మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. డిప్రెషన్ బారిన పడే ప్రమాదముంది. విద్యాసంస్థల్లో అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విజయ లాంటి అమ్మాయిల్ని ఇలాంటి ఘోరాల నుంచి రక్షించుకోవచ్చు. ఉదాహరణకు రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో షీటీమ్స్ – 'భూమిక విమెన్స్ కలెక్టివ్' కలసి 'షీ ఫర్ హర్' అనే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా జూనియర్, ఇంజనీరింగ్ కాలేజీలు సహా అన్ని కాలేజీల్లోనూ ఇద్దరు యువతుల్ని ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నాయి. వేధింపులు ఎదురైతే ఏం చేయాలో, ఎవరికి కాల్ చేయాలో, షీటీమ్స్‌కి ఎట్లా లింక్ చేయాలో వివరిస్తున్నాయి. రకరకాల చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాయి. వాళ్లు చాలా చురుగ్గా పనిచేస్తున్నారు. ఇలాంటివి ప్రతి చోటా చేయొచ్చు. కొన్ని సందర్భాల్లో హెల్ప్‌లైన్‌కి కాల్ చేసే అవకాశం కూడా బాధితులకు ఉండకపోవచ్చు. అసలు వాటి గురించి తెలియకపోవచ్చు కూడా. అలాంటి సందర్భాల్లో చుట్టూ ఉన్న ప్రజలు ఆమెకు సాయపడగల వాతావరణం రావాలి. రోడ్డు మీద ప్రమాదం జరిగితే 108కి కాల్ చేసి చెప్పే ప్రజలు.. ఒకమ్మాయిని వేధిస్తున్నప్పుడు కూడా స్పందించి సాయపడగలగాలి. షీటీమ్స్ వంటి వాటికి కంప్లయింట్ చేయగలగాలి. హింసను అరికట్టడంలో పౌరసమాజ పాత్ర చాలా కీలకం కాబట్టి ఈ దిశగా జనరల్ పబ్లిక్‌లో అవేర్‌నెస్ తీసుకురావాలి.

– **కొండవీటి సత్యవతి,** వ్యవస్థాపక కార్యదర్శి, భూమిక విమెన్స్ కలెక్టివ్

ఈ హెల్ప్‌లైన్ నంబర్లు ::: నోట్ చేసుకోండి...

181 విమెన్స్ హెల్ప్‌లైన్ (తెలంగాణ – ఆంధ్రప్రదేశ్)

18004252908 భూమిక హెల్ప్‌లైన్..

1091 వేధింపులు సహా రకరకాల ప్రమాదకర పరిస్థితుల్లో ఏపీ స్త్రీలు – పిల్లలు డయల్ చేయాల్సిన నంబర్

9490616555 హైదరాబాద్ షీ టీమ్స్ వాట్సాప్ నంబర్

1098 చైల్డ్ హెల్ప్‌లైన్

24 గంటలూ పని చేస్తుంది. పిల్లలతో చాకిరి, బాల్య వివాహాలు, లైంగిక దాడులు / వేధింపుల వంటి వాటిపై ఈ నంబర్‌కు కాల్ చేయవచ్చు. దేశంలోని ఏ ప్రాంతం నుంచైనా ఈ హెల్ప్‌లైన్‌కి కాల్ చేసి సహాయం పొందొచ్చు.

మానసిక శక్తిని కూడగట్టుకోవాలి



ఇంతకు ముందు ఆ అబ్బాయి వేధించిన ప్రదేశాల్లో తిరగలేకపోవడం, తిరిగితే డిప్రెసివ్‌గా అన్పించడం వంటి స్థితి విజయను బాధిస్తుండవచ్చు. మరోవైపు ఆమె బయటకెళ్లినప్పుడు ఒంటి మీద గాయాలకు సంబంధించి కొన్ని ప్రశ్నలు ఎదుర్కోవాల్సి రావచ్చు. ఈ పరిస్థితి ఆమెకు అవమానకరంగా ఉండొచ్చు. రకరకాల భావనల మధ్య ఘర్షణతో ఆమె కొంత ఒత్తిడికి గురవుతుండవచ్చు. తనదైన మానసిక శక్తిని కూడగట్టుకోవడం ద్వారా ఆమె ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు ప్రయత్నించాలి. కుటుంబం – దగ్గరి వాళ్లు గతాన్ని గుర్తు చేయకుండా ఆమెతో స్నేహపూర్వకంగా మెలగాలి. భవిష్యత్తు ఎంతో ఉందన్న విషయంపై విజయ ఫోకస్ పెట్టాలి. ఇప్పుడున్న పరిస్థితి నుంచి బయటపడేందుకు అవసరమైన అన్ని సాయాల్నీ ఆమె పొందాలి. వెంటాడిన వాడి గురించి లోలోన భయపడిపోవడం వల్లే, ఎవ్వరికీ తన సమస్యను చెప్పుకోకపోవడం వల్లే విజయ ఈ పరిస్థితికి నెట్టబడ్డారు. ఇలాంటి పొరపాటు మరోమారు జరగకుండా ఆమె జాగ్రత్త పడాలి.

– **డాక్టర్ పాల్వాయి పద్మ,** సైకియాట్రిస్ట్

లైంగిక విలువల్ని పునర్నిర్మించుకుందాం



ప్రైవసీ వేరు. రహస్యం వేరు. లైంగిక విషయాల్లో ప్రైవసీ అనే ప్రజాస్వామిక విలువకి చోటు చెల్లిపోయి, అవి ఉచ్చరించరాని నిగూఢ అంశాలుగా మారిపోయాయి. ఆ నిషేధిత అంశం మీద పట్టు, వ్యవస్థాగతంగా బలవంతుడైన పురుషుడికి దక్కడం వల్ల స్త్రీలు బాధితులయ్యారు. లైంగిక అంశాలను బాహాటంగా చర్చించడం, లైంగిక విలువలను పునర్నిర్మించడం, జత కట్టడానికైనా, వివాహానికైనా స్వయం నిర్ణయాధికారాలను ప్రోత్సహించడం మన అవగాహనలో భాగం కావాలి. ప్రతి మనిషికి ఒక లైంగిక వ్యక్తిత్వం చిన్నతనం నుంచీ రూపుదిద్దుకుంటూ ఉంటుంది. దాన్ని సహజమైన అంశంగా ఎంచి మాట్లాడటం, చర్చించడం, సవరించడం జరిగినపుడు ఇంత హింస నుంచి ప్రత్యక్షంగా స్త్రీలు, పరోక్షంగా పురుషులు రక్షింపబడతారు.

– **డాక్టర్ కేఎన్ మల్లీశ్వరి,** రచయిత్రి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ కార్యదర్శి



లైంగిక వేధింపులు అడ్డుకునేందుకు స్త్రీలు సంఘీభావ బృందాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. వేధింపులపై పోరాడటమంటే స్త్రీలకు సంబంధించి స్థిరీకరించబడిన ధోరణులపై యుద్ధం చేయడమే.

– **కమలా భాసిన్,** ఫెమినిస్ట్ కార్యకర్త, రచయిత

చెట్టు నీడ

మంచి మాటల వాసన

పాతకాలంలో ఒక వ్యాపారి ఉండేవాడు. ఆయన పచ్చి అబద్ధాలు ఆడేవాడు. అందువల్ల ఆయన్ని ఎవరూ నమ్మేవాళ్లు కాదు. పైగా పరమ కోపిష్టి. కుటుంబ సభ్యులపై, బంధువులపై రుసరుసలాడుతుంటాడు. ఊరివాళ్లతో గొడవపడుతుంటాడు. దాంతో ఎవరూ ఆత్మీయంగా ఉండేవారు కాదు. ఆయనను చూస్తూనే ఏదో దుర్గంధం వీచినట్టుగా జనం పక్కకు తొలగిపోయేవారు. దీనితో వ్యాపారిలో దిగులు మొదలైంది.

ఒకరోజు వ్యాపారి వీధిలో నడుస్తుండగా, ఏదో పరిమళాన్ని ఆయన ముక్కు గుర్తించింది. సుగంధ ద్రవ్యాల దుకాణం గానీ, అత్తర్ల దుకాణం గానీ సమీపంలో లేవని ఆయనకు తెలుసు. మరెక్కడినుంచి ఇంత మంచి వాసన వస్తోంది? ఇంకా నడుస్తుండగా ఆ పరిమళం మరింత హాయిగా, మెత్తగా అతడిని

> **అక్కడ ఒక సన్యాసి కూర్చునివున్నాడు. సన్యాసి మౌనంగా, ధ్యానంగా ప్రార్థిస్తూవున్నాడు. ఆయన పెదవులు చిన్నగా కదులుతున్నాయి.**

తాకుతోంది. చూస్తే వీధి చివర వున్న చింతచెట్టు కింద నుంచి వస్తోంది. అక్కడ ఒక సన్యాసి కూర్చునివున్నాడు. సన్యాసి మౌనంగా, ధ్యానంగా ప్రార్థిస్తూవున్నాడు. ఆయన పెదవులు చిన్నగా కదులుతున్నాయి. ఆ పరిమళం సన్యాసి నోట్లోంచి వస్తోందని వ్యాపారి తేలిగ్గానే గ్రహించాడు. కానీ అది అతడికి ఆశ్చర్యం కలిగించింది. దాంతో ప్రార్థన ముగించి, కళ్లు తెరిచేవరకూ ఓపిగ్గా వేచివుండి తన సందేహాన్ని సన్యాసి ముందుంచాడు.

'నా నోట్లోంచి పరిమళమా? నేను సత్యంగా ఉంటాను. మృదువుగా సంభాషిస్తాను. అంతకుమించి నాకేమీ తెలీదు' అన్నాడు నిరాడంబరంగా సన్యాసి.

'నాకు అర్థమైంది స్వామీ' అన్నాడు సాధువుకు వ్యాపారి భక్తిగా నమస్కరిస్తూ.

మళ్లీ చెప్పుకుందాం! రీటోల్డ్ కథలు – 17

మంచివాడు


● సాయి బ్రహ్మానందం గొర్తి



'సింగ్‌పూర్ అనగానే నాకు అందమైన అనుభవం సినిమా గుర్తుకొస్తుందండీ. బాలూ రాగం తీసి పాడుతాడు చూడండి... అందమైన' అని గ్యాప్ ఇచ్చి 'అనుభవం' అన్నాడు.

నవ్వుతుందేమోనని చూశాడు.

లేదు.

'దాంట్లో రజనీకాంత్‌కు పిల్లిగడ్డం ఉంటుంది. అతని గర్ల్‌ఫ్రెండ్ నీ గడ్డమంటే నాకు చాలా ఇష్టం అనగానే అవునా అయితే తీసుకో అని పీకి చేతిలో పెడతాడు. భలే ఫన్నీ' నవ్వాడు.

నవ్వలేదు.

సింగపూర్‌లో ఎనిమిది గంటలు ఉండాలి.

అంతసేపూ ఎయిర్‌పోర్ట్‌లో బోర్ అని టూ అవర్స్ ఫ్రీ టూర్ ఏర్పాటు చేస్తే రోడ్ల మీద పడ్డారు. ఈవిడది పక్కసీటు. ఎక్కినప్పటి నుంచి అదో మాదిరిగా ఉంది. మేల్కొంటుంది. నిద్రపోతుంది. మేగజీన్ తిరగేస్తుంది. అంతలోనే విండోవైపు తల తిప్పుకుని కళ్లు తుడుచుకుంటుంది. ఇండియా దాకా ఇదే తంతు నడిచిందంటే బోరైపోతాడు. అందుకే మాటల్లో దింపుదామని చూస్తున్నాడు.

ఎవడో గౌన్లు అమ్ముతున్నాడు. పూలుపూలుగా బావున్నాయి.

ఆగి రెండు కొంటూ అన్నాడు–

'నాకు ఇద్దరు ఆడపిల్లలండీ తీసుకుంటున్నా. అమెరికాకు తిరిగి వెళ్లాక ఇస్తే చాలా సంతోషపడతారు. చిన్నదైతే ఢిష్యుం ఫైటరే అనుకోండి. నా దగ్గర భలే చనువు'

పక్కకు తిరిగి విపరీతంగా వెక్కుతూ ఉంది.

'చూడండి. మీరెవరో నేనెవరో. ప్రయాణంలో కలిశాం. మళ్లీ ఎప్పటికీ కలవం. కనుక మీకేదైనా బాధ ఉంటే నాతో చెప్పండి. అమెరికాలో చచ్చినా మీ ఇంటికి రాను. మా ఇంటికి పిలువను. సరేనా?'

హ్యాండ్ కర్చీఫ్‌తో కళ్లు తుడుచుకుంది.

'పాప గుర్తుకొస్తోంది'

'ఎన్నేళ్లు'

'మూడు'

'వదిలేసి వచ్చారా? ఏం పర్లేదండీ. పిల్లలు అడ్జస్ట్ అవుతారు. మళ్లీ వెళ్లేలోపు మీరిలాగే ఏడుస్తుంటే బరువు మూడు కిలోలు తగ్గుతారు'

'మళ్లీ వెళ్లను'

'అదేంటీ?'

'నేను నా భర్తనూ పాపనూ వదిలేసి శాశ్వతంగా ఇండియా వెళ్లిపోతున్నాను'

ఇది కొంచెం కాఫీ తాగుతూ మాట్లాడాల్సిన సంగతే అనిపించింది. బస్సు మీ ఇష్టంరా రేయ్ తిరిగేసి రండి అన్నట్టు హాల్ట్ అయ్యింది. అక్కడే కాఫీ షాప్ ఉంటే తీసుకెళ్లాడు. ఇద్దరూ ఎదురూబొదురూ కూర్చున్నారు. కొంచెం ఈజ్ చేయడానికి అన్నాడు–

'అమెరికా అన్నాక ఏవో ఒక ఇష్యూస్ ఉండనే ఉంటాయండీ. ఇప్పుడు మా ఆవిడ ఉంది. ఇద్దరు చిన్నపిల్లలు. వాళ్లను చూసుకుంటూ ఉద్యోగం చేయాలంటే మహా అవస్థ. ఆరునెలలు మా అమ్మానాన్నలు ఆరునెలలు వాళ్ల అమ్మానాన్నలు వస్తే ఉంటే చేసి పెడతారు. రెండోది కడుపులో ఉండగా ఉద్యోగం మానేస్తాను అని అంది. వద్దు అని చెప్పాను. ఇంత దూరం వచ్చింది సంపాదించి బాగుపడటానికే కదండీ. ఒళ్లు వొంచాల్సిందే. ఫలితంగా ఏవో చికాకులు నడుస్తూనే ఉంటాయ్. మీ సంగతి?'

మౌనంగా ఉంది.

'కొంపదీసి అదే కేసా. ఉద్యోగం చేయనన్నారా?'

'చేస్తానన్నాను'

'చదువు సరిపోలేదా. డిగ్రీపాటి చదువైనా చదివారా?'

సూటిగా చూస్తూ అంది 'అయామ్ ఏ డాక్టర్'

'ఓ'

'కాని ప్రస్తుతం హోమ్‌మేకర్‌ని. చదివిన చదువును సద్వినియోగం చేయమని ఓత్ తీసుకుంటారు మా చేత. కాని పెళ్లినాటి ప్రమాణాల్లో అది కొట్టుకుపోయింది. మా వారికి నేను ఉద్యోగం చేయడం ఇష్టం లేదు.'

'చిత్రంగా ఉందే'

'నేనిక్కడ మెడికల్ కోర్సు చేయాలనుకున్నాను. ఈ సంబంధం ఓకే అనడానికి అది కూడా ఒక కారణం. చేద్దాంలే చేద్దాంలే అంటాడు. పాప పుట్టనీలే అంటాడు. మూడేళ్లు రానీలే అంటాడు. మొత్తానికి ఉద్యోగం చేయడం ఇష్టం లేదని మాత్రం అనడు'

'ఎంచేత?'

'ఇండియాలో అతనికి ఇద్దరు అన్నయ్యలు ఉన్నారు. కనుక ఇద్దరు వదినలు కూడా ఉంటారు. వాళ్లు బాగా చదువుకున్నారు. ఇంట్లో వుండి చక్కటి వంటలవీ చేస్తూ ఉంటారు. బాగా చదివి ఇంట్లో ఉంటూ వంట చేసి పెట్టే భార్యలు ఉండటం మర్యాదే కదా. తనకూ అలాంటి మర్యాద కావాలని నా భర్త కోరిక. నా భార్య మెడిసిన్ చేసిందోయ్ అని చెప్పుకోవాలి. సాయంత్రం ఇంటికి రాగానే జీడిపప్పు పకోడీ చేసి పెట్టాలి. బాగుంది కదూ'

'ఊ'

'అసలు సంగతి అది కాదు. సాఫ్ట్‌వేర్‌లో ఎంతొస్తాయో మీకు తెలియదా. నేను ఉద్యోగంలో చేరితే డాక్టరుగా అంతకంటే ఎక్కువ సంపాదించగలను. భార్యకు తన కంటే ఎక్కువ సంపాదన ఉండటం భర్తకు నచ్చదు. తక్కువ సంపాదించాలి. భర్త మీద డిపెండెంట్‌గా ఉండాలి. అప్పుడు సెక్యూరిటీ ఫీలవుతాడు. కష్టపడి చదువుకుని మంచి డాక్టర్నయ్యానండీ నేను. ఓ పాతికేళ్లైనా పని చేయగలను. అది కాదు... మెడిసిన్ అంటే ప్రాణాలు కాపాడే నోబెల్ ప్రొఫెషన్'... ఉద్వేగంతో ఆగింది.

'తుప్పు ఇనుముకు పట్టాలి. మనిషికి కాదు. అందుకే వెళ్లిపోతున్నాను' అంది.

బస్సు కదలబోతున్నట్టు అర్థమైంది.

వచ్చి ఎక్కేశారు.

ఇండియాకు వెళ్లబోయే ఫ్లయిట్‌లో ఇద్దరికీ పక్కపక్క సీట్లు రాలేదు. కనుక మాట్లాడటం కుదరలేదు. హైదరాబాద్‌లో దిగాక క్యూలో తారసపడ్డారు.

పలకరింపుగా నవ్వుతూ అన్నాడు–

'మీ ధైర్యానికి మెచ్చుకుంటున్నాను. నాకు మీ ఆయనెందుకో మంచివాడు కాదనిపిస్తోంది'

చురుగ్గా చూసింది.

'మీరు మంచివారేనా'

'మీకలా అనిపించలేదా?'

'మంచివారే. మా ఆయన కూడా మంచివాడే. భార్యను అపురూపంగా చూసుకుంటూ ఒక్క మాట అనకుండా ఒక్క పోట్లాట పెట్టుకోకుండా చాలా బాగా చూసుకునే మంచివాడు. కాని ఉద్యోగం వద్దంటే మీరు మీ ఆవిడ చేత చేయిస్తున్నారు. చేస్తానంటే నా భర్త నాతో వద్దంటున్నాడు. మీ ఇద్దరిలో కామన్ పాయింట్ ఏమిటో తెలుసా?'

'ఏంటి?'

'ఇద్దరు మగాళ్లు. అందరిలాంటి మగాళ్లు' తిరిగి చూడకుండా ఉక్రోషం పెల్లుబికుతుండగా బయటకు నడిచింది.

కథ ముగిసింది.

సాయి బ్రహ్మానందం గొర్తి రాసిన 'అతను' కథ ఇది.

తాను మంచివాణ్ణి అనుకునే మగాడు ఎంత మంచివాడో చెక్ చేసుకుంటాడా ఎప్పుడైనా. తన అహానికి, ఆధిక్యానికి, సౌలభ్యానికి ఆటంకం రానంత వరకు తల్లితో, చెల్లితో, భార్యతో, ఆఫీస్‌లో లేడీ కలీగ్‌తో మంచితనంలో ఎంతదూరమైనా వెళతాడు. కాని వాటికి భంగం వాటిల్లితే సమంజసమైన కారణాలను కూడా తిరస్కరించి చేతికి మట్టంటకుండా నస పెట్టడంలోనూ సిద్ధహస్తుడు. ఒళ్లు శుభ్రం చేసే సబ్బు ఉన్నట్టు మగ స్వభావాన్ని శుభ్రం చేసే సబ్బు కూడా దొరికితే బాగుంటుందంటారా?

పునః కథనం: **ఖదీర్**

> రైతు స్వేచ్ఛను ప్రేమిస్తాడు. ఆ ప్రేమతోనే చెట్టు, చేమ, మట్టి, పుట్టకు చేరువయ్యాడు!
> – వెండెల్ బెర్రీ, అమెరికన్ రచయిత, తాత్వికుడు, సేంద్రియ రైతు

సాగుబడి

'సాక్షి' అందిస్తున్న 'సాగుబడి' కథనాలపై స్పందించదలచారా? అయితే, ఫేస్‌బుక్‌లో sakshi saagubadi గ్రూప్‌ను చూడండి.

శతభిష కార్తె: మార్చి 3 వరకు ;

సేంద్రియ చిట్కా

పిండినల్లి నివారణ ఎలా?



నల్లుల మాదిరి తెల్లని పురుగులు(పిండినల్లి) కూరగాయలు, పండ్లు, పూల చెట్లను ఆశించి రసం పీల్చుకుంటూ నష్టపరుస్తూ ఉంటాయి. పిండినల్లి నివారణకు ఉపకరించే 3 సులువైన మార్గాలున్నాయి.

1. బట్టల సబ్బు పొడిని లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. లేదా
2. షాంపూ 1 ఎం.ఎల్.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా
3. చేతులను శుభ్రం చేసుకునే ద్రావణం(హ్యాండ్ వాష్ లిక్విడ్) 1 ఎం.ఎల్.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

వీటిలో ఏదేని ఒక దానిని బాగా నీటిలో కలిపి పిండినల్లి ఆశించిన భాగాలు బాగా తడిచేలా పిచికారీ చేసినట్లయితే.. 2 రోజుల్లో పిండినల్లిని పూర్తిగా అరికట్టవచ్చు. బొప్పాయి, కూరగాయ పంటల్లో ఈ విధంగా వాడి సత్ఫలితాలు పొందుతున్నాం.

- రమాకాంత్ (83747 21751), ఏకలవ్య సేంద్రియ వ్యవసాయ పరిశోధనా స్థానం, జిన్‌గుర్తి, వికారాబాద్ జిల్లా

5న రాపోలులో వేస్ట్ డీకంపోజర్‌పై సదస్సు

సిద్దిపేట జిల్లా గజ్వేల్ దగ్గరలోని రాపోలు గ్రామంలో మార్చి 5వ తేదీ(సోమవారం)న ఉదయం 10 గంటలకు వివిధ పంటల్లో వేస్ట్ డీ కంపోజర్ ద్రావణం వాడకంపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ప్రజాహిత ఫౌండేషన్ అధ్యక్షుడు మామిడి మోహనరెడ్డి తెలిపారు. ఘజియాబాద్‌లోని కేంద్ర వ్యవసాయ శాఖకు చెందిన జాతీయ సేంద్రియ వ్యవసాయ కేంద్రం శాస్త్రవేత్త డా. ప్రవీణ్‌కుమార్ ప్రసంగిస్తారు. వివరాలకు.. మోహన్‌రెడ్డి– 90006 10234, పడాల గౌతమ్ – 98497 12341.

సిరిధాన్యాల సాగు - వినియోగంపై 4 నుంచి 7 వరకు డా. ఖాదర్ సదస్సులు



చిరు(సిరి)ధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలను అటవీ కృషి పద్ధతులలో సాగు చేయడం.. సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందే మార్గాలపై మార్చి 4 నుంచి 7 వరకు జరిగే సదస్సుల్లో మైసూరుకు చెందిన తెలుగు శాస్త్రవేత్త డా. ఖాదర్‌వలి ప్రసంగించనున్నారు. **4వ తేదీ** సా. 5 గంటలకు హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ జంక్షన్‌లో భారతీయ ఇంజనీర్ల సంస్థకు చెందిన విశ్వేశ్వరయ్య ఆడిటోరియంలో ప్రసంగిస్తారు. తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల వేదిక ప్రచురించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తారు. వివరాలకు.. 94401 26778; **5వ తేదీ** ఉ. 10 గం.లకు వనపర్తిలోని సత్యసాయి మందిరంలో, 5వ తేదీ సా. 5 గం.లకు నారాయణపేటలోని శిలా గార్డెన్స్‌లో ప్రసంగిస్తారు. వివరాలకు.. 94407 33309, 93463 52348; **6వ తేదీ** ఉ. 10 గం.లకు జడ్చర్లలోని చంద్ర గార్డెన్స్‌లో, 6వ తేదీ సా. 5 గం.లకు మహబూబ్‌నగర్‌లోని క్రౌన్ గార్డెన్స్‌లో ప్రసంగిస్తారు. వివరాలకు.. 98495 93450, 94404 40559; **7వ తేదీ** ఉ. 10 గం.లకు సికింద్రాబాద్ రైల్‌భవన్ ఎదుట గల హైదరాబాద్ రైల్‌భవన్‌లో, 7వ తేదీ సా. 5 గం.లకు 'ఇరిసెట్' ఆడిటోరియం (మెట్టుగూడ)లో ప్రసంగిస్తారు. వివరాలకు.. 94401 26778

నేను శక్తి సాక్షి

ముగ్గురూ ముగ్గురే!

మహిళ లేనిదే వ్యవసాయం లేదు. వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావడం, అత్యధిక సమయాన్ని కేటాయించడంలోనే కాదు.. నిర్ణాయకపాత్ర నిర్వహిస్తూ వ్యవసాయదారులుగా భేష్ అనిపించుకుంటున్న మహిళా రైతులెందరో ఉన్నారు. ఈ ముగ్గురూ తమ తరాల మహిళలకు స్ఫూర్తినందిస్తున్న మహిళా రైతులకు జేజేలు..!

'సిన్ననాటి నుంచి వెవసాయం అంటే ఇష్టం..'

పిట్ల చిన్నమ్మి(65) పెద్దగా చదువుకోలేదు. ప్రభుత్వం అందించిన భూములను శ్రద్ధగా సాగు చేసుకుంటూ.. భర్త సింహాచలం తోడ్పాటుతో ఇద్దరు పిల్లలను వృద్ధిలోకి తెచ్చిన దళిత మహిళా రైతుగా గుర్తింపు పొందారు. విజయనగరం జిల్లా బొబ్బిలి రూరల్ మండలంలో అలజంగి ఆమె స్వగ్రామం. తొలుత ప్రభుత్వం ఎకరా 30 సెంట్ల భూమిని అందించింది. డా. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మరో ఎకరా భూమిని ఆమెకు ఇచ్చారు.



దుక్కి దున్నుతున్న చిన్నమ్మి



ఆ భూమిలో అనుదినం కాయకష్టం చేసి పంటలు పండిస్తూ కుటుంబాన్ని కుదురుగా నడుపుతున్నదామె. ఆడవాళ్లు చేసే వ్యవసాయ పనులతోపాటు దుక్కి దున్నటం, ఎడ్ల బండి తోలటం.. చివరకు ట్రాక్టరు తోలడం కూడా ఆమె నేర్చుకొని చేస్తూ ఉండటం చూపరులను ఆశ్చర్యపరుస్తోంది. అన్ని పొలం పనులు స్వయంగా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ.. ప్రభుత్వం ఇచ్చిన భూమితోపాటు మరికొంత భూమిని కూడా సమకూర్చుకున్నారు. ఇప్పుడు ఆమెకు 5 ఎకరాల భూమి ఉంది. ఎకరంలో చిలగడ దుంపలు, ఎకరాలో వేరుశెనగ, ఒకటిన్నర ఎకరాల్లో అరటి, మిగతా పొలంలో వరి పండిస్తున్నారు.



ఏ భూమిలో ఏ పంట పండుతుంది? ఏ పంటకు ఎకరాకు ఎంత ఖర్చవుతుంది? ఎంత దిగుబడి వస్తుంది? వంటి విషయాలను తడుముకోకుండా చెబుతారు. ఎలాంటి భూమిని అయినా సాగు చేసి పంట దిగుబడి తీయడం చిన్నమ్మి ప్రత్యేకత. కుమారులు రమేష్, రాజశేఖర్ ప్రైవేటు కంపెనీలలో టెక్నీషియన్లుగా పనిచేస్తున్నారు. ఉత్తమ రైతు పురస్కారాన్ని సైతం అందుకున్నారు.

ఆసక్తితో సేత్తన్నా..

'సిన్ననాటి నుంచి వెవసాయం అంటే ఇష్టం. మా అయ్య, అమ్మ ఈ పనులు నేర్పారు. సిన్న పని నుంచి పెద్ద పని వరకు నానే సేసేదాన్ని. అన్ని పనులు నేర్చుకుని వెవసాయంలో లీనమై అన్ని పనులూ నేనే సేసుకునే దాన్ని. నా పెనిమిటి సాయం సేసేవాడు. పిల్లలకు సదువు సెప్పిద్దామనే ఆలోచనతో వారికి వెవసాయం నేర్పలేదు. పొద్దు పోయాక పొలాల్లో నీరు కట్టడం దగ్గర నుంచి బండి తోలడం వరకు అన్నీ నేర్చుకున్నాను. నా పని నానే సేసుకోవాలనుకుని పొలం పనులు నేర్చుకున్నాను..' అంటారు చిన్నమ్మి సగర్వంగా.

- రంపా రాజమోహనరావు, సాక్షి, బొబ్బిలి రూరల్, విజయనగరం జిల్లా



డ్రిప్ పనుల్లో మహిళా రైతు అక్షర

సంతోషంగా ఉంది!

ఎలాంటి రసాయనిక మందులు వాడకుండా కూరగాయలు పండించడం చాలా ఆనందంగా ఉంది. వీటిని మార్కెట్‌లో మంచి ధరకు అమ్ముకుంటున్నాం. చదువుకున్న యువ మహిళలు ఆధునాతన పద్ధతులలో పంటల సాగుపై దృష్టి సారించాలి.

- అక్షర, మహిళా రైతు, తిర్మలాపూర్, కరీంనగర్ జిల్లా

సంతోషకరం.. 'అక్షర' సేద్యం!

- బీఎడ్ పూర్తి చేసిన సేంద్రియ సాగుపై మక్కువ చూపుతున్న యువతి

బీఎస్సీ, బీఎడ్ పూర్తి చేసి విద్యార్థులకు విద్యాబోధన చేయాల్సిన అక్షర (దీపిక) సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. తన భర్త శ్రీనివాస్ సేంద్రియ వ్యవసాయం చేస్తుండడంతో ఆమె కూడా సంతోషంగా సాగు పనులు చేస్తూ తోటి మహిళా యువ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కట్ల శ్రీనివాస్ ఎంబీఏ చదువుకొని ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ సంతృప్తి లేక తిరిగి ఇంటికి వచ్చేశారు. ఆరేళ్లుగా తమ సొంత భూమిలో అధునాతన, శాస్త్రీయ సేంద్రియ పద్ధతులను పాటిస్తూ సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం శ్రీనివాస్ వెదిర గ్రామానికి చెందిన బీఎస్సీ, బీఎడ్ పూర్తి చేసిన అక్షరను వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచీ వ్యవసాయ పనులపై మక్కువ పెంచుకున్న అక్షర తన భర్తతో కలిసి సాగు పనుల్లో పాలు పంచుకున్నారు. అక్షర ప్రత్యేకంగా బోడ కాకర, కాకర, వంగ, టమటా, బెండ, చిక్కుడులాంటి కూరగాయలను ఎలాంటి క్రిమి సంహారక మందులను పిచికారీ చేయకుండా సాగు చేస్తున్నారు.

- వి.రాజిరెడ్డి, సాక్షి, రామడుగు, కరీంనగర్ జిల్లా

18 ఏళ్లుగా అన్నీ తానై..!

అధిక దిగుబడులు.. ప్రశంసలు.. సత్కారాలు..



యువ మహిళా రైతు మంజుల వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. కృషి, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని రుజువు చేస్తున్నారు. అనంతపురం జిల్లా నల్లమాడ మండల పరిధిలోని రాగానిపల్లి ఆమె స్వగ్రామం. శివమ్మ, మాధవరెడ్డి దంపతుల కుమార్తె అయిన మంజుల ఇంటర్ వరకూ చదువుకున్నారు. తండ్రికి వయసు మీద పడటంతో ఆమె చదువుకు స్వస్తిపలికి వ్యవసాయంలోకి అడుగుపెట్టారు. 18 ఏళ్లుగా వ్యవసాయంలో అన్నీ తానై రాణిస్తోంది. తమకున్న పదెకరాల పొలంలో వేరుశెనగ, వరి, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, మల్బరీ తదితర పంటలు సాగుచేసి అధిక దిగుబడులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ట్రాక్టర్‌తో భూమి దున్నడం, విత్తనాలు, ఎరువుల ఎంపిక, చీడపీడల నివారణకు స్వయంగా మందుల పిచికారీ, వ్యవసాయ పరికరాలు సమకూర్చుకోవడం, పంటలకు నీరందించడం తదితర పనులన్నీ ఈమెకు వెన్నెతో పెట్టిన విద్య.

వ్యవసాయ రంగంలో తనదైన ముద్రవేసుకున్న మంజుల వేరుశెనగ, వరి, మల్బరీ పంటల్లో రెట్టింపు దిగుబడులు సాధించి అధికారుల నుంచి ప్రశంసలు, సన్మానాలు అందుకున్నారు. కదిరి వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో తయారైన కే–5, కే–6, కే–134 రకాలను సాగు చేసి గతంలో రెట్టింపు దిగుబడులు సాధించారు. పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు మంజులను సత్కరించారు. కదిరి తాలూకాలోనే అత్యధిక ధర పలికే పట్టుగూళ్లను పండించిన ఘనత మంజులది. పంటల సాగు, చీడపీడల నివారణకు గ్రామ రైతులు మంజుల సలహాలు తీసుకుంటుంటారు. 'మంజుల మా గ్రామ సైంటిస్ట్' అంటూ పలువురు రైతులు కొనియాడుతున్నారు.



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న మహిళా రైతు మంజుల

- సోమశేఖర్, సాక్షి, నల్లమాడ, అనంతపురం జిల్లా

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

పీహెచ్‌డీ చదువొదిలి.. ప్రకృతి సేద్యంలోకి..!

ఆంగ్ల సాహిత్యంపై మక్కువతో హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ ('ఇఫ్లూ')లో పీహెచ్‌డీ చేస్తున్న ఓ యువకుడు.. ఉన్నట్టుండి ఒక రోజున భార్యా బిడ్డలతోపాటు తిరిగి ఇంటికెళ్లి.. అంతే మక్కువతో రెండున్నరేళ్లుగా, ప్రశాంతంగా ప్రకృతి వ్యవసాయం చేసుకుంటున్నారు. అందుకు దారితీసిన బలమైన కారణం ఏమై ఉంటుంది?

''మట్టి ఆరోగ్యంపైనే మనుషులు సహా సకల జీవరాశి ఆరోగ్యం, జీవావరణం శ్రేయస్సు ఆధారపడి ఉన్నాయని గ్రహించా. పరిశోధన కొనసాగించి అధ్యాపకుడిగా జీవించే కన్నా.. నేలతల్లికి ప్రణమిల్లి.. ప్రకృతి వనరులను పొదుపుగా వాడుకుంటూ మట్టిని నెమ్మదిగా బాగు చేసుకుంటూనే ఆయురారోగ్య సిరులనిచ్చే చిరు(సిరి)ధాన్యాలను సాగు చేస్తున్నా..'' అంటున్నారు కిశోర్ చంద్ర (38).

శిక్షణ పొంది ప్రకృతి సేద్యంలోకి..

ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఎ, ఎంఫిల్, బీఈడీ చేసి దేశ విదేశాల్లో ఐదేళ్లు అధ్యాపకుడిగా పనిచేసి.. ప్రతిష్టాత్మక యూనివర్సిటీ 'ఇఫ్లూ'లో పరిశోధన విద్యార్థిగా చేరారు. ఆ కొత్తలోనే అమీర్‌ఖాన్ 'సత్యమేవ జయతే' టీవీ షోలో విషతుల్య ఆహారంపై స్ఫూర్తి పొందారు. ఒకవైపు ఆంగ్ల భాషా బోధనపై పరిశోధనను కొనసాగిస్తూనే.. అరణ్య అగ్రికల్చరల్ ఆల్టర్నేటివ్స్ సంస్థలో పర్మాకల్చర్‌లో, భూమి కాలేజీ (బెంగళూరు)లో ఆహారం–వ్యవసాయంపైన, మనసబు ఫుకుఓకా ప్రకృతి వ్యవసాయంపైన శిక్షణ పొంది అవగాహనను పరిపుష్టం చేసుకున్నారు. 2015 ఏప్రిల్‌లో తన జీవితాన్ని అర్థవంతమైన మలుపుతిప్పే నిర్ణయం తీసుకున్నారు! నాలుగేళ్లు కొనసాగించిన పరిశోధనకు స్వస్తి చెప్పి ప్రకృతి వ్యవసాయదారుడిగా మారారు. ఉన్నత విద్యావంతులైన జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు ఆయన నిర్ణయాన్ని స్వాగతించి తోడ్పాటునందించడం విశేషం.

రసాయనిక వ్యవసాయానికి స్వస్తి

కిశోర్‌చంద్ర స్వస్థలం డా. వైఎస్సార్ జిల్లాలోని ప్రొద్దుటూరు. తండ్రి డాక్టర్ పాతకోట చిన్నగురివిరెడ్డి ఆంత్రోపాలజీలో పీహెచ్‌డీ చేసి, శ్రీహరికోట 'ఇస్రో'లో కొంతకాలం యానాదులపై పరిశోధన చేశారు. కుటుంబ కారణాల వల్ల ఉద్యోగానికి స్వస్తి చెప్పి ప్రొద్దుటూరులోనే ఉంటున్నారు. అక్కడికి సమీపంలోని తాళ్లమాపురం గ్రామంలో వారికి మెట్ట భూమి ఉంది. పదేళ్లుగా రసాయనిక వ్యవసాయం చేయిస్తున్నారు. ఆరేడేళ్ల క్రితం వారి పొలంలో పురుగులమందు పిచికారీ చేసిన ఇద్దరు కూలీలు తీవ్ర అస్వస్థతకు గురైతే.. రూ. 50 వేల ఖర్చుతో వైద్యం చేయించి వారి ప్రాణాలను కాపాడారు. రసాయనిక వ్యవసాయం కొనసాగింపు సరికాదన్న భావం బలపడడానికి ఈ సంఘటన కూడా ఒక కారణమని కిశోర్ చంద్ర వివరించారు. ఆ నేపథ్యంలో రసాయన రహిత సేద్యం వైపు మళ్లిన ఆయన తండ్రితో కలసి గత రెండున్నరేళ్లుగా ప్రకృతి సేద్యం చేస్తున్నారు.

అండుకొర్రల సాగుపై దృష్టి

సాగునీటి వసతి లేని తమ పొలాన్ని అందుబాటులోని ప్రకృతి వనరులతోనే సారవంతం చేసుకుంటూనే తమ ప్రాంతానికి అనువైన చిరుధాన్యాల సాగును కిశోర్ చంద్ర చేపట్టారు. పచ్చిరొట్ట ఎరువులతోపాటు 'రామబాణం' పద్ధతిలో భూసారాన్ని పెంపొందిస్తున్నారు. జీవామృతం, పంచగవ్యలతో కొర్రలు, ఊదలతోపాటు అరుదైన సిరిధాన్య పంట అండుకొర్రలు(బ్రౌన్‌టాప్ మిల్లెట్) సాగు చేస్తూ.. తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

ఈ ఏడాది ఖరీఫ్‌లో 10 ఎకరాల్లో ఏకపంటగా అండుకొర్రలు సాగు చేశారు. ఇది 80–90 రోజుల పంట. పంట మూడు అడుగుల ఎత్తు పెరిగింది. కోతకు వచ్చే దశలో ఎడతెగని వర్షాల వల్ల దిగుబడి ఎకరానికి 9 క్వింటాళ్ల నుంచి 6 క్వింటాళ్లకు తగ్గింది. అండుకొర్ర ధాన్యం క్వింటాల్‌కు రూ. 3,500కు అమ్మారు.

రబీలో 14 ఎకరాల్లో అండుకొర్రలను సాగు చేస్తున్నారు. డిసెంబర్ 15న చాడ గట్టి(బోరు నీటిని పారగట్టి) గొర్రుతో ఇరుసాళ్లు విత్తనం విత్తారు. ఎకరానికి రెండుంపావు కిలోల విత్తనం వాడారు. దుక్కిలో ఎకరానికి 100 కిలోల వేప పిండి, 100 కిలోల ఆముదం పిండి చల్లారు. విత్తిన ఐదు వారాలకు బోరు నీటితోపాటు జీవామృతం పారగట్టారు. 8 వారాలకు ఎకరానికి రెండున్నర లీటర్ల పంచగవ్యను వంద లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేశారు. మార్చిలో నూర్పిడి చేయనున్నారు. రబీ పంట వేశాక వర్షం పడకపోవడం వల్ల పంట అడుగున్నర ఎత్తు మాత్రమే ఎదిగింది. ఎకరానికి 6 క్వింటాళ్ల అండుకొర్రల ధాన్యం దిగుబడి వస్తుందని భావిస్తున్నారు. గత ఏడాది ఊదలు, కొర్రలు, జొన్నలు సాగు చేసినప్పుడు.. ఊదలను సగం వరకు పక్షులు తిన్నాయని, అండుకొర్రలకు పక్షుల బెడద లేదన్నారు. సిరిధాన్యాల్లోకెల్లా అత్యధికంగా 12.5% పీచు కలిగి ఉండటం అండుకొర్రల విశిష్టత.



అండుకొర్ర పొలంలో తండ్రి చిన్నగురివిరెడ్డితో కిశోర్‌చంద్ర

ఇంటిల్లిపాదికీ సిరిధాన్యాలే ఆహారం..

ప్రొద్దుటూరులో జన్మించి మైసూరులో స్థిరపడిన సుప్రసిద్ధ స్వతంత్ర ఆహార శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలి సూచనల మేరకు 8 నెలలుగా తమ 8, 2 ఏళ్ల పిల్లలతోపాటు ఇంటిల్లిపాదీ సిరిధాన్యాలనే ప్రధాన ఆహారంగా తింటూ ఆరోగ్యంగా ఉన్నామని కిశోర్ చంద్ర ఆనందంగా తెలిపారు.

జలవనరులు తక్కువగా ఉన్న తమ పొలంలో అతి తక్కువ నీటితో పండే సిరిధాన్యాలను సాగు చేయడంతోపాటు.. వాటినే ప్రధాన ఆహారంగా తినటం ద్వారా విద్యాధిక రైతు కిశోర్‌చంద్ర యువ రైతాంగానికి ఆదర్శంగా నిలవడం విశేషం. ఇటీవల సేంద్రియ గ్రామసభలో కిశోర్‌చంద్రను అధికారులు ఘనంగా సత్కరించారు.

- కుడుముల వీరారెడ్డి, సాక్షి, ప్రొద్దుటూరు, డా.వైఎస్సార్ కడప జిల్లా

బాధ్యతగల రైతుగా సిరిధాన్యాలు పండిస్తున్నా..

వ్యవసాయ సంక్షోభానికి మూల కారణం మట్టిని, నీటిని, వాతావరణాన్ని, మొత్తం జీవావరణాన్ని నాశనం చేసే రసాయనిక సేద్యమేనని.. అతిగా నీటిని తాగే పంటలేనని అర్థం చేసుకున్నా. మనకూ భూమి ఉంది కదా. బాధ్యతగల పౌరుడిగా ఏం చేయొచ్చు? ఏం చేయగలం? అని ఆలోచించా. నాన్నతో కలిసి ప్రకృతి వ్యవసాయం మొదలు పెట్టా. తినే పంటలనే పండిస్తున్నాం. తినగా మిగిలినది అమ్ముతున్నాం. నిదానంగా భూమి సారవంతమవుతోంది. సీతాకోకచిలుకలు, తేనెటీగలు, వానపాములు, పీతలు కనిపిస్తుంటే సంతోషంగా ఉంది. సిరిధాన్యాలతోపాటు పండ్లు, కూరగాయలూ పండించి నలుగురికీ అందించాలన్నది లక్ష్యం.


- పాతకోట కిశోర్‌చంద్ర (94900 28642), ప్రొద్దుటూరు, డా.వైఎస్సార్ కడప జిల్లా

ఆక్వాపోనిక్స్‌తో సత్ఫలితాలు!

ఇంటి పంట



ఇంటిపట్టున స్వల్ప ఖర్చుతో, వనరులు వృథా కాకుండా చేపలను సాగు చేయడం, చేపల విసర్జితాలు కలిసిన నీటిని కూరగాయలు, ఆకు కూర మొక్కలు పెరిగే కుండీలు, టబ్‌లకు అందించడాన్ని ఆక్వాపోనిక్స్ (రీ సర్క్యులేటింగ్ ఆక్వాపోనిక్స్ సిస్టం– ఆర్.ఎ.ఎస్.) వ్యవస్థగా చెప్పొచ్చు. ఈ పద్ధతిలో మట్టిని వాడాల్సిన అవసరం లేదు. చేపలకు మేత వేస్తే చాలు. మొక్కలకు ఎరువులు వేయనక్కర లేదు. చేపల విసర్జితాలతో కూడిన నీరు సూక్ష్మ, స్థూల పోషకాలతో నిండి ఉంటుంది. ఈ నీటిని మొక్కల వేళ్లకు అందిస్తే.. అందులోని పోషకాలను గ్రహించి కూరగాయలు, ఆకుకూరలు చక్కగా పెరుగుతాయి.




నత్రజనిని స్థిరీకరించే సూక్ష్మజీవులు అమ్మోనియాను నైట్రైట్‌గా, తదనంతరం నైట్రేటుగా మార్చి మొక్కలకు అందిస్తాయి. ఇందులో వాడే నీటిలో 90%, పోషకాలలో 100% వృథాపోకుండా ఉపయోగించడానికి అవకాశం ఉంది. తద్వారా పూర్తిగా సేంద్రియ చేపలు, ఆకుకూరలు, కూరగాయలను పండించుకోవచ్చని మహారాష్ట్ర పుణే జిల్లా పబల్‌లోని 'విజ్ఞాన ఆశ్రమం' నిపుణులు చెబుతున్నారు. ఏదైనా కొత్త ఆలోచనతో ఈ ఆశ్రమానికి వచ్చే వ్యక్తికి తదనంతర పరిశోధనకు సహాయపడి.. ఆ పరిశోధనా ఫలితాల ద్వారా ఆ వ్యక్తి ఉపాధి పొందేలా తోడ్పాటునందించడం విజ్ఞాన ఆశ్రమం ప్రత్యేకత. గత 5 నెలలుగా ఆక్వాపోనిక్స్‌పై అధ్యయనం జరుగుతోంది.

గత ఏడాది సెప్టెంబర్‌లో 2 గ్రాముల గ్రాస్ కార్ప్ చేప పిల్లలు వేస్తే.. 5 నెలల్లో 30–450 గ్రాముల వరకు బరువు పెరిగాయి. చేపలకు అజొల్లా/బెర్సీమ్‌తోపాటు నీటిలో తేలియాడే బలపాల మేతను (40:40:10 నిష్పత్తిలో) వేస్తున్నారు. 50 వేల లీటర్ల నీటి ట్యాంకులో వెయ్యి చేప పిల్లలు వేశారు. కొన్ని పిల్లలు తీసేస్తే చేపల పెరుగుదల మరింత బాగుంటుందని భావిస్తున్నారు. చేపల నీటితో టమాటాలు, కలబంద, పాలీహౌస్‌లో గులాబీలను సాగు చేస్తున్నారు. జూన్ నాటికి పూర్తి వివరాలు తెలుస్తాయని భావిస్తున్నారు. వివరాలకు..

Email: vigyanashramvideo@gmail.com

కాటేసే 'కాస్మొటిక్'!

కాస్మొటిక్ సర్జరీలతో ఆరోగ్యం నాశనం ● ప్రాణాలూ పోయేంత ప్రమాదం..! ● హైడ్రాక్సిల్ మందులూ ఈ కోవలోవే





గురుగ్రామ్‌లో శ్రీదేవికి నివాళులర్పిస్తున్న నాటకరంగ కళాకారులు

అతిలోక సుందరి దివికేగింది.. మరణానికి కారణం గుండెపోటని వార్తలొచ్చినా సమయం గడుస్తున్న కొద్దీ అనేక అనుమానాలు ముసురుకుంటున్నాయి.. కాస్మొటిక్ సర్జరీలు కారణమని కొందరు.. బరువు తగ్గేందుకు వాడిన మందులని ఇంకొందరు అనుమానిస్తున్నారు.. ఆరోపిస్తున్నారు కూడా.. వాస్తవం రహస్యంగానే ఉండిపోవచ్చుగానీ సౌందర్య శస్త్ర చికిత్సలు, బరువు తగ్గించే మాత్రలు ప్రాణాలు తీసేంత హానికరమైనవే! గ్లామర్ ప్రపంచంలో అందంగా కనిపించడం అనివార్యం. కడుపు కట్టుకోవడం, ద్రవ ఆహారమే తీసుకోవడం, గంటల తరబడి వ్యాయామం చేస్తూ అందాన్ని కాపాడుకోవడం ఓ రకమైతే.. పెరుగుతున్న వయసు, ఒళ్లు దాచుకోడానికి శస్త్ర చికిత్సలు, మందులు మింగి ఆకలిని అణచుకొని నాజూకుగా కనిపించే ప్రయత్నం చేయడం ఇంకో రకం. శ్రీదేవి రెండో రకం వ్యక్తి అని కొన్ని వార్తలు చెబుతున్నాయి. చిన్న వయసులోనే ముక్కు ఆకారం సరిచేసుకోడానికి రైనోప్లాస్టీ చేయించుకున్న శ్రీదేవి.. తరువాత అమెరికా కాలిఫోర్నియాలోని ఓ ఆస్పత్రిలో చిన్నాచితకా కలిపి మొత్తం దాదాపు 29 ఆపరేషన్లు చేయించుకున్నారని వార్తలొస్తున్నాయి. శ్రీదేవికి దగ్గరి స్నేహితురాలు ఒకరు ఈ విషయమై ఫేస్‌బుక్‌లో ఓ పోస్ట్ కూడా పెట్టారు. – సాక్షి, హైదరాబాద్

రజనీ కోసం శ్రీదేవి వ్రతం



తమిళ సినిమా: సినిమా వాళ్లు ఏం చేసినా స్వార్థంతోనే అనే అపవాదు ఉంది. కానీ ఈ పరిశ్రమలోనూ మానవత్వం ఉన్నవాళ్లు, స్నేహానికి గౌరవం ఇచ్చేవారూ ఉన్నారు. అందుకు నిదర్శనం శ్రీదేవియే. 2011లో రజనీకాంత్ అనారోగ్యానికి గురై చికిత్స నిమిత్తం సింగపూర్‌కు వెళ్లారు. రజనీ త్వరగా కోలుకోవాలని అప్పట్లో శ్రీదేవి వారం రోజులు వ్రతం ఆచరించి పూజలు చేశారట. రజనీ కోలుకున్న తరువాత షిర్డీ సాయిబాబా ఆలయానికి వెళ్లి వ్రతాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ విషయాన్ని స్వయంగా ఆమెనే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. 'కమల్, రజనీ ఇద్దరు నాకు మంచి మిత్రులు. రజనీకి మా అమ్మంటే చెప్పలేనంత అభిమానం. రజనీ అంటే మా అమ్మకూ అంతే. కమల్‌లాగే తానూ పెద్ద స్టార్ కావాలని, అందుకు ఏం చేయాలని రజనీ మా అమ్మను అడిగేవారు. నువ్వు కచ్చితంగా పెద్ద స్టార్‌వి అవుతావని ఆమె చెప్పేది' అని ఇంటర్వ్యూలో శ్రీదేవి చెప్పారు. రూ.30వేలు పారితోషికం తీసుకోవాలనేది తన ఆశ అని అప్పట్లో రజనీ అంటుండేవారనీ, అది తలచుకుంటే ఇప్పుడూ నవ్వొస్తుందన్నారు.

శ్రీదేవి స్వగ్రామంలో విషాద ఛాయలు

సాక్షి, చెన్నై: శ్రీదేవి మరణ వార్తతో ఆమె స్వగ్రామమైన తమిళనాడులోని విరుదునగర్ జిల్లా శివకాశి సమీపంలోని మీనంపట్టిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాల్యంలోనే శ్రీదేవి మీనంపట్టి నుంచి చెన్నైకి వెళ్లినప్పటి ఫొటోను, ఆమె తల్లిదండ్రుల చిత్రపటాలను వీధుల్లో ఉంచి కొవ్వొత్తులు వెలిగించి అక్కడి ప్రజలు నివాళులర్పించారు. శ్రీదేవి గొప్ప నటిగా చెన్నైలో స్థిరపడిన తర్వాత కూడా మీనంపట్టి నుంచి తనను చూడడానికి ఎవరైనా వస్తే మంచి మర్యాదలతో స్వాగతం పలికి ఇంట్లో ఏ లోటూ రాకుండా చూసుకునేవారని గ్రామస్తులు గుర్తు చేసుకుంటూ విలపిస్తున్నారు. శ్రీదేవి జీవిత ఇతివృత్తంతో డాక్యుమెంటరీ తీయడానికి ఆమె అభిమాన సంఘాలు ఇటీవలే అనుమతి తీసుకుని ఆ పనులను వేగవంతం చేశాయి. ఇంతలోనే ఆమె కన్నుమూశారు. చెన్నై ఆళ్వార్‌పేట సీఐటీ కాలనీలోని శ్రీదేవి స్వగృహం ఒకప్పుడు అభిమానుల తాకిడితో నిత్యం కళకళలాడేది. ముంబైకి మకాం మార్చాక కూడా ఆమె ఎప్పుడు చెన్నైకి వచ్చినా ఈ ఇంట్లోనే ఉండేవారు. మాజీ సీఎం జయలలిత మరణం తర్వాత గత ఏడాది జనవరిలో ఆమె చివరిసారిగా చెన్నైకి వచ్చి శశికళను పరామర్శించి వెళ్లారు. ఆ ఇంటి ముందు అభిమానులు శ్రీదేవి చిత్రపటాన్ని ఉంచి నివాళులర్పించారు.

అన్ని సర్జరీలూ ప్రమాదకరమే..

కాస్మొటిక్ సర్జరీలతో అందం మాటేమోగానీ.. ఆరోగ్యం నాశనమవడం ఖాయమన్నది నిపుణుల మాట. రైనోప్లాస్టీ మొదలుకొని.. వక్ష సౌందర్యాన్ని పెంచుకోడానికి చేసుకునే శస్త్ర చికిత్స.. శరీరంలోని కొన్ని భాగాల నుంచి కొవ్వులు తొలగించేందుకు చేసే లైపోసక్షన్, తినే ఆహారం మోతాదును కృత్రిమంగా తగ్గించేందుకు బేరియాట్రిక్ సర్జరీ.. ఇలా అన్ని రకాల సర్జరీలతోనూ దుష్ప్రభావాలు బోలెడు. శస్త్ర చికిత్స జరిగిన ప్రాంతాల్లో రక్తం గడ్డకట్టడం మొదలుకుని.. రెండో గుండెగా చెప్పుకునే పిక్కల్లోని నరాల్లో రక్తప్రసరణ ఆగిపోయేంతగా అడ్డంకులు ఏర్పడటం వీటిల్లో కొన్ని మాత్రమే. కొన్నిసార్లు పిక్కల్లో ఏర్పడిన రక్తపు గడ్డలు పైకి ప్రవహించి ఊపిరితిత్తుల్లోకి చేరి ప్రాణాలూ తీయొచ్చు. వక్ష సంపదను పెంచేందుకు సర్జరీ చేయించుకున్న వారిలో కనీసం 15 శాతం మంది నాడులు దెబ్బతిని కొన్ని స్పందనలు కోల్పోతారని గణాంకాలు చెబుతున్నాయి. శస్త్ర చికిత్సల కోసం తరచూ మత్తుమందులు తీసుకోవాల్సి రావడమూ ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది. కొవ్వులు తొలగించేందుకు వాడే లైపోసక్షన్‌తో శరీరం లోపల ఉండే అవయవాలు దెబ్బతినేందుకు అవకాశాలెక్కువ. కొవ్వు తొలగించేందుకు ఉపయోగించే పరికరాలు అవయవాలను తాకడం వల్ల ఇలా జరుగుతుంటుంది.

మాత్రలతోనూ చిక్కులెక్కువే..

బరువు తగ్గేందుకు హైడ్రాక్సిల్ ఆధారిత మందులు శ్రీదేవి వాడారని వార్తలొచ్చాయి. బరువు తగ్గేందుకు లేదా ఆకలి మందగించేలా చేసేందుకు ఈ రకం మందులు వాడుతుంటారు. అనెరొక్సోరెంట్స్ రకం మందులు తీసుకుంటే కడుపు నిండుగా ఉందన్న భావన కలిగించేలా ఇవి మెదడులో కొన్ని మార్పులు చేస్తాయి. ఇలాంటి మందులతో రక్తపోటు, గుండె కొట్టుకునే వేగం పెరగడం. వాంతులు, అతిసారం, నిద్రలేమి, మలబద్ధకం, ఛాతి నొప్పి, చూపు మసకబారడం వంటి దుష్ప్రభావాలు ఉంటాయి.

సర్జరీలు చేయించుకోలేదన్న శ్రీదేవి

పదిహేనేళ్ల విరామం తరువాత 'ఇంగ్లిష్ వింగ్లిష్' సినిమాతో శ్రీదేవి మళ్లీ తెరంగేట్రం చేసిన విషయం తెలిసిందే. చిత్రం విడుదల సమయంలో తన పెదవుల ఆకారాన్ని మార్చుకోడానికి శ్రీదేవి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారని వార్తలు గుప్పుమన్నాయి. ఈ విషయమై అనేక సందర్భాల్లో విలేకరులు శ్రీదేవిని ప్రశ్నించారు కూడా. అయితే ప్లాస్టిక్ సర్జరీల విషయాన్ని శ్రీదేవి పూర్తిగా ఖండించారు. తనకు ఆ అవసరం లేదని.. మంచి ఆహారం, వ్యాయామాలతోనే ముఖం కళకళలాడుతోందిగానీ.. కృత్రిమ సర్జరీలతో కాదని అప్పట్లో ఆమె వ్యాఖ్యానించారు. ఆమె మరణం తరువాత కూడా.. శస్త్ర చికిత్సలు మాత్రమే మరణానికి కారణం కాకపోవచ్చునని ఓ కాస్మొటిక్ సర్జరీ నిపుణుడు అనడం గమనార్హం.

రంగీలా.. బాజీగర్!

బాలీవుడ్‌లో బ్లాక్‌బస్టర్లుగా నిలిచిన రంగీలా, బాజీగర్, మొహబ్బతే, బాఘ్‌బాన్ చిత్రాల్లోని ప్రధాన పాత్ర కోసం శ్రీదేవినే ఆయా చిత్ర నిర్మాతలు సంప్రదించారు. అయితే ఆమె వాటిని తిరస్కరించడంతో ఆ పాత్రలు కాజోల్, ఊర్మిళా మతోండ్కర్, ఐశ్వర్యారాయ్ తదితరుల్ని వరించాయి.

గతంలో స్టార్‌డస్ట్ మ్యాగజీన్‌కు శ్రీదేవి ఇచ్చిన ఓ ర్యాపిడ్‌ఫైర్ ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు:

- **నేను ప్రేమించేది–** పచ్చగా ఉన్న ఈ సుందరమైన ప్రపంచాన్ని
- **మర్చిపోవాలనుకునే విషయం–** ఈ ప్రపంచాన్ని మనం ఎలా నాశనం చేసుకుంటున్నామో అన్న విషయాన్ని
- **నేను సినిమాల్లో కోరుకునేది–** మంచి స్క్రీన్‌ప్లే
- **నాకు ఆసక్తి కలిగించే అంశం–** మంచి స్క్రీన్‌ప్లే
- **నాకున్న అతిపెద్ద ఆస్తి–** నా కుటుంబం
- **నా సెక్స్ అప్పీల్‌కు గల కారణం–** జన్యువులే
- **నాకు ఇష్టమైనవి–** పాంపియన్ కుక్కపిల్లలు, పైనాపిల్ ఐస్‌క్రీం, సినిమా ప్యాకప్ సమయం
- **తెలుసుకోవాలనుకునేది–** చనిపోయిన తర్వాత అక్కడా మేకప్ రూమ్స్ ఉంటాయా అని.
- **నా భయం, బాధ –** చనిపోయాక మరో జీవితం అంటూ ఉండదేమోనని
- **నా అధీనంలో ఉన్నవాటిలో ఇష్టమైనవి–** నా భావోద్వేగాలు
- **నా జీవితంలో మర్చిపోలేని అనుభవం–** ఛాల్‌బాజ్ సినిమాకు ఫిలింఫేర్ అవార్డు అందుకోవడం
- **నా బలం–** జీవితంలో జరగబోయేవాటిని ముందుగానే పసిగట్టగలగడం
- **నేను అలసిపోయేలా చేసేవి–** రీటేక్‌లు, రీమేక్‌లు
- **ఎక్కువగా ఆనందపడేది–** నా రీమేక్ సినిమా సూపర్‌హిట్ అయినప్పుడు
- **నా పుట్టినరోజు–** మృత్యువుకు మరో రోజు దగ్గరవ్వడం.



సిరియాలో తిరుగుబాటుదారుల అధీనంలో ఉన్న అల్–షిఫునియా గ్రామంపై ఆదివారం దేశసైన్యం జరిపిన అనుమానాస్పద రసాయనిక దాడిలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారి. ఈ దాడిలో 13 మందికి శ్వాససమస్యలు తలెత్తాయి.

మేఘాలయ, నాగాలాండ్‌లో నేడే ఓటింగ్

- పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి
- మార్చి 3న ఫలితాలు



నాంగ్‌పోలో ఈవీఎంలను తీసుకెళ్తున్న పోలింగ్ సిబ్బంది

షిల్లాంగ్/ కోహిమా: ఈశాన్య రాష్ట్రాలైన మేఘాలయ, నాగాలాండ్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. నేటి ఉదయం 7 గంటలకు ప్రారంభంకానున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని అధికారులు వెల్లడించారు. కొన్ని పోలింగ్ కేంద్రాలు మినహా మిగతా అన్ని చోట్లా సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. నాగాలాండ్‌లోని కొన్ని జిల్లాల్లో సాయంత్రం 3 వరకు మాత్రమే పోలింగ్ నిర్వహించనున్నారు. మేఘాలయ, నాగాలాండ్ సహా ఇప్పటికే ఎన్నికలు పూర్తైన త్రిపుర రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను మార్చి 3న ప్రకటిస్తారు. రెండు రాష్ట్రాల్లో కలిపి మొత్తం 120 నియోజకవర్గాలకు గానూ 118 చోట్ల పోలింగ్ జరగనుంది. మేఘాలయలో విలియమ్ నగర్ ప్రాంతంలో తీవ్రవాదుల దాడిలో ఎన్సీపీ అభ్యర్థి జోనాథన్ ఎన్ సంగ్మా మరణించడంతో అక్కడ ఎన్నిక నిలిపివేశారు. ఇక నాగాలాండ్‌లో ఎన్డీపీపీ చీఫ్ నెఫ్యూ రియో ఉత్తర అంగామి–2 నియోజకవర్గం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికవడంతో ఆ స్థానంలో ఎన్నిక జరగట్లేదు.

మహిళల కోసం పోలింగ్ కేంద్రాలు..

మేఘాలయలో దాదాపు 18.4లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈసారి రాష్ట్రంలో మహిళల కోసం ప్రత్యేకంగా 67 పోలింగ్ కేంద్రాలు సహా 61 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశామని మేఘాలయ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎఫ్ఆర్ ఖార్‌కోంగర్ వెల్లడించారు. అలాగే తొలిసారి అత్యధికంగా 32 మంది మహిళలు ఎన్నికల బరిలో ఉన్నట్లు తెలిపారు. ఇక నాగాలాండ్‌లో మొత్తం 11.91 లక్షల మంది ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొననున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే కేంద్ర సాయుధ పోలీసు బలగాలు(సీఏపీఎఫ్) నాగాలాండ్ చేరుకున్నాయని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ అభిజిత్ సిన్హా వెల్లడించారు. రెండు రాష్ట్రాల్లో హోరాహోరీగా జరిగిన ఎన్నికల ప్రచారం ఆదివారంతో ముగిసింది.

కేంద్ర కేబినెట్ మాజీ కార్యదర్శి 'టీఎస్ఆర్' కన్నుమూత



న్యూఢిల్లీ: కేంద్ర కేబినెట్ మాజీ కార్యదర్శి టీఎస్ఆర్ సుబ్రమణియన్(79) సోమవారం కన్నుమూశారు. కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతున్న ఆయన స్వగృహంలోనే తుదిశ్వాస విడిచారని అధికార వర్గాలు తెలిపాయి. తమిళనాడుకు చెందిన సుబ్రమణియన్ 1961 ఉత్తరప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి. ప్రధానమంత్రులు వాజ్‌పేయి, గుజ్రాల్, దేవెగౌడ హయాంలో 1996 నుంచి 1998 వరకు సుబ్రమణియన్ క్యాబినెట్ కార్యదర్శిగా పనిచేసి, పదవీ విరమణ పొందారు. ప్రభుత్వ పాలన, దేశ రాజకీయాలపై ఆయన మూడు పుస్తకాలు రాశారు. కాగా, టీఎస్ఆర్ మృతిపై ప్రధాని మోదీ సంతాపం వ్యక్తంచేశారు.

ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోలు హతం

రాంచీ: జార్ఖండ్‌లోని పలాము జిల్లాలో సోమవారం తెల్లవారుజామున భద్రత బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఇద్దరు మహిళా మావోలు ఉన్నారు. మావోయిస్టుల ఏరివేత చర్యల్లో భాగంగా సోమవారం లాలాఘటీ–నదిహా ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ దళాలు, పోలీసులు ఉమ్మడిగా కూంబింగ్ చేస్తున్నపుడు ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. మృతుల్లో స్థానిక నక్సల్ గ్రూప్‌కు సబ్ జోన్ కమాండర్ భూహియాన్, లల్లు యాదవ్, రింకీ, రూబీ ఉన్నారు. ఘటన ప్రాంతం నుంచి 2 ఎస్ఎల్ఆర్‌లు,5 మ్యాగజైన్లు, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.

చొరబడేందుకు సిద్ధంగా ఉగ్రవాదులు

శ్రీనగర్: కశ్మీర్‌లోకి చొరబడేందుకు నియంత్రణ రేఖకు దగ్గర్లో అనేకమంది ఉగ్రవాదులు కాచుకుని ఉన్నారని ఆర్మీ ఉన్నతాధికారి ఒకరు సోమవారం చెప్పారు. పాకిస్తాన్ తరచూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోంది కూడా ఆ ఉగ్రవాదులకు సహకరించడానికేనని ఆయన పేర్కొన్నారు. 'నియంత్రణ రేఖకు ఆవల భారీ సంఖ్యలో ఉగ్రవాదులు ఉన్నారని సమాచారమొచ్చింది' అని శ్రీనగర్‌లోని లెఫ్టినెంట్ జనరల్ ఏకే భట్ చెప్పారు. ఉగ్రవాదులు గుంపులు గుంపులుగా ఒక్కో చోట 30 నుంచి 40 మంది ఉన్నారని వెల్లడించారు.

హాల్ టికెట్లు ఆపొద్దు: సీబీఎస్ఈ

న్యూఢిల్లీ: వివిధ కారణాలు చూపుతూ విద్యార్థులకు హాల్ టికెట్లు నిరాకరిస్తుండటంపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) స్పందించింది. ఇటువంటి ఘటనలు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. అంతర్గత పరీక్షల్లో మార్కులు సరిగ్గా రాలేదనే కారణంగా హాల్ టికెట్లు ఇవ్వటం లేదనీ, ఫీజులు వసూలు చేస్తున్నారనీ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పలు ఫిర్యాదులు రావటంతో సీబీఎస్ఈ ఈ మేరకు పాఠశాలలకు సర్క్యులర్ జారీ చేసింది. మార్చి 5వ తేదీ నుంచి పది, పన్నెండు తరగతుల విద్యార్థులకు సీబీఎస్ఈ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

రైల్వే స్టేషన్లలో శానిటరీ న్యాప్కిన్ డిస్పెన్సర్లు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8వ తేదీ నాటికి దేశ వ్యాప్తంగా ఉన్న 200 రైల్వే స్టేషన్లలో శానిటరీ న్యాప్కిన్ డిస్పెన్సర్లను ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే మంత్రి గోయెల్ తెలిపారు. ఢిల్లీలోని సరోజినీ నగర్ రైల్వే కాలనీ శానిటరీ న్యాప్కిన్ తయారీ కేంద్రం 'దస్తక్'ను ఆయన సోమవారం సందర్శించారు. ఇక్కడ తయారయ్యే ఆరు న్యాప్కిన్ల ప్యాక్ ధర రూ.22 మాత్రమేనన్నారు. మరోవైపు, తమ రాష్ట్రంలోని దాదాపు 17 లక్షల మంది బాలికలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్‌ను అందజేయాలని ఒడిశా సర్కారు నిర్ణయించింది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 6–12వ తరగతి బాలికలకు వీటిని ఇవ్వనున్నారు. ఇందుకు ఏడాదికి రూ.70 కోట్లు ఖర్చుకానుంది.

కనీసం 'లోక్‌పాల్' కూడా లేదు

ప్రధాని మోదీపై రాహుల్ విమర్శలు



సాక్షి, బెంగళూరు (బెళగావి): అవినీతిపై పోరాటం అంటూ ప్రసంగాల్లో ఊదరగొట్టే ప్రధాని మోదీ లోక్‌పాల్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ప్రశ్నించారు. సోమవారం కర్ణాటకలో బెళగావి రామదుర్గ బహిరంగసభలో ప్రసంగిస్తూ కనీసం ఢిల్లీలో కూడా లోక్‌పాల్‌ను మోదీ ఏర్పాటు చేయలేకపోయారన్నారు. దేశంలో అతి పెద్ద మోసాలు, నేరాలు సంభవిస్తుంటే ప్రధాని నోరు మెదపడం లేదన్నారు. మోదీ కర్ణాటక రాష్ట్రానికి వచ్చి తమ సీఎం సిద్ధరామయ్యపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అవినీతి కేసుల్లో జైలుకెళ్లి వచ్చిన యడ్యూరప్ప, బీజేపీ మాజీ మంత్రులు పక్కనే కూర్చొని ఉండడాన్ని మరచినట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. దేశంలోని కార్పొరేట్ శక్తుల కోసమే మోదీ పనిచేస్తున్నారన్నారు. కర్ణాటకలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి తీరుతుందని రాహుల్ చెప్పారు. రాష్ట్రంలో పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారని, వారే తమను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. మూడు రోజుల రెండో విడత జనాశీర్వాద యాత్ర సోమవారంతో ముగిసింది.

మహారాష్ట్ర అసెంబ్లీలో 'గుజరాతీ' కలకలం

మరాఠీకి బదులుగా గుజరాతీలో గవర్నర్ ప్రసంగం ప్రసారం



ముంబై: మహారాష్ట్రలో బీజేపీ–శివసేన సంకీర్ణ ప్రభుత్వం సోమవారం వివాదంలో చిక్కుకుంది. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఆ రాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్ రావు ఉభయసభలను ఉద్దేశించి ఆంగ్లంలో మాట్లాడగా, సభ్యుల హెడ్‌ఫోన్లలో ఆ ప్రసంగ అనువాదం మరాఠీకి బదులు గుజరాతీ భాషలో వచ్చింది. ఈ ఘటనతో సభలో కలకలం చెలరేగింది. వెంటనే స్పందించిన సీఎం ఫడ్నవీస్.. ఈ ఘటనపై సభ్యులందరికీ క్షమాపణలు చెప్పారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. బాధ్యులపై వీలైతే సోమవారం సాయంత్రంలోపే చర్య తీసుకోవాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. గవర్నర్ ప్రసంగాన్ని ప్రారంభించిన కొద్దిసేపటికే దాని అనువాదం గుజరాతీలో ప్రసారం కావడంతో ప్రతిపక్ష కాంగ్రెస్, ఎన్సీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ ఘటనకు నిరసనగా ప్రతిపక్షాలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశాయి. అయితే ఈ ఘటన సాంకేతిక సమస్య వల్ల జరిగిందా? లేక మరేదైనా కారణముందా? అన్న విషయమై ఎలాంటి స్పష్టతా రాలేదు. మరాఠీ భాషా దినోత్సవానికి(ఫిబ్రవరి 27) ఒక్కరోజు ముందే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

కరుగుతున్న అమెరికా కలలు

- విశ్వవిద్యాలయాల్లో 21 శాతం తగ్గిన భారతీయులు
- కంపెనీలు, ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం



వాషింగ్టన్: ఉద్యోగ విధానంతో పాటు హెచ్1బీ వీసా నిబంధనల్ని కఠినతరం చేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు అగ్రరాజ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని ఓ నివేదికలో తేలింది. ట్రంప్ తీసుకుంటున్న దుందుడుకు చర్యలు అక్కడి కంపెనీలు, విశ్వవిద్యాలయాలతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ (ఎన్ఎఫ్ఏపీ) ఓ నివేదికను విడుదల చేసింది. అమెరికాలోని విశ్వవిద్యాలయాలకు విదేశీ విద్యార్థుల రూపంలో గణనీయంగా ఆదాయం అందుతున్న నేపథ్యంలో ట్రంప్ తాజా చర్యలతో ఈ ఆదాయం తగ్గుతోందని తేల్చింది. అమెరికా వర్సిటీల్లో సైన్స్, ఇంజనీరింగ్ డిగ్రీలు పొందిన విదేశీయులే ప్రస్తుతం అక్కడి సంస్థలకు ప్రధాన మానవవనరుగా ఉన్నారు.

21 శాతం తగ్గిన భారత విద్యార్థులు...

అమెరికాలో కంప్యూటర్‌సైన్స్, ఇతర ఇంజనీరింగ్ కోర్సుల్లో ఉన్నత చదువుల కోసం వెళ్లే భారతీయుల సంఖ్య 2016తో పోల్చితే 2017 నాటికి దాదాపు 21 శాతం (18,590 విద్యార్థులు) మేర తగ్గిందని నివేదికలో తెలిపింది. అమెరికా వర్సిటీల్లో చేరే మిగతా దేశాల విద్యార్థుల సంఖ్య 6 శాతం(14,730) తగ్గిందంది. హెచ్1బీ వీసాల జారీ విధానంలో ట్రంప్ యంత్రాంగం చేపట్టనున్న మార్పుల కారణంగానే అమెరికాకు వచ్చేందుకు విదేశీయులు, ముఖ్యంగా భారతీయులు విముఖత చూపుతున్నట్లు వెల్లడించింది.

అక్కడ విదేశీ విద్యార్థులదే సింహభాగం...

అమెరికా విశ్వవిద్యాలయాల్లో వేర్వేరు కోర్సుల్లో చేరేవారిలో విదేశీ విద్యార్థులే అధికంగా ఉన్నట్లు ఎన్ఎఫ్ఏపీ నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం అమెరికా వర్సిటీల్లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో 93 శాతం, కంప్యూటర్ సైన్స్‌లో 88 శాతం విద్యార్థులు విదేశీయులే. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఓపీటీ), సైన్స్–ఇంజనీరింగ్–గణితం(స్టెమ్) ఓపీటీలను పరిమితం చేయడమో, లేకపోతే తొలగించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఓపీటీ విధానంలో విదేశీ విద్యార్థులు గ్రాడ్యుయేషన్ తర్వాత అమెరికాలో చదువుకునేందుకు, శిక్షణ పొందేందుకు, పనిచేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇస్తోంది.

ఓబీసీ కుంభకోణంలో పంజాబ్ సీఎం అల్లుడు



అమరీందర్ (ఫైల్)

న్యూఢిల్లీ: దాదాపు రూ.109 కోట్ల ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్(ఓబీసీ) కుంభకోణం కేసులో కాంగ్రెస్ పార్టీకి చెందిన పంజాబ్ సీఎం అమరీందర్ అల్లుడిపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఘజియాబాద్‌లోని సింభావోలీ షుగర్స్ లిమిటెడ్ చైర్‌పర్సన్ గుర్మీత్ సింగ్ మన్, సీఎం అల్లుడు, కంపెనీ డిప్యూటీ ఎండీ గుర్పాల్ సింగ్‌లపై కేసులు పెట్టింది. రైతులకు రుణాలు అందిస్తామంటూ ఓబీసీ నుంచి ఈ సంస్థ 2011లో రూ.148 కోట్ల రుణం పొందింది. దానిని రైతులకు చెల్లించకుండా సంస్థ ఖాతాకు మళ్లించారు. ఈ రుణం చెల్లించటానికి గాను ఓబీసీ నుంచి 2015లో మరో రూ.110 కోట్ల రుణం పొందింది. ఈ వ్యవహారంలో మొత్తం రూ.109 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు గుర్తించిన సీబీఐ ఆదివారం గుర్పాల్‌పై కేసులు పెట్టి కొన్ని చోట్ల సోదాలు కూడా నిర్వహించింది.



విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ సభ్యులు

ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేస్తారా?

- విద్యా పరిరక్షణ కమిటీ ఆందోళన
- కమిషనర్ కార్యాలయం ముట్టడి

ఇబ్రహీంపట్నం (మైలవరం): ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు పోరాడాలని విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ రమేశ్ పట్నాయక్ పిలుపునిచ్చారు. విద్యారంగాన్ని పరిరక్షించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాలు కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నంలోని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించాయి. ముందుగా జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు రింగ్‌సెంటర్ నుంచి కమిషనర్ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా రమేశ్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యానికి కుట్ర పన్నడం హేయమన్నారు. విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో మిగిలి ఉన్న 22,814 టీచర్ల పోస్టుల భర్తీకి తక్షణమే డీఎస్సీ ప్రకటించాలని కోరారు. కొన్నేళ్లుగా ఉన్నత పాఠశాలల్లో పెరిగిన నమోదు మేరకు కొత్తగా మరో 7,677 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కమిషనర్ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో విద్యాపరిరక్షణ కమిటీ నేత కె.వెంకటేశ్వరరావు, ఏపీటీఎఫ్ నేత ఎన్వీ రమణ డీటీఎఫ్, పీడీఎస్‌యూ అధ్యక్షుడు రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి రంగన్న, పీఈఎస్‌యూ అధ్యక్షుడు రవిచంద్ర, వివిధ జిల్లాల ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో కల్తీ పాల కలకలం

తయారీదారుడిని అరెస్టు చేసిన పోలీసులు

నరసరావుపేట రూరల్: కల్తీపాలను తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్న పాలవ్యాపారిని నరసరావుపేట రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. గుంటూరు జిల్లా నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ కె.నాగేశ్వరరావు వెల్లడించారు. నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన కొంకల ప్రసన్నాంజనేయరెడ్డి ఏడాది కాలంగా కల్తీపాలు తయారు చేసి ప్రైవేటు డెయిరీతో పాటు పట్టణంలోని కొంతమంది ఖాతాదారులకు పాలను విక్రయించేవాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ప్రసన్నాంజయరెడ్డి నివాసంలో తనిఖీలు చేశారు. కల్తీ పాల తయారీకి ఉపయోగించే వస్తువులను, కల్తీపాలను స్వాధీనం చేసుకున్నారు. శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. పాలను కల్తీ చేయడం వలన వెన్న శాతం 5 నుంచి 7 శాతానికి పెరిగి లీటర్‌కు రూ.5 అదనంగా వస్తుందని తెలిపారు. కల్తీలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కల్తీపాల తయారీకి ఉపయోగించే సామాగ్రి

రిటైర్డ్ కాలేజీ టీచర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ కాలేజీ టీచర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటైంది. విజయవాడలో సోమవారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా టి.మణినాయుడు (చిత్తూరు), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ ఎం.ఆంథోని (విజయవాడ), ప్రధాన కార్యదర్శిగా ఎస్.వి.కృష్ణారావు (విజయవాడ), కోశాధికారిగా ఈశ్వరప్రసాద్ (కృష్ణా జిల్లా), సహాయ కార్యదర్శిగా ఆర్.వెంకటేశ్వరరెడ్డి (కర్నూలు) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులు మణినాయుడు, ఆంథోని మాట్లాడుతూ.. రిటైర్డ్ కళాశాల అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

వైఎస్సార్‌సీపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కారుమూరి

విజయవాడ సిటీ: ఏపీఎస్పీడీసీఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కో పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు విద్యుత్ కార్మికులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కారుమూరి వెంకటనాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికుల డిమాండ్లను సానుభూతితో పరిష్కరించాలని కోరారు. విజయవాడలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. 2014 ఎన్నికల సమయంలో కాంట్రాక్టు విద్యుత్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని మేనిఫెస్టోలో పేజీ నంబర్ 26లో హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టాక ఆ ఊసే విస్మరించారని ధ్వజమెత్తారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులలో అత్యధికంగా వైఎస్సార్‌సీపీ వారే ఉన్నారని చెబుతూ, వారిని రెగ్యులరైజ్ చేయకపోవడం ప్రజాస్వామ్యంలో సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. 2004కు ముందు టీడీపీ హయాంలో విధుల్లో చేరిన 7 వేల మందిని 2007లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రెగ్యులరైజ్ చేశారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పుకు లోబడి సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యుత్తు సంస్థల్లో దాదాపు 24,800 మంది ఉద్యోగుల ఆవేదనను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, ప్రమాదవశాత్తు కార్మికుడు మృతి చెందితే రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ విద్యుత్ కార్మికులకు అండగా ఉంటుందన్నారు. సమావేశంలో కాంట్రాక్టు విద్యుత్ కార్మికుల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్ పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న కారుమూరి, చిత్రంలో వెలగపల్లి ప్రదీప్

మనసులో అనుకున్నది గీసేస్తుంది!

టొరంటో: మనసులో తలచుకునే దానిని చిత్ర రూపంలో చూపించే నూతన టెక్నాలజీని టొరంటో యూనివర్సిటీకి చెందిన డాన్ నెమ్రోదేవ్ అనే పరిశోధకుడు అభివృద్ధి చేశారు. మెదడులోని తరంగాల కదలికల ఆధారంగా ఇది ముఖ చిత్రాన్ని గీస్తుందన్నారు. ఎలక్ట్రో ఎన్సెఫాలోగ్రఫీ(ఈఈజీ) డేటా ఆధారంగా ఇది పనిచేస్తుందని చెప్పారు. మనం దేనినైనా చూసినప్పుడు మెదడులో ఓ ఊహాచిత్రం ఏర్పడుతుందని, దీనిని ఈఈజీ సాయంతో బంధించి చిత్రం రూపంలోకి తీసుకురాగలమని పేర్కొన్నారు. నాడీ తరంగాల ఆధారంగా మనసులో గుర్తుంచుకున్న, ఊహించుకునే అంశాలను కూడా ఇది చిత్రీకరించగలదని వర్సిటీకి చెందిన ఆడ్రియాన్ నెస్టర్ తెలిపారు. ఇది విజయవంతమైతే నేరాల్లో ప్రత్యక్ష సాక్షుల మెదడు కదలికల ఆధారంగా నేరస్థుల చిత్రాలను గీయగలదని చెప్పారు. మాట్లాడలేని వారి మనసులో ఏముందో కూడా గుర్తించగలదన్నారు. అయితే దీనిని మరింత అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. పరిశోధన వివరాలు ఈన్యూరో జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.



‘అరణ్య’ రోదన!

- సిబ్బంది కొరతతో కునారిల్లుతున్న అటవీశాఖ
- 51 శాతం ఖాళీలు
- అయిదేళ్లుగా ఒక్క పోస్టూ భర్తీ చేయని సర్కారు

సాక్షి, అమరావతి: అరకొర ఉద్యోగులతో అటవీశాఖ కునారిల్లుతోంది. దీన్ని అనుకూలంగా మార్చుకున్న అక్రమార్కులు యథేచ్ఛగా స్మగ్లింగ్‌కు పాల్పడుతూ వందల కోట్లు దండుకుంటున్నారు. చిత్తూరు, వైఎస్సార్, నెల్లూరు జిల్లాల్లో విలువైన ఎర్రచందనం, విశాఖ జిల్లాలోని నర్సీపట్నం, పాడేరు, ఉభయ గోదావరి జిల్లాల్లోని మారేడుమిల్లి ఏజెన్సీ ప్రాంతాల్లో టేకు స్మగ్లింగ్ నిరాటంకంగా సాగుతోంది. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అడ్డుకునేందుకు అటవీశాఖ, పోలీసులతో కూడిన టాస్క్‌ఫోర్స్ ప్రయత్నిస్తున్నా సిబ్బంది కొరత ప్రధాన సమస్యగా మారింది. మరోవైపు రాష్ట్రంలో అటవీ భూముల ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. చిత్తూరు, నెల్లూరు, విశాఖపట్నం, గుంటూరు జిల్లాల్లో అటవీ ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో వీటి కట్టడి తలకు మించిన భారంగా మారిందని అధికార వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

అదనపు సిబ్బంది కేటాయింపు దేవుడెరుగు..

పెరిగిన అవసరాలకు అనుగుణంగా క్షేత్రస్థాయి అటవీ పర్యవేక్షణకు సిబ్బందిని పెంచాలని దీర్ఘకాలంగా అటవీశాఖ కోరుతోంది. ఈ మేరకు ప్రభుత్వానికి అయిదారేళ్లుగా ప్రతిపాదనలు సమర్పిస్తూనే ఉంది. అదనపు సిబ్బంది కేటాయింపు మాట దేవుడెరుగు ఉన్న ఖాళీల భర్తీకి కూడా ప్రభుత్వం అనుమతించకపోవడం గమనార్హం. గత ఏడాది జూలై నెలాఖరుకు అటవీశాఖలో 49 శాతం ఖాళీలు ఉండగా తర్వాత రిటైరైన వారిని పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతం ఖాళీల శాతం 51కి పెరిగింది. నాలుగేళ్ల కిందట పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేసి పరీక్షలు నిర్వహించిన తర్వాత రాష్ట్ర విభజన జరిగింది. దీంతో ఆ నియామకాలను నిలిపివేసిన ప్రభుత్వం, తర్వాత వాటిని కూడా భర్తీ చేయకపోవడం గమనార్హం.

కీలకం ఎఫ్‌బీవో, ఏబీవోలే..

అడవిలో నిత్యం తిరుగుతూ అక్రమాలు జరగకుండా చూడటంలో కీలక భూమిక పోషించేది ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు (ఎఫ్‌బీవో), అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ (ఏబీవో)లదే. పర్యవేక్షణ కోసం అడవిలో కొంత ప్రాంతాన్ని బీట్‌గా విభజిస్తారు. రాష్ట్రంలో బీట్ల పరిమాణం కూడా చాలా పెద్దది. అందువల్ల ఎక్కువ మంది ఎఫ్‌బీవో, ఏబీవోలను కేటాయించాల్సిన అవసరం ఉంది. ఈ విషయం పట్టించుకోని ప్రభుత్వం ఉన్న పోస్టులను కూడా భర్తీ చేయడం లేదు. అటవీ పరిరక్షణలో కిందిస్థాయి ఉద్యోగులు, అత్యంత కీలకమైన ఎఫ్ఎస్ఓ పోస్టులు సుమారు 60%, ఏబీవో పోస్టులు సుమారు 56 శాతం ఖాళీగా ఉన్నాయి.

అటవీ శాఖలో ఖాళీల వివరాలు

కేటగిరి	కేడర్ స్ట్రెంత్	పనిచేస్తున్నవారు	ఖాళీలు	ఖాళీల శాతం
ఐఎఫ్ఎస్	82	53	29	35.37
డీసీఎఫ్	32	23	09	28.13
ఏసీఎఫ్	62	62	0	0
ఎఫ్ఆర్ఓ	295	173	122	41.36
డీప్యూటీఆర్ఓ	192	177	15	7.81
ఎఫ్ఎస్ఓ	972	454	518	53.29
ఎఫ్‌బీఓ	2258	915	1343	59.48
ఏబీఓ	1390	622	768	55.25
ఎస్ఏ	240	210	30	12.50
జేఏ	222	147	75	33.78
ఓఎస్	355	252	103	29.01
ఇతరులు	782	426	356	45.52
మొత్తం	6882	3514	3368	48.88

నోట్: గతేడాది జూలై నెలాఖరు నాటికి ఉన్న ఖాళీల వివరాలు ఇవి. తర్వాత రిటైరైన వారిని పరిగణనలోకి తీసుకుంటే ఖాళీల శాతం 51కి పెరిగింది

హోదా ఇవ్వకపోతే బీజేపీ, టీడీపీలకు అధోగతే

కాంగ్రెస్ నాయకులు కనుమూరి, జేడీ శీలం హెచ్చరిక

నరసరావుపేట/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే బీజేపీ, టీడీపీ నాయకులకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, జేడీ శీలం హెచ్చరించారు. రాష్ట్ర విభజన చట్టం అమలు-ప్రత్యేక హోదా సాధన కోసం సోమవారం గుంటూరు జిల్లా నరసరావుపేటలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష సభలో వారు ప్రసంగించారు. బాపిరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి రాగానే రాష్ట్రానికి హోదా ఇస్తామన్నారు. జేడీ శీలం మాట్లాడుతూ నూతన రాజధాని ఏర్పడే వరకు హైదరాబాద్‌లో 2024 దాకా ఉండే అవకాశం ఉన్నా ఓటుకు కోట్లు కేసులో ఇరుక్కున్న ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని వదిలి వచ్చాడన్నారు.

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం

ఎన్నికల హామీలు నెరవేర్చనందుకు బీజేపీ, టీడీపీలను రద్దు చేయాలని త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సోమవారం విజయవాడ లెనిన్‌సెంటర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన చేశారు. రఘువీరా మాట్లాడుతూ నాలుగేళ్లయినా హోదా, విభజన హామీలు ఆ రెండు పార్టీలూ అమలు చేయలేదన్నారు. మార్చి 5 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బడ్జెట్‌లో సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. పీసీసీ నేతలు సుంకర పద్మశ్రీ, నరహరిశెట్టి నరసింహారావు, గురునాథం, మహిళలు పాల్గొన్నారు.

సాగర్ డ్యాంకు మరో స్పిల్‌వే అవశ్యం

- భారీ స్థాయిలో వరదలు వస్తే ఇబ్బందులే
- ప్రభుత్వానికి డీఎస్ఆర్‌పీ చైర్మన్ ఎంఎస్ రెడ్డి నివేదిక

విజయపురి సౌత్ (మాచర్ల): ఆధునిక దేవాలయమైన నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు మరో స్పిల్‌వేను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సాగర్ డ్యాం పరిరక్షణ కమిటీ (డీఎస్ఆర్‌పీ) చైర్మన్ ఎంఎస్ రెడ్డి తెలిపారు. ప్రపంచ బ్యాంకు నిధులతో ఏడేళ్లుగా జరుగుతున్న సాగర్ ప్రాజెక్టు ఆధునీకీకరణ పనులు మరో ఐదు నెలల్లో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు జరిగిన పనులతోపాటు పూర్తికావాల్సిన, భవిష్యత్తులో చేయాల్సిన పనులు, మరమ్మతులపై కమిటీ మూడు రోజులపాటు చర్చించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ ఎంఎస్ రెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడారు.

2009లో మాదిరిగా కృష్ణానదికి భారీస్థాయిలో వరదలు వస్తే సాగర్ డ్యాం నుంచి నీటిని దిగువకు విడుదల చేయడం కష్టమన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు లాంటి కాంక్రీట్ ఆనకట్ట అయితే ఓవర్ ఫ్లో అయి దాని మీదుగా వరదనీరు వెళ్లినా డ్యాంకు ఏమీకాదని.. గతంలో అదే జరిగిందని తెలిపారు. వాస్తవానికి సాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేను అప్పట్లో కేవలం 12లక్షల క్యూసెక్కుల నీరు వెళ్లే విధంగా డిజైన్ చేశారని ఆయన చెప్పారు. 2009లో శ్రీశైలానికి 26 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చిందని ఎంఎస్ రెడ్డి అన్నారు. అదే సమయంలో సాగర్‌కు 14లక్షల క్యూసెక్కుల నీరు వచ్చిందని గుర్తుచేశారు. ఈ డ్యాం మీదుగా వరద నీరు ఓవర్ ఫ్లో అయితే ఇరువైపులా ఉన్న మట్టికట్టలు కొట్టుకుపోవడంతోపాటు దిగువనున్న ప్రాంతమంతా కోతకు గురవుతుందన్నారు. కాగా, ఖరగ్‌పూర్ ఐఐటీ కళాశాల వారు ఇచ్చిన నివేదికల ప్రకారం వరదలు వచ్చే అవకాశం ఉందని ఆయన చెప్పారు. దీనిని నివారించేందుకు సాగర్ డ్యాం ఎడమ వైపున.. ఎర్త్‌డ్యాం ఎదురుగా ఉన్న టైగర్‌వ్యాలీ వద్ద మరో స్పిల్‌వే నిర్మించాలని ప్రభుత్వానికి సూచించినట్టు ఎంఎస్ రెడ్డి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని విపత్తుల నివారణ శాఖ అధికారులు డ్యాం బ్రేక్ అయితే జరిగే నష్టాలను 20 రకాలుగా వివరించారన్నారు.



ఎంఎస్ రెడ్డి

ఎర్త్ డ్యాం వద్ద స్పిల్‌వేకు అవకాశం

ఈ నేపథ్యంలో ఎర్త్ డ్యాం వద్ద స్పిల్‌వే నిర్మించేందుకు అవకాశముందని, ఎక్కువ పొడవుతో ఏర్పాటుచేస్తే తక్కువ ఎత్తుగల గేట్లు నిర్మించవచ్చన్నారు. అప్పుడు దిగువనున్న టైగర్ వ్యాలీలోకి నీటిని విడుదల చేస్తే నదిలో బ్రిడ్జి దిగువ భాగంలో కలుస్తుందని.. డ్యాంకు ఎలాంటి నష్టం జరగదని ఆయన చెప్పారు. ఆయన వెంట సాగర్ డ్యాం ఎస్ఈ రమేశ్ కూడా ఉన్నారు.

రాజాపై వేటుకు రంగం సిద్ధం!

సస్పెండ్ చేయాలంటున్న హరిబాబు వర్గం

సాక్షి, విజయవాడ: కృష్ణాజిల్లా నూజివీడుకు చెందిన బీజేపీ రాష్ట్ర నేత లక్ష్మీపతిరాజాను పార్టీ నుంచి సాగనంపేందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి హరిబాబు రంగం సిద్ధం చేస్తున్నారని వినిపిస్తోంది. టీడీపీని ఎదుర్కొనేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు నేతృత్వంలో బస్సు యాత్ర జరగాలని పార్టీ పదాధికారుల సమావేశంలో లక్ష్మీపతిరాజా డిమాండ్ చేశారు. టీడీపీకి వ్యతిరేకంగా బస్సు యాత్ర అనే ప్రతిపాదన వచ్చేసరికి కంగుతిన్న హరిబాబు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే స్థాయిలో లక్ష్మీపతిరాజా కూడా స్పందించిన విషయం విదితమే. హరిబాబు, లక్ష్మీపతిరాజా మధ్య వివాదానికి మీడియాలో విస్తృత ప్రచారం జరగడంతో లక్ష్మీపతిరాజా తమ పార్టీ అధికార ప్రతినిధికాదని, ఆయన్ను టీవీ చానళ్ల చర్చలకు ఆహ్వానించవద్దని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరుతో హరిబాబు వర్గం ఓ లేఖను విడుదల చేసింది. అంతటితో ఆగని హరిబాబువర్గం రాజాను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ కృష్ణా జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టినట్టు తెలిసింది. మార్చి రెండో తేదీన కృష్ణా జిల్లా సమావేశం విజయవాడ ఐవీ ప్యాలెస్‌లో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హరిబాబును ఆహ్వానించారు. సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, పురందేశ్వరిని అతిథులుగా పిలిచి, సమావేశం చివర్లో లక్ష్మీపతిరాజా ప్రాతినిధ్యం వహించే నూజివీడు ప్రాంత కార్యకర్తలతో అతనికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

రంగంలోకి సీనియర్లు..

నామినేటెడ్ పదవులన్నీ టీడీపీ నేతలకే దక్కుతుండడంపై ఆగ్రహించిన బీజేపీ నేతలు విజయవాడ నగరపార్టీ కార్యాలయాన్ని ముట్టడించడం, దానికి నగర అధ్యక్షుడు డాక్టర్ దాసం ఉమామహేశ్వరరాజును బాధ్యుడ్ని చేస్తూ పార్టీ నుంచి సస్పెండ్‌చేయడం తెలిసిందే. ఇపుడు లక్ష్మీపతిరాజాను కూడా సాగనంపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారన్న ప్రచారం నేపథ్యంలో సీనియర్ నేతలు రంగంలోకి దిగుతున్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడుగా హరిబాబు ఎన్నికై మూడేళ్లు గడిచినా నేటికీ రాష్ట్ర కమిటీని నియమించకుండా పార్టీని నిర్వీర్యం చేసి టీడీపీకి దాసోహం చేస్తున్నారని, వెంటనే హరిబాబు స్థానంలో మరొకర్ని నియమించాలని కోరుతూ ఒక వర్గం ఢిల్లీ వెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

టీడీపీ పాలనకు చరమగీతం పాడదాం

- ‘అదే బాట’ ప్రారంభ సభలో కాసు మహేష్‌రెడ్డి

గురజాల: నాలుగేళ్ల టీడీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఈ దుర్మార్గపు టీడీపీ పాలనకు చరమగీతం పాడుదామని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కాసు మహేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రజాసంకల్ప యాత్రకు సంఘీభావంగా ‘అదే బాట’ పేరుతో మహేష్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర ప్రారంభ సందర్భంగా గురజాలలో సోమవారం రాత్రి భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తాత, తండ్రి పంచిన రక్తం అన్యాయంపై పోరాడమంటోందని, జగన్ అన్న స్ఫూర్తితో ప్రజల కోసం ముందుకు అడుగువేయమంటోందని చెప్పారు. దున్నేవానిదే భూమి అని, పోరాడే వాడిదే రాజ్యం అని నినదించారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన కాసు బ్రహ్మానందరెడ్డి దగ్గర నుంచి గురజాల ఎమ్మెల్యేగా పనిచేసిన జంగా కృష్ణమూర్తి వరకు రాజకీయాల్లో ఆస్తులను పోగొట్టుకున్నారని, కానీ ప్రస్తుతం టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఈ నాలుగేళ్ల పాలనలో రూ.600 కోట్లకు పైగా అక్రమంగా సంపాదించారని విమర్శించారు. నియోజకవర్గంలో పేకాట క్లబ్‌లు నడుపుతూ, అక్రమంగా సున్నపురాయి గనులను దోచుకుంటూ వందల కోట్ల రూపాయలు సంపాదించారని దుయ్యబట్టారు. ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్న ఏకైన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని, ప్రత్యేక హోదా వస్తే గురజాల నియోజకవర్గంలో ప్రతి రెండు గ్రామాలకు ఒక సిమెంట్ పరిశ్రమ వస్తుందని చెప్పారు. గురజాలకు కృష్ణమ్మ నీళ్లు పరవళ్లు తొక్కుతాయని, ప్రతి గుడిసెను పక్కా ఇంటిగా చూస్తామని, అక్క చెల్లెళ్లకు అండగా ఉంటామని, పింఛను రూ.2 వేలు ఇస్తామని ప్రతి ఇంటికి వెళ్లి చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో మాచర్ల, నరసరావుపేట ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రి రాజశేఖర్, బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, పెదకూరపాడు సమన్వయకర్త కావటి మనోహర్‌నాయుడు, జెడ్పీ ఫ్లోర్ లీడర్ దేవళ్ల రేవతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాసు మహేష్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్యే పీఆర్కే, జంగా కృష్ణమూర్తి, మర్రి రాజశేఖర్, టీజీవీ కృష్ణారెడ్డి

అధికార పార్టీ ఎంపీ చెప్పిందే ధర

- ట్రాన్స్‌కో ఆప్టికల్ ఫైబర్ కేబుళ్ల టెండర్లలో మాయాజాలం
- రూ.కోట్ల విలువైన ప్రాజెక్టుపై టీడీపీ ఎంపీ కన్ను
- అర్హతల్లేని బినామీ సంస్థతో టెండర్ దాఖలు
- 5 శాతం తక్కువకే రెండు ప్యాకేజీలు కట్టబెట్టాలంటూ ఒత్తిళ్లు
- 11 శాతం తక్కువకు అయితేనే ఇస్తామంటున్న అధికారులు
- తాను చెప్పినట్టు చేయాలని ఎంపీ పట్టు.. ట్రాన్స్‌కో ఉన్నతాధికారి వత్తాసు



సాక్షి, అమరావతి బ్యూరో: ఆయన అధికార పార్టీకి చెందిన రాయలసీమ ఎంపీ. తరచుగా వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తుంటారు. తనను ఎన్నుకున్న ప్రజలకు సేవ చేస్తానంటూ ప్రమాణ స్వీకారం కూడా చేశారు. ఇప్పుడు అదే ప్రజల సొమ్మును అప్పనంగా కొట్టేద్దామని ఎత్తులు వేస్తున్నారు. రూ.కోట్ల విలువైన ట్రాన్స్‌కో ప్రాజెక్టుపై కన్నేశారు. ఎలాంటి అర్హతలు లేని తన బినామీ సంస్థను తెరపైకి తెచ్చారు. ప్రభుత్వరంగ సంస్థ నష్టపోయినా సరే తాను చెప్పిన ధరకే టెండర్ కట్టబెట్టాలంటూ అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. అలా ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని చెబుతున్నా వినిపించుకోవడం లేదు.

రూ.240 కోట్ల కేంద్ర నిధులు

అదనపు ఆదాయం సమకూర్చుకోడానికి రాష్ట్రంలో ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు వేయాలని ఏపీ ట్రాన్స్‌కో భావించింది. రాష్ట్రవ్యాప్తంగా తమకున్న ఎర్త్ వైర్ల స్థానంలో ఆప్టికల్ ఫైబర్ గ్రౌండ్(ఓపీజీ) వైర్లు వేయాలని నిర్ణయించింది. వీటిని టెలికాం, ఐటీ సంస్థలు డేటా పంపిణీకి ఉపయోగించుకునేలా ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రంలో విశాఖపట్నం నుంచి చిత్తూరు జిల్లా నగరి వరకు పలు నగరాలు, పట్టణాలను కలుపుతూ 9,000 కిలోమీటర్ల పొడవునా ఓపీజీ వైర్లు వేసేందుకు కార్యాచరణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.240 కోట్ల నిధులతో ఈ ప్రాజెక్టును అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. నిధులను 18 నెలల్లో ఖర్చు చేయాలి. లేకపోతే కేంద్రం వెనక్కి తీసుకుంటుంది.

ఎస్‌డీజీకి అర్హతల్లేవ్

ఆప్టికల్ ఫైబర్ గ్రౌండ్(ఓపీజీ) వైర్లు వేసేందుకు రూ.240 కోట్ల విలువైన ప్రాజెక్టును ట్రాన్స్‌కో మూడు ప్యాకేజీలుగా విభజించింది. ఒకటో ప్యాకేజీ రూ.90 కోట్లు, రెండో ప్యాకేజీ రూ.80 కోట్లు, మూడో ప్యాకేజీ రూ.70 కోట్లుగా నిర్ధారించి టెండర్లను ఆహ్వానించింది. ఈ మూడు ప్యాకేజీలకు చైనాకు చెందిన రెండు సంస్థలతోపాటు మరికొన్ని కంపెనీలు టెండర్లు దాఖలు చేశాయి. విదేశీ సంస్థలు టెండర్లు దాఖలు చేయాలంటే ప్రత్యేక అర్హతలు ఉండాలి. ఆ విదేశీ సంస్థ భారతదేశంలో కచ్చితంగా ఇన్‌కార్పొరేట్ అయ్యుండాలి. ఆ సంస్థకు భారతదేశంలో అప్పటికే బ్యాంకు ఖాతా ఉండాలి. కాగా, రెండు చైనా సంస్థల్లో సీపీసీ అనే సంస్థకు ఆయా అర్హతలు ఉన్నాయి. ఎస్‌డీజీ అనే మరో చైనా సంస్థ భారతదేశంలో ఇన్‌కార్పొరేట్ కాలేదు. ఇక్కడ బ్యాంకు ఖాతా కూడా లేదు. దాంతో ఆ సంస్థకు టెండర్లలో పాల్గొనే అర్హతలు లేవంటూ ట్రాన్స్‌కో ఇంజినీర్లు టెక్నికల్ బిడ్‌లోనే తేల్చేశారు.

ఇంజినీర్ల అభ్యంతరాలు బేఖాతరు

రాయలసీమకు చెందిన తెలుగుదేశం పార్టీ ఎంపీ రంగంలోకి దిగారు. ఆయన కుటుంబమే ఎస్‌డీజీ కంపెనీ ముసుగులో టెండర్ దాఖలు చేసినట్లు సమాచారం. ఈ టెండర్ తామే దాఖలు చేశామని, అర్హతలు లేకపోయినా అనుమతించాలంటూ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి చేశారు. ట్రాన్స్‌కోలో సర్వం తానై వ్యవహరిస్తున్న ఓ కీలక ఉన్నతాధికారి అందుకు వత్తాసు పలికారు. చివరకు ఇంజినీర్ల అభ్యంతరాలను లెక్కచేయకుండా టీడీపీ ఎంపీ బినామీ సంస్థ ఎస్‌డీజీ టెండర్‌ను అనుమతించారు.

ట్రాన్స్‌కోకు రూ.కోట్లల్లో నష్టం

రూ.90 కోట్ల విలువైన ఒకటో ప్యాకేజీలో సీపీసీ కంపెనీ 11 శాతం తక్కువకు(లెస్) కోట్ చేసింది. ఎల్-1గా తేలిన ఆ సంస్థకే టెండర్ ఖరారైంది. రూ.80 కోట్ల విలువైన రెండో ప్యాకేజీ, రూ.70 కోట్ల విలువైన మూడో ప్యాకేజీలో టీడీపీ ఎంపీ బినామీ అయిన ఎస్‌డీజీ సంస్థ ఎల్-1గా తేలింది. ఆ సంస్థ రెండు ప్యాకేజీలను 5 శాతం తక్కువకు కోట్ చేసింది. నిబంధనల ప్రకారమైతే.. ఒకే రకమైన ప్రాజెక్టుకు వేర్వేరు ప్యాకేజీల కింద టెండర్లు పిలిచినప్పుడు అన్నింటినీ ఒకే ధరకు కేటాయించాలి. ఒకటో ప్యాకేజీలో 11% తక్కువకు టెండర్ ఖరారు చేశారు. అలాగే రెండు, మూడో ప్యాకేజీల్లోనూ 11% తక్కువకే టెండర్ కట్టబెట్టాలి. అందుకు అధికార పార్టీ ఎంపీ ససేమిరా అంటున్నారు. తాము కోట్ చేసిన విధంగా కేవలం 5 శాతం తక్కువకే రెండు ప్యాకేజీలను కట్టబెట్టాలని పట్టుబడుతున్నారు. అది నిబంధనలకు విరుద్ధమని, దానివల్ల ట్రాన్స్‌కోకు రూ.కోట్లల్లో నష్టం వాటిల్లుతుందని అధికారులు చెబుతున్నా ఆయన లెక్కచేయడం లేదు. ట్రాన్స్‌కో కీలక అధికారి కూడా ఎంపీకే అండగా నిలుస్తున్నారు. ఎంపీ బినామీ కంపెనీకి అనుకూలంగా త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

ఓపీజీ వైర్లు అంటే?

ట్రాన్స్‌కో ఆర్‌వైబీ పేరుతో 3 ఫేజుల లైన్లతో రాష్ట్రంలో విద్యుత్తును సరఫరా చేస్తోంది. ఈ 3 ఫేజుల లైన్లతో పాటు మరో ఎర్త్ వైరుతో నాలుగో లైన్‌ను కూడా ఏర్పాటు చేసింది. విద్యుత్తు సరఫరా వ్యవస్థకు పిడుగుల నుంచి రక్షణ కోసం దాన్ని ఏర్పాటు చేశారు. పిడుగులు పడితే ఈ ఎర్త్ వైరు ఆకర్షించి భూమిలోకి పంపుతుంది. ఈ ఎర్త్ వైరు స్థానంలోనే ఆప్టికల్ ఫైబర్ గ్రౌండ్(ఓపీజీ) వైర్లు వేయాలని ట్రాన్స్‌కో తాజాగా నిర్ణయించింది. ఆ ఓపీజీ వైర్లలో ఒక మెటల్ వైరు కూడా ఉంటుంది. దాని చుట్టూ 24 లేయర్లతో ఆప్టికల్ ఫైబర్ వైర్లు ఉంటాయి. 24 లేయర్లు గల ఆప్టికల్ ఫైబర్ వైర్లను ఇతర సంస్థలకు లీజుకు ఇవ్వాలని ట్రాన్స్‌కో యోచిస్తోంది. టెలికాం, ఐటీ సంస్థల డేటా సరఫరాకు ఈ ఓపీజీ వైర్లను వినియోగించుకోవచ్చు. తద్వారా ట్రాన్స్‌కోకు ఆదాయం సమకూరుతుంది. పిడుగులు పడినప్పుడు ఓపీజీ వైర్ల మధ్యలో ఉండే మెటల్ వైరు వాటిని ఆకర్షించి భూమిలోకి పంపుతుంది. ఆ సమయంలో ఓపీజీ వైర్లలోని 24 లేయర్లలో డేటా సరఫరా తాత్కాలికంగా నిలిచిపోతుంది. అనంతరం మళ్లీ యథాతథంగా సరఫరా కొనసాగుతుంది.

సత్యం 'సమాధి'

- టీడీపీ ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు అధికార దుర్వినియోగం
- 'దళితులకు శిరోముండనం' కేసు నుంచి బయటపడేందుకు కుట్ర
- బాధితులు ఎస్సీలు కాదని నిరూపించేందుకు తప్పుడు సాక్ష్యాలు
- పాత సమాధికి కొత్త పేరు..
- కోర్టును తప్పుదోవ పట్టించేందుకు పన్నాగం
- నిజనిర్ధారణ కమిటీ విచారణలో వెలుగు చూసిన వాస్తవాలు
- ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయాలని దళిత సంఘాల డిమాండ్

వెంకటాయపాలెం(రామచంద్రపురం రూరల్):

రెండు దశాబ్దాల క్రితం నాటి కేసు.. ఎలాగైనా బయటపడేందుకు అధికార బలం ప్రయోగించారు. ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి తెచ్చి లొంగదీసుకున్నారు. బాధితుల కులాన్నే మార్చేశారు. వారు దళితులు కాదని నిరూపించేందుకు పాత సమాధికి కొత్త పేరు తగిలించారు. దాన్ని ఫొటో తీసి కోర్టుకు అందజేశారు. అలాగే తప్పుడు ధ్రువీకరణ పత్రాలను కోర్టుకు సమర్పించారు. ఏకంగా న్యాయస్థానాన్నే తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారు. తూర్పు గోదావరి జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యే సాగించిన అరాచకమిది. 18 దళిత సంఘాల నిజనిర్ధారణ కమిటీ విచారణలో వెలుగు చూసిన వాస్తవాలు నివ్వెరపరుస్తున్నాయి.

నిజ నిర్ధారణ కమిటీ వివరాల ప్రకారం... తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం మండలం వెంకటాయపాలెంలో 21 ఏళ్ల క్రితం ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు ఇద్దరు దళితులకు శిరోముండనం చేయించారు. అప్పట్లో ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో తోట త్రిమూర్తులు మూడు నెలలు జైలులో ఉండి వచ్చారు. అప్పటి నుంచీ కేసు కోర్టుల్లో నలుగుతూనే ఉంది. ఏడాదిన్నర కాలంగా విశాఖపట్నంలోని ప్రత్యేక కోర్టులో విచారణ సాగుతోంది. గత ఏడాది అక్టోబర్‌లో తుది తీర్పు ఇచ్చే సమయంలో... కేసు నుంచి బయటపడేందుకు తోట త్రిమూర్తులు కొత్త ఎత్తుగడ వేశారు.

ఎస్సీలు కాదని నిరూపించేందుకు..

కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని శిరోముండనం కేసులో తుది తీర్పు ఇచ్చే సమయంలో బాధితులైన కోటి చినరాజు, దడాల వెంకటరత్నంలను కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో శిరోముండనం బాధితులు అసలు దళితులే కాదని, క్రైస్తవ మతం స్వీకరించారని, 'బీసీ–సి' వర్గానికి చెందినవారని నిరూపించి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నుంచి బయటపడేందుకు ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు పావులు కదిపారు. ఇందులో భాగంగా మండల తహసీల్దార్, గ్రామ వీఆర్‌వోలను సెలవుపై పంపించారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంపై బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. వారికి వెంటనే ఆ పత్రాలు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఈలోగా బాధితులు ఎస్సీలు కాదని, క్రైస్తవ మతం స్వీకరించారంటూ ఎమ్మెల్యే త్రిమూర్తులు గ్రామంలోని తన పాలేరు కాలుకుర్చ జీవరత్నంతో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయించారు. దీనికి సాక్ష్యంగా స్మశానంలో బాధితుడు కోటి చినరాజు తల్లి నాగమ్మ సమాధి అంటూ శిలువ ఉన్న ఒక పాత సమాధి ఫొటోను జత చేశారు. బాధితులు చినరాజు, వెంకటరత్నంలు రామచంద్రపురంలోని ఏసు ప్రేమాలయం చర్చిలో క్రైస్తవ మతం స్వీకరించారని, అందుకు తానే సాక్ష్యమని పాస్టర్ పేరిట ఎస్.శామ్యూల్ రాజు అనే వ్యక్తితో చెప్పించారు. ఆ వివరాలతో బాధితులు క్రైస్తవ మతానికి చెందినవారేనని తహసీల్దార్, ఆర్డీవోలు కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన 18 దళిత సంఘాల నేతలు నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడి తహసీల్దార్‌ను, ఏసు ప్రేమాలయం చర్చి నిర్వాహకులను, గ్రామస్తులను విచారించారు. ఈ విచారణలో వాస్తవాలు బహిర్గతమయ్యాయి.





తన తల్లి సమాధిగా ఫొటోలో చూపించిన సమాధిని పొద్దోకు లక్ష్మి సమాధిగా చూపిస్తున్న శిరోముండనం భాదితుడు కోటి చినరాజు

బాధితులు ఎస్సీలు కాదని నిరూపించేందుకు ఎమ్మెల్యే చేసిన ప్రయత్నాలపై ఫొటోలు, వీడియో సాక్ష్యాలను కమిటీ సభ్యులు సేకరించారు.

బాధ్యులను సస్పెండ్ చేయాలి

వెంకటాయపాలెం గ్రామ స్మశానంలో ప్రొద్దోకు లక్ష్మి క్రైస్తవ మహిళ సమాధి ఉంది. దానిపై శిలువ, ముందు వైపున ఆమె పేరుతో శిలాఫలకం ఉంది. అదే సమాధి వెనుక వైపున కోటి నాగమ్మ పేరిట మరో శిలాఫలకాన్ని అతికించి, దానిని ఫొటో తీసి, జాయింట్ కలెక్టర్ కోర్టుకు సమర్పించారని నిజనిర్ధారణ కమిటీ సభ్యులు గుర్తించారు. అలాగే, శామ్యూల్‌రాజు అనే పాస్టర్ తమ చర్చిలో లేరని ఏసు ప్రేమాలయం చర్చి నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో అధికారుల తీరుపై దళిత సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ప్రలోభాలకు లొంగిపోయి, క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండా దళితులకు అన్యాయం చేసేలా నివేదిక ఇవ్వడం దారుణమని మండిపడుతున్నారు. ఇప్పటికైనా బాధితులకు ఎస్సీ కుల ధ్రువపత్రాలను అందించాలని, అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఎమ్మెల్యే తోట త్రిమూర్తులును పదవి నుంచి తొలగించాలని, తప్పుడు నివేదిక ఇచ్చిన తహసీల్దార్, ఆర్డీవోలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



డాక్టర్ జగదీష్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి

డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డికి బంగారు పతకం

గుంటూరు మెడికల్: గుంటూరు సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి చెందిన డాక్టర్ దుంపా శ్రీకాంత్‌రెడ్డికి బంగారు పతకం లభించింది. తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజ్‌లో ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సమావేశాలు ఈనెల 23 నుంచి 25 వరకు జరిగాయి. ఈ సమావేశాల్లో.. వెన్నుపూసకు సోకే క్షయవ్యాధి, ఇన్‌ఫెక్షన్లు, వాటి నివారణ, శస్త్రచికిత్సలు అనే అంశంపై డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి సమర్పించిన పరిశోధన పత్రం ఉత్తమమైనదిగా ఎంపికైంది. ఈ సందర్భంగా తిరుపతి బర్డ్స్ హాస్పటల్ డైరక్టర్ డాక్టర్ జి.జగదీష్.. శ్రీకాంత్‌రెడ్డికి బంగారు పతకం అందజేశారు. సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ మేనేజింగ్ డైరెక్టర్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, ఇతరు వైద్యులు శ్రీకాంత్‌రెడ్డిని అభినందనలు తెలియజేశారు.

సాంకేతికత రైతులకు చేరువ కావాలి

జాతీయ వ్యవసాయ సృజనాత్మక ప్రాజెక్టుల డైరెక్టర్ డాక్టర్ డి. రామారావు



సదస్సులో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ డి.రామారావు

బాపట్ల: వ్యవసాయ సాంకేతికత రైతులకు మరింత చేరువయ్యేలా వ్యవసాయ ఇంజనీర్లు కృషి చేయాలని జాతీయ వ్యవసాయ సృజనాత్మక ప్రాజెక్టుల డైరెక్టర్ డాక్టరు డి.రామారావు సూచించారు. గుంటూరు జిల్లా బాపట్ల వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రెసిషన్ అగ్రికల్చర్, విలువల జోడింపునకు డిజిటల్, ఇంజినీరింగ్ సాంకేతికతపై జాతీయ సదస్సుతో పాటు రెండురోజుల పాటు జరగనున్న యాంత్రీకరణ ఎక్స్‌పో–2018 సోమవారం ప్రారంభమైంది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టరు డి.రామారావు మాట్లాడుతూ వ్యవసాయాన్ని రైతులకు మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకు మొబైల్ ద్వారా పూర్తి సమాచారాన్ని అందించాలని సూచించారు. ఇఫ్కో వారు కిసాన్ కాల్‌సెంటర్ ద్వారా కేవలం రూ.400తో 20 వేల మంది రైతులకు వ్యవసాయ సూచనలు అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ మాట్లాడుతూ సాయిల్ మ్యాపింగ్ విధానం ద్వారా పొలంలో ఏ ప్రదేశంలో లోపం ఉందో అక్కడే పోషకాలను వాడే విధానాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా పురుగు మందులు పిచికారీ చేయడం, వ్యాధినిర్ధారణపై శ్రద్ధపెడుతున్నట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టరు వల్లభనేని దామోదరనాయుడు చెప్పారు. నీటి సాంకేతిక కేంద్రం డైరెక్టర్ డాక్టర్ మాన్‌సింగ్ నీటియాజమాన్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సదస్సులో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ టి.వి.సత్యనారాయణ, సాంకేతిక విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ డి భాస్కరరావు, వివిధ రాష్ట్రాలకు చెందిన 150 మంది శాస్త్రవేత్తలు ఈ సదస్సులో పాల్గొన్నారు. సమావేశంలో పరిశోధనా ప్రతులతో కూడిన సావనీర్‌ను విడుదల చేశారు.

ఏపీపీఎస్సీ చైర్మన్, కార్యదర్శులను తొలగించాలి

- కమిషన్ పనితీరు అస్తవ్యస్తంగా తయారైంది
- రౌండ్‌టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మండిపాటు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) పనితీరు అస్తవ్యస్తంగా తయారైందని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మండిపడ్డారు. ఏపీపీఎస్సీ చైర్మన్, కార్యదర్శులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిరుద్యోగ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విభజన తర్వాత ఏర్పడిన రాష్ట్రంలో 1.42 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఉద్యోగుల విభజన కమిటీ లెక్క తేల్చిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడిచినా వాటిలో సగం పోస్టులు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. ఏపీపీఎస్సీ హడావిడిగా ఉద్యోగాల భర్తీకి క్యాలెండర్ విడుదల చేసిందని, అయితే దాని ప్రకారం ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయలేదని మండిపడ్డారు. కొత్తగా క్యాలెండర్‌ను రూపొందించి అమలు చేయాలని కోరారు. గ్రూప్–2లోని ఎగ్జిక్యూటివ్ పోస్టులను గ్రూప్ 1లో విలీనం చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. దీని వల్ల గ్రామీణ ప్రాంత అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. పంచాయతీ కార్యదర్శి పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ప్రత్యేకహోదా వస్తే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. హోదా కోసం చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి చేయడం లేదన్నారు. నిరుద్యోగుల సమస్యలపై జేఏసీ చేపట్టే ఆందోళనకు తమ పార్టీ మద్దతిస్తుందని తెలిపారు. సమావేశంలో కె.వి.సుబ్రహ్మణ్యం (నిరుద్యోగ ఐక్యవేదిక), ఎం.రామకృష్ణ (పీడీఎస్‌యూ), సూర్యారావు (డీవైఎఫ్ఐ), డి.అంజిరెడ్డి (వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్), ఫారూఖ్ షుబ్లీ (యూత్ వెల్ఫేర్), బి.ఎస్.కె.అరుణ్‌కుమార్ (నిరుద్యోగ ఐక్యవేదిక) పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు

విజయవాడలో మెట్రో రైలుకు కేంద్రం సిద్ధం

- వాటా నిధులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలి
- బీజేపీ ఆంధ్ర ప్రాంత అభివృద్ధి కమిటీ చైర్మన్ రఘునాథబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా నిధులు ఇచ్చేందుకు ముందుకు వస్తే విజయవాడలో మెట్రో రైలు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని బీజేపీ ఆంధ్ర ప్రాంత అభివృద్ధి కమిటీ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు వెల్లడించారు. ఆ పార్టీ మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి పి.దిలీప్‌తో కలిసి ఆయన సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బెంగుళూరు సిటీలో మెట్రో ఏర్పాటు చేసేందుకు కేంద్రం నిధులు కేటాయించి విజయవాడ మెట్రోకు నిధులు ఇవ్వలేదని రాద్ధాంతం చేస్తున్నారని అక్కడి ట్రాఫిక్, విజయవాడలో ఉన్న ట్రాఫిక్‌కు తేడా లేదా అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా అంశాన్ని వెంకయ్యనాయుడు తెరపైకి తెచ్చేవరకు ఇతర పార్టీ నాయకులు ఎవ్వరూ డిమాండ్ చేయలేదన్నారు. 14వ ఆర్థిక సంఘం సూచన మేరకే కేంద్రం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో రూ.18 లక్షల కోట్లతో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని సీఎం చంద్రబాబు ప్రకటనతో ప్రత్యేక హోదా లేకున్నా పరిశ్రమలు ఏర్పాటవుతాయనే అంశం తేటతెల్లమైందని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా లేకపోవడం వల్ల పరిశ్రమలు రావడం లేదనే ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఇప్పటి వరకు మూడు సార్లు విశాఖలో నిర్వహించిన సన్‌రైజ్ భాగస్వామ్య సదస్సులో రూ.30 లక్షల కోట్లు విలువైన పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఒప్పందాలు కుదిరాయని గుర్తు చేశారు. రాయలసీమకు అన్యాయం జరిగిందని, ఇప్పటి వరకు ఆ ప్రాంతానికి చెందిన వారే ఎక్కువ మంది ముఖ్యమంత్రులుగా పని చేసినా అక్కడి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించలేదన్నారు. రాయలసీమకు 58 ఏళ్లుగా జరిగిన అన్యాయాన్ని రూపుమాపేలా ఈ ప్రాంత అభివృద్ధికి బీజేపీ కృషి చేస్తుందన్నారు. కర్నూలులో హైకోర్టు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కీచక ల్యాబ్ టెక్నీషియన్‌పై ఫిర్యాదు

- లైంగికంగా వేధిస్తున్నాడని పోలీసులను ఆశ్రయించిన విద్యార్థులు
- మెమో ఇచ్చినా సమాధానం ఇవ్వలేదంటున్న ప్రిన్సిపాల్



బాపట్ల: గుంటూరు జిల్లా బాపట్లలోని సరస్వతి స్మారక జూనియర్ కళాశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా (ఎంఎల్‌టీ) పనిచేస్తున్న జి.ఎస్.వి. సుబ్బారావు లైంగికంగా వేధిస్తున్నాడంటూ ఆ కళాశాల విద్యార్థినులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని చర్యలతో తమకు ఇబ్బందిగా ఉందని ఫిర్యాదు చేయడంతో బాపట్ల పట్టణ సీఐ వినయ్‌కుమార్ దర్యాప్తు ప్రారంభించారు. సుబ్బారావు అందుబాటులో లేకపోవడంతో కళాశాలలో అతని ప్రవర్తనపై విచారణ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వేదవతి కథనం ప్రకారం కళాశాలలో ఎంఎల్‌టీగా పనిచేస్తున్న సుబ్బారావు లైంగికంగా విద్యార్థినులను వేధిస్తున్నారంటూ ఈ నెల 16వ తేదీన ఫిర్యాదు అందగా ఆర్ఐఓకు సమాచారం ఇచ్చామన్నారు. ఆయన ఆదేశంతో ఐదుగురు అధ్యాపకులతో విచారణ చేయించి నివేదిక పంపామన్నారు. ఆర్ఐఓ సలహా మేరకు ఈనెల 20వ తేదీన సుబ్బారావుకు మెమో ఇచ్చామని, అతను దానికి సమాధానం ఇవ్వకపోగా, కళాశాలకు కూడా రాలేదని చెప్పారు. ఈ నేపథ్యంలో విద్యార్థినులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. కేసు దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని సీఐ వినయ్‌కుమార్ తెలిపారు. సుబ్బారావు అందుబాటులోకి రాలేదని, అతని కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.

'అభయ' నిధులు వెనక్కి?

- గతేడాది రూ.56 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- ఇంతవరకు పైసా ఖర్చు చేయని రాష్ట్రం
- మల్లగుల్లాలు పడుతున్న అధికారులు

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో మహిళల రక్షణకు ఉద్దేశించిన 'అభయ' పథకానికి కేటాయించిన నిధులను వాపస్ చేసేందుకు కేంద్ర రోడ్డు రవాణా, హైవే మంత్రిత్వ శాఖ (ఎంఓఆర్‌టీహెచ్) యోచిస్తోంది. 2017–2018 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా.. ఇంతవరకు అందుకు సంబంధించిన నిధుల ఖర్చు.. చేపట్టిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో కేంద్రం సీరియస్‌గా ఉంది. మంజూరు చేసిన నిధులను ఖర్చు చేయకపోవడంతో వాటిని వెనక్కు ఇచ్చేసేందుకు ఎంఓఆర్‌టీహెచ్ అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. ఆపదలో ఉండే మహిళల భద్రత కోసం రాష్ట్ర రవాణా శాఖ 'అభయ' అనే నూతన ప్రాజెక్టు చేపట్టేందుకు కేంద్ర సాయాన్ని కోరింది. ఢిల్లీలో జరిగిన నిర్భయ తరహా కేసులు రాష్ట్రంలో ఎక్కడా జరగకుండా.. ఏ సమయంలోనైనా మహిళలు రోడ్లపై స్వేచ్ఛగా ప్రయాణించే విధంగా చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. రాష్ట్రంలో క్యాబ్‌లు, ట్యాక్సీలు, ఆటోల సంఖ్య పెరుగుతుండడంతో వాటిల్లో ప్రయాణించే మహిళలకు అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) ఆధారంగా పోలీస్, రవాణా శాఖలకు సమాచారం చేరవేసే విధంగా రవాణా శాఖ 'అభయ' ప్రాజెక్టును రూపొందించింది. ఇందుకోసం 'అభయ' మొబైల్ యాప్ రూపకల్పన చేయాలి. ఈ ప్రాజెక్టు అమల్లోకి వస్తే క్యాబ్‌లు, ఆటోలతోపాటు ప్రయాణీకులను చేరవేసే ఇతర వాహనాల్లో జీపీఎస్ పరికరాలు అమర్చుకోవాల్సి ఉంటుంది. వీటి కదలికలను రవాణా, పోలీస్ శాఖ కాల్ సెంటర్లు, కంట్రోల్ రూంలు ద్వారా పర్యవేక్షిస్తాయి. మహిళలకు ఏదేని ఇబ్బంది ఎదురైతే మొబైల్ యాప్ నుంచి సంబంధిత వాహనం నెంబరు పంపితే వాహనం ఎక్కడుందో జీపీఎస్ ద్వారా తెలుసుకుని పట్టుకునేందుకు వీలుంటుంది. ఈ ప్రాజెక్టును తొలుత విశాఖ, విజయవాడల్లో అమలుచేయాలని రవాణా శాఖ నిర్ణయించింది.

రూ.100కోట్లతో ప్రతిపాదన

కాగా, ఈ ప్రాజెక్టుకు రూ.వంద కోట్లను కేటాయిస్తే రాష్ట్రంలో ప్రధాన పట్టణాలు, నగరాల్లో దీనిని అమలుచేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. కేంద్రం దీనిని నీతి ఆయోగ్ పరిశీలనకు పంపించింది. నీతి ఆయోగ్ ఇందుకు ఆమోదం తెలపడంతో తొలి విడతగా రూ.56 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధుల్ని ప్రాజెక్టు అమలుకోసం ఖర్చుచేస్తే రెండో విడత నిధులు కేటాయిస్తామని కేంద్రం చెప్పింది. అయితే, ప్రాజెక్టు అమలులో ప్రభుత్వం విఫలమైంది. కనీసం 'అభయ' యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకురాలేదు. ప్రయాణీకుల్ని చేరవేసే వాహనాల్లో డ్రైవర్ల సమాచారం, గుర్తింపు కార్డులను ఓ బోర్డు రూపంలో ఉంచాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసి చేతులు దులుపుకుంది. అంతేకాదు.. రవాణా శాఖలో 291 ఖాళీలను భర్తీ చేసేందుకు గతేడాది మంత్రివర్గం ఆమోదించిందే తప్ప ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. దీంతో ఈ ప్రాజెక్టు నిధులు వెనక్కి వెళ్లకుండా ఎలా అడ్డుకోవాలో తెలియక రాష్ట్ర రవాణా శాఖాధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

వేతన సవరణ సంఘాన్ని నియమించాలి

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం

సాక్షి, అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన 11వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోసెఫ్ సుధీర్‌బాబు, నాగేశ్వరరావులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఏడాది జులై నుంచి ఈ వేతన సవరణను అమలు చేయాల్సి ఉందన్నారు. కమిటీ తన నివేదిక అందించడానికి దాదాపు 15 నెలల సమయం పడుతుందని చెప్పారు. 10వ వేతన సంఘం బకాయిలు కూడా చెల్లించాలన్నారు. జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ ఎంప్లాయిస్, టీచర్స్ వర్కర్స్ అండ్ పెన్షనర్ల(ఏపీ జేఏసీ) రాష్ట్ర సెక్రటరీ జనరల్‌గా సుధీర్‌బాబు ఎన్నికయ్యారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మున్సిపల్ టీచర్ల పదోన్నతులపై మంత్రి హామీ

1200 పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు అవకాశం కల్పించినా మున్సిపల్ టీచర్లకు ఆ ఫలాలు అందడం లేదని, పదోన్నతులు ప్రక్రియ పలు అవాంతరాలతో ఆగిపోతోందని మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లగా ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారని మున్సిపల్ టీచర్ల ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, రవి సిద్ధార్థలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20 మందితో కూడిన ప్రతినిధులతో మంత్రికి విన్నవించామన్నారు. మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి మార్చి 3న విజయవాడ రెవెన్యూ భవన్‌లో సమావేశం ఏర్పాటుచేసినట్లు వారు తెలిపారు.

హామీపత్రాల ఉద్యోగులకు త్వరలో న్యాయం

డీఎస్సీ–2008లో హామీ పత్రాల ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పీఆర్సీ అమలు కొందరికి అయ్యిందని, మిగిలిన వారి వివరాలు వచ్చిన వెంటనే అమలు చేస్తామని ప్రభుత్వ అదనపు ఆర్థిక కార్యదర్శి తమకు హామీ ఇచ్చారని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.రాజేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షుడు ఒంటేరు వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో టీచర్లకు సంబంధించిన పలు సమస్యలపై అధికారులను కలసి వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

● తెలంగాణ

తండ్రితో ఫోన్‌లో మాట్లాడుతూనే దూకేసింది

జీవితంపై విరక్తి చెంది యువతి ఆత్మహత్య

హైదరాబాద్: 'నాన్నా... జీవితంపై బాగా విరక్తి చెందాను.. బతకాలని లేదు.. ప్రేమంటే ఏంటో అంతా అయోమయంగా ఉంది.. ఓదార్చేవారు కరువయ్యారు.. అమాయకురాలిని.. ఈ లోకం విడిచి వెళ్లిపోతున్నా' అంటూ ఒకవైపు తండ్రితో ఫోన్‌లో మాట్లాడుతూనే ఇంజనీరింగ్ విద్యార్థిని నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన వివరాలు ఆలస్యంగా వెలుగు చూశాయి. అండమాన్ నికోబార్ రాజధాని పోర్ట్‌బ్లెయర్ నగరానికి చెందిన షమాదిన్ (21) హైదరాబాద్ షేక్‌పేట నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతుంది. గత ఏడాదిగా తీవ్ర నిరాశ నిస్పృహల మధ్య గడుపుతోంది. శనివారం రాత్రి 9.30కి కళాశాల హాస్టల్ భవనం టెర్రస్ పైకి వెళ్లి తండ్రి దీన్ మహమద్‌తో మాట్లాడుతూ జీవితంపై విరక్తి చెందాను.. తనకు బతకాలని లేదంటూ ఫోన్ విసిరేసి కిందకు దూకేసింది. తీవ్ర గాయాలపాలైన బాధితురాలిని సన్‌షైన్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆందోళనతో అదేరోజు రాత్రి తండ్రి పోర్ట్‌బ్లెయర్ నుంచి బయల్దేరి నగరానికి వచ్చి చూడగా కూతురు విగతజీవిగా కనిపించింది. కూతురి శవాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. కొంతకాలంగా మైగ్రేన్‌తో బాధపడుతున్న విషయాన్ని తనతో చెప్పిందని ఆయన గుర్తు చేసుకున్నారు.

భద్రాచలంలో 38 డిగ్రీలు

- రాష్ట్రవ్యాప్తంగా పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఆదిలాబాద్, నిజామాబాద్‌లలో 37 డిగ్రీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎండల తీవ్రత మొదలైంది. పలుచోట్ల అప్పుడే గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత 24 గంటల్లో భద్రాచలంలో పగటి ఉష్ణోగ్రత సాధారణం కంటే 2 డిగ్రీలు అధికంగా 38 డిగ్రీలు నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం. ఆదిలాబాద్, నిజామాబాద్, రామగుండంలలో గరిష్ట ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. మెదక్, మహబూబ్‌నగర్‌లలో 36 డిగ్రీల చొప్పున రికార్డయ్యాయి. అలాగే పలుచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదు కావడం గమనార్హం. మెదక్‌లో సాధారణం కంటే ఐదు డిగ్రీలు తక్కువగా 13 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. మూడు డిగ్రీలు తక్కువగా హైదరాబాద్, రామగుండంలలో 16, మహబూబ్‌నగర్‌లో 17 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

తాగునీటి సరఫరా ప్రైవేటీకరణ!

గుంటూరు, కాకినాడలో ప్రయోగాత్మకంగా పరిశీలన

సాక్షి, అమరావతి: తాగునీటి సరఫరా వ్యవస్థ ప్రైవేటీకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలుత గుంటూరు, కాకినాడ నగర పాలక సంస్థల్లో తాగునీటి సరఫరా, నిర్వహణ తదితర బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇక్కడ ప్రయోగాత్మకంగా పరిశీలించిన అనంతరం ఇతర చోట్ల కూడా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే అందిన డీపీఆర్‌ను పరిశీలించిన గుంటూరు కలెక్టర్ కోన శశిధర్ కొన్ని మార్పులు చేర్పులు సూచించారు.

గుంటూరు ప్రాథమిక డీపీఆర్ సిద్ధం

గుంటూరులో తాగునీటిని ప్రైవేట్ సంస్థకు అప్పగించేందుకు ఎస్‌జిఐ పుణె స్టూడియో గల్లీ ఇగ్నేరియా ఇండియా సంస్థ రూ.214 కోట్ల అంచనాలతో ప్రాథమికంగా డీపీఆర్ రూపొందించింది. ఆటోమెటిక్ మీటర్ రీడింగ్, ఫిల్టరైజేషన్ ప్లాంట్లు, రిజర్వాయర్లు, పంపిణీ లైన్లు, నీటి కుళాయిల వరకు తాగునీటి సరఫరా పర్యవేక్షించేలా నివేదిక తయారు చేశారు. మంచినీటి సరఫరాకు వినియోగించే మోటార్లు, బల్క్‌ఫ్లో మీటర్లు, ఎనర్జీ మీటర్లు, క్లోరినేషన్ పర్యవేక్షణ బాధ్యతలను టెండర్ పొందిన సంస్థ నిర్వహించనుంది. గుంటూరులో మొత్తం 89,935 నివాస గృహాలున్నాయి. కాకినాడకు సంబంధించి ఎస్జీఐ కన్సల్టెన్సీ రూ.280 కోట్ల అంచనాలతో రూపొందించిన డీపీఆర్‌ను ప్రభుత్వం పరిశీలిస్తోంది.

వ్యాపార ధోరణిపై అభ్యంతరాలు

మునిసిపాల్టీలు, నగరపాలక సంస్థలు తాగునీటికి పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నా ఆశించిన ఆదాయం రావడం లేదు. విజయవాడ, విశాఖపట్నంలో ఆదాయం పెంచుకునేందుకు వాణిజ్య అవసరాలకు వినియోగించే నీటికి మీటర్లు ఏర్పాటు చేశారు. అయితే మౌలిక సదుపాయాల కల్పన బాధ్యత ప్రభుత్వానిదేనని, వ్యాపార దృక్పథం సరికాదని ప్రజలు, రాజకీయ పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేయటంతో వ్యక్తిగత నివాస గృహాలకు మీటర్ల ఏర్పాటు ప్రయత్నాలకు బ్రేక్ పడింది. బహుళ అంతస్తుల భవనాలు, అపార్టుమెంట్లకు మీటర్లను ఏర్పాటు చేసి చార్జీలు వసూలు చేస్తున్నారు.

మున్సిపల్ రహదారుల పక్కన చెట్ల పెంపకం

నివేదికలు రూపొందిస్తున్న గ్రీన్ కార్పొరేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న భవన నిర్మాణాల నుంచి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు చెట్లు, వనాలను పెంచే దిశగా ఏపీ అర్బన్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ప్రణాళికలను రూపొందిస్తోంది. ముఖ్యంగా మున్సిపల్ రహదారులు, కాలనీల్లో చెట్లను పెంచేందుకు నివేదికలను రూపొందిస్తోంది. మాస్టర్ ప్లాన్‌లోని రిక్రియేషన్ జోన్ విస్తీర్ణంలో కనీసం 14 శాతం ప్రాంతాన్ని గ్రీనరీగా అభివృద్ధి చేయాలని సూచిస్తోంది. జాతీయ రహదారులు.. పట్టణాల్లోని ప్రధాన రహదారులకు ఇరువైపులా చెట్ల పెంపకానికి కార్పొరేషన్ కసరత్తు చేస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్ల వెడల్పునకు అనువైన మొక్కలు నాటనున్నారు. కాగా, గ్రీనరీల అభివృద్ధికి అవసరమైతే విదేశీ బ్యాంకుల నుంచి రుణాలను తీసుకునే అంశాన్ని మున్సిపాల్టీలు పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఇప్పటికే గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని మున్సిపాల్టీలు ఇలా రుణాలు తీసుకున్నట్లు తెలిపింది. అలాగే, రాష్ట్రంలోని 110 మున్సిపాల్టీల్లో గ్రీనరీ అభివృద్ధిని ఇంజనీరింగ్ విభాగం చేపట్టాలని, సిబ్బంది కొరత ఉన్న చోట ఈ బాధ్యతను రోడ్లు భవనాల శాఖకు అప్పగించాలని కేంద్రం సూచించింది. కాలనీల్లో ప్రజలను భాగస్వాములను చేసేందుకు కమిటీల ఏర్పాటు కూడా ఉంటుంది.

హోదా సాధనకు ఉత్తరాంధ్ర జాతా



ఉత్తరాంధ్ర అభివృద్ధి జాతా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రతినిధులు

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కేవీ రమణ

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలోని అంశాల అమలు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజి, రైల్వేజోన్ తదితర అంశాలపై ఉత్తరాంధ్ర ప్రజలను చైతన్య వంతుల్ని చేసేందుకు మార్చి ఒకటి నుంచి 'ఉత్తరాంధ్ర అభివృద్ధి జాతా' చేపట్టనున్నట్టు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కేవీ రమణ తెలిపారు. ఈ మేరకు సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో అభివృద్ధి జాతా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పునర్విభజన చట్టంలోని ఏ ఒక్క అంశమూ సంపూర్ణంగా అమలు కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నోరెత్తకపోవడంతో కేంద్రం మరింత అన్యాయానికి బరితెగించిందని వాపోయారు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటుకు స్వయంగా ప్రధానమంత్రి ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, దాన్ని ఇప్పటికీ ప్రకటించకపోవడం దగా చేసినట్లేనని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలంతా సమైక్యంగా నడిస్తేనే న్యాయం జరుగుతుందని, లేకుంటే రాజకీయ ప్రయోజనాలకు మరోసారి బలికాక తప్పదని హెచ్చరించారు. మార్చి ఒకటిన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వద్ద ఉత్తరాంధ్ర అభివృద్ధి జాతా ప్రారంభమై 7వ తేదీన విశాఖ జిల్లా పాయకరావుపేటలో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ అజశర్మ, కోశాధికారి బీబీ గణేష్, ఉత్తరాంధ్ర రక్షణ వేదిక కన్వీనర్ ఎస్.ఎస్.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్

మంగళవారం 27-2-2018 WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
304 ▲	92 ▲
34,446	10,583

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 10.30కి)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	7,385	▲ 47
డోజోన్స్	25,594	▲ 284
ఎఫ్‌టీఎస్ఈ 100	7,290	▲ 45
డాక్స్	12,527	▲ 43
షాంఘై	3,330	▲ 41
నికాయ్	22,154	▲ 261

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	65.40	65.53
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.89	92.07
€	యూరో	ఎస్‌బీఐ	80.77	80.93
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	61.61	61.73
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.67	51.77
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.73	49.83
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.64	18.54
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.01	18.71
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.24	11.74

బ్యాంకింగ్

పీఎన్‌బీ నుంచి రికవరీపై ఎస్‌బీఐ ధీమా

మా డబ్బులు తిరిగొస్తాయి: రజనీష్‌కుమార్



న్యూఢిల్లీ: నీరవ్ మోదీ స్కామ్‌కు సంబంధించి పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) నుంచి రావాల్సిన బకాయిలను రాబట్టుకోగలమని ఎస్‌బీఐ ధీమా వ్యక్తంచేసింది. పీఎన్‌బీ లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌వోయూ) ఆధారంగా తామిచ్చిన 212 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,360 కోట్లు) ఆ బ్యాంకు తిరిగి చెల్లిస్తుందని భావిస్తున్నట్లు ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ చెప్పారు. తమ వంతుగా తమకు రావాల్సిన మొత్తాలను లెక్కవేసి పీఎన్‌బీకి ఇప్పటికే తెలియజేశామని కుమార్ చెప్పారు. ''స్కామ్ మిగతా బ్యాంకులకు విస్తరించకుండా కేవలం పీఎన్‌బీకే పరిమితమవుతుందనే నమ్మకం ఉంది. ఒకవేళ అలాంటిదేదైనా ఉండి ఉంటే ఇప్పటికే బైటికొచ్చేసి ఉండేది. మిగతా బ్యాంకులు ఈ పాటికే తమ పోర్ట్‌ఫోలియోలను సమీక్షించుకుని ఉంటాయి'' అని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయంగా నగదు బదిలీకి ఉపయోగించే స్విఫ్ట్ సాఫ్ట్‌వేర్ ఉపయోగించే విషయంలో తగు భద్రతా చర్యలు తీసుకోవాలని రిజర్వ్ బ్యాంక్ జారీ చేసిన ఆదేశాలను ఏప్రిల్ నాటికల్లా బ్యాంకులు పూర్తి స్థాయిలో అమలు చేసే అవకాశం ఉందని రజనీష్ కుమార్ తెలిపారు. పీఎన్‌బీ స్కామ్ నిర్వహణపరమైన రిస్కుల వల్ల తలెత్తినదే తప్ప.. రుణాల మంజూరుపరమైనది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. పీఎన్‌బీ జారీ చేసిన ఎల్‌వోయూలను ఉపయోగించుకుని వజ్రాభరణాల డిజైనర్ నీరవ్ మోదీ సంస్థలు దాదాపు రూ. 11,400 కోట్ల మేర బ్యాంకులను మోసం చేసిన స్కాం సంగతి తెలిసిందే.

ఈ ఎన్‌బీఎఫ్‌సీలన్నీ హైరిస్క్ ఉన్నవే

నిబంధనలను పాటించడం లేదు ● 9,491 సంస్థలతో జాబితా



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 9,491 నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ) హై రిస్క్ ఉన్నవిగా పేర్కొంటూ కేంద్ర ఆర్థిక శాఖ ఓ జాబితా విడుదల చేసింది. ఇవన్నీ యాంటీ మనీ లాండరింగ్ నిబంధనలను పాటించడం లేదని ఆర్థిక శాఖ పరిధిలోని ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ విభాగం (ఎఫ్ఐయూ) గుర్తించింది. తదనంతరం వీటితో ఓ జాబితాను రూపొందించి దర్యాప్తు సంస్థలను అప్రమత్తం చేసింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఎన్‌బీఎఫ్‌సీలు (కోపరేటివ్ బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు) తమ ఆర్థిక కార్యకలాపాల వివరాలను, లావాదేవీల వివరాలను తప్పనిసరిగా ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ విభాగానికి ఎప్పటికప్పుడు తెలియజేయాల్సి ఉంటుంది. ఈ కంపెనీలకు సంబంధించిన సమాచారాన్ని పరిశీలించిన ఎఫ్ఐయూ ప్రధానంగా ప్రిన్సిపల్ ఆఫీసర్‌ను నియమించాలన్న నిబంధనను పాటించడం లేదని గుర్తించింది. సంబంధిత అధికారి రూ.10 లక్షలకు పైబడిన లావాదేవీలను పరిశీలించి అనుమానాస్పదమైతే వాటి గురించి ఎఫ్ఐయూకి నివేదించాల్సి ఉంటుంది. పెద్ద నోట్ల రద్దు తర్వాత ఈ కంపెనీల లావాదేవీలపై ఎఫ్ఐయూ నిఘా వేసి, పలు మార్గాల నుంచి అందిన సమాచారం ఆధారంగా నిబంధనలు పాటించడం లేదని, హైరిస్క్ ఉన్నవిగా నిర్ధారించి జాబితాను విడుదల చేసింది. ఈ సంస్థలతో లావాదేవీలు నిర్వహించడం ద్వారా నష్టపోవద్దని ప్రజలను అప్రమత్తం చేయడమే ఎఫ్ఐయూ ఉద్దేశం.

ఈ సంస్థల పూర్తి జాబితాను **www.sakshibusiness.com**లో చూడొచ్చు

2014లోనే డిఫాల్టర్‌గా ప్రకటించాం!

- ద్వారకాదాస్‌పై సీబీఐ, ఆర్‌బీఐకి ఫిర్యాదు కూడా చేశాం
- లాభాలపై ప్రభావం ఉండదు: ఓబీసీ ప్రకటన



న్యూఢిల్లీ: ద్వారకాదాస్ ఇంటర్నేషనల్‌ను ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా 2014లోనే ప్రకటించామని ఓరియెంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్ తాజాగా వెల్లడించింది. ఇదే విషయాన్ని సీబీఐతోపాటు, ఆర్‌బీఐకి అప్పుడే నివేదించామని తెలిపింది. రూ.389.85 కోట్ల ఈ స్కామ్ తమ లాభదాయకతపై ఎలాంటి ప్రభావం చూపదని, ఇందుకు సంబంధించిన కేటాయింపులను ఇప్పటికే పూర్తి చేశామని స్పష్టం చేసింది. ద్వారకాదాస్ ఇంటర్నేషనల్‌కు ఇచ్చిన రుణం నిరర్థకంగా, మొండి బకాయిగా 2014 మార్చి 31న మారిందని, ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా ఆ కంపెనీని అదే ఏడాది జూన్ 30న ప్రకటించామని ఓబీసీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలియజేసింది. అమల్లో ఉన్న చట్టాల మేరకు ఈ రుణ ఖాతాలను మోసపూరితమైనవిగా సీబీఐ, ఆర్‌బీఐకి ఫిర్యాదు చేశామని వివరించింది. ఓబీసీ గతంలోనే ఫిర్యాదు చేసినప్పటికీ ద్వారకాదాస్ సేఠ్ ఇంటర్నేషనల్, ఆ కంపెనీ డైరెక్టర్లపై రూ.389.85 కోట్ల రుణ మోసానికి సంబంధించి సీబీఐ ఇటీవలే ఫిర్యాదు నమోదు చేయడం గమనార్హం. ద్వారకాదాస్ కంపెనీ 2007–12 మధ్య కాలంలో ఓబీసీ నుంచి రూ.389 కోట్ల మేర రుణ సదుపాయం పొంది బంగారం, వజ్రాభరణాల కొనుగోలుకు రుణాలిచ్చిన ఇతర సంస్థలకు చెల్లించింది. బంగారం, డబ్బుల్ని కల్పిత లావాదేవీల ద్వారా దేశాన్ని దాటించిందని సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

మార్చి 15 బ్యాంకింగ్ సమ్మె విరమణ

పీఎన్‌బీ కుంభకోణం, బ్యాంకింగ్‌పై అస్పష్ట పరిస్థితుల నేపథ్యం...



వడోదర: మార్చి 15న తలపెట్టిన దేశవ్యాప్త బ్యాంకింగ్ సమ్మె పిలుపును బ్యాంక్ ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక (యూఎఫ్‌బీయూ) విరమించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో భారీ కుంభకోణం, ఈ నేపథ్యంలో బ్యాంకింగ్‌కు సంబంధించి నెలకొన్న అస్పష్ట పరిస్థితుల వంటి అంశాలు సమ్మె పిలుపు విరమణకు కారణమని యూఎఫ్‌బీయూ జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటాచలం పేర్కొన్నారు.

సమావేశ ముఖ్యాంశాలు...

గత వారం చివర్లో సమావేశం అయిన యూఎఫ్‌బీయూ పలు అంశాలను చర్చించిందని సీహెచ్ వెంకటాచలం తెలిపారు. ఈ అంశాలు చూస్తే...

- పీఎన్‌బీలో జరిగిన స్కామ్‌పై లోతుగా విచారణ చేయకుండా, కేవలం దిగువస్థాయి ఉద్యోగులదే దీనికి బాధ్యత అన్నట్లు వారిపై చర్యలు తీసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతుండడం తగదు
- బ్యాంక్ నిర్వహణా వ్యవస్థ సామర్థ్యం తగిన విధంగా లేదన్నది సమావేశం అభిప్రాయం. నియంత్రణ, పర్యవేక్షణ, నిర్వహణ వంటి అంశాల్లో పూర్తి నిర్లక్ష్యం ఉందన్న విషయాన్ని ఎవ్వరూ దాచిపెట్టలేరు. పీఎన్‌బీ ఉన్నతాధికారులతోసహా వివిధ అత్యున్నత స్థాయిల్లో నైతికత లోపిస్తోంది. ఆయా పరిస్థితులు అన్నింటిపై సమగ్ర సమీక్ష జరిపి, బ్యాంకింగ్ పటిష్టతకు చర్యలు అవసరం.
- ఆర్‌బీఐ పర్యవేక్షణా వ్యవస్థ పాత్ర కూడా స్పష్టం కావాల్సి ఉంది.

మార్కెట్లోకి శామ్‌సంగ్ గెలాక్సీ ఎస్ 9, ఎస్ 9 ప్లస్



బార్సిలోనా: దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజ కంపెనీ 'శామ్‌సంగ్' తాజాగా గెలాక్సీ ఎస్ 9, ఎస్ 9 ప్లస్ స్మార్ట్‌ఫోన్లను ఆవిష్కరించింది. హై–ఎండ్ స్మార్ట్‌ఫోన్ విభాగంలో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకోవాలనే లక్ష్యంతో కంపెనీ వీటిని తీసుకువస్తోంది. అయితే కంపెనీ వీటి ధరను మాత్రం ప్రకటించలేదు. ఈ స్మార్ట్‌ఫోన్స్ వివిధ మార్కెట్లలో మార్చి 16 నుంచి అందుబాటులోకి వస్తాయి. ఇక శామ్‌సంగ్ కంపెనీ వచ్చే నెలలో ఈ స్మార్ట్‌ఫోన్లను భారత మార్కెట్‌లో ఆవిష్కరించే అవకాశముంది.

ప్రత్యేకతలివీ..

ఎస్ 9 స్మార్ట్‌ఫోన్‌లో 5.8 అంగుళాల స్క్రీన్, 4 జీబీ ర్యామ్, 64 జీబీ/128 జీబీ/256 జీబీ మెమరీ, 3,000 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ప్రత్యేకతలుంటాయని కంపెనీ తెలిపింది. ఇక ఎస్ 9 ప్లస్‌లో 6.2 అంగుళాల స్క్రీన్, 6 జీబీ ర్యామ్, 64 జీబీ/128 జీబీ/256 జీబీ మెమరీ, 3,500 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్లు ఉంటాయని పేర్కొంది. ఇక రెండు స్మార్ట్‌ఫోన్లలోనూ ఓరియో ఆపరేటింగ్ సిస్టమ్, వైర్‌లెస్ చార్జింగ్, బయోమెట్రిక్ అథంటికేషన్స్ (ఫింగర్‌ప్రింట్ స్కానర్, ఫేస్ ఐడెంటిఫికేషన్, ఐరిస్ స్కానర్), 8 ఎంపీ ఫ్రంట్ కెమెరా, 12 ఎంపీ రియర్ కెమెరా, కెమెరా యాప్‌లో ఆటోమేటిక్ ట్రాన్స్‌లేటర్ సదుపాయం, ఏఆర్ ఇమోజీలు, స్మార్ట్ థింగ్ యాప్ వంటి పలు ప్రత్యేకతలున్నాయని వివరించింది. ఇక భారతీయ కస్టమర్లు ఎస్ 9, ఎస్ 9 ప్లస్ స్మార్ట్‌ఫోన్లను రూ.2,000 అడ్వాన్స్‌తో శామ్‌సంగ్ వెబ్‌సైట్‌లో ప్రి–బుకింగ్ చేసుకోవచ్చు.

నోకియా కొత్త స్మార్ట్‌ఫోన్లు..



బార్సిలోనా: మొబైల్ హ్యాండ్‌సెట్స్ తయారీ కంపెనీ 'హెచ్ఎండీ గ్లోబల్' తాజాగా ఇక్కడ జరుగుతోన్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో నాలుగు కొత్త స్మార్ట్‌ఫోన్లను ఆవిష్కరించింది. నోకియా 8 సిరోకో, నోకియా 7 ప్లస్, కొత్త నోకియా 6, నోకియా 1 అనేవి ఇందులో ఉన్నాయి. వీటి ధర రూ.6,800– రూ.60,000 శ్రేణిలో ఉంది. ఇక కంపెనీ అలాగే తన 22 ఏళ్ల ఫీచర్ ఫోన్ నోకియా 8110ను 4జీ సర్వీసులతో రీలాంచ్ చేసింది. దీని ధర దాదాపు రూ.6,300 (పన్ను మినహా) ఉండొచ్చు. సరికొత్త నోకియా 8110 ఫోన్‌ను మే నెలలో భారత్‌లో ఆవిష్కరిస్తామని కంపెనీ అధికార ప్రతినిధి తెలిపారు. నోకియా 8 సిరోకో, నోకియా 7 ప్లస్, న్యూ నోకియా 6 స్మార్ట్‌ఫోన్లు ఆండ్రాయిడ్ వన్ ప్లాట్‌ఫామ్‌పై పనిచేస్తాయి. ఇవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని సపోర్ట్ చేస్తాయి. దాదాపు రూ.60,000 ధర కలిగిన నోకియా 8 సిరోకో ఫోన్‌లో 5.5 అంగుళాల స్క్రీన్, 3 డీ కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 5, డ్యూయెల్ రియర్ సెన్సార్స్ వంటి ఫీచర్లుంటాయని కంపెనీ తెలిపింది. నోకియా 7 ప్లస్ ధర దాదాపు రూ.32,000 ఉండొచ్చు. ఇందులో 6 అంగుళాల స్క్రీన్, 12 ఎంపీ ప్రైమరీ కెమెరా, 13 ఎంపీ సెకండరీ కెమెరా, 3,800 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్లుంటాయని కంపెనీ పేర్కొంది. ఇక కొత్త నోకియా 6, నోకియా 1 హ్యాండ్‌సెట్ల ధర వరుసగా దాదాపు రూ.23,000, రూ.6,800 ఉండొచ్చు.

కేజీ డి-6లో రూ.26,000 కోట్ల పెట్టుబడులు

మూడు గ్యాస్ క్షేత్రాలను అభివృద్ధి చేయనున్న ఆర్ఐఎల్–బీపీ

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్రిటిష్ పెట్రోలియం (బీపీ)సంయుక్తంగా కేజీ డి–6 బ్లాక్ పరిధిలో 4బిలియన్ డాలర్లు (రూ.26,000 కోట్లు) ఇన్వెస్ట్ చేసే క్షేత్ర స్థాయి అభివృద్ధి ప్రణాళికలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రో కార్బన్స్ (డీజీహెచ్) అధ్యక్షతన గల మేనేజింగ్ కమిటీ సోమవారం ఆమోదం తెలిపింది. తూర్పు తీరంలో ఇవి ఇన్వెస్ట్ చేయనున్నాయని, వీటితో 20 ఎంఎంఎస్సీఎండీల గ్యాస్ అదనంగా అందుబాటులోకి వస్తుందని డీజీహెచ్ ప్రకటన తెలిపింది. కేజీ డి–6కు ఆర్ఐఎల్ ఆపరేటర్‌కాగా, బ్రిటన్‌కు చెందిన బీపీకి 30%, కెనడాకు చెందిన నికో రీసోర్సెస్‌కు 10% వాటాలు కలిగి ఉన్నాయి. మరోవైపు ఎంజే, ఆరు శాటిలైట్ క్షేత్రాల అభివృద్ధికి సంబంధించి క్షేత్ర స్థాయి అభివృద్ధి ప్రణాళికలకు కూడా ఆమోదం లభించింది. కేజీ డి–6 పరిధిలో ఉత్పత్తిని తిరిగి సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు రూ.40,000 కోట్లను ఇన్వెస్ట్ చేయనున్నట్టు ఆర్ఐఎల్, బీపీ గతేడాది జూన్‌లో ప్రకటించాయి. 2020–22 నాటికి రోజువారీ ఉత్పత్తిని 30–35 మిలియన్ క్యూబిక్ మీటర్లకు తీసుకెళ్లాలన్నది ఈ సంస్థల లక్ష్యం.

కేజీ డి-5లో ఉత్పత్తి ఆలస్యం: ఓఎన్‌జీసీ



కృష్ణా గోదావరి (కేజీ) బేసిన్ పరిధిలోని డి–5 బ్లాక్‌లో ఉత్పత్తి 2019 జూన్ నాటికి ప్రారంభించడం సాధ్యం కాదని ఓఎన్‌జీసీ స్పష్టం చేసింది. దీనికి ప్రభుత్వ విధానాల్లో మార్పులే కారణమని పేర్కొంది. జీఎస్టీ రావడం, స్థానిక కొనుగోలు ప్రాధాన్య నిబంధన, ప్రభుత్వ రంగ సంస్థలు దేశీయంగానే ఐరన్, స్టీల్‌ను సమీకరించుకోవాలన్న నిబంధనలను అవరోధాలుగా పేర్కొంది. ముఖ్యంగా స్థానిక కొనుగోలు ప్రాధాన్య నిబంధనల వల్ల ఉత్పత్తి ఆలస్యం కావచ్చంటూ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది. కేజీ డి–5 బ్లాక్‌లో నిక్షేపాలను వెలికితీసేందుకు గాను 5.07 బిలియన్ డాలర్లను ఇన్వెస్ట్ చేసే ప్రణాళికకు ఓఎన్‌జీసీ బోర్డు 2016 మార్చిలో ఆమోదం తెలిపింది. అయితే, గతేడాది మే నెలలో కేంద్ర కేబినెట్ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో తయారీని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థలు మౌలిక ప్రాజెక్టుల కోసం దేశీయంగానే ఐరన్, స్టీల్‌ను సమకూర్చుకోవాలన్నది ఆ నిర్ణయం. కేజీ డి–5 పరిధిలో ఉత్పత్తి జాప్యం కావడం వాస్తవానికి ఇది రెండోసారి. 2014 నాటి ఓఎన్‌జీసీ ప్రణాళిక ప్రకారం ఈ ఏడాది చమురు, వచ్చే ఏడాది గ్యాస్ ఉత్పత్తి ప్రారంభం కావాలి.

స్టార్టప్‌లు లిస్టింగ్‌కు రావాలి

ఎన్ఎస్ఈ ఎండీ పిలుపు



న్యూఢిల్లీ: స్టార్టప్‌లు ఒక స్థాయికి వచ్చిన తర్వాత స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావాలని ఎన్ఎస్ఈ కోరింది. లిస్టింగ్ కారణంగా లిక్విడిటీ పెరుగుతుందని, ఈ స్టార్టప్‌ల్లో ఇన్వెస్ట్ చేసిన ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ వైదొలగడానికి వీలవుతుందని న్ఎస్ఈ ఎండీ, సీఈఓ విక్రమ్ లిమాయే చెప్పారు. స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ కారణంగా విస్తృతమైన క్యాపిటల్ మార్కెట్ తోడ్పాటు స్టార్టప్‌లకు లభిస్తుందని వివరించారు. మ్యూచువల్ ఫండ్స్, విదేశీ ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు పెడతాయని వివరించారు. ఒకటి రెండు సంవత్సరాల్లో చాలా స్టార్టప్‌లు లిస్టయ్యే అవకాశాలున్నాయని ఆయన అంచనా వేస్తున్నారు.

ఎయిర్‌టెల్ 'గ్లోబల్' భాగస్వామ్యం


ఇన్–ఫ్లైట్ కనెక్టివిటీ సర్వీసుల కోసం జట్టు



దేశీ దిగ్గజ టెలికం కంపెనీ 'భారతీ ఎయిర్‌టెల్' తాజాగా మొబైల్ యూజర్లు విమాన ప్రయాణం చేసేటప్పుడు వారికి శాటిలైట్ టెక్నాలజీ ద్వారా అంతరాయం లేని, హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పించేందుకు (ఇన్–ఫ్లైట్ కనెక్టివిటీ సర్వీసుల కోసం) అంతర్జాతీయ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ గ్లోబల్ అలయన్స్‌లో వన్‌వెబ్ (సాఫ్ట్‌బ్యాంక్ ఇన్వెస్ట్ చేసిన శాటిలైట్ స్టార్టప్), ఎయిర్‌బస్ (అమెరికాకు చెందిన ఎయిర్‌లైన్ సంస్థ), డెల్టా (అమెరికాకు చెందిన ఎయిర్‌లైన్ సంస్థ), గోగో (ఇన్–ఫ్లైట్ బ్రాడ్‌బాండ్ ప్రొవైడర్), స్ప్రింట్ (అమెరికాకు చెందిన టెలికం సంస్థ), భారతీ ఎయిర్‌టెల్ (భారత్‌కు చెందిన టెలికం సంస్థ) భాగస్వాములుగా ఉన్నాయి. ఈ సంస్థలన్నీ ఇన్–ఫ్లైట్ కనెక్టివిటీ సేవల కోసం సంయుక్తంగా పనిచేస్తాయి.

రూ.11 లక్షల కోట్ల రుణాల లక్ష్యం సాధ్యమే

- రైతుల ఆదాయం రెట్టింపునకు ఉపకరిస్తుంది
- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ వ్యాఖ్య



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2018–19) ప్రాధాన్య రంగాలకు బ్యాంకులు రూ.11 లక్షల కోట్ల రుణాలివ్వాలనే లక్ష్యం ఆచరణ సాధ్యమేనని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ చెప్పారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. నాబార్డ్ బోర్డు సమావేశం సోమవారం ఢిల్లీలో జరిగింది. ఈ సందర్భంగా జైట్లీ మాట్లాడుతూ... వ్యవసాయ రంగంలోకి నిధుల రాకను పెంచే దీర్ఘకాలిక సాధనాల్లో బ్యాంకింగ్ రంగం తప్పకుండా ఇన్వెస్ట్ చేయాలని సూచించారు. ఫైనాన్షియల్ టెక్నాలజీలో గత కొన్ని సంవత్సరాల్లో చేసిన పెట్టుబడులతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సమర్థత, వేగం, పారదర్శకత సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థిక శాఖ కార్యదర్శి రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ... అధిక వృద్ధి సాధనకు అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే ఆర్థిక సేవల విస్తృతితోపాటు టెక్నాలజీలను అమలు చేయడం అవసరమని సూచించారు.

వ్యాలెట్లకు గడువు రేపటి వరకే

- కేవైసీ వివరాలివ్వకుంటే పనిచేయవు!
- గడువు పొడిగించేది లేదు: ఆర్‌బీఐ



ముంబై: ప్రీపెయిడ్ వ్యాలెట్లు (పేటీఎం, మొబిక్విక్, ఓలా మనీ, అమెజాన్ పే తరహా) తమ కస్టమర్లకు సంబంధించిన కేవైసీ వివరాలు ధ్రువీకరించేందుకు ఇచ్చిన గడువు ఫిబ్రవరి 28గానే ఉంటుందని, దీన్ని పొడిగించేది లేదని ఆర్‌బీఐ సోమవారం స్పష్టం చేసింది. ''కేవైసీ మార్గదర్శకాల అమలుకు కావాల్సినంత వ్యవధి ఇచ్చాం. గడువులోపు కేవైసీకి సంబంధించిన వివరాలు సమర్పించని కస్టమర్లు ఆందోళన చెందక్కర్లేదు. వ్యాలెట్లలో ఉన్న బ్యాలన్స్‌ను సరుకుల కొనుగోలుకు, సేవలకు వినియోగించుకోవచ్చు. వ్యాలెట్ తిరిగి రీచార్జ్ చేసుకోవాలంటే కేవైసీ నిబంధనలు పాటించాలి'' అని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ బీపీ కనుంగో స్పష్టంచేశారు. లావాదేవీల భద్రతా, కస్టమర్ల రక్షణ కోసమే ఈ నిబంధన అమలు చేస్తున్నట్టు కనుంగో చెప్పారు. బ్యాంకులు ప్రమోట్ చేసిన 50 వ్యాలెట్లతోపాటు నాన్ బ్యాంకింగ్ ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్లు 55 వరకు ప్రస్తుతం మనదేశంలో ఉన్నాయి. కేవైసీ నిబంధనలు అమలు చేసేందుకు ఈ సంస్థలకు గతేడాది డిసెంబర్ 31 వరకు తొలుత గడువు ఇచ్చారు. తర్వాత దీన్ని ఈ నెల 28కి పొడిగించారు. నిజానికి ఈ నిబంధన వ్యాలెట్ సంస్థలను కలవరపరిచేదే. ఎందుకంటే 90 శాతం కస్టమర్లు కేవలం ఫోన్ నంబర్, ఈ మెయిల్ వివరాలతోనే వీటి సేవలను వినియోగించుకుంటున్నారు. మొబైల్ ఫోన్లకు కేవైసీ అమలు చేస్తున్నందున దాన్నే పరిగణనలోకి తీసుకుంటే పోతుందిగా అన్నది ప్రీపెయిడ్ పేమెంట్ వ్యాలెట్ల పరిశ్రమ అభిప్రాయం.

ఫోర్టిస్ హెల్త్‌కేర్

మరో సత్యం కానుందా?

వాటాదారుల అనుమతి లేకుండానే నిధుల మళ్లింపు

- పూర్తి వివరాలివ్వాలంటూ సెబీ నోటీసులు
- దీనికోసం ఇచ్చిన గడువు సోమవారంతో ముగింపు
- ఫలితాల కోసం 28 వరకూ గడువు అడిగిన ఫోర్టిస్
- భారీ కుంభకోణం బయటపడొచ్చు: ఇన్ గవర్న్



ఫోర్టిస్ హెల్త్‌కేర్ వ్యవహారం చూస్తుంటే భారీ కుంభకోణమేదో బయటపడుతుందన్న భయాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ర్యాన్‌బాక్సీతో అంచెలంచెలుగా ఎదిగి దాని విక్రయంతో బిలియనీర్ సింగ్ సోదరులుగా ఖ్యాతిగాంచిన మల్వీందర్ సింగ్, శివిందర్ సింగ్‌లు స్థాపించిన ఫోర్టిస్ హెల్త్‌కేర్‌లో పలు పరిణామాలు వేగంగా జరిగిపోతున్నాయి. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల వరుస రాజీనామాలు, తరచుగా రీస్ట్రక్చరింగ్‌లు జరగటమే కాక... తాజాగా ఢిల్లీ హైకోర్టు కూడా ఈ ప్రమోటర్లకు చెందిన రెండు హోల్డింగ్ కంపెనీల ఆస్తుల్ని జప్తు చేయటం గమనార్హం. ఈ వరుస పరిణామాలతో ఇప్పటికే ఇన్వెస్టర్ల నమ్మకాన్ని కోల్పోయిన ఈ సంస్థ వారి సంపదను కూడా భారీగా హరించేసింది. ట్రెజరీ ఆపరేషన్లలో భాగంగా సెక్యూర్డ్ షార్ట్ టర్మ్ ఇన్వెస్ట్‌మెంట్ పేరిట రూ.473 కోట్ల నిధులను కొల్లగొట్టిన బోర్డ్.. ఈ నిధులను సింగ్ సోదరుల ఇతర కంపెనీలకు బదలాయించేసిందనే ఆరోపణలు కొనసాగడం చూస్తుంటే ఫోర్టిస్ హెల్త్‌కేర్ మరో సత్యం కానుందని అనిపిస్తున్నట్లు 'మనీలైఫ్' పత్రిక పేర్కొంది.

ఇది మామూలు మళ్లింపు కాదు: ఇన్‌గవర్న్

నిధులను ఇతర కంపెనీలకు మళ్లించడం అనేది పలు కంపెనీలలో తరచుగా జరిగేదే అయినప్పటికీ ఇక్కడ జరుగుతున్న తరలింపు మాత్రం సత్యం, యూబీ గ్రూప్ తరహాలోనే ఉందని... ప్రాక్సీ వోటింగ్ అడ్వైజరీ సంస్థ ఒకటి అభిప్రాయపడింది. బెంగళూరుకు చెందిన ఇన్‌గవర్న్ రీసెర్చ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ తెలిపిన సమాచారం మేరకు కంపెనీ ప్రమోటర్లకు చెందిన పూర్తి అనుబంధ సంస్థల ద్వారా నిధులు మళ్లిపోగా.. ఇందుకు సంబంధించి షేర్‌హోల్డర్ల అనుమతి తీసుకోలేదని తెలిసింది. నియంత్రణ సంస్థలకు ఎటువంటి సమాచారం లేకుండానే అనుబంధ సంస్థలు సంబంధిత వ్యక్తులకు రుణాలను మంజూరీ చేశాయి. మరోవైపు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ... నిధులకు సంబంధించిన విషయాలపై ఫోర్టిస్ హెల్త్‌కేర్ బోర్డ్ తమకు పూర్తి సమాచారం అందించాలని ఆదేశించి.. ఇందుకు ఈ నెల 26వ తేదీని (ఫిబ్రవరి, 2018) గడువుగా నిర్ణయించింది. ఒక కంపెనీ సంబంధిత వ్యక్తులకు రుణాలను జారీ చేయటం కంటే ముందే వాటాదారుల అనుమంతి పొందాల్సి ఉంటుందని కంపెనీల చట్టం 2013, ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ చెబుతుండగా ఈ నిబంధనను ఫోర్టిస్ హెల్త్‌కేర్ అనుబంధ సంస్థలు పూర్తిగా విస్మరించాయి. కంపెనీ ఆర్థిక ఫలితాలను కూడా సమయానికి వెల్లడించకుండా రెలిగేర్ హెల్త్ ట్రస్ట్ ఆస్తులను విలీనం చేసుకోవడంలో నిమగ్నమైపోయిన ఫోర్టిస్ హెల్త్‌కేర్ బోర్డ్.. ఫిబ్రవరి 13న సమావేశం అయినప్పటికీ ఇదే నెల 28 వరకు అనుమతి పొందిందే తప్ప ఫలితాలను ఇప్పటికీ ప్రకటించక లేదు. ఇదంతా చూస్తుంటే స్కామ్ భారీ స్థాయిలోనే జరిగి ఉంటుందనే ఊహాగానాలకు మరింత బలం చేకూరుతోంది. కంపెనీకి అనుబంధంగా ఉన్న ఫోర్టిస్ హాస్పిటల్స్ ద్వారా గతేడాదిలో నిధుల మళ్లింపు జరిగిందని, అప్పుడు కూడా షేర్ హోల్డర్ల అనుమతి లేకుండానే ఇదంతా జరిగిపోయిందని వెల్లడించిన ఇన్‌గవర్న్ రీసెర్చ్.. ఇలాంటి నిర్ణయాలు ఫోర్టిస్‌లో సర్వసాధారణంగా మారిపోయాయని తెలియజేసింది. సెక్యూర్డ్ షార్ట్ టర్మ్ ఇన్వెస్ట్‌మెంట్ రూపంలో కొల్లగొట్టిన మొత్తాన్ని బ్యాలెన్స్ షీటులో ఆస్తుల వైపు కరెంట్ లోన్స్ రూపంలో చూపించాల్సి ఉండగా.. కన్సాలిడేటెట్ బ్యాలెన్స్ షీటులో నగదు కింద ఈ మొత్తాన్ని చూపింది. ఇది గతేడాదిలో రూ.142 కోట్లు ఉండగా.. ఇప్పుడు ఈమొత్తం రూ.544 కోట్లుగా ఉందని, ఇంతగా పెరగడం అనేది అకౌంటింగ్ స్టాండర్డ్స్‌కు విరుద్ధమని వివరించింది.

గతంలో ఫోర్టిస్ హెల్త్‌కేర్ దారి మళ్లించిన నిధులు

- 2010లో ఫోర్టిస్ మారిష్ అనే 100% అనుబంధ సంస్థ ద్వారా పార్క్‌వే హోల్డింగ్స్ సింగపూర్‌లో 25% వాటాను కొనుగోలుచేసింది.
- ఎఫ్‌సీసీబీ మార్గంలో రూ.647 కోట్లను సమీకరించి అదే సమయంలో ఫోర్టిస్ మారిషస్‌కు రూ.395 కోట్ల రుణాన్ని ఇచ్చింది.
- పార్క్‌వే హోల్డింగ్స్‌లో వాటాను పెంచడం కోసం ఆర్‌హెచ్‌సీ హెల్త్‌కేర్ బిడ్ దాఖలు చేసింది.
- తొలుత ఆర్‌హెచ్‌సీ హెల్త్‌కేర్‌లో ఫోర్టిస్ మారిషస్‌కు 49 శాతం, ప్రమోటర్లకు 51 శాతం వాటా ఉండగా.. ఇది క్రమంగా 100 శాతానికి పెరిగిపోయింది.
- రెండు సార్లు పేర్లు మార్చడం ద్వారా చివరకు ఆర్‌హెచ్‌సీ హెల్త్‌కేర్ కాస్తా ఫోర్టిస్ హెల్త్‌కేర్ ఇంటర్నేషనల్‌గా మారింది.
- 2010–11 సమయంలో ఫోర్టిస్ ఇంటర్నేషనల్ ద్వారా ఫోర్టిస్ ప్రమోటర్లు 6 విదేశీ ఆస్తులను కొనుగోలు చేశారు.
- ఈ మొత్తం వ్యవహారంలో ఫోర్టిస్ మారిషస్‌కు ఇచ్చిన రూ.395 కోట్లకు లెక్కలు లేకుండా పోయాయి.
- ఇప్పటికీ ఇంటర్‌నేషనల్‌కు 4.4 శాతం వడ్డీ, ఎఫ్‌సీసీబీపై 5 శాతం వడ్డీ చెల్లిస్తూనే ఉండడం కొసమెరుపు.
- ఇంతటి స్థాయిలో నిధుల మళ్లింపులు జరుగుతుండడం, ఇదే సమయంలో ఉన్నట్టుండి వరుసగా డైరెక్టర్లు రాజీనామాలు చేయడం చూస్తుంటే అతి త్వరలోనే ఫోర్టిస్‌లో భారీ కుంభకోణం బయటపడనుందని ఇన్‌గవర్న్ రీసెర్చ్ అంచనావేస్తోంది.

దైచీ ఆర్బిట్రేషన్‌లో కొత్త మలుపు!


ఆర్‌హెచ్‌సీ హోల్డింగ్స్, ఆస్కార్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆస్తుల జప్తుకు ఆదేశాలు

న్యూఢిల్లీ: జపాన్ ఫార్మా దిగ్గజం– దైచీ శాంక్యో గెలిచిన రూ.3,500 కోట్ల ఆర్బిట్రేషన్ కేసు అమలు దిశలో కొత్త పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే పీకల్లోతు కష్టాల్లో ఉన్న ర్యాన్‌బాక్సీ లేబొరేటరీస్ ఒకప్పటి ప్రమోటర్లు– మల్వీందర్ సింగ్, శివేందర్ సింగ్‌లకు చెందిన రెండు హోల్డింగ్ కంపెనీలు– ఆర్‌హెచ్‌సీ హోల్డింగ్స్, ఆస్కార్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు చెందిన ఆస్తుల్ని జప్తు చేయాలని ఢిల్లీ హైకోర్టు సోమవారం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జయంత్ నాథ్ వారెంట్లు జారీ చేశారు. తనఖాలో లేని ఆస్తుల జాబితాను 10 రోజుల్లో అందజేయాలని– సోదరులు మల్వీందర్ సింగ్, శివేందర్ సింగ్‌లతో పాటు మరో 10 మందికి న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కేసు తదపరి విచారణను మార్చి 23వ తేదీకి వాయిదా వేశారు. అప్పటి వరకూ వేతనాలు, చెల్లించాల్సిన బకాయిలకు మినహా మిగిలిన కార్యకలాపాలు దేనికీ ఆర్‌హెచ్‌సీ హోల్డింగ్స్ తన బ్యాంక్ ఖాతాలోని సొమ్మును వినియోగించరాదని సైతం ఢిల్లీ హైకోర్టు స్పష్టంచేసింది. సింగ్ సోదరులు, ఈ కేసుకు సంబంధం ఉన్నవారు తమ స్థిర, చర ఆస్తులను అమ్మడం కానీ, బదలాయించడం కానీ చేయరాదని ఇంతక్రితమే ఢిల్లీ హైకోర్టు ఆదేశాలిచ్చింది.




నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	మిర్చి (వరంగల్, తేజ)	పసుపు (నిజామాబాద్, కొమ్ము)	ఉల్లి (కర్నూలు)	చక్కెర (కృష్ణా)	బియ్యం (కరీంనగర్)	కందిపప్పు (కృష్ణా)	సుబాబులు (కృష్ణా)	ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)
--	--	--	--	రూ.3,600	రూ. 3,800 (హెచ్ఎంటీ)	రూ.7,200	రూ.4,400 (టన్నుకు)	--
--	--	--	--					





కలరా వ్యాక్సిన్‌కు డబ్ల్యూహెచ్‌వో అనుమతి

SHANTHA A SANOFI COMPANY

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సనోఫీకి చెందిన వ్యాక్సిన్ విభాగం సనోఫీ పాశ్చర్ అనుబంధ సంస్థ శాంతా బయోటెక్నిక్స్ అభివృద్ధి చేసిన ఓరల్ కలరా వ్యాక్సిన్ షాన్‌కాల్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతినిచ్చింది. దీంతో 40 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో గరిష్టంగా 14 రోజుల వరకూ దీన్ని వినియోగించుకునే వీలుంటుందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

పీఎఫ్‌సీ డివిడెండ్ రూ.1.80

వచ్చే నెల 7న రికార్డ్ డేట్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రెండో మధ్యంతర డివిడెండ్‌గా ఒక్కో షేర్‌కు రూ.1.80 చెల్లించనుంది. ఈ మేరకు సోమవారం జరిగిన సమావేశంలో తమ డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని పీఎఫ్‌సీ పేర్కొంది. రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేర్‌కు రూ.1.80 డివిడెండ్‌ను చెల్లించనున్నట్లు తెలియజేసింది. ఈ డివిడెండ్‌ను చెల్లించడానికి అర్హత గల ఇన్వెస్టర్లను నిర్ణయించడానికి వచ్చే 7ను రికార్డ్ తేదీగా నిర్ణయించామని వెల్లడించింది. వచ్చే నెల 27లోపు డివిడెండ్ చెల్లింపులు జరుగుతాయి. గత ఏడాది నవంబర్‌లో ఈ కంపెనీ ఒక్కో షేర్‌కు రూ.6 చొప్పున తొలి మధ్యంతర డివిడెండ్‌ను చెల్లించింది. డివిడెండ్ వార్తల నేపథ్యంలో బీఎస్‌ఈలో పీఎఫ్‌సీ షేర్ 2.6 శాతం లాభంతో రూ.110.55 వద్ద ముగిసింది.

10,500 పైకి నిఫ్టీ

జీడీపీపై ఆశావహ అంచనాలు

- సానుకూలముగా అంతర్జాతీయ సంకేతాలు
- మూడు వారాల గరిష్టానికి సూచీలు
- 304 పాయింట్ల లాభంతో 34,446కు సెన్సెక్స్
- 92 పాయింట్లు పెరిగి 10,583కు నిఫ్టీ



భారత ఆర్థిక రికవరీపై ఆశావహ అంచనాలు సోమవారం స్టాక్ మార్కెట్‌ను లాభాల బాట పట్టించాయి. సానుకూల అంతర్జాతీయ సంకేతాలు కూడా తోడవడంతో స్టాక్ సూచీలు వరుసగా రెండో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభాల్లో ముగిశాయి. స్టాక్ సూచీలు మూడు వారాల గరిష్టానికి చేరాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 304 పాయింట్ల లాభంతో 34,446 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 92 పాయింట్ల లాభంతో 10,583 పాయింట్ల వద్ద ముగిశాయి. సెన్సెక్స్ వరుసగా రెండో ట్రేడింగ్ సెషన్‌లోనూ 300 పాయింట్లకు పైగా లాభపడడం విశేషం. గత శుక్రవారం సెన్సెక్స్ 323 పాయింట్లు పెరిగిన విషయం తెలిసిందే. రియల్టీ, వాహన, క్యాపిటల్ గూడ్స్, బ్యాంకింగ్, మౌలిక, లోహ, విద్యుత్, ఆయిల్, గ్యాస్, పీఎస్‌యూ, కన్సూమర్ డ్యూరబుల్స్ రంగాల షేర్లు లాభపడ్డాయి. డాలర్ బలహీన పడడం, తాజాగా హెచ్ వన్ వీసాలపై వివాదం రేగడంతో ఐటీ, టెక్నాలజీ షేర్లు నష్టపోయాయి. ఫార్మా షేర్లు కూడా జత కలిశాయి.

క్యూ3లో 7 శాతం వృద్ధి: ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో భారత జీడీపీ 7%గా ఉండొచ్చని, భారత ఆర్థిక వృద్ధి రికవరీ జోరు మొదలైందని మోర్గాన్ స్టాన్లీ తాజా నివేదిక వెల్లడించడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కు జోష్‌నిచ్చింది. జీడీపీ గణాంకాలు రేపు (బుధవారం) వెల్లడవుతాయి. బాండ్ ఈల్డ్స్ తగ్గడంతో శుక్రవారం అమెరికా స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగియడం, ఈ దన్నుతో ఆసియా మార్కెట్లు లాభపడడం కలిసివచ్చింది. సెన్సెక్స్ 34,226 పాయింట్ల వద్ద లాభాల్లో ఆరంభమైంది. కొనుగోళ్ల జోరుతో ఇంట్రాడేలో 341 పాయింట్ల లాభంతో 34,483 పాయింట్ల గరిష్ట స్థాయి తాకింది. మార్కెట్ ఇప్పుడిప్పుడే పుంజుకుంటోందని, సానుకూల అంతర్జాతీయ సంకేతాలు తోడ్పాటునందిస్తున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	3,459
ఎన్‌ఎస్‌ఈ (ఈక్విటీ)	29,176
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	4,29,229
ఎఫ్ఐఐ	-1,120
డీఐఐ	1,409

సెన్సెక్స్ షేర్ల లావాదేవీల చార్జీలు రద్దు!

సెన్సెక్స్ షేర్లకు లావాదేవీల చార్జీలను రద్దు చేస్తున్నట్లు బీఎస్‌ఈ తెలిపింది. ఆర్థికంగా పటిష్టంగా ఉన్న కంపెనీల్లో రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడులను ప్రోత్సహించడానికి సెన్సెక్స్ షేర్లకు లావాదేవీల చార్జీలను వచ్చే నెల 12 నుంచి రద్దు చేస్తున్నామని బీఎస్‌ఈ పేర్కొంది.

పేలవంగా ఆస్టర్ డీఎమ్ హెల్త్‌కేర్ లిస్టింగ్

5 శాతం నష్టంతో ముగింపు



న్యూఢిల్లీ: ఆస్టర్ డీఎమ్ హెల్త్‌కేర్ కంపెనీ సోమవారం స్టాక్ మార్కెట్లో పేలవంగా లిస్టయింది. ఇష్యూ ధర, రూ.190తో పోల్చితే 4 శాతం నష్టంతో రూ.182 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో 7 శాతం నష్టంతో రూ.176 వద్ద కనిష్ట స్థాయిని తాకింది. చివరకు 5.3 శాతం నష్టంతో రూ.180 వద్ద ముగిసింది. ఇక ఎన్‌ఎస్‌ఈలో ఈ షేర్ 4.4 శాతం నష్టంతో రూ.182 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో 18.26 లక్షల షేర్లు, ఎన్‌ఎస్‌ఈలో కోటికి పైగా షేర్లు ట్రేడయ్యాయి. సోమవారం ట్రేడింగ్ ముగిసేనాటికి కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.9,086.5 కోట్లుగా నమోదైంది. ఈ నెల 12–15 మధ్య వచ్చిన ఈ ఐపీఓ 1.33 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయింది. ఈ కంపెనీ భారత్, ఫిలిప్పైన్స్, జోర్డాన్, జీసీసీ దేశాల్లో హాస్పిటల్స్‌ను నిర్వహిస్తోంది.

చెన్నై ప్లాంటులో బీఎండబ్ల్యూ తొలి గ్రాన్ టురిస్మో



ముంబై: దేశీ రెండో అతిపెద్ద లగ్జరీ కార్ల తయారీ కంపెనీ 'బీఎండబ్ల్యూ' తాజాగా తన చెన్నై ప్లాంటులో తొలి 6 సిరీస్ గ్రాన్ టురిస్మో కారు 'బీఎండబ్ల్యూ 630ఐ గ్రాన్ టురిస్మో స్పోర్ట్ లైన్'ను తయారు చేసింది. ఇది పెట్రోల్ వేరియంట్ రూపంలో కస్టమర్లకు అందుబాటులో ఉంటుంది. ఇక డీజిల్ వెర్షన్‌ను ఈ ఏడాది చివరి కల్లా మార్కెట్‌లోకి తెచ్చే అవకాశముంది. కంపెనీ ఇటీవల గ్రేటర్ నోయిడాలో జరిగిన ఆటో ఎక్స్‌పోలో గ్రాన్ టురిస్మో కారును ఆవిష్కరించడం తెలిసిందే. 'చెన్నై ప్లాంటులో తొలి బీఎండబ్ల్యూ 6 సిరీస్ గ్రాన్ టురిస్మో కారును తయారు చేయడం సంతోషంగా ఉంది. లగ్జరీ కారు విభాగంలో ఈ మోడల్ కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తుంది' అని చెన్నై ప్లాంటు మేనేజింగ్ డైరెక్టర్ జోకెన్ స్టాల్కాంప్ తెలిపారు. కాగా కంపెనీ తన 3 సిరీస్, 3 సిరీస్ గ్రాన్ టురిస్మో, 5 సిరీస్, 6 సిరీస్ గ్రాన్ టురిస్మో, 7 సిరీస్, ఎక్స్1, ఎక్స్3, ఎక్స్5 వంటి మోడళ్లను చెన్నై ప్లాంటులోనే తయారు చేస్తోంది.

వాట్సాప్ లీక్ నివేదిక సమర్పించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్



న్యూఢిల్లీ: ఆర్థిక ఫలితాలు వాట్సాప్ ద్వారా లీక్ అయిన విషయంలో సవివరమైన నివేదికను సెబీకి సమర్పించామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తెలిపింది. ఆర్థిక ఫలితాలు అధికారికంగా వెల్లడి కాకముందే వాట్సాప్‌లో లీక్ అయిన విషయంలో విచారణ జరిపి నివేదికను అందజేయాల్సిందిగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను సెబీ గతవారం ఆదేశించిన విషయం తెలిసిందే. కార్పొరేట్ గవర్నెన్స్‌కు సంబంధించి అత్యున్నత ప్రమాణాలను పాటిస్తున్నామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పేర్కొంది.

ఎనిమిదిన్నరేళ్ల కనిష్టానికి పీ-నోట్ల పెట్టుబడులు

సెబీ కఠిన నిబంధనలే కారణం

న్యూఢిల్లీ: మన స్టాక్ మార్కెట్లో గత నెలలో పీ–నోట్ల (పార్టిసిపేటరీ నోట్ల) పెట్టుబడులు ఎనిమిదిన్నరేళ్ల కనిష్ట స్థాయి అయిన రూ.1.19 లక్షల కోట్లకు పడిపోయాయి. పీ-నోట్ల దుర్వినియోగాన్ని నియంత్రించడానికి మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ కఠినమైన నిబంధనలను తేవడమే దీనికి ప్రధాన కారణమని నిపుణులు పేర్కొన్నారు. నేరుగా నమోదు చేసుకోకుండానే మన దేశంలో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న విదేశీ ఇన్వెస్టర్లకు సెబీ వద్ద నమోదైన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు పీ–నోట్లను జారీ చేస్తారు. ఇక సెబీ గణాంకాల ప్రకారం...



- ఈక్విటీ, డెట్, డెరివేటివ్స్ విభాగాల్లో గత ఏడాది డిసెంబర్ నాటికి రూ.1,24,810 కోట్లుగా ఉన్న పీ–నోట్ల పెట్టుబడులు ఈ ఏడాది జనవరిలో రూ.1,19,556 కోట్లకు పడిపోయాయి.
- 2009, ఆగస్టు తర్వాత ఇదే కనిష్ట స్థాయి. ఆ నెలలో పీ నోట్ల పెట్టుబడులు రూ.1,10,355 కోట్లుగా ఉన్నాయి.
- గత ఏడాది డిసెంబర్‌లో మొత్తం విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల్లో 3.8 శాతంగా ఉన్న పీ–నోట్ల పెట్టుబడులు ఈ ఏడాది జనవరిలో 3.5 శాతానికి తగ్గాయి.
- పీ–నోట్ల నిబంధనలను సెబీ కఠినతరం చేయడంతో గత ఏడాది సెప్టెంబర్‌లో పీ–నోట్ల పెట్టుబడులు ఎనిమిదేళ్ల కనిష్ట స్థాయికి పడిపోయాయి. అక్టోబర్‌లో పుంజుకున్నప్పటికీ, నవంబర్‌లో మళ్లీ పడిపోయాయి. ఇక ఈ ఏడాది జనవరి వరకూ ఇదే పోకడ కొనసాగింది.

స్విట్జర్లాండ్ టూరిజం సీఈవోగా మార్టిన్



ముంబై: స్విట్జర్లాండ్ టూరిజం నూతన సీఈవోగా మార్టిన్ నైడిగర్ నియమితులయ్యారు. సంస్థలో ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబర్‌గా 2008 నుంచి ఆయన సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం బిజినెస్ డెవలప్‌మెంట్ బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. ప్రాధాన్యత క్రమంలో తమకు భారత్ 7వ ర్యాంకులో ఉందని ఈ సందర్భంగా మార్టిన్ వ్యాఖ్యానించారు. 2017లో భారత్ నుంచి స్విట్జర్లాండ్‌కు వెళ్లిన పర్యాటకుల సంఖ్య 25 శాతం పెరిగింది. మూడేళ్లలో ఇది 33 శాతానికి చేరుతుందని అంచనా వేస్తున్నట్టు ఆయన చెప్పారు.

మెర్సిడెస్ నుంచి అప్‌డేటెడ్ ఎస్-క్లాస్

ప్రారంభ ధర రూ.1.33 కోట్లు



న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల దిగ్గజం 'మెర్సిడెస్ బెంజ్' తాజాగా అప్‌డేటెడ్ ఎస్–క్లాస్‌ను భారత్ మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. ఇది ఎస్ 350 డీ (డీజిల్), ఎస్ 450 (పెట్రోల్) అనే రెండు వేరియంట్లలో కస్టమర్లకు అందుబాటులో ఉంటుంది. వీటి ధరలు వరుసగా రూ.1.33 కోట్లు, రూ.1.37 కోట్లుగా ఉన్నాయి. ఎస్ 350 డీ అనేది భారతదేశపు తొలి బీఎస్–6 వెహికల్ అని మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈవో రొనాల్డ్ ఫోల్గర్ చెప్పారు. దీన్ని దేశీయంగానే తయారుచేశామన్నారు.

క్యూ3లో జీడీపీ వృద్ధి 7% : మోర్గాన్‌స్టాన్లీ



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) డిసెంబర్ త్రైమాసికంలో 7%గా ఉంటుందని అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం– మోర్గాన్‌స్టాన్లీ అంచనావేసింది. ఈ మేరకు ఒక నివేదికను విడుదల చేసింది. ముఖ్యాంశాలు చూస్తే....

- పరిశ్రమలు, సేవల రంగాల్లో మంచి వృద్ధే నమోదయినా, వ్యవసాయం నిరాశ పరిచే వీలుంది. కార్పొరేట్ రెవెన్యూ ధోరణి మెరుగుపడవచ్చు.
- ఆటో, ద్విచక్ర వాహన విక్రయాలు భారీగా పెరిగే అవకాశం ఉంది. అయితే దీనికి బేస్ ఎఫెక్ట్ కారణం కావచ్చు.
- భారత్ ఎగుమతులు పెరుగుతుండడం ఆర్థిక వ్యవస్థకు కలిసివచ్చే అంశం.
- భారత్ జీడీపీ మొదటి త్రైమాసికంలో మూడేళ్ల కనిష్ట స్థాయి 5.7%కి పడిపోయింది. అటు తర్వాత త్రైమాసికంలో 6.3%గా నమోదయ్యింది.

బులియన్ రూ.లలో



ముంబై	
బంగారం (99.9, 10గ్రా)	30,750
బంగారం (99.5, 10గ్రా)	30,600
వెండి (కిలో)	38,610
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	– –
బంగారం (22 క్యారెట్లు)	29,270
వెండి (కిలో)	--
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	30,730
బంగారం (22 క్యారెట్లు)	29,270
వెండి (కిలో)	41,700
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	31,500
బంగారం (22 క్యారెట్లు)	29,150
వెండి (కిలో)	39,900
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	31,887
బంగారం (22 క్యారెట్లు)	29,230
వెండి (కిలో)	41,000
విజయవాడ (శనివారం ధరలు)	
బంగారం (24 క్యారెట్లు)	31,500
బంగారం (22 క్యారెట్లు)	29,150
వెండి(కిలో)	39,600
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	31,650
బంగారం (22 క్యారెట్లు)	29,270
వెండి (కిలో)	39,700

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.00కు	శుక్రవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	64.02	$63.55
బ్రెంట్	67.41	$67.04

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 27-2-2018

విశాఖ	350–00
చిత్తూరు	388–00
వరంగల్	357–00
ముంబై	400–00
చెన్నై	395–00
విజయవాడ	348–00
గోదావరి	348–00
నమక్కల్	380–00
26–2–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	355–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.15
బెంగళూరు	385–00
కోల్‌కతా	398–00
ఢిల్లీ	365–00

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	415.05	406.5
AMBUJA CEME	262.95	260.2
ASIAN PAINT	1104.8	1101.8
AXIS BANK L	552.3	536.65
BAJAJ AUTO	3008.7	2986.4
BAJAJ FINAN	1674.95	1633.4
BHARTI AIRT	423.15	425.55

A B C D

20 MICRONS	50.85	51.85
3M INDIA LI	20691.65	20733.8
5PAISA CAPI	370.5	370.6
63 MOONS TE	95.2	94.05
8K MILES SO	750.95	753.45
A AND M JUM	65.05	65.05
AARTI DRUGS	609.15	613.15
AARTI INDUS	1144.85	1170.4
AARVI ENCON	98	98
ABAN OFFSHO	174.45	173
BANSWARA SY	116	115.6
BASF INDIA	2056.3	2026.65
BATA INDIA	726.25	718.2
BAYER CROPS	3899.7	3831.75
BEARDSELL L	57.25	54.75
BEML LIMITE	1251.45	1232.5
BERGER PAIN	247.05	245.85
BETA DRUGS	150.1	152
BF INVESTME	332.8	328.9
BF UTILITIE	454.5	448.9
BGR ENERGY	119.3	118.9
BHAGERIA IN	302.25	295.95
BHANSALI EN	170.35	168.6
BHARAT BIJL	1520.5	1442.25
DIC INDIA L	517	516.25
DILIP BUILD	953.25	962.2
DISH TV IND	73.35	74.25
DISHMAN CAR	340.2	329.35
DIXON TECHN	3365.75	3285.45
DOLLAR INDU	440.5	420.3
DOLPHIN OFF	93.8	92.15
DONEAR IND.	61.5	62.7
DR. LAL PAT	909.55	905.6
DYNAMATIC T	1910.2	1947.65
DYNEMIC PRO	200.25	201.95

E F G H

GUJ STATE F	131	128.2
GUJ. APOLLO	225.75	217
GUJARAT ALK	761	748.55
GUJARAT AMB	254.95	243.55
GUJARAT FLU	773.05	777.1
GUJARAT GAS	863.25	855.1
GUJARAT MIN	140.7	141.35
GUJARAT PIP	144.75	142.25
GUJARAT STA	201.45	199.25
GULF OIL LU	999.25	985.5
GULSHAN POL	80.3	79.95
HARITA SEAT	944.7	954.1
HARRISON MA	85.1	83.15
HATSUN AGRO	773.2	775.45
JBM AUTO LI	441.5	440.85
JET AIRWAYS	766.25	745.45
JET FREIGHT	102	100
JET KNITWEA	117.4	115.5
JHS SVEND.	67.6	67.85
JIND POL IN	62.8	62.75
JINDAL DRIL	167.7	170.55
JINDAL PHOT	65.15	65
JINDAL POLY	358.75	357.2
JINDAL SAW	142.2	138.7
JINDAL STAI	105.25	101.95
JINDAL STAI	193.15	183.05
JINDAL STEE	267.45	265
JINDAL WORL	631.45	620.35
MAN INFRA L	56.85	56.4
MANAKSIA LT	60.1	55.25
MANAPPURAM	109.4	108.25
MANG.CHEM.F	67.4	68.15
MANGALAM CE	330.75	331.9
MANGALAM DR	165.1	162.35
MANPASAND B	383.85	387.9
MANUGRAPH I	52.4	51.2
MARATHON NX	521.4	486.25
MAS FINANCI	599.85	601
MASTEK LTD	505.55	503.3
MATRIMONY.C	846.35	847.65
MAWANA SUGA	61.2	62
MAX FINANCI	509	498
PG ELECTROP	307.05	310.2
PHILIPS CAR	1165.25	1190.15
PI INDUSTRI	891.7	837.55
PIONEER DIS	186.55	185.55
PLASTIBLEND	200.1	191.4
PNB HOUSING	1224.65	1215.4
PNC INFRATE	164.5	166.6
PODDAR HOUS	1190	1150
PODDAR PIGM	284.55	282.05
POKARNA LIM	213.45	206.45
POLY MEDICU	247.65	254.35
POLYPLEX CO	495.4	493.7
PONNIE SUGA	168.3	168.5
POWER MECH	952.35	931.1
SHALBY LIMI	223.7	224.5
SHALIM PAIN	169.3	172.45
SHANKARA BL	1693.1	1704.6
SHANTHI GEA	143.9	143.75
SHARDA CROP	416.4	395.85
SHARDA MOTO	2234.75	2258.4
SHEELA FOAM	1570.3	1600.05
SHEMAROO EN	530.2	524.45
SHILPA MEDI	457.6	450.35
SHIPPING CO	73.9	73.1
SHIRPUR GOL	151.55	153.4
SHIVA TEXYA	550.4	551.95
SHIVAM AUTO	80.7	79.2
SHOPPERS ST	532.45	527.9
THE HI-TECH	440.05	444.45
THE INDIA C	160.5	158.05
THE INDIAN	132.85	131.45
THE MANDHAN	136.6	136.05
THE NEW IND	712.9	705
THE PHOENIX	583.1	569.05
THE RAMCO C	731.55	718.3
THE RUBY MI	330.7	330.6
THE STATE T	157.55	152.35
THE TINPLAT	238.85	234.55
THEMIS MEDI	538.7	539
THERMAX LTD	1167.5	1153.5
THIRUMALAI	2056.55	2027.6
THOMAS COOK	245.5	236.3

I J K L | M N O P | R S T U | V W X Z

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

బీఎస్‌ఈలో ఎస్ఎంఈ షేర్లు

సాక్షి ఎఫెక్ట్..

● చిన్నారి కీర్తనకు గుండె ఆపరేషన్ చేయడానికి హైదరాబాద్‌లోని స్టార్ హాస్పిటల్ యాజమాన్యం ముందుకొచ్చింది. వైఎస్సార్‌జిల్లా రాజుపాళెం మండలం, పొట్టిపాడుకు చెందిన 11 నెలల చిన్నారి కీర్తన ఆరోగ్య పరిస్థితిపై ఈ నెల 24న సాక్షిలో 'చిన్ని గుండెకు పెద్ద కష్టమొచ్చింది' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై పలు ఆస్పత్రి యాజమాన్యాలు స్పందించాయి.

హోదాతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

- అన్ని పార్టీలు కలసి పోరాడాలి..
- హోదా పదేళ్లు తెస్తామని మోసం చేసిన బాబు, మోదీ
- రాయలసీమలో హైకోర్టు, ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి
- సాక్షి మీడియా 'ప్రత్యేక హోదా' సదస్సులో వక్తలు



చర్చావేదికలో మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు

సాక్షి, కడప: ఎన్నికలకు ముందు తిరుపతి బహిరంగసభ వేదికగా మోదీ, చంద్రబాబు, వెంకయ్య నాయుడు రాష్ట్రానికి పదేళ్లు ప్రత్యేక హోదా తీసుకొస్తామని ప్రకటించి.. నేడు దీనిపై మాటమార్చి ప్రజలను మోసం చేశారని వక్తలు మండిపడ్డారు. హోదాతోనే రాష్ట్రానికి భవిష్యత్తు అని నేతలు ఉద్ఘాటించారు. సోమవారం వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోని హరిత హోటల్‌లో సాక్షి మీడియా గ్రూప్ 'హోదా మన హక్కు–ప్యాకేజీ మనకొద్దు' నినాదంతో చర్చావేదిక నిర్వహించింది. సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వైఎస్సార్ జిల్లాకు చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, విద్యావంతులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అసోసియేషన్, విద్యార్థులు, రిటైర్డ్ ఉద్యోగులు హాజరయ్యారు. ప్రత్యేక హోదా విషయంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్రం రెండూ దొందూ దొందేనని అభిప్రాయపడ్డారు. ఇన్నాళ్లు ప్రత్యేక హోదా సంజీవిని కాదు.. అంతకుమించి ప్యాకేజీ వస్తుందని ప్రచారం చేసిన చంద్రబాబు మళ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో హోదా నినాదం ఎత్తుకుని కొత్త నాటకానికి తెరతీశారని పలువురు విమర్శించారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావాలన్నా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాలన్నా ప్రత్యేక హోదా ఆవశ్యకత ఎంతైనా ఉందని హాజరైన వారు ముక్తకంఠంతో చెప్పారు.

హోదా ఇచ్చే పార్టీలకే వైఎస్సార్‌సీపీ మద్దతు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే పార్టీలకే కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తుందని, ఈ విషయంలో వెనక్కి తగ్గేదే లేదని పార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు కె.సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తేల్చి చెప్పారు. తమ పార్టీ అధినేత ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ప్రత్యేక హోదా కోసం మొదటి నుంచీ పోరాటం చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. వెనుకబడిన రాయలసీమలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే అడ్డంకులు సృష్టించారని, ఇప్పుడు చట్టంలో పేర్కొన్నప్పటికీ కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యున్నతమైన పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీల్లో ఒకటైన ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం బాధాకరమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అభిప్రాయపడ్డారు. హోదా సాధన కోసం ఎంతవరకైనా వస్తామని జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యురాలు కమలమ్మ చెప్పారు. ప్రత్యేక హోదాతో సమానంగా నిధులు ఇస్తున్నామని, అయితే టీడీపీ సర్కార్ బహిర్గతం చేయడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పుష్పాల శ్రీనాథరెడ్డి స్పష్టం చేశారు. రాయలసీమలో హైకోర్టు, ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. హోదా సాధనలో టీడీపీ వైఫల్యం చెందిందని, పైగా టీడీపీ, బీజేపీ నాయకులు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి విమర్శించారు.

కౌన్సిల్ భేటీకి మద్యం తాగొచ్చాడు

- గొల్లప్రోలు చైర్మన్ మాణిక్యం తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం
- చర్యలు తీసుకోవాలని డిమాండ్


వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్ చిన్నారావుకు వేలు చూపిస్తూ వెకిలిగా మాట్లాడుతున్న మాణిక్యం

గొల్లప్రోలు (పిఠాపురం): పట్టణ ప్రథమ పౌరుడిగా ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన ఆ వ్యక్తి పూటుగా మద్యం సేవించి కౌన్సిల్ సమావేశానికి వచ్చాడు. ప్రజా సమస్యలపై కౌన్సిలర్లు, అధికారులతో చర్చించి, పట్టణాభివృద్ధికి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన సమావేశంలో అతడు ప్రవర్తించిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉంది. తాగిన మైకంలో సమావేశంలో ఆయన చేసిన వెకిలి చేష్టలు, వింత ప్రవర్తనతో కౌన్సిలర్లు, అధికారులు నివ్వెరపోయారు. ఆయన మాట్లాడుతుంటే వచ్చిన మద్యం దుర్వాసనతో మహిళా కౌన్సిలర్లు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ప్రతిపక్ష కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక.. బ్యాలెన్స్ తప్పుతూ, తూలిపడుతూ ఆయన మాట్లాడిన తీరు రోడ్డుపై తాగుబోతుల చేష్టలను తలపించింది. చైర్మన్ శీరం మాణిక్యం అధ్యక్షతన తూర్పు గోదావరి జిల్లా గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశం సోమవారం నిర్వహించారు. నగర పంచాయతీ సిబ్బంది అజెండాలో అంశాలను చదివే సమయంలో.. చైర్మన్ మాణిక్యం వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ తెడ్లపు చిన్నారావు వైపు ఎగతాళిగా చూస్తూ.. ''మీరేదో అడగాలనుకుంటున్నారు. అడగలేకపోయారా? మీ పని వచ్చిన దగ్గర నుంచి అడగడమే కదా!'' అంటూ వెకిలిగా మాట్లాడారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, వెలికి నవ్వుతో తూలనాడనారంభించారు. దీంతో వైఎస్సార్ సీపీకి చెందిన మహిళా కౌన్సిలర్ గొల్లపల్లి వెంకట అచ్యుతాంబ తీవ్రంగా మండిపడ్డారు. ''సమావేశానికి తాగి వస్తారా? అంటూ నిలదీశారు. తాగి సమావేశానికి వచ్చిన చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని కమిషనర్ రామ్మోహన్‌ను కోరారు. పలు సమస్యలపై వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ ప్రశ్నలు సంధించడంతో అదుపు తప్పిన చైర్మన్ బల్ల చరుస్తూ తానే పట్టణాన్ని అభివృద్ధి చేశానంటూ ఇష్టానుసారం మాట్లాడారు. సభ అదుపు తప్పడంతో టీడీపీ కౌన్సిలర్ల సూచన మేరకు సమావేశాన్ని వాయిదా వేశారు. దీనిపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు నగర పంచాయతీ కార్యాలయం బయట నిరసన తెలిపారు. సమావేశాన్ని ఎందుకు వాయిదా వేశారో చెప్పాలని కమిషనర్‌ను నిలదీశారు.

● తూర్పు గోదావరి జిల్లా కొత్తపల్లి మండలం అమీనాబాద్ శివారులో ఉన్న మినీ హార్బర్ నిర్మాణ స్థలాన్ని సోమవారం జపాన్‌కు చెందిన వ్యవసాయ, మత్స్య, అటవీ మంత్రిత్వ శాఖ అధికార బృందం సభ్యులు పరిశీలించారు. మత్స్యకారులు వేటాడే వలలు, బోట్లను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

- చిత్తూరు జిల్లా తుంబూరు సమీపంలో ఘటన
- శ్రీవారి దర్శనానికి తిరుమల వస్తుండగా ప్రమాదం

నారాయణవనం: చిత్తూరు జిల్లా నారాయణవనం మండలం తుంబూరు గ్రామ సమీపంలో కడప–చెన్నై హైవేపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించారు. ఆర్టీసీ బస్సు, మహేంద్ర జైలో వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో జైలో డ్రైవర్ కన్నదాసన్ (26), ఆముదవల్లి (30) ఘటనా స్థలంలోనే మరణించగా శకుంతలమ్మ (53) తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. మృతులు చెన్నైలోని హస్తినాపురానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఇటీవల వివాహమైన సతీష్ తన తల్లి శకుంతల, భార్య అముదవల్లితో పాటు సమీప బంధువు ఉళగనాధన్, అతని భార్య తమిళరసితో కలిసి మహేంద్ర జైలో వాహనంలో తిరుమలకు బయల్దేరారు. తుంబూరు సమీపంలో తిరుమల నుండి చెన్నైకి వెళ్తున్న ఆర్టీసీ బస్సు, జైలో ఒకదానికొకటి ఢీకొన్నాయి. డ్రైవర్ కన్నదాసన్‌తో పాటు అతని వెనుకనే కుర్చున్న అముదవల్లి వాహనంలో ఇరుక్కుని మృతి చెందారు. తీవ్ర గాయాలైన సతీష్ (33), అతని తల్లి శకుంతలను తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ శకుంతల సోమవారం సాయంత్రం మృతి చెందింది. మిగిలినవారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పుత్తూరు సిఐ కొండయ్య, ఎస్ఐ దస్తగిరి సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నాలుగు రోజుల్లో రెండు దూడలు జననం

శ్రీకాకుళం జిల్లాలో సంఘటన


రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు

సారవకోట: ఒకే ఈతలో రెండు దూడలు పుట్టడం సహజం. కానీ ఓ ఆవు నాలుగు రోజుల వ్యవధిలో రెండు దూడలను ఈని ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ సంఘటన శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం బద్రి గ్రామంలో చోటుచేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన బగ్గ ప్రభాకర రావు ఇటీవల నారాయణవలస సంతలో రూ. 17 వేలకు చూడి ఆవును కొనుగోలు చేశాడు. ఈ ఆవుకు బుధవారం రాత్రి ఆడ దూడ పుట్టింది. అలాగే ఆదివారం సాయంత్రం మరో మగ దూడ పుట్టడంతో గ్రామస్తులంతా ఆశ్చర్యపోయారు. కవల దూడలు పుట్టడం చూశామని, కానీ ఇలా నాలుగు రోజుల వ్యవధిలో దూడల జననం ఇప్పటి వరకూ చూడలేదని చెబుతున్నారు. ఈ విషయాన్ని కొమ్ముసరియాపల్లి పశువైద్యులు సిగలపల్లి అనీల్ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా.. యద కాలంలో రెండు అండాలు ఒకే సమయంలో వేర్వేరుగా ఫలదీకరణ చెందడం వల్ల రెండు గర్భకోశాల్లో (ఊంబ్) రెండు దూడలు రోజుల వ్యవధిలో జన్మిస్తాయన్నారు.

భార్య చేతిలో భర్త హతం!

మెడకు తాడు బిగించి హత్య

తగరపువలస (భీమిలి): తాళి కట్టిన భర్తను భార్య హతమార్చిన సంఘటన సోమవారం ఇక్కడ జరిగింది. దీనికి సంబంధించి మృతుని సోదరులు తెలిపిన వివరాలిలా.. విశాఖ జిల్లా భీమిలి మండలం కొత్త మూలకుద్దుకు చెందిన కొయ్య అప్పలస్వామి (38)కి 2003లో ధనలక్ష్మితో వివాహమైంది. వీరి మధ్య తరచూ వివాదాలు జరుగుతుండేవి. చాలాసార్లు పెద్దల సమక్షంలో పంచాయతీలు జరిగినా వీరిలో మార్పురాలేదు. ఆదివారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. సోమవారం ఉదయం 5 గంటల సమయంలో ధనలక్ష్మి తన ఇంటి సమీపంలో ఉన్న అత్తింటికి వెళ్లి తన భర్తను చంపినట్టు తెలిపింది. గ్రామస్తులు విచారించగా వారి వద్ద కూడా తానే హత్య చేసినట్టు ఆమె ఒప్పుకుంది. దీంతో స్థానికులు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని ధనలక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు.

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం 27-2-2018



కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు కెప్టెన్‌గా అశ్విన్

ఐపీఎల్‌లో తమ జట్టు కెప్టెన్‌గా భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ వ్యవహరిస్తాడని కింగ్స్ ఎలెవెన్ పంజాబ్ ఫ్రాంచైజీ ప్రకటించింది. ఈ సందర్భంగా అశ్విన్ మాట్లాడుతూ... 'యువరాజ్, గేల్‌లాంటి మేటి ఆటగాళ్లున్న జట్టుకు సారథిగా ఎంపిక చేయడాన్ని గౌరవంగా భావిస్తున్నా. కెప్టెన్సీతో నాపై అదనపు ఒత్తిడేమీ ఉండదు. 21 ఏళ్ల వయసులోనే తమిళనాడుకు సారథ్యం వహించా. ఈసారీ ఆ సవాల్‌ను ఆస్వాదిస్తా' అని అన్నాడు. ఎనిమిదేళ్లపాటు చెన్నై, రెండు సీజన్లుగా పుణే జట్టుకు ఆడిన అశ్విన్‌ను ఈసారి పంజాబ్ దక్కించుకుంది.



'బెస్ట్ బాక్సర్'గా వికాస్ కృషన్

సోఫియా (బల్గేరియా): స్ట్రాండ్‌జా స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత స్టార్ బాక్సర్ వికాస్ కృషన్ 'బెస్ట్ బాక్సర్' పురస్కారాన్ని పొందాడు. ఈ టోర్నీ చరిత్రలో భారత బాక్సర్‌కు ఈ అవార్డు రావడం ఇదే తొలిసారి. పురుషుల 75 కేజీల విభాగంలో వికాస్ విజేతగా నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఫైనల్లో వికాస్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతక విజేత ట్రాయ్ ఇస్లే (అమెరికా)ను ఓడించాడు. గతేడాది ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలిచాక వికాస్ ఖాతాలో చేరిన మరో పతకం ఇదే. 'నాకిది గొప్ప పునరాగమనం. గతంలో నా కచ్చితమైన బరువును నియంత్రించుకునేందుకు ఇబ్బంది పడేవాణ్ని. ప్రస్తుతం ఆ సమస్య లేదు. నా టెక్నిక్ కూడా మెరుగయింది. మానసికంగా కూడా నేను దృఢంగా మారాను' అని వికాస్ తెలిపాడు. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత్ తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. భారత బాక్సర్లు రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, ఆరు కాంస్యాలతో కలిపి మొత్తం 11 పతకాలను గెల్చుకున్నారు.

కర్ణాటక X సౌరాష్ట్ర


నేడు విజయ్ హజారే ట్రోఫీ ఫైనల్

న్యూఢిల్లీ: ఈ సీజన్‌లో అద్భుత ఆటతీరు కనబరుస్తున్న కర్ణాటక, సంచలనాల సౌరాష్ట్ర మధ్య మంగళవారం ఇక్కడ దేశవాళీ ప్రతిష్ఠాత్మక వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ ఫైనల్ జరగనుంది. రెండు జట్ల బ్యాట్స్‌మెన్ మంచి ఫామ్‌లో ఉన్నారు. బౌలర్లు నిలకడగా రాణిస్తున్నారు. టోర్నీలో 633 పరుగులు సాధించిన ఓపెనర్ మయాంక్ అగర్వాల్‌తో పాటు కెప్టెన్ కరుణ్ నాయర్, ఆల్‌రౌండర్లతో కర్ణాటక ఫేవరెట్‌గా కనిపిస్తున్నా... రవీంద్ర జడేజా, చతేశ్వర్ పుజారా వంటి ఆటగాళ్లున్న సౌరాష్ట్రను తక్కువ అంచనా వేయలేం. ఈ నేపథ్యంలో ఆసక్తికర పోరుకు అవకాశం ఉంది.

ఉదయం గం. 9.00 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

అహంకారమే అలంకారమై...

తనదైన శైలిలోనే దూసుకుపోయిన కోహ్లి ● మైదానంలో తగ్గని దూకుడు
విమర్శలకు వెరవని వైనం ● ప్రదర్శన, ఫలితాలతోనే సమాధానం



టన్నుల కొద్దీ పరుగులు చేయడం, సెంచరీల మీద సెంచరీలు సాధించడం, రికార్డులు బద్దలు కొట్టడం విరాట్ కోహ్లికి కొత్త కాదు. అది అతని దినచర్యలో భాగంగా మారిపోయింది. ఇప్పటికే అతను ప్రపంచంలోని అత్యుత్తమ క్రికెటర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. కెప్టెన్‌గా కూడా అతను అసమాన ఘనతలు సాధిస్తూ పోతున్నాడు. తాజాగా దక్షిణాఫ్రికా పర్యటనలో వన్డే, టి20 సిరీస్‌లు గెలుచుకొని టీమిండియా సత్తా చాటింది. టెస్టు సిరీస్ ఓడినా జొహన్నెస్‌బర్గ్‌లో ఘన విజయంతో పాటు తొలి రెండు మ్యాచ్‌లలో ఓడినా మన ప్రదర్శన గర్వపడేలా చేసింది. కోహ్లి ముందుండి నడిపించిన తీరుకు అన్ని వైపుల నుంచి ప్రశంసలు వచ్చాయి. మరోసారి తనదైన శైలిలో దూకుడుతోనే ప్రత్యర్థిని పడగొట్టిన అతనిపై ఏ వ్యాఖ్యాతగానీ, మాజీ ఆటగాడు కానీ పొరపాటున కూడా విమర్శకు దిగే సాహసం చేయలేకపోయాడు. వికెట్ తీసినప్పుడు దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తూ ఉద్వేగాలు ప్రదర్శించడం, సహచరులలో స్ఫూర్తి నింపే విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గని తత్వం ఒరిజినల్ కోహ్లిని మళ్లీ చూపించాయి. అయితే అది ఈసారి విరాట్‌కు నెగెటివ్‌గా మారలేదు. సరిగ్గా చెప్పాలంటే అతని అద్భుతమైన ఆట అనవసరపు అంశాలపై ఎవరి దృష్టీ పడకుండా చేసింది.

విమర్శల నుంచి ప్రశంసలు...

2012లో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లినప్పుడు అసభ్యకర సంజ్ఞల వివాదంతో కోహ్లి చెడ్డ పేరు తెచ్చుకున్నాడు. మరో రెండేళ్ల తర్వాత అదే గడ్డపై ఆస్ట్రేలియా ఆటగాళ్లకు ఎలా జవాబివ్వాలో అతను ప్రపంచానికి చూపించాడు. వాళ్లు తనను దారి తప్పిన పిల్లాడు అన్నారని... అయితే అలా రెచ్చగొట్టడం వల్లే పరుగులు చేశాను కాబట్టి అదీ మంచిదేనంటూ కోహ్లి అప్పట్లో దాని గురించి చెప్పుకున్నాడు. ఆ తర్వాత కూడా కోహ్లి వ్యవహారశైలిని విమర్శించే వారి జాబితా పెరిగిందే తప్ప తగ్గలేదు. కోహ్లికి ఎవరైనా మార్గనిర్దేశనం చేయాలంటూ ఒకరు సూచిస్తే... అతని దూకుడు జట్టుకు చేటు చేస్తుందని చెప్పేవారొకరు. అయితే అతను ఒక్కో సిరీస్‌తో వీటన్నింటికి సరైన రీతిలో సమాధానం ఇస్తూ పోయాడు. తాజాగా దక్షిణాఫ్రికా సిరీస్ సమయంలో దూకుడైన రీతిలో కాకుండా మంచి ఆలోచనాత్మకంగా కెప్టెన్సీ వ్యూహాల గురించి కోహ్లి తెలుసుకోవాలని చెప్పిన దక్షిణాఫ్రికా మాజీ సారథి గ్రేమ్ స్మిత్... పర్యటన ముగిశాక కోహ్లి ది బెస్ట్ అనకుండా ఉండలేకపోయాడు. సెంచూరియన్ టెస్టులో బంతిని మార్చమంటూ అంపైర్లతో వాగ్వాదం చేసిన సమయంలో, మూడో టెస్టులో పిచ్ సమస్య వచ్చినప్పుడు ఆట కొనసాగించాలని కోరిన సమయంలో కోహ్లిలోని రౌద్ర రూపం కనిపించినా... దానిని ఎవరూ తప్పు పట్టలేదు. ఆవేశం, ఆటపై వెర్రి ప్రేమ, పిచ్చి... మీరు ఏ మాటైనా వాడండి. దాని వల్లే కోహ్లి వరల్డ్ క్రికెట్‌లో సూపర్ స్టార్‌గా ఎదిగాడనేది అంగీకరించాల్సిన విషయం. తన మాటల్లో కూడా అప్పుడప్పుడు కనిపించే అహాన్ని ధరించి మైదానంలో దిగే విరాట్‌ను మారమని ఎవరైనా చెప్పగలరా?

> ఒకప్పుడు వారంతా అతడిని 'దారి తప్పిన పిల్లాడు'గా అభివర్ణించారు. ఇప్పుడు అతడిని పొగడటంలో వారంతా పోటీ పడుతున్నారు. మరి కొద్ది రోజుల్లోనే అతను అంతగా మారిపోయాడా! లేదు... కోహ్లి తనలాగే ఉన్నాడు. ఏడాది క్రితం కోహ్లితో ఢీ అంటే ఢీ అంటూ తలపడ్డవాడు ఇప్పుడు అతడిని చూసి తాను కూడా కొత్త విషయాలు నేర్చుకున్నానని చెబుతున్నాడు. కోహ్లి ఒక్కసారిగా మంచి బాలుడైపోయాడా! కాదు... కోహ్లిని చూసే ధోరణిలో వచ్చిన మార్పు ఇది. కోహ్లి ఆటను కాకుండా అతని ప్రవర్తనను ఈతరం కుర్రాళ్లు అనుకరిస్తారేమోనని భయపడుతున్నట్లు సాక్షాత్తూ రాహుల్ ద్రవిడ్ చెప్పాడు. కానీ అలాంటి దుందుడుకు స్వభావమే కోహ్లిని ప్రత్యేకంగా నిలబెట్టిందని స్వయంగా అతనే అంగీకరించిన సత్యం. విరాట్ కోహ్లిది అహంకారం అన్నారు కొందరు... కానీ అది ఆత్మవిశ్వాసం మాత్రమే అని అతను చేసి చూపించాడు. ఒకనాడు అతని ప్రవర్తన చూసి కోహ్లి ఇలా ఎందుకు ఉంటాడు అనేవాళ్లతో కూడా కోహ్లి ఇలా ఉంటేనే బాగుంటాడు అనిపించగలిగాడు.
>
> – సాక్షి క్రీడా విభాగం

మారాల్సిన అవసరం లేదు!

ధోనితో పోలిస్తే కోహ్లి కెప్టెన్సీలో కూడా అతని తత్వమే కనిపిస్తుంది. ధోని అయితే భగవద్గీతలోని కర్మణ్యే వాధికారస్తే.... తరహాలో పదే పదే ప్రక్రియ గురించే తప్ప ఫలితాల గురించి ఆలోచించనని చెప్పేవాడు. కానీ ఫలితం లేని ప్రక్రియ వృథా అనేది కోహ్లి గట్టి నమ్మకం. అందుకే అతను మ్యాచ్ ఆడేది గెలిచేందుకే అనే బలమైన సందేశాన్ని జట్టు సభ్యులకు ఇవ్వగలిగాడు. ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనుకంజ వేయకుండా పోరాడమంటూ తాను ముందుండి చూపించాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో టీమిండియా ఆటగాళ్ల ఆట అనూహ్యం. సఫారీ గడ్డకు వెళ్లే ముందు వారి నుంచి ఎవరూ ఊహించనిది ఇది. దీనికి కర్త, కర్మగా తానే వ్యవహరించి జట్టును విజయపథంలో నడిపించడం కోహ్లి కెరీర్ స్థాయిని మరింతగా పెంచింది. కొన్నాళ్ల క్రితం కోచ్ అనిల్ కుంబ్లేతో విభేదాలు, ఆ తర్వాత కోచ్‌ను తప్పించిన అంశంలో కోహ్లిపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. మొత్తం వ్యవస్థ గుప్పిట్లో పెట్టుకున్నాడని, వ్యక్తి పూజ పెరిగిపోయిందంటూ కూడా కథనాలు కనిపించాయి. అయితే తనపై ఉన్న ఆత్మవిశ్వాసమే అతడు ఈ తరహాలో వ్యవహరించేందుకు కారణమైంది. ఇప్పుడు కోహ్లి నామజపం మారుమోగిపోతోంది తప్ప కోహ్లి ఇలా వ్యవహరించకుండా ఉండాల్సింది అని ఎవరైనా అంటున్నారా! మరి కొన్ని నెలల్లో కోహ్లి అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టి దశాబ్ద కాలం పూర్తవుతుంది. అత్యద్భుత ఆట ఉన్నా అనవసరపు అంశాలతో కూడా అతను ఇన్నేళ్లు సహవాసం చేశాడు. అయితే తాను మాత్రం ఎలా ఉండాలనుకున్నాడో అలాగే ఉన్నాడు. ఈ క్రమంలో ఎలాంటి సవాళ్లు ఎదురైనా తగ్గలేదు. నిజంగానే కోహ్లి ఎందుకు మారాలి? అతను ఒక్కసారిగా మారిపోయి ప్రశాంతంగా ఆడుతూ ఉంటే ఆట ఎంత నిస్సారంగా, బోర్‌గా ఉంటుందో ఊహించుకోండి!

అందుకే ఇది 80 శాతం ప్రదర్శన


సునీల్ గావస్కర్

సఫారీలతో సిరీస్ ముగిశాక తమ సామర్థ్యంలో 80 శాతమే కనబర్చామని ప్రకటించిన భారత కెప్టెన్ విరాట్ కోహ్లి... సాధ్యమైనంత త్వరగా 100 శాతం ఆటను ప్రదర్శించేలా బాజా మోగించాడు. దక్షిణాఫ్రికాపై ప్రత్యేకించి పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల్లో భారత్ అన్ని విభాగాల్లో సొంత సామర్థ్యాన్ని నమ్ముకుని అవసరమైన సందర్భాల్లో ఉత్తేజకరమైన ఆట కనబరిచింది. ఇదే పనిని ప్రత్యర్థి చేయలేకపోయింది. టాప్ ఫోర్ బ్యాట్స్‌మెన్ రాణించడంతో లోయరార్డర్‌తో పెద్దగా పని పడలేదు. ప్రారంభంలో, చివర్లో పరుగులు ఇవ్వకుండా కొత్త బంతి బౌలర్లు ప్రొటీస్‌ను ఉక్కిరిబిక్కిరి చేశారు. మధ్య ఓవర్లలో స్వేచ్ఛగా ఆడదామనుకుంటే మణికట్టు స్పిన్నర్లు ఆశ్చర్యానికి గురిచేశారు. కుల్దీప్, చహల్‌లు వారిని తప్పుదారి పట్టించి పాఠశాల స్థాయి క్రికెటర్లుగా మార్చేశారు. ఈ ఇద్దరి మాయాజాలం, ధైర్యం, అద్భుత ఆత్మవిశ్వాసంతో భారత్ మున్ముందు టెస్టుల్లోనూ మరిన్ని విజయాలు సాధించగలదు.

టెస్టు సిరీస్ ఓటమిని ప్రస్తావిస్తే... మన జట్టు రెండు టెస్టుల్లో మూడో ఇన్నింగ్స్ వరకూ పోటీలోనే ఉంది. సరైన ప్రారంభం దక్కక, మిడిలార్డర్‌లో రహనే లేకపోవడంతో నాలుగో ఇన్నింగ్స్‌లో మాత్రమే విఫలమైంది. ఈ రెండు సార్లూ కోహ్లి రాణించకపోవడమూ ప్రభావం చూపింది. జొహన్నెస్‌బర్గ్‌లో లిఫ్ట్‌లో వెళ్తుండగా నాకు ఆజానుబాహులైన రగ్బీ ఆటగాళ్లు తారసపడ్డారు. కోహ్లికి, మిగతా 21 మంది ఆటగాళ్ల మధ్య సామర్థ్యం, దృక్పథం విషయంలో సరిగ్గా ఇదే తీరున తేడా కనిపించింది. టీమిండియా గతంలో దక్షిణాఫ్రికాలో పరిమిత ఓవర్ల సిరీస్ గెలుచుకోలేదు. ఈసారి మాత్రం కోహ్లి సేన దానిని చేసి చూపింది. టెస్టు సిరీసూ గెలిచి ఉంటే భారత క్రికెట్ చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిపోయేది. అందుకే ఇది 80 శాతం ప్రదర్శన కనబర్చిన సిరీస్‌గా మిగిలిపోయింది.

బ్యాటింగ్ భారం తగ్గింది

ఆటలో వేగం పెరిగింది ● టి20 ప్రపంచకప్‌లోనూ రాణిస్తాం ● మిథాలీ రాజ్ మనోగతం



కేప్‌టౌన్: భారత మహిళల క్రికెట్ జట్టులో మిథాలీ రాజ్‌ది చెరగని ముద్ర. వన్డేల్లో సారథిగా కొనసాగుతున్న ఈ వెటరన్ క్రికెటర్ ... ఇప్పుడు టి20 ప్రపంచకప్‌పై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా సఫారీ పర్యటనలో పొట్టి ఫార్మాట్‌లో సత్తా చాటుకుంది. మ్యాచ్‌లు గెలిపించే ఇన్నింగ్స్‌లతో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచింది. ఇదే ఆత్మవిశ్వాసంతో టి20ల్లోనూ ముందడుగు వేస్తానని చెప్పింది. స్మృతి మంధన, వేద, జెమీమాలు కూడా నిలకడగా రాణిస్తుండటంతో తనపై బ్యాటింగ్ భారం తగ్గిందని తెలిపింది. త్వరలో జరిగే సిరీస్‌లు, జట్టు సన్నాహాలపై ఈ హైదరాబాదీ స్టార్ చెప్పిన విశేషాలు ఆమె మాటల్లోనే...

ప్రపంచకప్ కోసమే...

నిజాయితీగా చెప్పాలంటే... నాకు టి20లంటే అమితాసక్తి లేదు. అయితే టి20 ప్రపంచకప్ లక్ష్యంగా సన్నాహాలకు పదును పెట్టడం వల్లే ఈ ప్రదర్శన సాధ్యమైంది. ఇప్పుడు నేను కూడా టి20 ప్లేయర్ననే ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఓపెనర్‌గా నేను ధాటిగా ఆడేందుకు మంచి అవకాశం దొరికింది. మొదటి ఆరు ఓవర్లు (పవర్ ప్లే) చాలా కీలకం. జట్టుకు శుభారంభమిచ్చే అవకాశం ఇక్కడే మొదలవుతుంది. పొట్టి ఫార్మాట్‌లో విదేశీగడ్డపై నేను ఓపెనర్‌గా విజయవంతమయ్యాను. ఇదే ఉత్సాహాన్ని తదుపరి సిరీస్‌లలో కొనసాగిస్తా.

పెను భారం లేదిపుడు...

ఇంతకుముందున్నట్లు... ప్రధానంగా బ్యాటింగ్ భారమంతా నా మీదే లేదు. హర్మన్‌ప్రీత్ (టి20 కెప్టెన్), వేద కృష్ణమూర్తి, టీనేజ్ సంచలనం జెమీమా రోడ్రిగ్స్‌లు నిలకడగా రాణిస్తున్నారు. దీంతో నేను స్వేచ్ఛగా నా ఆటతీరు కొనసాగించే వీలు చిక్కింది. ఆచితూచి ఆడటం కన్నా... ప్రయోగాత్మక షాట్లు ఆడేందుకు ఇదో కారణం. ఔట్ అవుతాననే బెంగలేకుండా ఆడగలుగుతున్నా. జట్టులో ఇద్దరుముగ్గురు మ్యాచ్ విన్నర్లు ఉండటం నిజంగా అదృష్టం. ఇదే పటిష్టమైన జట్టుకు నిదర్శనం.

లోయర్ ఆర్డర్ మెరుగవ్వాలి...

టి20 ప్రపంచకప్ గెలవాలంటే జట్టులో ఐదారుగురు ఆడితే సరిపోదు. అందరు సమష్టిగా రాణించాలి. ముఖ్యంగా జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ కూడా తమ వంతు పరుగులు సాధించిపెట్టాలి. టాప్, మిడిలార్డర్ విఫలమైనపుడు వీళ్లు చేసే స్కోర్లే కీలకమవుతాయి. వెస్టిండీస్‌లో అక్టోబర్‌లో జరిగే ఈ మెగా ఈవెంట్‌లో స్పిన్నర్లు కూడా కీలకపాత్ర పోషిస్తారు.

మా ఆటపైనా కన్నేశారు...

క్రికెట్ వీక్షకుల్లో మార్పొచ్చింది. భారత అభిమానులు మా మ్యాచ్‌లపై కూడా ఆసక్తి కనబరుస్తున్నారు. మహిళల జట్టు ఎంత స్కోరు చేసింది? ఎలా ఆడుతుంది? అని టీవీల్లో చూసేవారి సంఖ్య పెరుగుతోంది. వన్డే సిరీస్‌ను బ్రాడ్‌కాస్ట్ చేయలేకపోయినప్పటికీ టి20 మ్యాచ్‌లను ప్రసారం చేయడం మంచి పరిణామం. చూస్తు ఉండండి... టి20 ప్రపంచ కప్‌లో కూడా మేం అందరిని ఆశ్చర్యపరిచే ఆటతో అలరిస్తాం.

ఆసీస్‌తో ఆఖరి ఆట

క్రికెట్‌కు వీడ్కోలు చెబుతానన్న మోర్నీ మోర్కెల్



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా పేసర్ మోర్నీ మోర్కెల్ త్వరలోనే ఆటకు టాటా చెప్పనున్నాడు. స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగే నాలుగు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అవుతానని మోర్కెల్ సోమవారం ప్రకటించాడు. 'ఇది చాలా కఠినమైన నిర్ణయం. అయితే వీడ్కోలుకు ఇదే సరైన సమయం. ఇకపై క్రికెట్‌లేని జీవితాన్ని కొత్తగా ఆస్వాదిస్తా. నాకో మంచి కుటుంబం ఉంది. నేను, నా విదేశీ భార్య అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్ బడలికల నుంచి విముక్తులమవుతున్నాం. క్రికెట్ భారాన్ని దించేసి వ్యక్తిగత జీవితంలో ముందడుగు వేయదల్చుకున్నా' అని 33 ఏళ్ల మోర్కెల్ తన రిటైర్మెంట్ సందేశంలో పేర్కొన్నాడు. ప్రొటీస్ జెర్సీ ధరించి ఎన్నో మధుర క్షణాలను అనుభవించానని... దక్షిణాఫ్రికాకు ఆడిన ప్రతీ మ్యాచ్‌ను, ప్రతీ క్షణాన్ని ఆస్వాదించినట్లు తెలిపాడు. 'నా క్రికెట్ ప్రయాణంలో సఫారీ బోర్డు, జట్టు సహచరులు, కుటుంబసభ్యులు, మిత్రులు ఎంతో తోడ్పాటు అందించారు. నాలో ఇంకా క్రికెట్ ఆడే సత్తా ఉంది. దాన్ని ఇప్పుడు ఆస్ట్రేలియాతో జరిగే టెస్టు సిరీస్‌లో ఉపయోగిస్తా. జట్టును గెలిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తా'అని అన్నాడు. 2006లో డర్బన్‌లో భారత్‌తో జరిగిన టెస్టుతో అరంగేట్రం చేసిన మోర్కెల్ 12 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో మూడు ఫార్మాట్లలో కలిపి 529 వికెట్లు పడగొట్టాడు. వన్డేల్లో 117 మ్యాచ్‌లాడి 188 వికెట్లు తీశాడు. టి20ల్లో 44 మ్యాచ్‌లాడి 47 వికెట్లు పడగొట్టాడు. టెస్టు కెరీర్‌లో 83 మ్యాచ్‌లాడి 294 వికెట్లు చేజిక్కించుకున్నాడు. 2009లో ప్రధాన పేసర్ మఖాయ ఎన్తిని రిటైర్మెంట్ తర్వాత జట్టులో కీలక బౌలర్‌గా ఎదిగాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్‌డెవిల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, రాజస్తాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన మోర్కెల్‌ను ఈసారి వేలంలో ఎవరూ కొనుగోలు చేయలేదు.

'కామన్వెల్త్'లో పాల్గొనే భారత అథ్లెట్లకు బీమా

న్యూఢిల్లీ: కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొనే భారత అథ్లెట్లకు రూ. 50 లక్షల చొప్పున జీవిత బీమా చేశారు. ఎడిల్‌వీజ్ టోక్యో లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఈ బీమా సదుపాయాన్ని కల్పించినట్లు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తెలిపింది. సోమవారం ఐఓఏ భారత జట్టుకు స్పాన్సర్‌షిప్ చేస్తున్న సంస్థల వివరాలు వెల్లడించింది. ఎడిల్‌వీజ్ బీమా, ఆర్థిక సేవల కంపెనీ కామన్వెల్త్ గేమ్స్‌తో పాటు, ఆసియా గేమ్స్, టోక్యో ఒలింపిక్స్ (2020)లకూ భారత జట్టు ప్రధాన స్పాన్సర్‌గా కొనసాగుతోంది. గతంలో రియో ఒలింపిక్స్‌లో పాల్గొన్న అథ్లెట్లకు ఎడిల్‌వీజ్ సంస్థ రూ. కోటి బీమా చేసింది. ప్రముఖ వస్త్ర ఉత్పత్తుల సంస్థ రేమండ్స్ దుస్తులను స్పాన్సర్ చేయనుంది. ప్రతిష్టాత్మక క్రీడల్లో పాల్గొనే భారత జట్టుకు స్పాన్సర్‌షిప్ సేవలందించడాన్ని గర్వంగా భావిస్తున్నట్లు రేమండ్స్ చైర్మన్ గౌతమ్ హరి సింఘానియా తెలిపారు. కార్పొరేట్ సంస్థలు ముందుకొచ్చి క్రీడాకారులకు చేయూతనివ్వాలని కోరారు.



సోదరుడే చాపెల్‌ను నమ్మలేదు

ఆత్మకథలో గంగూలీ



న్యూఢిల్లీ: కెప్టెన్‌గా సౌరవ్ గంగూలీ, కోచ్‌గా గ్రెగ్ చాపెల్ మధ్య విభేదాలు, అవి భారత క్రికెట్‌పై చూపిన ప్రభావం మీద ఇప్పటికే ఎన్నో కథనాలు వచ్చాయి. కెప్టెన్సీతో పాటు, జట్టు నుంచి కూడా తప్పించడంపై గంగూలీ పలుసార్లు గ్రెగ్‌పై విమర్శలు చేశాడు. తాజాగా ఆత్మకథ 'ఎ సెంచరీ ఈజ్ నాట్ ఎనఫ్'లోనూ గంగూలీ ఆ సంగతులను ప్రస్తావించాడు. భారత కోచ్‌గా గ్రెగ్ చాపెల్ నియామకంపై అతడి సోదరుడైన ఇయాన్ చాపెల్ కూడా నాడు ఏమంత సానుకూలంగా లేడని చెప్పుకొచ్చాడు. ఆత్మకథలో ఇంకా ఏమన్నాడంటే... '2005లో ఈ ఉదంతంపై ఇయాన్‌తో పాటు సునీల్ గావస్కర్ కూడా నన్ను హెచ్చరించారు. అయినా వాటిని విస్మరించాను. అంతకుముందు తనతో జరిగిన భేటీల్లో విస్తృత క్రికెట్ పరిజ్ఞానంతో గ్రెగ్ నన్ను ఆశ్చర్యపరిచాడు. మన జట్టును నంబర్ వన్‌గా నిలిపేందుకు అతడు సరైనవాడని భావించాను. నా అభిప్రాయాన్ని దాల్మియాకు వివరించాను. కానీ గ్రెగ్‌తో మున్ముందు ఇబ్బందులు తప్పవని, అతడి కోచింగ్ రికార్డు గొప్పగా ఏమీ లేదని గావస్కర్ హెచ్చరించారు. అయినప్పటికీ నేను ముందుకెళ్లా. విజయవంతమైన కెప్టెన్‌ను, అంతకుముందు టెస్టు సిరీస్‌లో సెంచరీ చేసిన నన్ను అకారణంగా తొలగించారు. చరిత్రలో ఇలా ఎక్కడా జరిగి ఉండకపోవచ్చు. భారత క్రికెట్‌లో దీంతో పోల్చదగిన ఘటనలు గతంలోను, ఇకపైనా జరగకపోవచ్చు' అని పేర్కొన్నాడు.

కొత్త కారుతో ఫోర్స్ ఇండియా

బార్సిలోనా: భారత్‌కు చెందిన ఫార్ములావన్ (ఎఫ్1) జట్టు ఫోర్స్ ఇండియా కొత్త కారును ఆవిష్కరించింది. జట్టు యజమాని విజయ్ మాల్యా పేరులోని అక్షరాలు 'వీజేఎమ్11' పేరుతో ఈ కారును అత్యంత ఆకర్షణీయంగా తయారు చేశారు. ఈ సీజన్‌లో ఫోర్స్ ఇండియా డ్రైవర్లు ఈ కారుతో బరిలోకి దిగుతారని టీమ్ వర్గాలు వెల్లడించాయి. త్వరలోనే ఫోర్స్ డ్రైవర్లు పెరెజ్, ఒకాన్‌లు ఈ కారును ట్రయల్స్‌లో నడిపి పరీక్షించనున్నారు. ఎఫ్1 2018 సీజన్ మార్చి 25న ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రి రేసుతో మొదలవుతుంది.



సీఎంను కలిసిన ఆంధ్రా బ్యాంక్ ఈడీ

విజయవాడ: ఆంధ్రా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కులభూషణ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. కులభూషన్ విజయవాడ వచ్చిన సందర్భంగా సీఎం నివాసానికి వెళ్లి దాదాపు 35 నిమిషాలపాటు చంద్రబాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తమ బ్యాంకు సహకారం అందిస్తుందని సీఎంకు కులభూషణ్ హామీ ఇచ్చారు.



సీఎంను కలిసిన ఆంధ్రా బ్యాంక్ ఈడీ కులభూషణ్

మల్లన్న సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



ఆలయ ప్రాంగణంలో జస్టిస్ అభయ్‌మనోహర్ సప్రే

శ్రీశైలం: శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభయ్‌మనోహర్ సప్రే కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలను నిర్వహించుకున్నారు.

మండలానికో 'ఫుడ్ పాయిజన్' సెంటర్


తడబడిన హోం మంత్రి చినరాజప్ప



కొయ్యలగూడెం: మండలానికో ఫుడ్ పాయిజన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర హోం మంత్రి చినరాజప్ప అనడంతో.. అక్కడ ఉన్న వారంతా అవాక్కయ్యారు. తనతోపాటు ఉన్న పోలీసు అధికారులు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ అని చెప్పడంతో మంత్రి పొరపాటును సరిదిద్దుకున్నారు. అనారోగ్యానికి గురైన రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్ల మేఘలాదేవిని పరామర్శించడానికి చినరాజప్ప పశ్చిమగోదావరి జిల్లా కొయ్యలగూడెం వెళ్లారు. మేఘలాదేవిని పరామర్శించిన అనంతరం చినరాజప్ప విలేకర్లతో మాట్లాడుతూ.. మండలానికో ఫుడ్ పాయిజన్ సెంటర్ ఏర్పాటు చేస్తామంటూ తడబడ్డారు.

పెట్టుబడుల సమ్మేళనంలో అసభ్య ప్రదర్శనలా?

సీఎం చంద్రబాబుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శర్మ బహిరంగ లేఖ



సాక్షి, అమరావతి: పెట్టుబడుల సమ్మేళనంలో మహిళలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన అసభ్యంగా ఉందని, ఇలాంటి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొనడం తెలుగు సంస్కృతిని కించపరిచేదిగా ఉందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పోకడలను 'రివర్స్ హ్యూమన్ ట్రాఫికింగ్'గా పేర్కొంటారని సోమవారం ఆయన సీఎం చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. ఒక పత్రిక మొదటి పేజీలో సోమవారం ప్రచురితమైన 'పెట్టుబడుల ప్రవాహం' అనే వార్త క్లిప్పింగ్‌ను లేఖకు జత చేశారు. ఇలాంటి ప్రదర్శనలను ప్రభుత్వ కార్యక్రమంలో ఎలా చేర్చారని, వీటి కోసం ప్రజాధనం ఎలా వృథా చేస్తారని ప్రశ్నించారు. దీనిపై స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. విద్యా రంగ అభివృద్ధి, ప్రజల ఆరోగ్యం కోసం ఖర్చు పెట్టాల్సిన నిధులను ఈ విధంగా దుర్వినియోగం చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి జాప్యం చేస్తున్న ప్రభుత్వం ఐదు నక్షత్రాల హోటళ్లలో విలాసాలు, అసభ్య ప్రదర్శనలపై దృష్టి పెట్టడం సరికాదన్నారు.

ప్రైవేటు వ్యక్తులతో అక్రమ వసూళ్లు..

- నెల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారుల నిర్వాకం
- ఏసీబీ తనిఖీల్లో బయటపడిన వైనం



రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న దృశ్యం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొందరు అధికారులు ప్రైవేటు వ్యక్తులతో అక్రమ వసూళ్లకు తెరలేపారు. డాక్యుమెంట్ రైటర్ల నుంచి నగదు వసూళ్లు చేసి, అడ్డగోలుగా రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు. దీనిపై కొద్దిరోజులుగా ఏసీబీ అధికారులు నిఘా ఉంచారు. సోమవారం రిజిస్ట్రేషన్లు అధికంగా జరిగి పెద్ద మొత్తంలో వసూళ్లు జరిగి ఉంటాయని భావించిన ఏసీబీ డీఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి.. రాత్రి తన సిబ్బందితో కలిసి మద్రాసు బస్టాండు సమీపంలోని నెల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై ఆకస్మిక దాడులు చేశారు. కార్యాలయంలోకి ప్రవేశించిన సమయంలో సబ్‌రిజిస్ట్రార్–1 వీవీ ప్రసాద్‌రెడ్డితో పాటు ఇద్దరు ప్రైవేటు వ్యక్తులు ఎం.శివ, ఎం.తిరుపతి, మరో ఇద్దరు కాంట్రాక్ట్ సిబ్బంది ఖలీల్, తిరుపాల్ ఉన్నారు. పనివేళలు ముగిసిన తర్వాత ఇక్కడేమి చేస్తున్నారని ప్రైవేటు వ్యక్తులను ప్రశ్నించగా వారు నీళ్లు నమిలారు. వారి వద్ద నుంచి రూ. 76,600 స్వాధీనం చేసుకున్నారు. వారిని నిలదీయగా రోజూ డాక్యుమెంట్ రైటర్ల నుంచి వసూలుచేసి సబ్‌రిజిస్ట్రార్–1కు ఇస్తున్నామని వెల్లడించారు. ఈ విషయమై సబ్‌రిజిస్ట్రార్–1 ప్రసాద్‌రెడ్డిని విచారించగా.. తనకు ఎలాంటి సంబంధం లేదని బుకాయించాడు. వారందరినీ అధికారులు అదుపులోకి తీసుకుని, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల అనంతరం ఏసీబీ డీఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. రిజిస్ట్రేషన్ అధికారులు ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకుని డాక్యుమెంట్ రైటర్ల వద్ద నుంచి రూ. లక్షలు రోజువారీ కలెక్షన్‌లు తీసుకుంటున్నారని తెలిపారు.

రూ.4.39 లక్షల కోట్ల పెట్టుబడులు

భాగస్వామ్య సదస్సు ముగింపు సమావేశంలో సీఎం చంద్రబాబు

విశాఖపట్నం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది భాగస్వామ్య సదస్సులో దేశీయ, విదేశీ పారిశ్రామికవేత్తలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో 4,253 మంది పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొనడమే కాకుండా రూ. 4.39 లక్షల కోట్ల విలువైన 734 ఒప్పందాలు కుదిరినట్లు తెలిపారు. 50 దేశాల నుంచి 280 మంది విదేశీ ప్రతినిధులు, 3,673 మంది దేశీయ ప్రారిశ్రామికవేత్తలు, 30 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. వరుసగా మూడవ ఏడాది విశాఖలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు సోమవారం ముగిసింది. ముగింపు సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ఈ సమావేశాల్లో భాగస్వాములు కావడానికి విదేశీయులు ఆసక్తి చూపిస్తున్నారని, ఈసారి జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్ కంట్రీల సెషన్స్ జరిగాయని, వచ్చే ఏడాది శ్రీలంక, రష్యా సెషన్స్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

11.10 లక్షల మందికి ఉపాధి

గత ఒప్పందాల అమల్లో రాష్ట్ర ప్రభుత్వం రికార్డు సష్టించిందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. గడిచిన మూడున్నరేళ్లలో మొత్తం 1,946 ఒప్పందాలు కుదిరాయని, వీటి ద్వారా రూ.13.54 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు రావడమే కాకుండా 31 లక్షల మందికి ఉపాధి లభించనుందన్నారు. ఈ ఒప్పందాల్లో రికార్డు స్థాయిలో 58 శాతం అమల్లోకి వచ్చాయన్నారు. మొత్తం 1,153 ఒప్పందాల పనులు వివిధ దశల్లో ఉన్నాయని వీటి పెట్టుబడి విలువ రూ. 5.69 లక్షల కోట్లుగా పేర్కొన్నారు. వీటి వల్ల రాష్ట్రంలో కొత్తగా 11.10 లక్షల మందికి ఉపాధి లభించనుందన్నారు. ఒప్పందాల్లోని 531 సంస్థలు ఉత్పత్తిని ప్రారంభించడమే కాకుండా వీటి ద్వారా మరో 2.64 లక్షల మందికి ఉపాధి లభించనుందన్నారు. వీటి పెట్టుబడి విలువ రూ.1.29 లక్షల కోట్లు అని చెప్పారు. ఈ సంవత్సరం ఒప్పందాలు కుదుర్చుకున్న వారు డీపీఆర్‌లు సమర్పిస్తే 21 రోజుల్లోనే అనుమతులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభు, పౌరవిమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు, సింగపూర్ మంత్రి ఈశ్వరన్, మారిషస్ వైస్ ప్రెసిడెంట్ పరమశివన్ పిళ్లై, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథ్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి అలోక్య రాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఎలక్ట్రానిక్స్ రంగంలో ఒప్పందాల పత్రాలు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

హార్డ్‌వేర్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్: సీఎం

ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు (విశాఖ తూర్పు): హార్డ్‌వేర్ ఉత్పత్తుల కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు చెప్పారు. భాగస్వామ్య సదస్సులో భాగంగా ఎలక్ట్రానిక్స్ రంగంలో పెట్టుబడులకు సంబంధించి పలువురికి ఒప్పంద పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హార్డ్‌వేర్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఏపీ ఆసక్తిగా ఉందని వెల్లడించారు. దేశంలోకి వచ్చే పెట్టుబడుల్లో 80 శాతం ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. 'ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్ ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్ ఏపీ' అంశంపై జరిగిన సదస్సులో ఏపీ ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు ప్రోత్సాహకాలతో పాటు త్వరితగతిన అనుమతులు, భూమి అందిస్తుందన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్ట్‌ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్. చిత్రంలో సీఎం చంద్రబాబు తదితరులు

మౌలిక వసతులు ఉపయోగించుకోండి: గవర్నర్



పెట్టుబడులకు అనువైన రాష్ట్రం ఏపీ అని, ఇక్కడ అన్ని రకాల మౌలికవసతులు ఉండటమే కాకుండా, అన్ని రకాల భద్రత ఉంటుందని గవర్నర్ నరసింహన్ తెలిపారు. హైవే, రేవులు, రోడ్డు కనెక్టివిటీతో పాటు కమ్యూనికేషన్స్, ఇంధన భద్రత పరంగా రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితాన్ని పూర్తి చేసుకొన్న సీఎం చంద్రబాబుకు గవర్నర్ అభినందనలు తెలిపారు.

మానవాళికి మానసిక ప్రశాంతత అవసరం: శ్రీశ్రీ రవిశంకర్

మానసిక ప్రశాంతత ప్రస్తుత మానవ సమాజానికి అత్యవసరమైనది అని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ పేర్కొన్నారు. భాగస్వామ్య సదస్సులో ఆయన సోమవారం జరిగిన ఏడో సెషన్ కార్యక్రమంలో భాగంగా 'స్పెషల్ ప్లీనరీ విత్ ఏ సోషల్ ఐకాన్' అంశంలో పాల్గొని మాట్లాడారు. శారీరక, మానసిక ఆరోగ్యమే తొలి సంపద అని, సంతోషమే అభివృద్ధికి మూలమన్నారు. ఈసెషన్‌కి క్రాంతినేషన్ ఇండియా అండ్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్ పుస్తక రచయిత ప్రాంజల్ శర్మ మోడరేటర్‌గా వ్యవహరించారు.

అందని ద్రాక్షలా కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్‌లు

- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్నారుల తల్లిదండ్రులు
- అనుమతులు ఇవ్వడంలో జాప్యం చేస్తోన్న కమిటీ
- రాష్ట్రవ్యాప్తంగా విశాఖ కేజీహెచ్‌లో మాత్రమే ఆపరేషన్లు
- గుంటూరు మినహా ఎక్కడా లేని స్పీచ్ థెరపీ కేంద్రాలు



సాక్షి, గుంటూరు: మేనరికం వివాహాలు, జన్యు లోపంతో అనేక మంది చిన్నారులు వినికిడి లోపంతో జన్మిస్తున్నారు. వీరికి కాక్లియర్ ఇంప్లాంటేషన్ ఆపరేషన్‌లు అందని ద్రాక్షలా మారాయి. ఆపరేషన్లకు అనుమతి ఇవ్వడానికి గుంటూరు ప్రభుత్వాస్పత్రికి చెందిన ముగ్గురు వైద్యులు, ఎన్టీఆర్ వైద్యసేవ నుంచి ఒకరు, ఒక ప్రైవేటు వైద్యుడితో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. గుంటూరులో ఉన్న ఈ కమిటీ చిన్నచిన్న లోపాలను సాకుగా చూపి అనుమతులను పెండింగ్‌లో పెడుతోందని చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు. మరోవైపు రాష్ట్రంలో విశాఖపట్నం కేజీహెచ్ మినహా మరే ప్రభుత్వ ఆస్పత్రిలోనూ ఈ ఆపరేషన్‌లు జరగడం లేదు. ఆపరేషన్‌కు ముందు, తర్వాత చిన్నారులకు స్పీచ్ థెరపీ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రం మొత్తం మీద గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మాత్రమే స్పీచ్ థెరపీ ఉంది. దీంతో వినికిడి లోపం ఉండి మాట్లాడలేకపోతున్న చిన్నారులను దూరప్రాంతాల నుంచి గుంటూరుకు తీసుకొచ్చి ఏడాదిన్నరపాటు అక్కడే ఉంచి స్పీచ్ థెరపీ చేయించాల్సి రావడంతో నిరుపేదలు ఆర్థిక భారాన్ని మోయలేక విలవిల్లాడుతున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో స్పీచ్ థెరపీ అందించి, ఆపరేషన్లు చేయాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

అనుమతులివ్వని కమిటీ

కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్ చేయించే చిన్నారికి ఐదేళ్లలోపు వయసు ఉండాలి. మూడు నెలలపాటు హియరింగ్ ఎయిడ్ పరికరాన్ని వాడి ఉండాలి. ఆపరేషన్‌కు ముందు మూడు నెలలు స్పీచ్ థెరపీ, నెలరోజులపాటు కౌన్సెలింగ్ ఇప్పించాలి. తర్వాత సంబంధిత డాక్టర్ కమిటీకి రిఫర్ చేస్తారు. కమిటీ చిన్నారులను పరిశీలించి అనుమతిస్తే రూ.6 లక్షలు ఖర్చయ్యే ఆపరేషన్‌ను, తర్వాత స్పీచ్ థెరపీని ఉచితంగా చేస్తారు. అయితే కమిటీ మాత్రం చిన్నారులు తగినంత బరువు లేరని, వైద్యుల సంతకం సక్రమంగా కనిపించడం లేదనే సాకులు చూపి అనుమతులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోందని తల్లిదండ్రులు అంటున్నారు. ఆపరేషన్‌కు అనుమతి వస్తే తర్వాత ఏడాదిన్నరపాటు స్పీచ్ థెరపీ ఇప్పించాల్సి ఉంటుందని, దీనికోసం గుంటూరులో ఇల్లు అద్దెకు తీసుకుని ఉండాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. ప్రభుత్వం అన్ని జిల్లా కేంద్రాల్లో స్పీచ్ థెరపీ కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు కమిటీని అన్ని జిల్లాలకు పంపి అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైఎస్ హయాంలో..

దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆరోగ్యశ్రీ ద్వారా రూ.6.50 లక్షల ఖరీదైన కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్‌లను ఉచితంగా చేయించారు. దీంతో ఎంతోమంది చిన్నారులు లబ్ధి పొందారు. తల్లిదండ్రులపై ఎలాంటి ఆర్థిక భారం పడలేదు. వైఎస్సార్‌ను ఆదర్శంగా తీసుకుని తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఈ ఆపరేషన్‌లను ఉచితంగా నిర్వహిస్తున్నాయి.

బరువు తక్కువగా ఉన్నారని మూడు నెలలపాటు అనుమతి ఇవ్వలేదు



మా పాప హర్షిత పుట్టిన ఏడాదిన్నరకు మాటలు రాకపోవడం గమనించాం. ఆపరేషన్ చేయిస్తే మాటలు వస్తాయని తెలిసి రెండు నెలలపాటు స్పీచ్ థెరపీ ఇప్పించాం. అనంతరం కమిటీ పరీక్షించి పాప బరువు తక్కువగా ఉందని చెప్పి ఆపరేషన్‌కు అనుమతి నిరాకరించింది. మళ్లీ మూడు నెలలపాటు గుంటూరులోనే ఉండి స్పీచ్ థెరపీ చేయిస్తే కమిటీ అనుమతించింది. దీంతో ఆపరేషన్ చేశారు. తర్వాత ఏడాదిపాటు స్పీచ్ థెరపీ చేయించేందుకు అక్కడే ఉండాల్సి రావడంతో చాలా ఖర్చయింది.

– ఆదిలక్ష్మి, ఆపరేషన్ చేయించుకున్న చిన్నారి హర్షిత తల్లి, త్రిపురాంతకం, ప్రకాశం జిల్లా

బొమ్మలు సరిగా వేయలేదని అనుమతి నిరాకరించారు



మా బాబుకి ఎనిమిదో నెల వయసు వచ్చాక మాటలు రావడం లేదని గుర్తించి వైద్యులకు చూపించగా కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్ చేయిస్తే మాటలు వస్తాయని చెప్పారు. దీంతో గుంటూరు వచ్చి ఐదు నెలలు థెరపీ చేయించాం. బొమ్మలు సరిగా వేయడం లేదని చెప్పి కమిటీ వాళ్లు మూడుసార్లు ఆపరేషన్‌కు అనుమతి నిరాకరించి ఎట్టకేలకు ఆపరేషన్ చేశారు. ఇప్పుడు ఏడాదిపాటు గుంటూరులో ఉండి స్పీచ్ థెరపీ చేయించాలి. దీంతో అద్దెలు, తిండి ఖర్చులు భరించలేకపోతున్నాం.

– ఆపరేషన్ చేయించుకున్న చిన్నారి కళ్యాణ్‌రెడ్డి తల్లిదండ్రులు అపర్ణ, రామాంజనేయరెడ్డి, శ్రీకాళహస్తి, చిత్తూరు జిల్లా

'శ్రమ్' పురస్కారాల ప్రదానం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో నైపుణ్యంతో, నిజాయితీగా పనిచేసే సిబ్బందికి, కార్మిక అభివృద్ధికోసం పనిచేసిన 338 మందిని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ 'ప్రధాన మంత్రి శ్రమ్' పురస్కారాలతో సత్కరించింది. ఏటా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకటించే ఈ అవార్డులను గత ఆరేళ్లకుగానూ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్ సోమవారం ఢిల్లీలో ప్రదానం చేశారు. ఏపీ నుంచి విశాఖ నావల్ డాక్‌యార్డ్‌కు చెందిన ఆర్పీ బాలన్ పిళ్లై, ఎం.జ్యోతిరాజు, వీఏవీ వేణుసాగర్, కె.పిళ్లై రాజన్‌లు పురస్కారాలు దక్కించుకున్నారు. విశాఖలోని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ సంస్థకు చెందిన బత్తుల కోటిరెడ్డి, క్రిప తదితరులు పురస్కారాలు పొందినవారిలో ఉన్నారు.

తెలంగాణ నుంచి.. హైదరాబాద్‌లోని బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన కె.రామ్‌ప్రసాద్, హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్‌కు చెందిన సి.కుమార్, జి.గోవర్దన్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, రాజేందర్ ప్రసాద్ పురస్కారాలు దక్కించుకున్నారు.

స్టీవ్ జాబ్స్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

వీవీఐటీలో జస్టిస్ లావు నాగేశ్వరరావు స్ఫూర్తిదాయక ప్రసంగం

పెదకాకాని(పొన్నూరు): ప్రఖ్యాత యాపిల్ సంస్థ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు సూచించారు. విజయం సాధించడానికి మనం ఏ పరిస్థితుల్లో జన్మించామనేది అడ్డంకి కాదని స్టీవ్ జాబ్స్ జీవితంలోని సంఘటనను ఉదాహరణగా చెప్పారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండల పరిధిలోని నంబూరు వీవీఐటీని సోమవారం జస్టిస్ లావు నాగేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టీవ్ జాబ్స్‌ను ఒకసారి సంస్థలో నుంచి తీసేస్తే పట్టుదలతో శ్రమించి అదే సంస్థకు సీఈవో కాగలిగారని, ఏ పరిస్థితులలోనైనా నిరుత్సాహపడకుండా ప్రయత్నించాలన్నారు. ఎక్కువకాలం జీవించలేనని తెలిసినా ఈ క్షణం తాను ఏం చేయగలనని స్టీవ్ జాబ్స్ ఆలోచించారని, సమయం ఎంతో విలువైనది, అనవసరమైన విషయాలపై శ్రద్ధ చూపి సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు.



వీవీఐటీలో మాట్లాడుతున్న జస్టిస్ నాగేశ్వరరావు

జస్టిస్ లావు నాగేశ్వరరావు వీవీఐటీకి విచ్చేసి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపే ప్రసంగం చేయడం అభినందనీయమని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. మనం సంపాదించిన దానిలో కొంతభాగం సమాజానికి ఇవ్వాలని, ఈ విషయంలో జస్టిస్ లావు నాగేశ్వరరావును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, వివా ప్రిన్సిపల్ సీటీ జోషి, పరిపాలన కార్యదర్శి ఎస్. బదరీప్రసాద్, సంయుక్త కార్యదర్శి ఎం.శ్రీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీట్ల పెంపు కోసమే 29 సార్లు ఢిల్లీకి..

- 'పోలవరం, అమరావతి' అవినీతిపై విచారణ జరగకుండా కేంద్రంతో సీఎం క్విడ్‌ప్రో కో
- హోదా కోసం మొదటి నుంచీ పోరాడుతోంది వైఎస్ జగన్ ఒక్కరే..
- మార్చి ఒకటిన కలెక్టరేట్ల వద్ద, 5న ఢిల్లీలో ధర్నాలు
- పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న పీఏసీ చైర్మన్ బుగ్గన. చిత్రంలో పార్టీ సీనియర్ నేతలు శిల్పా చక్రపాణిరెడ్డి, బీవై రామయ్య, ఎమ్మెల్యే ఐజయ్య తదితరులు

కర్నూలు(కొండారెడ్డి ఫోర్టు): సొంత వ్యవహారాలు, స్వలాభం కోసం ఆనాడు ఆంధ్రప్రదేశ్ విభజనకు సీఎం చంద్రబాబు లేఖ ఇచ్చారని, ఇప్పుడు పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణాల్లో దోచుకోవడం కోసం ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారని ప్రజాపద్దుల కమిటీ(పీఏసీ) చైర్మన్, కర్నూలు జిల్లా డోన్ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం కర్నూలులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలవరం, అమరావతి నిర్మాణాల్లో వేల కోట్ల రూపాయలను దోచుకున్న ప్రభుత్వ పెద్దలు.. వారి అవినీతిపై విచారణ జరగకుండా కేంద్రంతో క్విడ్‌ప్రో కో చేసుకున్నారని విమర్శించారు. అభద్రతా భావంతో ఉన్న చంద్రబాబు 23 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, వారిలో నలుగురికి మంత్రి పదవులు ఇచ్చి రాజ్యాంగ విలువలను మంటగలిపారని దుయ్యబట్టారు. అసెంబ్లీ సీట్ల పెంపు కోసమే 29 సార్లు ఢిల్లీ చుట్టూ చంద్రబాబు తిరిగారన్నారు. హోదా సంజీవని కాదని చెప్పి నాలుగేళ్ల తరువాత మళ్లీ ఇవ్వాలని డిమాండ్ చేయడం సీఎం అజ్ఞానానికి నిదర్శనమన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని మొదటి నుంచి తాము చెప్పినా వినిపించుకోకుండా ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకున్నారని, దానిని రాష్ట్రంలోని కొన్ని మీడియా సంస్థలు ప్రత్యేకంగా ఫోకస్ చేసి అన్ని లక్షల కోట్లు వస్తున్నాయని ప్రజలను తప్పుదారి పట్టించాయని విమర్శించారు.

హోదా కోసం వైఎస్సార్‌సీపీ అలుపెరగని పోరాటం

ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్‌సీపీ మొదటి నుంచి పోరాటం చేస్తోందని బుగ్గన పేర్కొన్నారు. అందులో భాగంగా రెండుసార్లు రాష్ట్రబంద్‌లు, పలుమార్లు రాస్తారోకోలు, ధర్నాలు, యువభేరీలు, దీక్షలు చేపట్టినట్లు గుర్తు చేశారు. తమ అధినేత వైఎస్ జగన్ గుంటూరు, ఢిల్లీలో ధర్నాలు చేశారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం మార్చి ఒకటో తేదీన జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే 5న ఢిల్లీలో ధర్నా చేపడుతున్నామని, ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. సీఎం చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ అనుభవం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి ఉపయోగపడిందని బుగ్గన ఎద్దేవా చేశారు. స్వయాన మంత్రి ఆదినారాయణరెడ్డి ప్రతి రూపాయిలో ఇద్దరు నాయకులు అర్ధభాగం పంచుకోవాలని, ఐఏఎస్‌ల సమక్షంలో సీఎం చంద్రబాబు పంచాయితీ చేశారని చెప్పిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. శిక్ష పడిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన స్పీకర్ కోడెల శివప్రసాద్‌ను కోరారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు పార్లమెంటరీ జిల్లాల అధ్యక్షులు శిల్పా చక్రపాణిరెడ్డి, బీవై రామయ్య, ఎమ్మెల్యే ఐజయ్య, సమన్వయకర్తలు శ్రీదేవి, మురళీకృష్ణ, పార్టీ నాయకులు శిల్పా రవిచంద్రారెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి(నాని), నంద్యాల రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఈయూ రాష్ట్ర కార్యాలయం ప్రారంభం



విలేకర్లతో మాట్లాడుతున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ ఎండీ మాలకొండయ్య

విజయవాడ రూరల్: ఆర్టీసీలో నష్టాలు తగ్గటానికి కారణం కార్మికుల సహాయ, సహకారాలేనని సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మాలకొండయ్య అన్నారు. విజయవాడలోని జక్కంపూడి కాలనీ వద్ద వైవీరావ్ ఎస్టేట్‌లో ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరింతగా కలసికట్టుగా పనిచేసి ఆర్టీసీ నష్టాలను పూర్తిగా తగ్గించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పద్మాకర్, యూనియన్ అధ్యక్షుడు వైవీ రావు, సీపీఐ జాతీయ నేత పి.జె.చంద్రశేఖరావు, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు చలసాని రామారావు, జి.ఓబులేసు ప్రసంగించారు. ఆర్టీసీ అధికారులు వెంకటేశ్వరావు, జి.జయరావు, ఎ.కోటేశ్వరరావు, ఏపీ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి దామోదరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

- మామిడిమొక్కలు పీకివేశారని ఆవేదన
- టీడీపీ నేతల ఒత్తిడితోనే అధికారుల చర్య

ఒంటిమిట్ట: రెవెన్యూ అధికారుల ఎదుట ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం వద్ద చోటుచేసుకుంది. 2153 సర్వేనెంబరులో 26సెంట్ల భూమిని రైతు టక్కోలు శంకరరెడ్డి సాగుచేసుకుంటూ మామిడిచెట్లు నాటుకున్నారు. ఆ భూమి ఆక్రమించి సాగుచేసుకుంటున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు వెళ్లింది. దీని వెనుక కొందరు అధికారపార్టీ నాయకులు ఉన్నారు. వీరిఒత్తిడితోనే మండల తహసీల్దారు శిరీష ఆదేశాల మేరకు ఆర్ఐ అర్చన, వీఆర్ఓ సిబ్బందితో వెళ్లి మొక్కలను పీకేశారు. విషయం తెలుసుకున్న రైతు శంకర్‌రెడ్డి అడ్డుకునే ప్రయత్నం చేశారు. భూమికి సంబంధించి ఆధారాలు ఉన్నాయని చెబుతున్నా పట్టించుకోకుండా మొక్కలు పీకేశారు. అవమానం భరించలేక రెవెన్యూ అధికారుల ఎదుటే రైతు పురుగుల మందు తాగేశారు. విషయం రైతు కుటుంబ సభ్యులకు తెలియడంతో చికిత్స నిమిత్తం 108లో కడప రిమ్స్‌కు తరలించారు. ఇది ఇలా ఉండగా తహసీల్దారు శిరీష ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. భూమికి సంబంధించి ఆధారాలు తీసుకురావాలని ఐదురోజులుగా రైతుకు చెప్పినా తీసుకురాలేదన్నారు. ఆక్రమణను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



చికిత్స పొందుతోన్న శంకర్‌రెడ్డి

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.